కర్నాటక ప్రభుత్వం

# తెలుగు మంజరి

## ప్రథమ భాష – తెలుగు

**Telugu First Language**

# 10

## పదవ తరగతి

**Tenth Standard**

పరిష్కృత ప్రతి

**(Revised)**

**KARNATAKA TEXTBOOK SOCIETY (R)**
100 Feet Ring Road, Banashankari 3rd stage,
Bengaluru-85

©KTBS Not to be republished

# Preface

The Textbook Society, Karnataka has been engaged in producing new textbooks according to the new syllabi which in turn are designed on NCF – 2005 since June 2010. Textbooks are prepared in 12 languages; seven of them serve as the media of instruction. From standard 1 to 4 there is the EVS, mathematics and 5th to 10th there are three core subjects namely mathematics, science and social science.

**NCF – 2005 has a number of special features and they are:**

- connecting knowledge to life activities
- learning to shift from rote methods
- enriching the curriculum beyond textbooks
- learning experiences for the construction of knowledge
- making examinations flexible and integrating them with classroom experiences
- caring concerns within the democratic policy of the country
- making education relevant to the present and future needs.
- softening the subject boundaries- integrated knowledge and the joy of learning.
- the child is the constructor of knowledge

The new books are produced based on three fundamental approaches namely- Constructive approach, Spiral approach and Integrated approach

The learner is encouraged to think, engage in activities, master skills and competencies. The materials presented in these books are integrated with values. The new books are not examination oriented in their nature. On the other hand they help the learner in the all round development of his/her personality, thus help him/her become a healthy member of a healthy society and a productive citizen of this great country, India.

The most important objectives of teaching language are listening, speaking, reading, writing and reference work. These skills have been given a lot of importance in all the language textbooks. Along with the inculcation of these skills, fundamental grammar, opportunities for learners to appreciate beauty and imbibe universal life values have been integrated in language textbooks. When learners master these competencies, they would stop studying textbooks for the sake of passing examinations. In order to help learners master these competencies, a number of paired and group activities, assignments and project work have been included in the textbooks. It is expected that these activities would help learner master communicative skills. Ultimately, it is expected that students master the art of learning to learn and make use of these competencies in real life. Textbooks for students X have a special significance. As any other new textbook they help learners' master skills and competencies and at the same time there is going to be a public examination based on them.

The Textbook Society expresses grateful thanks to the chairpersons, writers, scrutinisers, artists, staff of DIETs and CTEs and the members of the Editorial Board and printers in helping the Text Book Society in producing these textbooks. A few works of some writers and poets have been included in these textbooks. The textbook society is extremely grateful to them for giving their consent for the inclusion of these pieces in the textbooks.

**Prof G S Mudambadithaya**
Coordinator
Curriculum Revision and
Textbook Preparation
Karnataka Textbook Society
Bengaluru, Karnataka

**Nagendra Kumar**
Managing Director
Karnataka Textbook Society®
Bengaluru, Karnataka

©KTBS
Not to be republished

# Text Book Committee

**Chairman**

**Dr. G.S. Mohan,** Professor & Chairman (Retired) Dept. of Telugu, Bangalore University, Bengaluru- 560056

**Members.**

1. **Smt. G. Sasikala,** Retired S.G.L in Telugu, K.G.F First Grade College, Oorgaum, K.G.F - 563120
2. **Dr. K. Surendrababu,** Retired S.G.L. in Telugu, Smt A.S.M College for women, Ballari.
3. **Dr. A. Lakshminarayana,** Retired S.G.L in Telugu, Wardlaw PU College Ballari-4
4. **Dr. S. Madhavaraju,** Retired Telugu Pandit, Gottipati Venkaratnam High School, Vidyanagar, Gangavathi
5. **Sri C. Nagesam,** Retired Telugu Pandit, R.B.A.N.M.S. High School Main, Bengaluru-560042

**Scrutiniser**

**Dr. P.R. Harinath,** Senior Lecturer in Telugu, Regional Institute of Education, Manasa Gangothri, Mysuru-570006.

**Chief Co-Ordinator**

**Prof G.S. Mudambadithaya,** Curriculum Revision and Text Book Preparation, Text Book Society, Bengaluru

**Chief Advisors**

**Sri Nagendra Kumar,** Managing Director, Karnataka Text Book society, Bengaluru.

**Sri Panduranga,** Deputy Directorcin charge), Karnataka Text Book Society, Bengaluru.

**Programme Co-ordinator**

**Smt. Asharani. N,** Asst Director, Karnataka Text Book Society, Bengaluru.

©KTBS Not to be republished

# ముందుమాట

జాతీయ పాఠ్య ప్రణాళిక చట్రం 2005 లోని సూచనలకు అనుగుణంగా కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం కర్నాటక రాష్ట్ర పాఠ్యప్రణాళికను పరిష్కరించింది. దీనిని అవగాహన చేసుకొని తదనుగుణంగా పాఠ్యాంశాలను ఎంపిక చేసుకొని 10వ తరగతి ప్రథమ భాష తెలుగు పాఠ్యపుస్తకాన్ని తయారు చేయడం జరిగింది.

ప్రతి పాఠంలోనూ రాసినవారి పరిచయం, ఉద్దేశం, అవసరమైన పూర్వాపర వివరణ, క్రొత్తపదాలకు అర్థాలు, అవసరమైన భాషాభ్యాసాలను చేర్చడం ద్వారా నిర్దిష్ట పాఠ్యాంశాన్ని సమర్థవంతంగా గ్రహించడానికి అనుకూలంగా కూర్చబడింది. పరిసరం మరియు నైతిక విలువల అవగాహనకై విశేష ప్రాధాన్యం ఇవ్వబడింది. అభ్యసనం ఆహ్లాదకరంగా ఉండేవిధంగా రూపొందించబడి ఆధునికతతో పాటు మూలసాహిత్యంలోని సొగసును నిలుపుకొంటూ శ్రేణీకృత అభ్యసనానికి అనువుగా తయారుచేయబడింది. సమాజంలో శాంతికి భంగం కలుగకుండా ఉండేవిధంగా ఈ పాఠ్యవస్తురచనలో విశేషమైన జాగరూకత వహింపబడింది. జాతీయ విలువల్ని, జాతీయ భావ సమైక్యతకు సంబంధించిన అంశాలను పాఠ్యాంశాలుగా తీసుకోవడం జరిగింది. సరళశైలినుండి సంక్లిష్టశైలికి పాఠాలను కూర్చడమైంది. వ్యాకరణాంశాలను, ఛందస్సును, పాఠ్యపుస్తకం చివర్లో పొందుపరచడం జరిగింది.

ఈ పాఠ్యపుస్తకం విద్యార్థుల్లో భాషా సాహిత్యాలమీద అవగాహనను, ఆసక్తిని కల్గిస్తుందని మా విశ్వాసం. ఈ మా కృషిని అధ్యాపకులు సహృదయతతో స్వీకరించాల్సిందిగా కోరుతూ విలువైన సలహాలను అహ్వానిస్తున్నాం.

ఈ పాఠ్యపుస్తకాన్ని రచించడంలో సహకారాన్ని అందించిన రచనా సమితి సభ్యులందరికి హృత్పూర్వక కృతజ్ఞతలు.

ఈ పాఠ్యపుస్తక రచనా సమితివారికి తమ సహాయ సహకారాలను అందించిన కర్నాటక పఠ్యపుస్తక సమితి(రి.) సంయోజకులు ప్రొ. జి.ఎస్.ముడంబడిత్తాయగారికి, వ్యవస్థాపక నిర్దేశకులు శ్రీ.వై.టి. గురుమూర్తి గారికి, సహనిర్దేశకులు శ్రీ బెళ్ళశెట్టి గారికి, సహాయక నిర్దేశకులు శ్రీమతి చంద్రకళగారికి, పరిశీలకులు డా.పి.అర్. హరినాథ్‌గారికి కృతజ్ఞతాంజలులు.

**అచార్య జి.ఎస్.మోహన్**
**అధ్యక్షులు**
**పాఠ్యపుస్తక రచనా సమితి.**

©KTBS Not to be republished

## ಪರಿಷ್ಕರಣೆ ಕುರಿತು

ಒಂದರಿಂದ ಹತ್ತನೇ ತರಗತಿಯ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳ ಬಗ್ಗೆ ಪ್ರಕಟಗೊಂಡ ಸಾರ್ವಜನಿಕ ಅಭಿಪ್ರಾಯಗಳನ್ನು ಗಮನಿಸಿ ಮಾನ್ಯ ಮುಖ್ಯಮಂತ್ರಿಯವರೂ ಅರ್ಥಸಚಿವರೂ ಆಗಿರುವ ಶ್ರೀ ಸಿದ್ದರಾಮಯ್ಯನವರು ತಮ್ಮ 2014–15 ರ ಬಜೆಟ್‌ನಲ್ಲಿ ತಜ್ಞರ ಸಮಿತಿಯನ್ನು ರಚಿಸುವ ಘೋಷಣೆ ಮಾಡಿದರು. ತಜ್ಞರು ಅನುಸರಿಸಬೇಕಾದ ಮೂಲ ಆಶಯವನ್ನು ಹೀಗೆ ಹೇಳಿದರು: "ಪಠ್ಯಪುಸ್ತಕಗಳನ್ನು ಸಾಮಾಜಿಕ ಸಾಮರಸ್ಯ, ನೈತಿಕಮೌಲ್ಯಗಳು, ವ್ಯಕ್ತಿತ್ವವಿಕಸನ, ವೈಜ್ಞಾನಿಕ ಮತ್ತು ವೈಚಾರಿಕ ಮನೋಭಾವ, ಜಾತ್ಯತೀತತೆ ಮತ್ತು ರಾಷ್ಟ್ರಿಯ ಬದ್ಧತೆಗಳಿಗೆ ಅನುವಾಗುವಂತೆ ತಜ್ಞರ ಸಮಿತಿಯನ್ನು ಪುನರ್ ರಚಿಸಲಾಗುವುದು" – ಇದು ಬಜೆಟ್ ಭಾಷಣದಲ್ಲಿ ಸಾದರಪಡಿಸಿದ ಆಶಯ.

ಆನಂತರ ಶಿಕ್ಷಣ ಇಲಾಖೆಯು ಒಂದರಿಂದ ಹತ್ತನೇ ತರಗತಿಯವರೆಗಿನ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳ ಪರಿಷ್ಕರಣೆಗಾಗಿ 27 ಸಮಿತಿಗಳನ್ನು ರಚಿಸಿ ದಿನಾಂಕ: 24.11.2014 ರಂದು ಆದೇಶಹೊರಡಿಸಿತು. ಈ ಸಮಿತಿಗಳು ವಿಷಯವಾರು ಮತ್ತು ತರಗತಿವಾರು ಮಾನದಂಡಕ್ಕನುಗುಣವಾಗಿ ರಚಿತವಾದವು. ವಿವಿಧ ಪಠ್ಯವಿಷಯಗಳಿಗೆ ಸಂಬಂಧಿಸಿದ ತಜ್ಞರು, ಅಧ್ಯಾಪಕರು ಈ ಸಮಿತಿಗಳಲ್ಲಿದ್ದಾರೆ. ಈಗಾಗಲೇ ಲಿಖಿತವಾಗಿ ಬಂದಿರುವ ಅನೇಕ ಆಕ್ಷೇಪಗಳು ಮತ್ತು ವಿಶ್ಲೇಷಣೆಗಳನ್ನು ಪರಿಶೀಲಿಸಿ, ತಪ್ಪು ಒಪ್ಪುಗಳ ಬಗ್ಗೆ ನಿರ್ಣಯಿಸಿ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳನ್ನು ಪರಿಷ್ಕರಿಸುವ ಹೊಣೆಹೊತ್ತ ಈ ಸಮಿತಿಗಳಿಗೆ 'ಅಗತ್ಯವಿದ್ದಲ್ಲಿ ಪಠ್ಯವಸ್ತುವನ್ನು ಪರಿಷ್ಕರಿಸಿ ನಂತರ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳನ್ನು ಪರಿಷ್ಕರಿಸುವ' ಸ್ವಾತಂತ್ರ್ಯವನ್ನು 24.11.2014ರ ಆದೇಶದಲ್ಲೇ ನೀಡಲಾಗಿತ್ತು. ಆನಂತರ 19.09.2015 ರಂದು ಹೊಸ ಆದೇಶ ಹೊರಡಿಸಿ 'ಅಗತ್ಯವಿದ್ದಲ್ಲಿ ಪುನರ್ ರಚಿಸುವ' ಸ್ವಾತಂತ್ರ್ಯವನ್ನು ನೀಡಲಾಯಿತು. ಹೀಗೆ ಸಮಗ್ರ ಪರಿಷ್ಕರಣೆಗೊಂಡ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳನ್ನು 2016–17 ರ ಬದಲು 2017–18ನೇ ಶೈಕ್ಷಣಿಕ ವರ್ಷದಲ್ಲಿ ಜಾರಿಗೊಳಿಸಲಾಗುವುದೆಂದು ಇದೇ ಆದೇಶದಲ್ಲಿ ತಿಳಿಸಲಾಯಿತು.

ಅನೇಕ ವ್ಯಕ್ತಿಗಳೂ ಸಂಘಟನೆಗಳೂ ಸ್ವಯಂಪ್ರೇರಿತರಾಗಿ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳ ಮಾಹಿತಿದೋಷ, ಆಶಯದೋಷಗಳನ್ನು ಪಟ್ಟಿಮಾಡಿ ಶಿಕ್ಷಣ ಸಚಿವರಿಗೆ, ಪಠ್ಯಪುಸ್ತಕ ಸಂಘಕ್ಕೆ ಕಳುಹಿಸಿದ್ದರು. ಅವುಗಳ ಪರಿಶೀಲನೆಮಾಡಿದ್ದಲ್ಲದೆ, ಸಮಿತಿಗಳಾಚೆಗೆ ಅನೇಕ ಸಂವಾದಗಳನ್ನು ಏರ್ಪಡಿಸಿ ವಿಚಾರ ವಿನಿಮಯ ಮಾಡಿಕೊಂಡಿದ್ದೇವೆ. ಪ್ರಾಥಮಿಕ ಮತ್ತು ಪ್ರೌಢಶಾಲಾ ಅಧ್ಯಾಪಕರ ಸಂಘಗಳ ಜೊತೆ ಚರ್ಚಿಸಿದ್ದಲ್ಲದೆ ಪ್ರಶ್ನಾವಳಿ ಸಿದ್ಧಪಡಿಸಿ ಅಧ್ಯಾಪಕರಿಗೆ ಕಳಿಸಿ ಅಭಿಪ್ರಾಯಗಳನ್ನು ಸಂಗ್ರಹಿಸಲಾಗಿದೆ. ಅಧ್ಯಾಪಕರು, ವಿಷಯಪರಿವೀಕ್ಷಕರು ಮತ್ತು ಡಯಟ್ ಪ್ರಾಂಶುಪಾಲರ ಪ್ರತ್ಯೇಕ ಸಭೆಗಳನ್ನು ನಡೆಸಿ ವಿಶ್ಲೇಷಣಾತ್ಮಕ ಅಭಿಮತಗಳನ್ನು ಪಡೆಯಲಾಗಿದೆ. ವಿಜ್ಞಾನ, ಸಮಾಜವಿಜ್ಞಾನ, ಗಣಿತ, ಭಾಷೆ ಸಾಹಿತ್ಯಗಳಿಗೆ ಸಂಬಂಧಿಸಿದ ತಜ್ಞರಿಗೆ ಮೊದಲೇ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳನ್ನು ಕಳುಹಿಸಿ ಆನಂತರ ಸಭೆ ನಡೆಸಿ ಚರ್ಚಿಸಲಾಗಿದೆ. ಮಹಿಳಾ ಸಂಘಟನೆ ಹಾಗೂ ವಿಜ್ಞಾನ ಸಂಬಂಧಿ ಸಂಸ್ಥೆಗಳನ್ನು ಆಹ್ವಾನಿಸಿ ಚಿಂತನೆ ನಡೆಸಲಾಗಿದೆ. ಹೀಗೆ ಎಲ್ಲಾ ಮೂಲಗಳಿಂದ ಪಡೆದ ಅರಿವಿನ ಆಧಾರದ ಮೇಲೆ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳನ್ನು ಅಗತ್ಯವಿದ್ದಕಡೆ ಪರಿಷ್ಕರಿಸಲಾಗಿದೆ.



© KTBS Not to be republished

ಬಹುಮುಖ್ಯವಾದ ಇನ್ನೊಂದು ಸಂಗತಿಯನ್ನು ಇಲ್ಲಿ ಹೇಳಬೇಕು. ಕೇಂದ್ರೀಯ ಶಾಲಾ (N.C.E.R.T) ಪಠ್ಯಪುಸ್ತಕಗಳ ಜೊತೆ ರಾಜ್ಯದ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳನ್ನು ತೌಲನಿಕವಾಗಿ ಅಧ್ಯಯನ ಮಾಡಿ ಸಲಹೆಗಳನ್ನು ನೀಡಲು ವಿಜ್ಞಾನ, ಗಣಿತ ಮತ್ತು ಸಮಾಜವಿಜ್ಞಾನಕ್ಕೆ ಸಂಬಂಧಿಸಿದಂತೆ ತಜ್ಞರ ಮೂರು ಸಮಿತಿಗಳನ್ನು ರಚಿಸಲಾಯಿತು. ಈ ಸಮಿತಿಗಳು ನೀಡಿದ ತೌಲನಿಕ ವಿಶ್ಲೇಷಣೆ ಮತ್ತು ಸಲಹೆಗಳನ್ನು ಆಧರಿಸಿ ರಾಜ್ಯ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳ ಗುಣಮಟ್ಟವನ್ನು ಹೆಚ್ಚಿಸಲಾಗಿದೆ. ಕೇಂದ್ರೀಯ ಶಾಲಾ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳಿಗಿಂತ ನಮ್ಮ ರಾಜ್ಯದ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳ ಗುಣಮಟ್ಟ ಕಡಿಮೆಯಾಗದಂತೆ ಕಾಯ್ದುಕೊಳ್ಳಲಾಗಿದೆ. ಜೊತೆಗೆ ಆಂಧ್ರ, ತಮಿಳುನಾಡು, ಮಹಾರಾಷ್ಟ್ರಗಳ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳ ಜೊತೆ ನಮ್ಮ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳನ್ನು ಪರಿಶೀಲಿಸಲಾಗಿದೆ.

ಇನ್ನೊಂದು ಸ್ಪಷ್ಟನೆಯನ್ನು ನೀಡಲು ಬಯಸುತ್ತೇನೆ. ನಮ್ಮ ಸಮಿತಿಗಳು ಮಾಡಿರುವುದು ಪರಿಷ್ಕರಣೆಯೇ ಹೊರತು ಪಠ್ಯಪುಸ್ತಕಗಳ ಸಮಗ್ರ ರಚನೆಯಲ್ಲ. ಆದ್ದರಿಂದ ಈಗಾಗಲೇ ರಚಿತವಾಗಿರುವ ಪಠ್ಯಪುಸ್ತಕಗಳ ಸ್ವರೂಪಕ್ಕೆ ಎಲ್ಲಿಯೂ ಧಕ್ಕೆಯುಂಟುಮಾಡಿಲ್ಲ. ಲಿಂಗತ್ವ ಸಮಾನತೆ, ಪ್ರಾದೇಶಿಕ ಪ್ರಾತಿನಿಧ್ಯ, ರಾಷ್ಟ್ರೀಯ ಸಮಗ್ರತೆ, ಸಮಾನತೆ, ಸಾಮಾಜಿಕ ಸಾಮರಸ್ಯಗಳ ಹಿನ್ನೆಲೆಯಲ್ಲಿ ಕೆಲವು ಪರಿಷ್ಕರಣೆಗಳು ನಡೆದಿವೆ. ಹೀಗೆ ಪರಿಷ್ಕರಿಸುವಾಗ ರಾಷ್ಟ್ರೀಯ ಪಠ್ಯಕ್ರಮ ಚೌಕಟ್ಟು ಮತ್ತು ರಾಜ್ಯ ಪಠ್ಯಕ್ರಮ ಚೌಕಟ್ಟುಗಳನ್ನು ಮೀರಿಲ್ಲವೆಂದು ತಿಳಿಸಬಯಸುತ್ತೇನೆ: ಜೊತೆಗೆ ನಮ್ಮ ಸಂವಿಧಾನದ ಆಶಯಗಳನ್ನು ಅನುಸರಿಸಲಾಗಿದೆ. ಸಮಿತಿಗಳು ಮಾಡಿದ ಪರಿಷ್ಕರಣೆಯನ್ನು ಮತ್ತೊಮ್ಮೆ ಪರಿಶೀಲಿಸಲು ವಿಷಯವಾರು ಉನ್ನತ ಪರಿಶೀಲನ ಸಮಿತಿಗಳನ್ನು ರಚಿಸಿ ಅಭಿಪ್ರಾಯಪಡೆದು ಅಳವಡಿಸಲಾಗಿದೆ.

ಹೀಗೆ ಕ್ರಮಬದ್ಧವಾಗಿ ನಡೆದ ಕೆಲಸಕ್ಕೆ ತಮ್ಮನ್ನು ತಾವು ಸಂಪೂರ್ಣ ತೊಡಗಿಸಿಕೊಂಡ 27 ಸಮಿತಿಗಳ ಅಧ್ಯಕ್ಷರು ಮತ್ತು ಸದಸ್ಯರನ್ನು ಹಾಗೂ ಉನ್ನತ ಪರಿಶೀಲನಾ ಸಮಿತಿಯ ಸಮಸ್ತರನ್ನು ಕೃತಜ್ಞತೆಯಿಂದ ನೆನೆಯುತ್ತೇವೆ. ಅಂತೆಯೇ ಸಮಿತಿಗಳ ಕೆಲಸ ಸುಗಮವಾಗಿ ನಡೆಯುವಂತೆ ವ್ಯವಸ್ಥೆಮಾಡಲು ಕಾರ್ಯಕ್ರಮ ಅಧಿಕಾರಿಗಳಾಗಿ ನಿಷ್ಠೆಯಿಂದ ದುಡಿದ ಪಠ್ಯಪುಸ್ತಕ ಸಂಘದ ಎಲ್ಲಾ ಅಧಿಕಾರಿಗಳನ್ನೂ ನೆನೆಯುತ್ತೇವೆ. ಸಹಕರಿಸಿದ ಸಿಬ್ಬಂದಿಗೂ ನಮ್ಮ ವಂದನೆಗಳು. ಅಭಿಪ್ರಾಯ ನೀಡಿ ಸಹಕರಿಸಿದ ಸರ್ವ ಸಂಘಟನೆಗಳು ಮತ್ತು ತಜ್ಞರಿಗೆ ಧನ್ಯವಾದಗಳು.

**(ನರಸಿಂಹಯ್ಯ)**
ವ್ಯವಸ್ಥಾಪಕ ನಿರ್ದೇಶಕರು
ಕರ್ನಾಟಕ ಪಠ್ಯಪುಸ್ತಕ ಸಂಘ (ರಿ)
ಬೆಂಗಳೂರು–85

**(ಪ್ರೊ. ಬರಗೂರು ರಾಮಚಂದ್ರಪ್ಪ)**
ಸರ್ವಾಧ್ಯಕ್ಷರು
ಪಠ್ಯಪುಸ್ತಕ ಪರಿಷ್ಕರಣ ಸಮಿತಿ
ಕರ್ನಾಟಕ ಪಠ್ಯಪುಸ್ತಕ ಸಂಘ (ರಿ)
ಬೆಂಗಳೂರು–85

©KTBS Not to be republished

# ಪಠ್ಯಪುಸ್ತಕ ಪರಿಷ್ಕರಣ ಸಮಿತಿಗಳ ವಿವರ

**ಸರ್ವಾಧ್ಯಕ್ಷರು**

**ಪ್ರೊ. ಬರಗೂರು ರಾಮಚಂದ್ರಪ್ಪ** : ರಾಜ್ಯ ಪಠ್ಯಪುಸ್ತಕ ಪರಿಷ್ಕರಣ ಸಮಿತಿ, ಕರ್ನಾಟಕ ಪಠ್ಯಪುಸ್ತಕ ಸಂಘ(ರಿ), ಬೆಂಗಳೂರು.

## ಪರಿಷ್ಕರಣ ಸಮಿತಿ

**ಅಧ್ಯಕ್ಷರು**

**ಎಸ್. ದೇವೇಂದ್ರ** : ನಿವೃತ್ತ ಪ್ರಾಧ್ಯಾಪಕರು, ಸ. ಕಲಾ ಕಾಲೇಜು, ಅಂಬೇಡ್ಕರ್ ವೀಧಿ, ಬೆಂಗಳೂರು.

**ಸದಸ್ಯರು**

**ಶ್ರೀ. ಜೈಪಾಲ್ ನಾಯ್ಡು** : ಪ್ರಾಧ್ಯಾಪಕರು, PES ಕಾಲೇಜು, ಬೆಂಗಳೂರು .

**ಶ್ರೀ. ಡಿ. ಭುವನಾನಂದ** : ಸ.ಶಿ, ತೆಲುಗು ಪ್ರೌಢಶಾಲೆ, ವಿವೇಕನಗರ, ಬೆಂಗಳೂರು.

**ಶ್ರೀ. ರಂಗಸ್ವಾಮಿ ನಾಯ್ಡು** : ನಿವೃತ್ತ ಶಿಕ್ಷಕರು, ಗಂಗಮ್ಮನಗುಡಿ ಬಡಾವಣೆ, ಬೆಂಗಳೂರು.

**ಶ್ರೀ. ವಿ. ಶ್ರೀನಿವಾಸಲು** : ಸಶಿ, ಸರ್ಕಾರಿ ತೆಲುಗು ಪ್ರೌಢಶಾಲೆ, ದೊಡ್ಡಬಳ್ಳಾಪುರ,

**ಶ್ರೀ. ಈಶ್ವರಪ್ಪ** : ಸ.ಶಿ, ಎ.ಇ.ಎಸ್. ತೆಲುಗು ಪ್ರಾ.ಶಾ, ಕಮ್ಮಗೊಂಡನಹಳ್ಳಿ, ಬೆಂಗಳೂರು.

**ಶ್ರೀಮತಿ. ಕೆ.ವಿ.ನಾಗಲಕ್ಷ್ಮಿ** : ಸ.ಶಿ, ಸರ್ಕಾರಿ ತೆಲುಗು ಪ್ರೌಢಶಾಲೆ, ಶಿವಾಜಿನಗರ ಬೆಂಗಳೂರು

**ಶ್ರೀ. ಎ. ಶ್ರೀನಿವಾಸ** : ತೆಲಗು ಶಿಕ್ಷಕರು, BEL ಹಿರಿಯ ಪ್ರಾಥಮಿಕ ಶಾಲೆ, ಜಾಲಹಳ್ಳಿ, ಬೆಂಗಳೂರು.

## ಉನ್ನತ ಪರಿಶೀಲನ ಸಮಿತಿ

**ಡಾ. ಆರ್.ವಿ.ಎಸ್ ಸುಂದರಂ** : #498, ಚಿತ್ರಭಾನು ರಸ್ತೆ, ಕುವೆಂಪು ನಗರ, ಮೈಸೂರು.

**ಶ್ರೀ.ಜಿ.ಆರ್.ವೆಂಕಟೇಶ್ವರಲು** : ನಿವೃತ್ತ ಪ್ರಾಂಶುಪಾಲರು, ರಾಘವ ಕಲ್ಯಾಣ ಕಾಲೋನಿ, ಬಳ್ಳಾರಿ.

**ಶ್ರೀ. ಸುಜ್ಞಾನ ಮೂರ್ತಿ** : ಪ್ರಾಧ್ಯಾಪಕರು, ಹಂಪಿ ಕನ್ನಡ ವಿಶ್ವವಿದ್ಯಾಲಯ, ಹಂಪಿ, ಬಳ್ಳಾರಿ ಜಿಲ್ಲೆ.

**ಸಲಹೆ ಮತ್ತು ಮಾರ್ಗದರ್ಶನ:**

**ಶ್ರೀ ನರಸಿಂಹಯ್ಯ** : ವ್ಯವಸ್ಥಾಪಕ ನಿರ್ದೇಶಕರು, ಕರ್ನಾಟಕ ಪಠ್ಯಪುಸ್ತಕ ಸಂಘ(ರಿ), ಬನಶಂಕರಿ 3ನೇಹಂತ ಬೆಂಗಳೂರು–85.

**ಶ್ರೀಮತಿ ಸಿ.ನಾಗಮಣಿ** : ಉಪನಿರ್ದೇಶಕರು, ಕರ್ನಾಟಕ ಪಠ್ಯಪುಸ್ತಕ ಸಂಘ(ರಿ), ಬನಶಂಕರಿ 3ನೇ ಹಂತ ಬೆಂಗಳೂರು–85.

**ಕಾರ್ಯಕ್ರಮ ಸಂಯೋಜಕರು:**

**ಶ್ರೀಮತಿ ಆಶಾರಾಣಿ.ಎನ್** : ಸಹಾಯಕ ನಿರ್ದೇಶಕರು, ಕರ್ನಾಟಕ ಪಠ್ಯಮಸ್ತಕ ಸಂಘ(ರಿ), ಬನಶಂಕರಿ 3ನೇ ಹಂತ ಬೆಂಗಳೂರು–85.

©KTBS Not to be republished

## విషయసూచిక


| క్రమ సంఖ్య | పద్యభాగం | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | కృషీవలుడు - 'కళా ప్రపూర్ణ' డా. బోయి భీమన్న (కంఠస్థ పద్యాలు 1,9,11) | 1 |
| 2. | పురావైభవం- 'సాహితీశిల్పి' రూపనగుడి నారాయణరావు | 10 |
| 3. | త్రిజటా స్వప్నం- గోనబుద్ధారెడ్డి | 19 |
| 4. | శతకపద్యాలు (కంఠస్థ పద్యాలు 1,2,3,7,8) | 24 |
| 5. | వాత్సల్యం- అనంతామాత్యుడు (కంఠస్థ పద్యాలు 6,7,8) | 34 |
| 6. | తామసి- 'కళాప్రపూర్ణ' డా.దాశరథి కృష్ణమాచార్యులు | 41 |
| 7. | అజ్ఞాత కౌంతేయము- డా.నండూరి రామకృష్ణమాచార్యులు | 48 |
| 8. | విన్నపం-పింగళి సూరన | 57 |
| 9. | మమకారం- పిల్లలమర్రి పినవీరన ***భద్రతడత*** (కంఠస్థ పద్యాలు 3,5,6) | 65 |
| 10. | ఘోషయాత్ర- ఎఱ్ఱా ప్రెగ్గడ | 71 |
| | **గద్యభాగం** | |
| 1. | మితవ్యయం- పి.వి చలపతిరావు | 81 |
| 2. | కల్పనా చావ్లా | 85 |
| 3. | స్వయం ఉపాధి | 95 |
| 4. | మన తెలుగు రైతు- శ్రీ దేవులపల్లి రామానుజరావు | 102 |
| 5. | యువకులు- సాహిత్యాభిరుచి- డా.ఆశావాది ప్రకాశరావు | 109 |
| 6. | జానపదవిజ్ఞానం- సామెతలు- డా.ఆర్వీయస్. సుందరం | 115 |
| 7. | డా. చంద్రశేఖర కంబార | 121 |
| 8. | లేఖ | 132 |
| 9. | కలహ కారణం | 139 |
| 10. | భువన విజయం | 147 |
| | అనుబంధం: తెలుగు వ్యాకరణం, ఛందస్సు | 157 |


పాఠాలలో '*' గుర్తు ఉన్న పద్యాలు కంఠస్థ పద్యాలు

©KTBS Not to be republished

# 1. కృషీవలుడు

**- కళాప్రపూర్ణ డా. బోయి భీమన్న**

[ఈ పాఠ్యాంశంలో రైతు ఔన్నత్యం గురించి వర్ణించబడింది. రైతు రాత్రీపగలూ కష్టపడి పనిచేస్తాడు. అందరికి అన్నదాత అతడు. తనకు పట్టెడు మెతుకులు లేకపోయినా కూడా పదిమంది కోసం పాటుపడే ధన్యజీవి రైతు.

'కృషీవలుడు' అనే ఈ కవిత బోయి భీమన్నగారి 'కావ్యకుసుమాలు' అనే కవితా సంకలనం నుండి గ్రహింపబడింది. బోయి భీమన్నగారు 1911సెప్టెంబర్ 19న తూర్పు గోదావరి జిల్లా మామిడి కుదురు గ్రామంలో జన్మించారు.

పేదరికంలో పుట్టి పెరిగిన భీమన్నగారు పేదల, కష్టజీవుల కడగండ్లను బాగా తెలిసిన వారగుటవలన బడుగు జీవుల బతుకులను, వారి కష్ట నష్టాలను కళ్ళకు కట్టినట్లుగా, హృదయాలకు హత్తుకొనేటట్టుగా చిత్రించడంలో దిట్ట.

ఆంధ్ర విశ్వ విద్యాలయం వీరిని 'కళాప్రపూర్ణ' బిరుదుతోను, కాశీ విద్యాపీఠ్‌వారు గౌరవ డాక్టరేట్ బిరుదంతోను సత్కరించారు.]

1 ★ ఓహో, కృషీవల! ఓ కష్టజీవి
జీవాలు సంసృష్టిజెందు నీకృషిని,
లోకాలు జీవించు నీ కష్టమందు
అన్నదాతవు నీవు అన్నమే నీవు!

2 ప్రొద్దు కంటెను ముందె నిద్దురలేచి
క్షేత్రలక్ష్మిని భక్తి సేవించువేళ
పొంగారు నీరక్తి పువ్వు పువ్వునను
నిండారు నీశక్తి పండు పండునను!

3 భవదీయ కృషి గీతి భావార్ధ రుచులు
కోకిలకంఠాన గూండ్లు కట్టినవి!
ఈల కొమ్మలలో నూయల లూగినవి!
వేణు వనాలలో విర్రవీగినవి!

4 ఎద్దుల దోలెడు నెడ నీశ్వరుండు
విత్తనమ్ములు చల్లువేళ పద్మజుడు
పంటప్రోవును చేయుపట్ల శ్రీశుండు
మూర్తిత్రయా రూపమును గొంటివీవు!

5 ఈవు పెట్టక అన్నమేలేదు భువికి
నీవు పోయక నీరమే లేదెవరికి
నీవింత కష్టించి నిర్మించకున్న
కంట కాటవి గాక కలదె మానుషత?

6 వ్యవసాయకారణ హలము కరాన
భువన సమ్మోహన రవము కంఠాన
విశ్వప్రవర్తక విధి జీవితాన
వెలయు నీకిల సదా విజయమౌగాక!

7 ఎద్దులు నీడలో నిద్దురవోవ
నాగలి పొదలోన నక్కిపరుండ
కోకిల గూటిలో కూర్చుండి పాడ
కృషికుడు కష్టించు గ్రీష్మాతపమున!

8 ఎడనెడ పట్ట కొట్టెడు గాలివాన
సృష్టి సృష్టియె దాగు చీకట్లలోన
దెయ్యాల చెరువు క్రింది పొలాన చేరి
రైతు కష్టించు వర్షానిశీథమున

9 * అలివేణి బంతిపువ్వులు తాల్చిజగము
ప్రభల తీర్థపు సేవ బయనమై పోవ
చెరుకు గానుగడాసి చెమటోడ్చి తీసి
కర్షకు డందిచ్చుకడు తీపి రసము

10 చైత్రోత్సవములో వసంతములాడు
తిరులక్ష్మియింటి నౌకరు సేద్యగాడు;
సౌఖ్యమ్ము వడ్డించి శాంతిదాహమిడి
ప్రగతి బెంచుచు తాను పస్తుండు గేహి!

11 * ఓహో కృషీవల! ఓ కష్టజీవి
జగముల గాల్చు నీ చండాతపమున
గొడుగు పట్టును నీకు గున్నమామిడులు
తలిరువీవన వీచు మలయ మారుతము.

12 పగలెల్ల పని చేసి భాస్కరుడేని
విశ్రాంతి గొనకుండ వెడలదే రాత్రి;
రైత! నీ కృషి లోన రాత్రింబవళ్ళు
రెండొక్క రూపమై పండించు బ్రతుకు.

13 పొలి పదంపు ముగింపె తొలిపదమ్మునకు
పల్లవిగా జేసి పాడుమోయన్న!
పాట అఖండపారమాద్యంత
రహిత మానంద కరమ్ము నీవలెను!

14 ఓహో కృషీవల! ఓకష్ట జీవి!
పడదున్నివేయుమా పల్లేరు పొదలు!
పరికించి తీయుమా మెరక పల్లములు!
పండించి పోయుమా గుండె పండుగలు!

* కంఠస్థ పద్యాలు



©KTBS Not to be republished

**1. కొత్తపదాలు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| సంసృష్టి | క్షేత్రలక్ష్మి | పొంగారు | భవదీయ | ఈలకొమ్మలు | వేణువనాలు |
| నీరం | కంటకాటవి | గ్రీష్మాతపం | నిశీథమున | అలివేణి | చైత్రోత్సవం |
| తిరులక్ష్మి | ప్రగతి | చండాతపం | తలిరుదీవన | మలయపర్వతం | ఆద్యంతరహితం |
| అఖండం | అపారం | పరికించు | మూర్తిత్రయారూపం | | |
| భువనసమ్మోహనరవం | | విశ్వప్రవర్తకవిధి | | | |

**2. సారాంశం :**

1. ఓ కర్షకా! నీ కృషితో ప్రాణులు జీవం పోసుకొంటాయి. లోకాలు జీవించడానికి నీ కష్టమే కారణం. నీవు కేవలం అన్నదాతవే కాదు, సాక్షాత్తు అన్నమే నీవు.

2. పొద్దు పొడవక ముందే నిద్రలేచి, నేల తల్లిని సేవించువేళ ప్రతి పువ్వులోను నీ అనురాగం పొంగిపొర్లుతుంది. ప్రతిపండు నీ శక్తితో నిండుతుంది.

3. నీ కృషి గీతాలు రసరమ్య భావాలతోనిండి కోకిలల కంఠాలలో గూళ్ళు కట్టుకొన్నవి. ఎత్తైన కొమ్మలలో ఊయలలూగాయి. వెదరు పొదలతో నిండిన అడవులలో విగ్రవీగాయి.

4. ఎద్దులు తోలెడివేళ నీవు ఈశ్వరస్వరూపుడివి. విత్తనాలు చల్లునపుడు బ్రహ్మవు, పంటకుప్పలు వేయువేళ మహావిష్ణువు అయిన నీవు ఒక్కడివే ఆ త్రిమూర్తుల రూపాలను పొందావు.

5. నీ పెట్టు పోతలు లేనినాడు ఈ భూమండలానికి అన్నంనీళ్ళు లేవు. నువ్వు శ్రమించనిచో ఈ నేలపై మానవత్వం నశించి, ఈ భూమండలమంతా ముళ్ళ అడవిగా మారియుండేది.

6. వ్యవసాయకారణమైన నాగలి చేతిలో, ప్రపంచమంతటిని మైమరిపించే పదాలు / పాటలు కంఠంలో, విశ్వాన్ని నడిపించాల్సిన కర్తవ్యం జీవితంలో ఉన్న నీకు సదా జయం కల్గుగాక.

7. ఎద్దులు నీడలో నిద్రించగా, నాగలిని పొదలో పెట్టి, గూళ్ళలోని కోయిలలు పాడుచుండ రైతు మండుటెండలో శ్రమిస్తాడు.

8. ఎడా పెడా కొడ్తున్న గాలివానలో సృష్టి మొత్తం చీకట్లలో దాగియుండగా, చిమ్మ చీకట్లు అలుముకొన్న ఆవర్షా కాలపు నడిరేయి దెయ్యాల చెరువు కింది పొలంలో చేరి రైతు శ్రమిస్తాడు.

9. నల్లని వెంట్రుకలలో బంతిపూలు అలంకరించుకొని జగమంతా కూడా ప్రభల తీర్థపు తిరునాళ్ళకు పోవ, అక్కడ వారికి రైతు శ్రమించే చెరుకు గానుగనుండి తియ్యటి రసం తీసి ఇస్తాడు.

10. చైత్రోత్సవాలలో వసంతాలాడు శ్రీ లక్ష్మీదేవి ఇంటి సేద్యగాడు రైతు. జగత్తుకంతా సుఖశాంతులను చేకూర్చి, పెంపు చేసి తాను మాత్రం పస్తులుండెడి గృహస్థు రైతు.

11. ఓ కష్ట జీవి ! జగాన్నంతటిని కాల్చివేసే మండుటెండలో నీకు గున్నమామిడి చెట్లు గొడుగు పడతాయి. (నీడనిస్తాయి) చిగుళ్ళు విసనకర్రలై చల్లటి గాలివీస్తాయి.

©KTBS Not to be republished

12. పగలంతా పని చేసి సూర్యుడు విశ్రాంతి తీసుకొనకుండా రాత్రి ముగియదు. కానీ ఓ కృషీవలా ! నీ శ్రమలో రాత్రి పగలు అనే తేడా లేకుండా బ్రతుకు సఫలం అవుతుంది.

13. పొలిపదపు ముగింపే తొలిపదమునకు పల్లవిగా చేసి నువ్వుపాడేపాట నీవలెనే ఆనంద కరమై అపారమైనది, తుది మొదళ్ళులేనిది.

14. ఓ రైతన్నా ! కష్టజీవీ! హానికరమైన పల్లేరు ముళ్ళపొదలను చివళ్ళకంటా దున్నివేయి. పరిశీలించి మెరకపల్లాలను చదును చేసి పంటలు పండించి మాకు సంతోషాన్ని కలుగజేయి !

**3. అర్థాలు :**

కృషీవలుడు = రైతు; జీవాలు = ప్రాణులు; సంసృష్టి = పుట్టుక ; క్షేత్రలక్ష్మి = పంటపొలం; పొంగారు = ఉబుకు /పొంగు; రక్తి = అనురాగం; భవదీయ = నీయొక్క; కృషిగీతి = వ్యవసాయపు పాటలు; రుచులు = కాంతులు / కమ్మదనాలు; ఈలకొమ్మలు = పొడవయిన / ఎత్తైనకొమ్మలు; వేణువనాలు =వెదురు అడవులు; పద్మజుడు = బ్రహ్మ; శ్రీశుండు = విష్ణువు; మూర్తిత్రయారూపం = త్రిమూర్తుల రూపం; కంటకాటవి = ముళ్ళ అడవి; మానుషత = మానవత్వం; కరాన = చేతిలో; తిరు = శ్రీ; భువన సమ్మోహన = ప్రపంచాన్ని మై మరిపించే; రవము = శబ్దం; విశ్వం = ప్రపంచం; ప్రవర్తకుడు = నడుపువాడు; విధి = కర్తవ్యం; గ్రీష్మ = ఎండాకాలము ; ఆతపం = ఎండ; వర్షానిశీథం = వర్షాకాలపురాత్రి; అలివేణి = తుమ్మెదల వంటి నల్లటి వెంట్రుకలు కలది; ప్రభలు = అలంకరించిన బండ్లు; చైత్రోత్సవములు = వసంతకాలంలో జరిగెడి వేడుకలు; ప్రగతి = అభివృద్ధి; గేహి = గృహస్తు /ఇంటియజమాని; డాసి = సమీపించి; చండాతపం = భీకరమైన ఎండ; తలిరు = చిగుళ్ళు; వీవన = విసనకర్ర; మలయమారుతం = మలయ పర్వతం పై నుండి వీచెడి చల్లటి గాలి; ఆది + అంతరహితం = మొదలు , తుది /చివర లేనిది; మెరకపల్లములు = మిట్టపల్లాలు/ హెచ్చుతగ్గులు; పల్లేరు పొదలు = ముళ్ళపొదలు; గుండె పండుగలు = సంతోషాలు.

**4. నానార్థాలు :**

లోకం : జగత్తు; జనం; చూపు; గుంపు

లక్ష్మి : శ్రీదేవి; సిరి; కలువ; పసుపు.

శక్తి : బలం; పార్వతి; బల్లెం; శూలం.

కంటకం : ముల్లు; నొప్పి; బాధాకరం.

వనం : జలం; తోట; అడవి

కరం : హస్తం; తొండం; హస్త నక్షత్రం; ఇంద్రధనుస్సు; కిరణం.

విధి : ధాత; కాలం; భాగ్యం; విధం; పని; కర్తవ్యం; నిబంధన;

పదం : శబ్దం; చిహ్నం; పాట;

©KTBS Not to be republished

**5. పర్యాయపదాలు :**

కోకిల : కోయిల; వనప్రియం; పికం; సారంగం; గంధర్వం.

అటవి : అడవి; అరణ్యం; విపినం; కాన; వనం.

భాస్కరుడు : సూర్యుడు; దివాకరుడు; ఆదిత్యుడు; దినకరుడు.

జగం : ప్రపంచం; విశ్వం; జగత్తు; లోకం; భువనం; జగతి.

ఎద్దు : వృషభం; బలీవర్దం; ధురీణం.

ఈశ్వరుడు : శంభుడు; ఈశుడు; పశుపతి; శివుడు; శూలి.

పద్మజుడు : బ్రహ్మ; విధాత; ధాత; నలువ.

శ్రీశుడు : నారాయణుడు; వైకుంఠుడు; మాధవుడు.

అన్నం : ఓదనం; బువ్వ; కూడు; భోజనం.

నాగలి : హలం; మడక; దుక్కివాలం.

**6. వివరణ :**

**మలయపర్వతం :** మలయపర్వతం దక్షిణ దిక్కున ఉంది. ఇది శ్రీగ్రంధపు చెట్లతో కూడినది కాబట్టి దీనిపై నుండి వీచేగాలి సువాసనలతో కూడి శ్రేష్ఠకరం మరియు ఆరోగ్యదాయకమైనది.

**7. జంటపదాలు :**

రాత్రింబవళ్ళు; మెరకపల్లములు.

**8. ఛందస్సు :** ఈ పద్యపాఠం ద్విపదగతిలో నడిచింది. ఇందులో రెండు పాదాలు (ద్వి+పద) ఉంటాయి. పాదానికి 3 ఇంద్రగణాలు, ఒక సూర్యగణం ఉంటుంది. 3వ గణంమొదటి అక్షరం యతి, యతిలేని చోట్ల ప్రాసయతి ఉంటుంది. ప్రాస నియమం ఉంది.

| | సల | (ఇం.గ) సల (ఇం.గ) | | (సూ.గ) |
|---|---|---|---|---|
| | I I U I | I I U I | U I I | U I |
| **ఉదా :** | ప గ లె ల్ల | ప ని చే సి | భా స్క రు | డే ని |

**9. ప్రకృతి - వికృతులు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| లక్ష్మి | - | లచ్చి | గృహస్థుడు | - | గేస్తు |
| భక్తి | - | బత్తి | ప్రోవు | - | పోగు |
| శక్తి | - | సత్తి / సత్తువ | సౌఖ్యం | - | సుకం |
| శ్రీ | - | సిరి | అటవి | - | అడవి |
| గృహం | - | గీము | ప్రయాణం | - | పయనం |

**10. వ్యుత్పత్తి అర్థాలు :**

| | | | | |
|---|---|---|---|---|
| కర్షకుడు | : | వ్యవసాయం చేయువాడు | - | రైతు |
| శ్రీశుడు | : | శ్రీ (లక్ష్మి) కి ఈశుడు (భర్త) | - | విష్ణువు |
| పద్మజుడు | : | పద్మం నుండి పుట్టినవాడు | - | బ్రహ్మ |

## అభ్యాసాలు

**1. కింది పదాలకు రెండేసి పర్యాయ పదాలను రాయండి :**

1. కృషి 2. . గీతి 3. వేణువు 4. కంఠం 5. నిశీథం 6. గుండె

**2. కింది పదాలకు రెండేసి నానార్థాలను రాయండి :**

వనం; తీర్థం; పదం; పండుగ.

**3. కింది పదాలకు ప్రకృతి / వికృతులు రాయండి :**

| | | | |
|---|---|---|---|
| మూర్తి | - | లక్ష్మి | - |
| బ్రతుకు | - | భక్తి | - |
| ప్రోవు | - | పయనం | - |

**4. కింది పదాలకు వ్యతిరేక పదాలను రాయండి :**

1. కష్టం ×
2. అఖండం ×
3. అంతం ×
4. ఆనందం ×

©KTBS Not to be republished

**5. కింది ఖాళీలను సరి అయిన పదాలతో పూరించండి :**

1. అన్నమే ________________
2. పొంగారు నీ ________________
3. నిండారు నీ ________________
4. భవదీయ కృషి గీతి భావార్థ ________________
5. వేణువనాలలో ________________
6. పంటప్రోవు చేయుపట్ల ________________
7. నీవు పోయక నీరమే ________________
8. కంటకాటవిగాక కలదె ________________
9. నీకిల సదా ________________
10. భువన సమ్మోహన రవము ________________
11. పండించి పోయుము ________________
12. పడదున్ని వేయుమా ________________

**6. కింది పదాలలో తప్పొప్పులను గుర్తించండి :**

1. ఈల కొమ్మలలో గూండ్లు కట్టినవి
2. వేణువనాలలో విర్రవీగినవి.
3. నీవు పోయక నీరమే లేదెవరికి.
4. అలివేణి జాజి పువ్వులు తాల్చెను.

**7. గుంపుకు చెందని పదాలను గుర్తించండి :**

| | | | |
|---|---|---|---|
| 1. | ఉపకారం | అపకారం | మమకారం |
| 2. | కాళేశ్వరం | భీమేశ్వరం | శనేశ్వరం |
| 3. | పాండవులు | యాదవులు | వానరులు |
| 4. | దేవతలు | ఆదిత్యులు | దైత్యులు |
| 5. | చంద్రుడు | చంద్రిక | చంపకం |

©KTBS Not to be republished

**8. కింది పద్యపాదాలకు సందర్భాలు రాయండి :**

1. అన్నదాతవు నీవు, అన్నమే నీవు
2. వేణువనాలలో విర్రవీగినవి
3. మూర్తిత్రయారూపమునుగొంటి వీవు
4. కంటకాటవి గాక కలదె మానుషత?
5. కర్షకుడందిచ్చు కడు తీపిరసము !
6. ప్రగతి బెంచుచు తాను పస్తుండుగేహి !
7. తలిరు వీవన వీచు మలయ మారుతం.
8. రెండొక్క రూపమై పండించు బ్రతుకు.
9. పండించిపోయుమా గుండె పండుగలు.

**9. కింది పదాలను విడదీసి, సంధి పేరు తెలపండి :**

1. జీవాలు
2. పొంగారు
3. కంతాన
4. ఊయలలూగినవి
5. నిద్దురవోవ
6. చైత్రోత్సవం
7. వనాలు
8. శ్రీశుండు
9. కంటకాటవి
10. పదంపుముగింపు
11. చండాతపం

**10. కింది వానికి విగ్రహ వాక్యాలు రాసి ఏ సమాసాలో తెల్పండి :**

పంటప్రోవు

తీపిరసం

గాలివాన

కంటకాటవి

క్షేత్రలక్ష్మి

©KTBS Not to be republished

**11. కింది పదాలను సొంతవాక్యాలలో ప్రయోగించండి :**

ఊయలలూగినవి　　విర్రవీగు　　అపారం పయనమై పోవు
గొడుగుపట్టు　　పండించిపోయు గుండెపండుగలు.

**12. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి :**

1. రైతుకు అన్నదాత అనేపేరు ఎలా తగిఉంది?
2. రైతు క్షేత్రలక్ష్మిని సేవించే తీరు తెల్పండి.
3. రైతులో త్రిమూర్తుల రూపం ఎలా దాగి ఉంది?
4. రైతు శ్రమించే విధాన్ని తెల్పండి.
5. కవి కృషీవలుని ప్రస్తుతించే రీతి ఎలాంటిది?

**13. విద్యార్థులకు సూచనలు :**

రైతు దైనందిన జీవితాన్ని పరిశీలించండి.

**14. ఉపాధ్యాయులకు సూచనలు :**

1. సమాజానికి రైతు చేసే సేవలను తెల్పండి. ఇతర కష్టజీవుల జీవిత విధానాల్ని పరిచయం చేయండి.
2. రైతు సాంస్కృతిక జీవితాన్ని పరిచయం చేయండి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 2. పురావైభవం

- 'సాహితీ శిల్పి' రూపనగుడి నారాయణరావు

[ఈ పాఠ్యభాగం 'సాహితీ శిల్పి' రూపనగుడి నారాయణరావుగారి 'పంపాపురీ శతకం' అనే కావ్యం నుండి గ్రహించబడింది. హంపీ క్షేత్రాన్ని దర్శించినపుడు కవిలో పొంగిన భావోద్వేగం ఈ కావ్యంగా రూపొందింది. ప్రస్తుతం దీనావస్థలో ఉన్న ప్రదేశాల ప్రాచీన నేపథ్యాన్ని తలచి కవి ఆవేదన చెందడం ప్రస్తుత పాఠ్యాంశం. నారాయణరావుగారికి 'సాహితీ శిల్పి' అనే బిరుదు ఉంది. వీరి ఇతర రచనలు: కావ్యనిదానం, అశ్రుతర్పణం, కవితానీరాజనం, రూపన్న కుమార భారతం, శిశుమానసిక శాస్త్రం, శ్రీ అరవిందుల యోగం (అనువాదం) మొదలైనవి.]

©KTBS Not to be republished

### తుంగభద్ర

1. తే.గీ. ఆంధ్ర భూపురంధ్రికి మధ్యమందుఁ దనరు
పైడి కాంచి యగుచుఁ దుంగభద్ర మెఱయ,
దాని కౌచిత్యభంగి సంభావిత మగు
కొలికి- పూస యగుచు 'హంపి'కొమరు మిగులు

2. క. గంగాస్నాన మఘహరము,
తుంగా పానంబు గూడ దురితౌఘములన్
జెంగం జేసెడు నందురు,
గంగా తుంగలు సమాన గౌరవ పాత్రల్.

3. తే.గీ. విజయనగర వైభవ భవ్య వేళలందు
భక్తజను లసంఖ్యేయులాపగను రేప
కడల నైష్ఠికతను నవగాహమాడి
సంభృతాత్యంత పుణ్యులై చనెడివారు.

### ఆనెగొంది

4. చ. తలవరి గట్టు చేరి ప్రమదంబున నందలి గంగ తెప్పలో
నలఁత శమింప నెక్కి చని, యాపగదాఁట నొకింతలోన న
వ్వలిదరి నానెగొంది చెలువంబగు దీర్ఘపుఁ గోటగోడ కొ
త్తళములు ద్వారమున్ సుమహితంబుగఁ గన్పడి నివ్వటిల్లెడున్

5. గీ. ఆనెగొందియె కిష్కింధ యనెడిపేరఁ
గ్రాలె రామాయణ పవిత్ర కాలమందు;
రామలక్ష్మణులయు, వాలి రావణులయు
చరణ ముద్రలు దాల్చు నీ పరిసరములు.

## పంపాసరోవరము

6. తే. బ్రహ్మపుత్రి పంపాదేవి ప్రతిదినంబు
నీ కొలఁకున స్నానంబు గావించి తపము
సల్పు కారణంబునను నీ సరసునకును
నమరుఁ బంపా సరోవరం బనెడిపేరు.

7. క. పంపా సరోవరము దన
సొంపగు వీచీకరముల శుభశీకరముల్
పెంపుగఁ జిలికించి యతిథి
సంపూజనము సలుపు మది సంతృప్తిపడన్

8. క. ఇది బహు రమణీయంబై
యుదితానేకవిధ నీరజోత్కర కాంతిన్
బొదువుట నడవిని బఱచిన
మృదు రత్నపుఁ గంబళమ్ము మెయిఁ గన్పట్టన్

9. క. కమలంబులు వెద చిమ్మెడి
సుమనోజ్ఞామోద కలన సుప్తములయి భృం
గములటఁ బడ, సుమగృహములు
దమ తల్పులను మొగిడించుఁ దరణిమునుంగన్.

10. క. సరసి సిరి దక్షిణాశను
జిఱు కొండల నుండి వచ్చు శీత పవనమున్
బరిమళయుత కాసారపుఁ
గరువలియును నిచట వేడ్కఁ గౌఁగిలి గొనెడున్.

11. ఉ. శ్రీరఘురాముఁడీ విమలశీతలవారిని దానమాడి యెం
తో రహిమించి, భాస్కర తనూజుని సన్నిధి చేర్చి వానితోఁ
గూరిమి నాచరించి, కడుఁ గ్రూరుఁ డనీతుఁ డునైన వాలి సం
హారము చేసె; నప్పరుని యంఘ్రి పరాగముఁ దాల్చు నియ్యెడన్

©KTBS Not to be republished

### నవబృందావనము

12. క. నదియిందిరు పాయలుగాఁ
బొదువుట నిట నంతరీపముగ నేర్పడె; నే
సదమల మహనీయత కా
స్పదమగు నీ స్థలము నందె పరఁగు సమాధుల్

13. క. నవ బృందావన మనఁ బడు
నవ యతుల సమాధులిందు నయముగ నుంటన్
అవిరత బోధకులు యతులు
పవిత్ర సాధుగుణయుతులు ద్వైత మతాప్తుల్

### వివిధ దృశ్యములు

14. సీ. పసుపుఁ గంబుళములపై రత్నరాశులు
పిక్కటిల్లిన భూరి విపణియదియె;
నిర్మాణ నిపుణత నివ్వటిల్లఁగఁ దురు
ష్కుల 'మొహల్లా' లున్న నెలవు లవియె,
పలువింత తోరణల్ కలువడంబులు నిండ
బెడఁగు సూపిన రాజవీధులవియె;
అంబారి నెక్కి రాయలు మెఱవణి వెళ్ళఁ
బ్రజలు క్రిక్కిరిసిన బాటలవియె;

15. గే. అక్కటా! యిప్పు డయ్యవి యందము చెడి
పొలుపుఁ గోల్పోయి పల్లేర్లు మొదలు గాఁ గ
ముండ్ల తీవె డొంకల కాటపొలములగుచు
నధ్వనీనులకు విషాద మడరఁ జేయు.

**1. సారాంశం**

### తుంగభద్రానది

1. తుంగభద్రానది, ఆంధ్ర భూమాత నడుమున అలంకరించుకొన్న బంగారు మొలనూలుగా అలరుచున్నది. హంపి, దాని కొలికి పూసలాగా భావింపబడుతూ అందంగా వున్నది.
2. గంగాస్నానం పాపాలను పోగొట్టుతుంది. తుంగా పానం కూడా పాపాలను తొలగిస్తుందని అంటారు. ఇలా గంగా తుంగా నదులు రెండూ సమానంగా గౌరవపాత్రాలు.
3. విజయనగరం గొప్ప వైభవంగా వున్న రోజుల్లో అసంఖ్యాకమైన భక్తులు ఎంతోనిష్ఠతో ప్రాత: కాలంలో స్నానమాడి, అత్యంత పుణ్యాన్ని పొంది వెళ్ళేవారు.



©KTBS Not to be republished

## ఆనెగొంది

4. తలవార్ ఘాట్ చేరుకొని, అక్కడ నుండి ఆనందంగా, అలసట తీరేలా, గంగతెప్ప (అరిగోలు) లో నదిని దాటగా అవతలిగట్టుకు అతి దగ్గరలోనే, అందమైన పొడవైన కోట, బురుజులు, ద్వారం గంభీరంగా ఉన్నాయి.

5. పవిత్రమైన రామాయణ కాలంలో ఆనెగొందియే 'కిష్కింధ' అనే పేరుతో వర్ధిల్లింది. ఈ పరిసరాలు రామలక్ష్మణులు, వాలి, రావణుడు మొదలైనవారి పాద ముద్రలతో ఒప్పారినవి.

## పంపాసరోవరం

6. బ్రహ్మదేవుని పుత్రిక అయిన పంపాదేవి, ప్రతిదినం ఈ కొలనులో స్నానం చేసి, తపస్సు చేసేదట. అందు చేతనే దీనికి పంపాసరోవరమని పేరువచ్చింది.

7. పంపాసరోవరం తన అందమైన అలలనెడు చేతులతో శుభప్రదములైన తుంపరలను బాగా చిలికించి అతిథులు సంతృప్తి పడేలా (పూజిస్తుంది) ఆతిథ్యమిస్తుంది.

8. ఈ పంపాసరోవరం ఎంతో రమణీయంగా తనలో పుట్టిన అనేక విధాలైన పద్మాల కాంతులతో ఒప్పారి, అడవిలో పరచిన మృదు రత్నపు కంబళిలా కన్పిస్తుంది.

9. పద్మాలు విరజిమ్మే ఎంతో మనోహరాలైన సువాసనల వల్ల తుమ్మెదలు వాటిల్లోనే నిద్రిస్తుండగా, సూర్యుడు మునగటంతో ఆ పద్మాలు తమ రేకులనే తలుపులను మూసివేస్తాయి.

10. శ్రీకరమైన ఈ సరస్సుకు, దక్షిన దిశలోని చిన్న కొండల నుండి వచ్చే చల్లని గాలి, సరోవరంలోని సువాసనతో కూడిన గాలి, రెండూ ఇచట ఎంతో ఆనందంగా కౌగిలించుకొంటాయి.

11. శ్రీ రఘురాముడు ఈ పంపాసరోవరంలో స్నాన మాచరించి ఎంతో మెరిసి పోయాడు. సూర్యుని కుమారుడైన సుగ్రీవుని తన దగ్గరికి చేరదీసి, అతనితో స్నేహం చేశాడు. అతి క్రూరుడు, అవినీతి పరుడు అయిన వాలిని సంహరించాడు. అలాంటి పుణ్యాత్ముడైన శ్రీరాముని పాదధూళి రేణువులను ఈ ప్రాంతం ధరించి యున్నది.

## నవ బృందావనం

12. తుంగభద్రానది రెండు పాయలుగా చీలి ప్రవహించటం వల్ల ఇక్కడ ఒక దిబ్బ (లంక) ఏర్పడింది. ఈ స్థలం పవిత్రమైన మహనీయతకు ఆస్పదమైంది. ఇక్కడే పవిత్రమైన సమాధులున్నాయి.

13. ద్వైత మతానికి సంబంధించిన పవిత్ర సాధుపుంగవులు, నిరంతర బోధకులు అయిన తొమ్మిది మంది సమాధులు ఇక్కడ ఉంటున్నందున, దీనికి 'నవబృందావనం' అనే పేరు వచ్చింది.

## వివిధ దృశ్యాలు

14. బంగారు కంబళ్ళపై రత్నరాశులు పోసి అమ్మిన గొప్ప విపణివీధి ఇదే. ఎంతో నైపుణ్యంతో నిర్మించబడ్డ తురుష్కుల మొహల్లాలున్న చోటులివే. అనేక వింత తోరణాలతో కలువడాలతో వైభవం చూపిన రాజవీధులివే. ఏనుగుపై నెక్కి రాయలు మెరవణి (ఊరేగింపు) అవుతుండగా ప్రజలంతా క్రిక్కిరిసి చూచిన బాటలు ఇవే. అయ్యో ! అవన్నీ నేడు అందాన్ని కోల్పోయి, పల్లేరు కాయలు మొదలైన ముండ్ల తీగెలు, పొదలు నిండిపోయి కాలి నడకన వెళ్ళేవాళ్ళకు విషాదం కలుగజేస్తాయి.

©KTBS Not to be republished

**2. కొత్తపదాలు :**

పురంధ్రి, అఘహరము, సంపూజనము, వీచీ కరములు , కంబళము, అంఘ్రి.

**3. అర్థాలు :**

భూ పురంధ్రి = భూమి అనెడి స్త్రీ; కాంచి = స్త్రీలు ధరించే ఒంటి పేట మొలనూలు; ఔచిత్య భంగి = తగిన విధంగా; సంభావితము = భావించబడినది; కొమరు = అందం; అఘహరము = పాపాన్ని తొలగించేది; దురితౌఘము = పాప సమూహము; ఆపగ = నది, ఏరు; అవగాహం = స్నానం; రేపకడ = ఉదయము; ప్రమదం = సంతోషం; గ్రావె = ఉండెను; నైష్ఠికత = నిష్ఠ; సంభృత + అత్యంత పుణ్యులు = పుణ్యాన్ని బాగా నింపు కొన్నవారు; వీచీకరము = అలలు అనెడి చేతులు; ఉదిత = పుట్టిన; కంబళము = కంబళి; ఉత్కరము = అధికము; కలువడము = ఉత్సవములలో కట్టెడు బంగారు కలువ పూదండ; సరసి = సరస్సు; సుప్తములు = నిద్రపోయినవి; శీకరము = తుంపర; నీరజము = పద్మము; మెయి = వలె; రహి = కాంతి; భృంగము = తుమ్మెద; తనూజుడు = కుమారుడు.

**4. నానార్థాలు :**

కాంచి : మొలనూలు, చూచి

కరము : చేయి, మిక్కిలి, తొండం

ఆమోదము : సంతోషము, ఒప్పుకోవడం

ఆశ : కోరిక, దిక్కు

యతి : సన్యాసి, పద్యవిశ్రమ స్థానం

**5. పర్యాయ పదాలు :**

భృంగము : తుమ్మెద, తేటి, బంభరము

తరణి : సూర్యుడు, రవి, భానుడు, ఆదిత్యుడు

సరస్సు : సరోవరము, కొలను, సరసి

కరువలి : గాలి, వాయువు, పవనం

**6. వ్యుత్పత్త్యర్థాలు**

ఆపగ : జలముతో నడిచేది (నది)

నీరజము : నీటిలో పుట్టినది (తామర)

©KTBS Not to be republished

అతిథి : తిథి, వార, నక్షత్రాదులను గణింపక వచ్చేవాడు

తరణి : అంధకారమును తరింప సాయపడువాడు (సూర్యుడు)

అంతరీపము : నీటి నడుమనున్నది (లంక)

**7. ప్రకృతి - వికృతులు :**

గౌరవం - గారవం

కుడ్యం - గోడ

పుణ్యం - పున్నెం

స్నానం - తానం

**8. రూపాంతరాలు**

అవగాహనము - అవగాహము

సరసి - సరసు, సరస్సు

వేడుక - వేడ్క

**9. సంధులు**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| దురితౌఘము | : దురిత | + | ఓఘము | = | వృద్ధిసంధి |
| సంభృతాత్యంతము | : సంభృత | + | అత్యంతము | = | సవర్ణదీర్ఘసంధి |
| అత్యంతము | : అతి | + | అంతము | = | యణాదేశసంధి |
| దక్షిణాశ | : దక్షిణ | + | ఆశ | = | సవర్ణదీర్ఘసంధి |
| పసుపు గంబళము | : పసుపు | + | కంబళము | = | సరళాదేశసంధి |
| రత్నపు కంబళము | : రత్నము | + | కంబళము | = | పుంప్వాదేశసంధి |

**10. సమాసాలు :**

గంగా తుంగలు : గంగయును మరియు తుంగయును - ద్వంద్వ సమాసం

భూపురంధ్రి : భూమి అనెడి స్త్రీ - రూపకసమాసం

చరణముద్రలు : చరణముల యొక్క ముద్రలు - షష్ఠీతత్పురుష సమాసం

రత్న కంబళము : రత్నములతో కూడిన కంబళము - విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం.

©KTBS Not to be republished

**11. అలంకారాలు :**

1. **' ఆంధ్ర భూ పురంధ్రికి మధ్యమందు తనరు**
**పైడి కాంచి యగుచు తుంగభద్ర మెరయ'**

(ఆంధ్రభూమి యనెడు పడతికి, తుంగభద్ర ఒడ్డాణమై శోభించుచున్నదనుట ఉత్ప్రేక్ష)

ఉపమేయం : తుంగభద్ర

ఉపమానం : పైడి కాంచి

**అలంకారం:** ఉత్ప్రేక్ష, రూపకం.

ఆంధ్రభూమి యనెడు పురంధ్రి యనుటచే రూపకము

2. **'ఇది నీరజోత్కర కాంతిన్ మృదురత్నపు కంబళమ్ము మెయి గన్పట్టున్'**

**భావం :** ఈ పంపా సరోవరం విస్తారమైన పద్మాల కాంతి చేత మృదువైన రతనాల కంబళము వలె కనపడుచున్నది.

ఉపమేయం : నీరజోత్కరమైన పంపాసరోవరం

ఉపమానం : మృదు రత్నపు కంబళం

ఉపమావాచకం : మెయిన్

సాదృశ్యం : ఆకారం

**అలంకారం** : ఉపమాలంకారం.

**12. జతపరచండి :**

| | |
|---|---|
| విజయనగరం | కిష్కింధ |
| సరోవరము | సమాధులు |
| ఆనెగొంది | స్నానము |
| నవ బృందావనము | శ్రీకృష్ణదేవరాయలు |
| గంగ | పద్మములు |

**13. తప్పొప్పుల్ని గుర్తించండి :**

అగము, బక్తజనులు, గ్రుహము, సాదుజనులు భోదకుడు, బాస్కరుడు

©KTBS Not to be republished

**14. క్రింది ప్రశ్నలకు ఒకటి , రెండు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. గంగా స్నానం ఎలాంటిది?
2. రామాయణంలో 'ఆనెగొంది' ని ఏమని పిల్చేవారు?
3. బ్రహ్మపుత్రి ఎవరు?
4. నవ బృందావనం ఎక్కడ ఉంది?

**15. క్రింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. 'హంపి' ఎలా కనబడుతోంది?
2. 'గంగా తుంగలు' ఏ విధంగా సమాన గౌరవాన్ని పొందాయి?
3. ఆనెగొందికి ఎలా చేరు కోవాలి?
4. రామాయణానికి, ఆనెగొందికి గల సంబంధ మేమి?
5. 'పంపా సరోవర' మనే పేరు ఎలావచ్చింది?

**16. క్రింది ప్రశ్నలకు పది, పన్నెండు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. పంపా సరోవరాన్ని గురించి వివరించండి.
2. 'నవబృందావనం' విశేషాలను వివరించండి.
3. ''అధ్వనీనులకు విషాదమడరజేయు'' ఎందుకు?

**17. క్రింది సందర్భాలను వివరించండి.**

1. కొలికి పూస యగుచు 'హంపి' కొమరు మిగులు
2. గంగా తుంగలు సమాన గౌరవ పాత్రల్
3. చరణ ముద్రలు దాల్చు నీ పరిసరములు
4. అమరు బంపా సరోవరంబనెడి పేరు
5. మృదు రత్నపు గంబళమ్ము మెయి గన్పట్టున్
6. అధ్వనీనులకు విషాదమడర జేయు

**18. కింది ఖాళీలను పూరించండి.**

1. ఆంధ్ర భూ పురంధ్రికి మధ్యమందు తనరు________________యగుచు
2. ఆనెగొందియె ________________ కిష్కింధ యనెడి పేరగ్రాలె

©KTBS Not to be republished

3. ఈ సరసునకును నమరు __________________ సరోవరంబనెడి పేరు

4. వాలి రావణులయు __________________ ముద్రలు దాల్చు నీ పరిసరములు

5. తురుష్కుల__________________ లున్న నెలవు లవియె

6. ఈ కొలకున __________________ గావించి తపము సల్పు కారణంబున

**19. విద్యార్థులకు సూచనలు.**

1. హంపి వంటి ఇతర చారిత్రక ప్రదేశాలను సందర్శించండి.
2. లేపాక్షి, రామప్పదేవాలయం మొదలైన శిల్పకళాక్షేత్రాలకు సంబంధించిన పుస్తకాలను చదవండి.

**20. ఉపాధ్యాయులకు సూచనలు.**

1. విద్యార్థులను విహార యాత్రగా హంపి, ఆనెగొంది ప్రాంతాలకు పిలుచుకొనివెళ్ళండి.
2. 'హంపీ' క్షేత్రానికి సంబంధించిన ఇతర రచనలను, కావ్యాలను పరిచయం చేయండి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 3. త్రిజటా స్వప్నం

- గోన బుద్ధారెడ్డి

[రావణుడు సీతనపహరించి అశోకవనంలో ఉంచాడు. రాక్షస స్త్రీలను కాపలాగా నియమించాడు. వాళ్ళు సీతమ్మను కఠినమైన మాటలతో బాధించేవాళ్ళు. వాళ్ళలో త్రిజట ఉత్తమ స్త్రీ. ఆమెకు ఒక కల వచ్చింది. అందులో రాముడు లంకకు వచ్చి రావణుని వధించి సీతను అయోధ్యకు తీసుకొని పోయినట్లుగా కన్పించింది. ఆ స్వప్నవృత్తాంతాన్ని ఆమె రాక్షస స్త్రీలతో వివరించడమే ఈ పాఠ్య భాగ వృత్తాంతం. రంగనాథ రామాయణంలోని సుందరకాండ నుండి ఈ పాఠ్యాంశం తీసుకోబడింది.

తెలుగులో వచ్చిన రామాయణాలలో రంగనాథ రామాయణం మొట్టమొదటిదన్న అభిప్రాయం ఉంది. గ్రంథనామాన్ని బట్టి రంగనాథుడనే కవి ఈ గ్రంథాన్ని రచించాడని కొంతమంది అంటారు. అయితే పరిశోధకులు దీన్ని గోనబుద్ధారెడ్డి రచనగా భావిస్తున్నారు.

గోన బుద్ధారెడ్డి 13వ శతాబ్దికి చెందిన వాడు. మృదు మధురమైన శైలిలో సామాన్యులకు కూడా అర్థమయ్యేలా ద్విపదలో రామాయణాన్ని రచించాడు. అన్వయ కాఠిన్యం గానీ, దీర్ఘ సంస్కృత సమాసాలు కానీ లేకుండా సరళమైన భాషలో వచ్చిన గొప్ప కావ్యం రంగనాథ రామాయణం.]

అంత నా త్రిజటయు నవనీ తనూజ
సంతాపమటు చూడఁ జాలక తొలగి
నెలకొని యొకచోట నిద్రించి లేచి
గలగని రాక్షస కాంతలఁ జూచి
“యొక కలగంటి నేనో యింతులార
ప్రకటించి చెప్పెదఁ బాటించి వినుడు
రాముడేనుగు నెక్కి రాఁజూడఁ గంటి
సౌమిత్రి భృత్యుడై చనుదేరఁ గంటి
నామహా గజముపై నవని వల్లభుండు
కోమలి నెక్కించు కొని పోవఁ గంటిఁ
బట్టాభిషిక్తుడై బ్రహ్మాది సురులు
గట్టిగాఁ గొల్వ రాఘవుఁ డుండఁ గంటిఁ
గూలిన రావణు గ్రూరాసి నొకతె
నీలాంబరము తోడఁ జేరఁ గంటి
గురుతరోష్ట్రము నెక్కి కుంభకర్ణుండు
తిరమేది దక్షిణ దిశకేగు గంటిఁ

దనరారు తోరణ తతులతో గూడ
వనధి లోపల లంక వడిఁ గూలఁ గంటిఁ
దైల ధారలఁ దోగి దానవు లెల్ల
నేల నూరక పడి నిద్రింపఁ గంటి
రావణ మరణంబు రఘురాము జయము
నేవిధంబున సిద్ధమిట మీదనింక
నటుగాన మీర లీ యవనీ తనూజఁ
బటు దుష్టభాషల భర్జింప వలదు
తొలగి పొండ''నవుడు తొలగి నిద్రించి
రలసి రాక్షస కాంత లందఱునంత

**1. సారాంశం :**

అంతట ఆ త్రిజట సీతాదేవి దు:ఖాన్ని చూడలేక ప్రక్కకు తొలగి ఒక చోట నిద్రించి, కలగని లేచి రాక్షసస్త్రీలను చూచి ఇలా అన్నది.

''నేనొక కలగన్నాను. మీకు చెబుతాను వినండి. రాముడు ఏనుగు మీద రాగా చూశాను. లక్ష్మణుడు సేవకుడై వస్తుండగా చూశాను. శ్రీరామ చంద్రుడు సీతాదేవిని ఏనుగుపై నెక్కించుకొని పోవటాన్ని చూశాను. బ్రహ్మాది దేవతలు కొల్వగా శ్రీరాముడు పట్టాభిషిక్తుడయ్యాడు.

నీల వస్త్రాన్ని ధరించి ఒకామె రావణుని సమీపించింది. ఒక గొప్ప ఒంటెపై ఎక్కి కుంభకర్ణుడు దక్షిణవైపు పోవటాన్ని చూశాను. తోరణాల సమూహంతో లంకా పట్టణమంతా సముద్రంలోకి కూలిపోవటం చూశాను. తైల ధారలతో మునిగి రాక్షసులందరు నేలపైపడి నిద్రింపగా చూశాను.

రావణుని మరణం, రఘురాముని విజయం ఏ విధంగా చూచినా జరగటం తథ్యం. అందువల్ల మీరు సీతమ్మను కఠినమైన మాటలతో బాధపెట్టకండి. తొలగి పొండి '' అన్న ఆమె మాటలు విని రాక్షస స్త్రీలు పక్కకు పోయి, అలసి పోయి, నిద్రించారు.

**2. కొత్తపదాలు :**

| | | | | |
|---|---|---|---|---|
| అవనీ తనూజ | సంతాపము | సౌమిత్రి | భృత్యుడు | తోరణ తతులు |
| ఇంతి | చనుదేరు | క్రూరాసి | నీలాంబరము | అవనీవల్లభుడు |
| వనధి | ఉష్ట్రము | | | |

**3. కఠిన పదాలకు అర్థాలు :**

కమనీయం = మనోహరం; భృత్యుడు = సేవకుడు; అసి = కత్తి; ఉష్ట్రం = ఒంటె; తనరారు = ప్రకాశించు, ఒప్పు; వనధి = సముద్రం; తతులు = సమూహములు, గుంపులు; చనుదేరు = వచ్చు; అంబరము = వస్త్రము; వల్లభుడు = భర్త; ఇంతి = స్త్రీ;

©KTBS Not to be republished

**4. నానార్థాలు :**

గజం : ఏనుగు, మూడు అడుగులు

అంబరం : ఆకాశం, వస్త్రం, వ్యసనం

తతి : సమూహం, సమయం

**5. వ్యుత్పత్త్యర్థాలు :**

సౌమిత్రి : సుమిత్ర యొక్క తనయుడు (లక్ష్మణుడు)

రాఘవుడు : రఘువంశానికి చెందినవాడు (రాముడు)

అవనీతనూజ : భూమిపుత్రిక (సీత)

**6. పర్యాయ పదాలు :**

భూమి : పుడమి, ఉర్వి, అవని, ధరిత్రి

ఏనుగు : గజము, కరి, ఇభము, హస్తి

కోమలి : స్త్రీ, ఇంతి, పడతి, వనిత

**7. ప్రకృతి - వికృతులు :**

| **ప్రకృతి** | **వికృతి** |
|---|---|
| భ్రమ | బ్రమ |
| స్థిరము | తిరము |
| దిశ | దెస |
| రాక్షసులు | రక్కసులు |
| బ్రహ్మ | బెమ్మ, బమ్మ |

**8. క్రింది లఘుప్రశ్నలకు ఒక వాక్యంలో జవాబులు రాయండి :**

1. త్రిజట దూరంగా ఎందుకు నిద్రించింది?
2. త్రిజట కలలో రాముడెలా కనిపించాడు?
3. త్రిజట కలలో సౌమిత్రి ఎలా కనిపించాడు?
4. బ్రహ్మాది సురులకు రాముడెలా కన్పించాడు?
5. నేల కూలిన రావణుని దగ్గరకు వచ్చిన స్త్రీ ఎలా ఉంది?
6. కుంభ కర్ణుడు దేనిపై వచ్చాడు?
7. లంక ఎక్కడ, ఎలా కూలింది?
8. దానవులందరు ఎలా నిద్రించారు?
9. ఏమి సిద్ధమని త్రిజట భావించింది?

©KTBS Not to be republished

**9. వివరణాత్మక ప్రశ్నలు :**

1. త్రిజట వేరొక చోట నిద్రించడానికి గల కారణమేమిటి ?
2. త్రిజట తన స్వప్న వృత్తాంతాన్ని రాక్షస స్త్రీలకు చెప్పిన విధానాన్ని తెలపండి.
3. త్రిజట శీలాన్ని వివరించండి.

**10. కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయిండి :**

1. నీలాంబరం
2. గురుతరోష్ట్రం
3. క్రూరాసి
4. బ్రహ్మాది
5. పట్టాభిషిక్తుడు

**11. కింది వానికి విగ్రహవాక్యాలు రాసి, ఏసమాసాలో తెలపండి :**

1. అవనీతనూజ
2. త్రిజట
3. మహాగజము
4. అవనీ వల్లభుడు
5. నీలాంబరం

**12. ఖాళీలను పూరించండి :**

1. రాముడు ____________________ నెక్కి రాజూడగంటి
2. సౌమిత్రి ____________________ చనుదేరగంటి
3. ____________________ లోపల లంక వడిగూలగంటి
4. తైలధారల దోగి ____________________ లెల్ల
5. రావణు ____________________ రఘురాము జయము

**13. గుంపుకు చెందని పదాన్ని గుర్తించండి :**

1. దేవతలు, రాక్షసులు, గంధర్వులు, యక్షులు, వృక్షములు, కిన్నరులు.
2. పుష్పము, పండు, జంతువు, పిందె, ఆకు
3. నీలము, ఎరుపు, నలుపు, విషము, తెలుపు



©KTBS Not to be republished

**14. క్రింది సందర్భాలను వివరించండి :**

1. ప్రకటించి చెప్పెద బాటించి వినుడు
2. గట్టిగా గొల్వ రాఘవుడుండ గంటి
3. వనధి లోపల లంకవడిఁ గూలగంటి
4. పటు దుష్టభాషల వర్జింప వలదు

**15. ఛందస్సు :**

**ద్విపద :** 'ద్విపద' అంటే రెండు పాదాలువున్నవి అని అర్థం. ఇది దేశీయ ఛందస్సు. ద్విపదలో ప్రతిపాదంలోను మూడు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం ఉంటాయి. రెండేసి పాదాలకు ప్రాస నియమం ఉంటుంది. పాదము నందలి మొదటి అక్షరమునకు మూడవగణము మొదట అక్షరమునకు యతిచెల్లుతుంది. ద్విపదను ప్రాస నియమం లేకుండా కూడ రాయవచ్చును. అలా రాస్తే దీన్ని మంజరీ ద్విపద అంటారు.

**ఉదాహరణ :**

| ర | నల | సల | గల |
|---|---|---|---|
| U I U | I I I I | I I U I | U I |
| అంతనా | త్రిజటయు | నవనీత | మూజ |

| త | సల | భ | న |
|---|---|---|---|
| U U I | I I U I | U I I | I I I |
| సంతాప | మటుచూడ | జాలక | తొలగి |

ప్రాస : అంత
సంతా

యతి : మొదటి పాదంలో మొదటిగణంలోని **అ** కు మూడవ గణంలో నవనీలోని **అ** కు రెండవ పాదంలో స కు మూడవ గణంలోని **జా**కు యతి మైత్రి చెల్లుతుంది.

**16. విద్యార్థులకు సూచనలు :**

1. భారత, భాగవత, రామాయణ కావ్యాలలోని కొన్ని ప్రధాన ఘట్టాల్ని ఉపాధ్యాయుల నడిగి తెలుసుకోండి. బొమ్మల బాల రామాయణం, బొమ్మల భారతం, భాగవతాలను చదివి, విషయాల్ని గ్రహించండి.

**17. ఉపాధ్యాయులకు సూచనలు :**

a. తెలుగులో రచింపబడిన వివిధ రామాయణ గ్రంథాలను విద్యార్థులకు తెలియ జేయండి. ద్విపద కావ్యాలను, వాటిని రచించిన కవులను గూర్చి విద్యార్థులకు అభిరుచిని కలిగించండి.

b. 'ద్విపద' గానయోగ్యమైన ఛందస్సు. దీనిని ఎలా పాడాలో లేదా చదవాలో విద్యార్థులకు చెప్పండి.

♣ ♣ ♣

Not to be republished ©KTBS

# 4. శతక పద్యాలు

[తెలుగు సాహిత్యంలో శతకప్రక్రియ ప్రసిద్ధమైంది. శతకకవులశైలి అందరినీ ఆకట్టుకొంటుంది. సులభశైలితోపాటు మానవ జీవితపురీతులు, లోకపు నీతులు మానవ జీవితాన్ని ప్రతిబింబించే విషయాలు, శతకసాహిత్యం జనానికి దగ్గర కావడానికి ప్రధానకారణమైంది.

'శతం' అంటే నూరు. శతకం అంటే నూరుపద్యాలను కలిగినది. కాని సాధారణంగా శతక సాహిత్య ప్రక్రియలో నూటఎనిమిది పద్యాలుంటాయి. విద్యార్థులను సత్పౌరులుగా, లోకజ్ఞానయుతులుగా తీర్చిదిద్దే, ఈ పాఠ్యాంశంలోని పద్యాలు విభిన్నకాలాలకు చెందిన విభిన్న శతకాలనుండి గ్రహింపబడ్డాయి.

**శతకవుల పరిచయం:**

1. **ఏనుగు లక్ష్మణకవి :**

సంస్కృతంలో భర్తృహరి రచించిన 'సుభాషితత్రిశతి'ని తెనిగించిన ముగ్గురిలో, ఏనుగులక్ష్మణకవి సుప్రసిద్ధుడు. [తక్కిన ఇరువురు పుష్పగిరి తిమ్మన, ఎలకూచి బాలసరస్వతి] ఏనుగులక్ష్మణకవి 'సుభాషితత్రిశతి'ని 'సుభాషితరత్నావళి' పేరిట ఆంధ్రీకరించాడు.

ఈ కవి 18వ శతాబ్దానికి చెందినవాడు, ఈయన ఇతర రచనలు రామవిలాసం, గంగామాహాత్మ్యం; మొదలైనవి. ఈ పాఠ్యాంశంలోని మొదటి రెండు పద్యాలు 'సుభాషితరత్నావళి'లోనివి.

2. **మారద వెంకయ్య :**

ఈ పాఠ్యాంశంలోని 3, 4, పద్యాలు మారద వెంకయ్య రచించిన 'భాస్కరశతకం' లోనివి. ఈయన 17వ శతాబ్దం కంటె ముందున్నవాడు.

ఇతని భాస్కరశతకం ప్రౌఢమైన నీతిశతకాలకోవకు చెందింది. ఈ శతకంలో 'భాస్కరా' అన్నది మకుటం.

3. **శరభాంకుడు :**

పాఠ్యాంశంలోని 5వ పద్యం శరభాంకుడు రాసిన 'శరభాంకలింగం' శతకంనుండి గ్రహింపబడింది. ఈ కవిని గురించి తెల్సుకోవడానికి ఆధారాలు తక్కువ.

ఈ కవి కాకతీయ రెండవ ప్రతాపరుద్రుని కాలంవాడని విమర్శకుల అభిప్రాయం. 'శరభాంకలింగమా' అన్న మకుటంతో శతకాన్ని రాశాడు.

©KTBS Not to be republished

4. **అల్లంరాజు రంగశాయి కవి :**

ఈ పాఠ్యాంశంలోని 6వ పద్యం రంగశాయి కవి రచించిన 'రఘురామశతకం'లోనిది. ఈ కవి 20వ శతాబ్దం ప్రారంభంలోనివాడు.

ఈ కవి చంపూరామాయణాన్ని, చంపూభారతాన్ని అనువదించాడు. మాధవ శతకాన్ని రాశాడు. రఘురామశతకంలో 'రఘురామదయా హృదయా శుభోదయా' అన్నది మకుటం.

5. **వడ్డాది సుబ్బరాయకవి :**

వీరు ఆధునిక శతక కవులలో సుప్రసిద్ధులు. వీరు అనేక సంస్కృత నాటకాలను ఆంధ్రీకరించారు, 'ఆర్తరక్షామణి'; 'నందనందన శతకం'; 'మల్లికామారుతం' కృతులను రచించారు. ఈ పాఠ్యభాగంలోని 7వ పద్యం 'భక్తచింతామణి' అనే మకుటంగల 'భక్త చింతామణి' శతకంలోనిది.

6. **కలుగోడు అశ్వత్థరావు :**

ఈ పాఠ్యాంశంలోని 8వ పద్యం కలుగోడు అశ్వత్థరావు రచించిన 'సోమేశ్వర శతకం'లోనిది. ఈ కవి అనంతపురం జిల్లా రాయదుర్గంవారు. వీరు 20వ శతాబ్దికి చెందినవారు. తెలుగు కన్నడ భాషలందు కవిత్వం అల్లారు. అశ్వత్థామ భారతం; దండకరామాయణం; అనే కావ్యాలను తెలుగులో రచించారు. భాగవతంలోని కొన్ని ఘట్టాలను, వేమన శతకాన్ని అనువదించారు. కన్నడంలో రన్నమహాకవి రాసిన గదాయుద్ధాన్ని, సర్వజ్ఞవచనాలను, పాల్కురికి సోమన రచించిన సోమేశ్వర శతకాన్ని ఆంధ్రీకరించారు.

ఈ పాఠ్యాంశమైన పద్యం కన్నడానువాదమైన 'సోమేశ్వర శతకం' లోనిది. 'సోమేశ్వరా' అన్న మకుటంతో కూడినది.

## శతకపద్యాలు

1. ★ భూషలుగావు మర్త్యులకు భూరిమయాంగద తారహారముల్
భూషితకేశపాశమృదు పుష్ప సుగంధ జలాభిషేకముల్
భూషలుగావు పూరుషుని భూషితు జేయుఁ బవిత్రవాణి, వా
గ్భూషణమే సుభూషణము భూషణముల్ నశియించునన్నియున్.

2. ★ ఆపదలందు ధైర్యగుణ మంచిత సంపదలందుఁ దాల్మియున్
భూపసభాంతరాళమునఁ బుష్కలవాక్చతురత్వ, మాజి బా
హాపటు శక్తియున్, యశమునం దనురక్తియు విద్యయందు వాం
ఛాపరివృద్ధియున్, బ్రకృతి సిద్ధగుణంబులు సజ్జనాళికిన్.

3. ★ చదువదియెంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణసంయుతు లెవ్వరు మెచ్చరెచ్చటం
బదునుగ మంచికూర నలపాకము చేసిననైననందు నిం
పొదవెడునుప్పు లేక రుచి పుట్టఁగ నేర్చునటయ్య భాస్కరా!

©KTBS Not to be republished

4. బంధుర సద్గుణాఢ్యుడొక పట్టున లంపట నొందియైనదు
స్సంధిఁ దలంనాపడన్యులకుఁ జాల హితం బొనరించుగాక,
గంధపుజెక్క రాగిలుచుఁ గాదె శరీరులకుత్సవార్థమై
గంధములాత్మఁ బుట్ట దిఱుగంబడి యండుటలెల్ల భాస్కరా !

5. ఎక్కడి మంత్రతంత్రములవెక్కడి చక్రములేడ పాచికల్
ఎక్కడి జ్యోతిషంబులవి యెక్కడి హేతువులేడ ప్రశ్నముల్
తక్కిడి గాక పూర్వకృత ధర్మసుకర్మమె నిశ్చయంబు పో
పెక్కురు పొట్టకూటికిది వేషమయా శరభాంక లింగమా

6. తమయుదకంబులన్నదులు త్రావవు స్వీయఫలంబులెల్ల వృ
క్షములు భుజింప వభ్రములు సస్యములందినవట్లుగా మహో
త్తమ పురుషార్జితంబయిన ద్రవ్యమహర్నిశమున్ పరోపకా
రమునకెయౌను సుమ్ము రఘురామ దయాహృదయా శుభోదయా

7 ★ ఆకాశంబును భూమియున్ పుటలు రెండందెల్ల నీ శక్తియున్
నీ కారుణ్యము నీ మహత్వమును నీ నేర్పాదిగా నన్నియున్
నీకుజ్జ్వల్ చదువంగ వ్రాసితివి తండ్రీ! భావ గర్భంబుగా
నాకేమర్థముగాదు నేర్పవె, యనంతా భక్తచింతామణీ!

8. ★ తనకున్‌గాని ధనంబదేల? ముదిమిన్ దన్ బ్రోవగాలేని నం
దనుఁడేలా? తఱిరానివాన మరి రాఁదానేల? కష్టస్థితిన్
గనరాకుండిన బంధువేల? సమయానన్ జేతికిన్ జిక్కు
తృణమే మేరుసమంబుగాదె ! గిరిశా! యీశాన సోమేశ్వరా!

*** కంఠస్థ పద్యాలు**

**1. సారాంశం :**

1. మానవులకు బంగారు భుజకీర్తులు, ముత్యాలదండలు, అలంకారాలు కావు. అలంకరించుకొన్న వెంట్రుకలు, మృదువైన పూలపరిమళ జలస్నానాలు, అలంకారాలు కావు. పవిత్రమైన వాక్కే (మాటే) మానవునికి నిజమైన మంచి భూషణం. తక్కినవన్నీ నశిస్తాయి.

2. ఆపదలలో ధైర్యం, అధికమైన సంపదలున్నపుడు ఓర్పు, రాజసభలలో మాటనేర్పరితనం, యుద్ధరంగంలో భుజబల పరాక్రమం, కీర్తిసంపాదన, విద్యాభివృద్ధులపట్ల ఆసక్తి, మంచివారికి సహజమైన గుణాలు.

3. కూరను ఎంత బాగా వండినప్పటికీ తగినంత ఉప్పు లేకపోతే ఆ కూర రుచిగా ఉండదు. అలాగే ఎంత చదువుకొన్నప్పటికీ చదువుల సారాన్ని గ్రహించే శక్తి లేని చదువు నిరర్థకం.

4. మంచి గంధపు చెక్క తాను అరిగిపోతూ కూడా తనలోని సువాసనలచే జనులకు వేడుక కలిగించేటట్లుగా, సుగుణవంతుడు తాను కష్టాలలో ఉండి కూడా పరులకు కీడు తలపక మేలు చేస్తుంటాడు.

©KTBS Not to be republished

5. దేవతా వశీకరణం కోసం ఉపయోగించే మంత్రతంత్రాలు, చక్రాలు, భవిష్యత్తును తెల్సుకోవడం కోసం ఉపయోగించే పాచికలు, జ్యోతిషాలు, హేతువులు, ప్రశ్నలు అన్నీ మోసమే. గతంలో చేసిన మంచివల్ల కలిగే ఫలితమే నిశ్చయం. పైన చెప్పిన మంత్రతంత్రాదులన్నీ చాలా మంది పొట్ట కూటి కోసం వేసే వేషాలు, చేసే మోసాలు.

6. నదులు తమ నీళ్ళను తామే తాగవు, చెట్లు తమ పండ్లను తామే తినవు. వర్షం కురిపించి పంటలు పండడానికి కారణమైన మేఘాలు ఆ పంటల్ని తినవు. అదే విధంగా గొప్పవారు సంపాదించిన సంపద ఎల్లప్పుడూ ఇతరుల కోసమే.

7. ఓ తండ్రీ ! భక్తులకోర్కెలు తీర్చెడివాడా ! ఓ అనంతా ! ఆకాశం, భూమి అనే రెండు పుటలలో నీ శక్తిని, కనికరాన్ని, గొప్పతనాన్ని, మిక్కిలి నేర్పరితనంతో భావపూరితంగా నీ బిడ్డలు చదువుకోవడం కోసం రాశావు. అది నాకు అర్థం కాదు. దానిని అర్థం చేసుకొనే సామర్థ్యాన్ని ఇవ్వు.

8. తనకు పనికిరాని ధనం, ముసలితనంలో పోషించని కొడుకు, సకాలంలో కురవని వర్షం, కష్ట సమయంలో ఆదుకోని బంధువు నిరుపయోగం. అవసరానికి చేతికి చిక్కిన తృణమో, పణమో అదే గొప్పది.

**2. కొత్తపదాలు :**

| | | | | |
|---|---|---|---|---|
| భూషలు | పుష్కల | అనురక్తి | మర్త్యులు | ఆజి |
| బంధుర | భూరిమయ | బాహాపటుశక్తి | తఱుగంగ | అంగద |
| వాంఛాపరివృద్ధి | తక్కిడి | రసజ్ఞత | పరుషార్జితం | ద్రవ్యం |
| తారహారముల్ | భావగర్భితం | తఱి | తృణం | |

**3. అర్థాలు :**

భూషలు = అలంకారాలు; మర్త్యులు = మానవులు; భూరిమయ = అధికమైన బంగారు మయమైన; వాణి = వాక్కు; అంగద = భుజకీర్తులు; తారహారముల్ = ముత్యాలసరాలు; అంచిత = తగిన; తాల్మి = ఓర్పు, సహనం; భూపసభ + అంతరాళం = రాజసభలలో; పుష్కల = అధికమైన, ఎక్కువ; వాక్ = మాటల; చతురత్వం = నేర్పరితనం; ఆజి = యుద్ధం; బాహాపటుశక్తి = గొప్పభుజబలం; యశము = కీర్తి; అనురక్తి = ప్రేమ; వాంఛ = కోరిక; పరివృద్ధి = అభివృద్ధి; ప్రకృతి = సహజం; సిద్ధ = కలిగే; రసజ్ఞత = సారాన్ని గ్రహించడం; నిరర్థకం = వ్యర్థం, అర్థంలేనిది; గుణసంయుతులు = గుణవంతులు; పదను = పక్వం; నలపాకం = మిక్కిలి రుచికరంగా చేసినవంట; ఇంపు = తృప్తి; బంధుర = కాంతి, ప్రకాశం; లంపట = ఆపద, కష్టం; దుస్సంధి = చెడు; రాగిలుచు = అరిగిపోవుచు; ఉత్సవ + అర్థం = వేడుకకై, సంతోషానికై; ఆత్మన్ = తనలో; గంధం = సువాసన; తక్కిడి = మోసం; పూరం = ముందు; కృతం = చేసిన; సుకర్మం = పుణ్యం, మంచిపని; ఉదకం = నీళ్ళు; అభ్రములు = మేఘములు; సస్యం = పంట; ఆర్జితం = సంపాదన; ద్రవ్యం = ధనం; అహః + నిశలు = పగలు; రాత్రి; ముదిమి = ముసలితనం; తఱి = సమయం; తృణం = గడ్డి, కొంచెం; మేరుసమం = మేరు పర్వతంతో సమానం.

©KTBS Not to be republished

**4. వివరణ :**

నలపాకం : నలుడు కొంచెం గడ్డిని చేత పట్టుకొని విసరగానే అగ్ని పుడుతుంది. అతని వంటముగియునంత వరకు ఆరిపోక మండుతూనే ఉంటుంది. నీళ్ళు కావాలంటే బిందెలు వానంతట అవే నిండుతుంటాయి. రెండు చేతులు చరచికొట్టి నంతనే సుగంధ ద్రవ్యం వస్తుంది. వంటయొక్క రుచి అమోఘం. నలపాకంతోపాటు భీమపాకం కూడా ప్రసిద్ధి చెందింది.

**5. నానార్థాలు :**

భూరి :- బంగారు; విశాలం; అధికం.

గంధం :- వాసన; గర్వం; చందనం; స్వల్పం; గంధకం.

తార :- వాలిభార్య; బృహస్పతి భార్య; నక్షత్రం.

పవిత్రం :- జందెం; జలం; దర్భ; పరిశుద్ధం; యంత్రం.

భూషణం :- నగ, అలంకారం; ధర్మం; విల్లు; యజ్ఞం; పుణ్యం; న్యాయం.

ధనం :- గోసమూహం; డబ్బు; సంపత్తు.

రుచి :- కాంతి; ఆకలి; రంగు; కోరిక.

సంధి :- కూడిక; అదుకు; సొరంగం; కీలు.

భోగం :- సుఖం; రాజ్యం; ధనం; పూజ; పాముపడగ; భోజనం.

అర్థం :- ధనం; పదంయొక్క అర్థం; కారణం; ప్రకృతి.

**6. పర్యాయపదాలు :**

మర్త్యుడు :- నరుడు; మనుజుడు; మానవుడు; పురుషుడు; మనుష్యుడు.

నృపాలుడు :- రాజు; క్షితిపతి; ఏలిక; ఒడయుడు; భూపతి.

పుష్పం :- విరి, సుమం, కుసుమం.

శరీరం :- దేహం; తనువు; కాయం; గాత్రం.

ఉదకం :- నీరు; తోయం; జలం.

ఆజి :- యుద్ధం; ఆహవం; సంగ్రామం; సమరం.

వృక్షం :- మహీరుహం; ద్రుమం; తరువు.

నందనుడు :- కుమారుడు; తనయుడు; సుతుడు; పుత్రుడు; కొడుకు.

ఆకాశం :- దివం; వినువీధి; గగనం; నభం.

భూమి :- అవని; ధరణి; విశ్వంభర.

©KTBS Not to be republished

**7. వ్యుత్పత్తి అర్థాలు :**

నృపాలుడు :- నరులను పాలించువాడు - రాజు

నందనుడు :- ఆనందమును కల్గించువాడు - కొడుకు

అనంతుడు :- అంతంలేనివాడు (భగవంతుడు) విష్ణువు

మర్త్యుడు :- మృతిని కలిగినవాడు (మానవుడు)

**8. జంటపదాలు :**

అహర్నిశములు; భూమ్యాకాశములు; యంత్రతంత్రములు.

**9. ప్రకృతి - వికృతులు :**

| | | |
|---|---|---|
| విద్య | - | విద్దె |
| శ్రీ | - | సిరి |
| గుణం | - | గొనం |
| వేషం | - | వేసం |
| సస్యం | - | ససి |
| శక్తి | - | సత్తి, సత్తువ |
| జ్యోతిషం | - | జోతిషం |

**10. వ్యతిరేక పదాలు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| మృదువు | × | కఠినం | నిశ్చయం | × | అనిశ్చయం |
| మంచి | × | చెడు | ఉత్తమం | × | అధమం |
| పవిత్రం | × | అపవిత్రం | కష్టం | × | సుఖం |
| హితం | × | అహితం | అర్థం | × | అనర్థం |
| తరుగు | × | పెరుగు | సుగంధం | × | దుర్గంధం |
| ధర్మం | × | అధర్మం | | | |
| అంతం | × | ఆది, అనంతం | | | |

©KTBS Not to be republished

**11. తప్పొప్పులను గుర్తించండి :**

1. వాగ్భూషణమే సుభూషణం
2. రసజ్ఞత లేని చదువు సార్థకం
3. స్వీయ ఫలంబులెల్ల వృక్షములు భుజించును
4. పూర్వకృత ధర్మ సుకర్మమె నిశ్చయం
5. భూషణముల్ నశించవు

**12. సొంత వాక్యాలలో రాయండి.**

| | |
|---|---|
| 1. పవిత్రవాణి | 6. పూర్వకృతం |
| 2. వాంఛాపరివృద్ధి | 7. భావగర్భితం |
| 3. పొట్టకూటికి | 8. వాక్చతురత్వం |
| 4. ప్రకృతి సిద్ధం | 9. ఇంపొదవు |
| 5. అహర్నిశం | 10. మేరుసమం |

**13. కింది పదాలను విడదీసి సంధి పేరు తెలపండి :**

| | |
|---|---|
| 1. సభాంతరాళం | 6. పరోపకారం |
| 2. శరభాంకుడు | 7. అన్నదులు |
| 3. సోమేశ్వరా | 8. ఎక్కడ |
| 4. విద్యయందు | 9. తమయుదకంబులు |
| 5. సజ్జనాళి | 10. శుభోదయ |

**14. కింది పదాలను కలిపి రాసి గట్టిగా చదవండి :**

| | | |
|---|---|---|
| 1. వాక్ + భూషణం | 3. సత్ + గుణ | 5. తాను + ఏల |
| 2. సత్ + జనులు | 4. అహః + నిశలు | 6. నాకు + ఏమి |

**15. కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి ఏ సమాసాలో తెల్పండి :**

| | | |
|---|---|---|
| 1. పవిత్రవాణి | 3. నీశక్తి | 5. నిరర్థకం |
| 2. వాగ్భూషణం | 4. అహర్నిశలు | 6. యంత్రతంత్రములు |

**16. కింది పదాలను విడదీసి ఔపవిభక్తులను గుర్తించండి :**

గూటిలో   ఇంటికి

చేతికిన్   నేతిగిన్నె

©KTBS Not to be republished

**17. కింది పదాలకు పర్యాయ పదాలు రాయండి :**

జలం

వాక్కు

తాల్మి

తక్కెడి

ద్రవ్యం

పొట్ట

కూడు

ముదిమి

**18. ప్రకృతి వికృతులు రాయండి :**

భోజనం

భూషణం

గుణం

వేషం

జ్యోతిషం

**19. వ్యతిరేక పదాలు రాయండి :**

కష్టం ×

ఉపకారం ×

హితం ×

పూర్వం ×

సుగంధం ×

**20. జతపర్చండి :**

| | |
|---|---|
| వాగ్భూషణం | బాహాపటు శక్తి |
| అంచిత సంపదలు | సుభూషణం |
| ఆజి | అనురక్తి |
| యశము | ధైర్యగుణం |
| ఆపదలు | తాల్మి |

©KTBS Not to be republished

**21. ఖాళీలను పూరించండి :**

1. తృణమే మేరుసమంబు ______________________________

2. నీ కుఙ్జల్ చదువంగ ______________________________

3. పూరుషుని భూషితు జేయు ______________________________

4. ____________ లేక ________________ పుట్టగ నేర్చునటయ్యా

5. పెక్కురు పొట్ట కూటికిది ______________________________

6. ఆకాశంబును, భూమియున్ పుటలు ____________________

7. భూపసభాంతరాళమున్ ______________________________

8. విద్యయందు ______________________________

9. ప్రకృతిసిద్ధ ______________________________ సజ్జనాళికిన్

10. నాకేమర్థము గాదు ______________________________

**22. సందర్భాలు రాయండి :**

1. పూరుషుని భూషితు జేయు పవిత్రవాణి

2. ఉప్పు లేక రుచి పుట్టగ నేర్చునటయ్యా ?

3. ముదిమిన్ దన్ బ్రోవగా లేని నందనుడేలా?

4. పొట్టకూటికిది వేషమయా !

5. తమ యుదకంబులన్నదులు త్రావవు

**23. కింది పద్య పాదాలలోని ఛందస్సును తెల్పండి :**

1. కనరాకుండిన బంధువేల? సమయానన్ జేతికిన్ జిక్కునా ?

2. నాకేమర్థముగాదు నేర్వ వెయనంతాభక్తచింతామణి

3. తక్కిడిగాక పూర్వకృత ధర్మసుకర్మమె నిశ్చయంబుపో

4. చదువు నిరర్థకంబు గుణ సంయుతు లెవ్వరు మెచ్చ రెచ్చటం

©KTBS Not to be republished

**24. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి :**

1. మర్త్యులకు నిజమైన భూషణం ఏది? ఎందుకు?
2. సజ్జనాళికి ప్రకృతిసిద్ధ గుణములు ఏవి?
3. రసజ్ఞత లేనివాని చదువు ఎలా నిరర్థకం?
4. సద్గుణాఢ్యుని స్వభావం ఎలాంటిది?
5. పెక్కురు పొట్టకూటికై వేసే వేషాలు, చేసే మోసాలేవి?
6. ఉత్తమ పురుషార్థం, పరోపకారార్థమేనని ఎలా నిరూపింపబడింది?
7. ఈ లోకంలో పనికి రానివి ఏవి?
8. భగవంతుడు బిడ్డలకోసం దేన్ని ఎలారాశాడు?

**25. విద్యార్థులకు సూచనలు :**

1. శతక పద్యాలను కంఠస్థం చేయండి.
2. శతకాలలో నీతిని ఉదాహరణ రూపంలో (దృష్టాంతరూపంలో) ఎలా చెప్తారో పరిశీలించండి.

**26. ఉపాధ్యాయులకు సూచనలు :**

1. శతకలక్షణాలను పరిచయం చేయండి. అందులో మకుటం అంటే ఏమిటో సోదాహరణంగా వివరించండి.
2. సుప్రసిద్ధ శతకాలను, శతక కవులను పరిచయం చేయండి.
3. ప్రణాళికా కార్యాచరణంలో ప్రతి విద్యార్థి కనీసం రెండు శతక పద్యాలను (ఒక విద్యార్థి రాసిన వాటిని మరొక విద్యార్థి రాయకుండా) సేకరించి, తెచ్చేలాగా విద్యార్థులను ప్రోత్సహించండి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 5. వాత్సల్యం

- అనంతామాత్యుడు.

[ఈ పాఠ్యభాగరచయిత అనంతామాత్యుడు 15 వశతాబ్దానికి చెందినవాడు.'భోజరాజీయం' అనే నీతి బోధాత్మకమైన చక్కని కావ్యాన్ని రచించాడు. సమగ్రమైన ఛందస్సును వివరించే 'ఛందోదర్పణం' ఇతని ఇతర కృతి. ప్రస్తుత పాఠ్యభాగం భోజరాజీయంనుండి తీసుకోబడింది.

అడవిలో గడ్డిమేస్తున్న ఆవును, చంపడానికి పులివస్తుంది. అప్పుడు ఆవు నాబిడ్డకు పాలిచ్చివస్తాను అని చెప్పి, దానికి మాటిచ్చి, ఇంటికి వచ్చి, తన దూడకు పాలిస్తూ, నీతులు దానికి చెప్పడం ఇందులో వర్ణితం. సమాజంలో మానవుడు ఎలా నడుచుకోవాలో ప్రాణులను దృష్టాంతంగా తీసుకొని, ఇందులో ఆడినమాటను ఎలాంటి పరిస్థితులలోను తప్పగూడదు అనే నీతిని పరోక్షంగా కవి చెప్పాడు.]

1 చ. పులికి ప్రదక్షిణించి తలపుంబటకున్ సదృశంబుగాగన
స్ఖలిత విలాసయాన మెసగం బురికేగి జతుస్తనంబులుం
బలసి పొదుంగుప్రేగుపఱుపంగ గభీరరవంబు తోడ వీ
థుల నడయాడు బాలకులు దోరపు భీతిదొలంగి పాఱగన్.

2 తే.గీ. కొడుకు చనుగ్రోలు చున్నంత తడవుదల్లి
యడుగుదిరుగక కదలక, యన్యచిత్త
గాక పైనీగ సోకిన గదలకుండె
నెమ్మి పాషాణధేనువు నిలిపినట్లు.

3 ఆ.వె. తల్లులు అరుగుదేర దనయాడు కోడెలు
సదమలాను రక్తి నెదురువార
దానుగూడబఱి తనమాతృహీనత
దెలిసి బిడ్డడంతదలగకున్నె

4 ఉ. ఏదనుబాసిపోవు తెఱగెద్దియుగానడువీడు నెమ్మదిం
దాదిరుగందొడంగె పులితద్దయు నాకొనియోర్వలేకనా
మీద నసత్య దోషమిడి మిన్నక పోవునొ యింక నాకు ని
చ్చోదడయంగ రాదనుచు సూనునిడగ్గఱి ధేనువిట్లనున్

5 కం. నిన్ను గని యిన్ని దినములు
చన్నిచ్చితినేను ఋణ వశంబున నిక నీ
వెన్నడు నన్ను తలంపకు
మన్న! మమత్వమ్ము విడువుమన్న !మనమునన్

©KTBS Not to be republished

6 ★ కం. ఒంటి జరింపకు పొలమున
నింటికి గడు ప్రొద్దు గలుగనే తెంచుచురా
వెంటబడి పొడుచుగోవుల
జంట జనకు క్రయ్యబడకు సందడియగుచో

7 ★ కం. నూతుల దరులను, లోతగు
పాతటి కసవులను నెట్టి పచ్చిక యున్నన్
బ్రాతిపడి మేయబోకుము
మూతినిడకుముగ్ర సత్త్వములు గలనీటన్.

8 ★ కం. చులకన జలరుహ తంతువు
చులకన తృణ కణము దూది చుల్కన సుమ్మీ
యిల నెగయు ధూళి చుల్కన
చులకన మతితల్లి లేని సుతుడు కుమారా!

9 చం. అని తగబుద్ధి చెప్పెడు నిజాంబ గనుంగొని, తత్తనూజుడి
ట్లను "నిది ఏమి తల్లి! ఇటులాడెదు, విప్రుడు నిన్ను నర్థకాం
క్షనొకని కమ్మెనో? తనదు గాదిలి పుత్రికి నీదలంచెనో?
యనయగ పుణ్యకాలమున నెవ్వరికేనియు ధారవోసెనో?

10 వ. అనిన క్రేపు మాటలకు.... అగ్గోవిట్లనియె.

11 కం. "ఇవ్విప్రవరేణ్యుడునను
నెవ్వరికి నొసగడేన యేగెదవిను" మం
చవ్వివరము సర్వంబును
నవ్వత్సముతోడ చెప్పనది కడుభీతిన్

12 కం. పిడు గడిచిన క్రియ, నీటెం
బొడిచిన గతి గుండె పగిలి భూస్థలి మీదన్
పడిపొరలు, దన్నుకొను ను
గ్గడువుగ కన్నీరునించు గడగడవడకున్

13 కం. 'చే'యను 'తల్లీ! నీవెట
పోయెద?' వను, "నన్నుడించి పులివాతబడన్
బోయెదవే? 'యను 'జెల్లం
బో?' యను 'నింకేటి బ్రతుకుపోనాకు' ననున్.

14 కం. ఇవ్విధమున శోకింపగ
నవ్వత్స శిరంబు మీదనాననమిడి, "నీ
వెవ్వరికి గాగవగచెద
వివ్వలవని జాలిపడగ నేటికి పుత్రా!

©KTBS
Not to be republished

15 కం. పుట్టిన పిమ్మట చావును
గట్టి; వృథా మరణమొందుకంటె బుధులకున్
దట్టమగు కీర్తి సుకృతము
లిట్టలముగ కల్గు చావులింపుగావే

16 ఆ.వె. ఇంక పెనగవలవదిటనే దడసిన
నచట నన్నృత దోషమావహిల్లు
దానజేసి యగునధమలోకమంత సే
యంగ నేలపనుపవయ్య! నన్ను''

17 చం. అని యిటులెట్టకేలకు నిజాత్మజు శోకదవాగ్ని కీలలొ
య్యన వచనాంబు వర్షమున నాఱగజేయుచు దాననచ్చటం
గొనకొని యుండగా నిలిపి, కూరిమితో పులియున్న యట్టి య
వ్వనమునకున్ రయంబెసగవచ్చి...........

*** కంఠస్థ పద్యాలు**

**1. సారాంశం :**

1. పులికి ప్రదక్షిణ చేసి, మనసులో పులిచెప్పిన మాటలు తలచుకుంటూ ఎక్కడా ఆగకుండ, ఊరివైపుపరుగులుపెట్టింది. పొదుగునిండా పాలు చేపునకువచ్చి, బరువైపోగా, పెద్దగా అరుస్తూ వెళ్ళింది. వీధుల్లో ఆడుకుంటున్న పిల్లలు భయంతో పక్కకు పారిపోసాగారు.
2. తన దూడ పాలు తాగుతున్నంతసేపు, కదలకుండ, వేరే ఆలోచన లేకుండ, ఈగ వాలినా కదలకుండ, రాతి గోవులా నిలబడింది.
3. తాను పులికి ఆహారమైపోతే, తల్లిలేని తనబిడ్డడు, ఎలా కష్టాలను ఎదుర్కొంటాడోనని ఆధేనువు ఇలా ఆలోచిస్తుంది.

   తన ఈడు దూడలు, తమ తల్లులతో కూడా ఎదురుగావచ్చినపుడు తనబిడ్డడు, తనకు తల్లి లేదని, తెలిసినపుడు దూరంగ వెళ్ళకుండా ఉంటాడా!
4. నా ఈ కుమారుడు, నేను వీనిని వదలిపోతుండటం ఎరుగడు. ఎంతో నెమ్మదిగా తిరుగుతున్నాడు. ఆపులి మిక్కిలి ఆకలిగొని, తట్టుకొనలేక, నేనువెళ్ళనందుకు, నేను మాటతప్పానని భావించి, వెళ్ళిపోయిందేమో. నేనిక్కడ ఇంక ఆలస్యం చేయకూడదు అని కొడుకును పిలిచి ఇలాచెబుతుంది.
5. ఓనాయనా! నిన్నుకని ఇన్ని దినాలుగా పాలిచ్చి పెంచాను. నీకు నాకు ఋణం తీరిపోయింది. ఇకపై నన్నెప్పుడూ గుర్తుకు తెచ్చుకోకు. నాపై ఆశవదలుకో.
6. పొలంలో ఒంటరిగా తిరుగాడవద్దు. ఇంటికి తొందరగా రమ్ము. పాడిచేగోవుల వెంబడిపోవద్దు. గుంపులో దూరి కలబడవద్దు.

©KTBS Not to be republished

7. నూతుల దరుల్లోను, లోతైనచోట్ల, ఎంత లేతగడ్డిఉన్నా, ఆశతో దాన్ని మేయటానికి వెళ్ళవద్దు. అపాయకరమైన జీవులున్న నీటిని తాగటానికి వెళ్ళకు.

8. తామర తూడులోని దారం, గడ్డిపోచ, దూది, భూమిపై ఎగసిన ధూళి ఎంతో తేలిక. అలాగే తల్లిలేనిబిడ్డడన్నను చాలాతేలిక.

9. అని తనకు మంచి మాటలు చెప్పే తన తల్లిని చూచి ఆదూడ ఇలా అడిగింది'అమ్మా! ఇది యేమి? ఇలా మాట్లాడుతున్నావు? మనయజమాని డబ్బుకోసం నిన్ను వేరే వాళ్ళకేమైన అమ్మినాడా? లేక తనముద్దుల కూతురుకు బహుమానంగా పంపుతున్నాడా? లేదంటే ఏదైన పుణ్యకాలంలో ఎవరికైనాదానంగా ఇచ్చేశాడా?

10. అందుకు గోవు ఇలా సమాధానమిచ్చింది.

11. మన యజమానియైన ఈ బ్రాహ్మణుడు నన్ను ఎవ్వరికీ ఇవ్వటం లేదు. నేనే వెళ్ళుతున్నాను. ఆ వివరమంతా వినుమని చెప్పగా, అది చాలా భయపడి.

12. పిడుగు మీదపడినట్లు, ఈటెతో పొడిచినట్లు, గుండెపగిలి భూమిమీద పడి దొర్లింది. తన్నుకొనింది. కన్నీటిధారతో గడగడవణికింది.

13. 'అంబా' అని అరిచింది. అమ్మా! నీవెక్కడికి పోతావు? నన్ను వదలి పులి నోటబడటానికి వెళ్తున్నావా? సరే, ఇంక ఈ బ్రతుకెందుకు ? అని వాపోయింది.

14. ఇలా ఏడుస్తున్న ఆదూడతలపై, తనముఖాన్ని ఆనించి, నాయనా! నీవు ఎవరికోసం బాధపడతావు? ఈ అనవసరమైన జాలిని చూపడమెందుకు?

15. పుట్టాక చావు తప్పదు. వ్యర్థంగా ప్రాణం విడవడంకంటే, సజ్జనులకు కీర్తిని తెచ్చే, ఉపయోగం కలిగించే చావుమంచిది కాదా!

16. ఇంక పెనుగులాడవలసిన పనిలేదు. ఇక్కడ నేను ఆలస్యం చేస్తే, మాటతప్పినదాననవుతాను. దానివల్ల అధోగతి కలుగుతుంది. కాబట్టి అలా జరక్కుండా నన్ను పంపించు.

17. అని ఇలా దాని శోకమనే అగ్నిని తన చల్లని మాటలు అనే వర్షంతో ఆర్పివేసి, దానిని అక్కడనే ఉండేలాచేసి, వెంటనే పులి దగ్గరకు వెళ్ళింది.

**2. కొత్తపదాలు :**

| | | | | |
|---|---|---|---|---|
| ప్రదక్షిణించు | సదృశంబు | గభీరరవంబు | అన్యచిత్త | మాతృహీనత |
| ఋణవశంబు | క్రయ్యబడకు | సత్త్వములు | విప్రవరేణ్యుడు | జలరుహ తంతువు |
| అర్థకాంక్ష | క్రేపు | గడగడవడకున్ | వృథామరణము | అనృతదోషము |
| శోకదవాగ్ని | | | | |



©KTBS Not to be republished

**3. అర్థాలు :**

పొదుంగు= పొదుగు: ప్రేగుపఱుపన్= స్వాధీనపరచుకోలేక; (పాలు చేపునకురాగా అదుపు చేసుకోలేక); చతుః + స్తనంబులు=నాలుగు స్తనాలు; పాషాణం= రాయి; ధేనువు=ఆవు: నెమ్మి= ప్రీతి; శైశవక్రీడలు= బాల్యచేష్టలు; కందు=కందమ్మ (పసిబిడ్డ); కోడెలు=దూడలు; క్రయ్యపడకు=కలబడవద్దు; తలగు=బాధ; ఉగ్రసత్త్వములు=క్రూరజంతువులు; జలరుహతంతువు= తామరతూడు; తృణం=గడ్డిపోచ; అర్థకాంక్ష=డబ్బుమీద ఆశ; గాదిలి= ప్రియమైన; క్రేపు=దూడ; వత్స=బిడ్డ; ఆననం= ముఖం; అనృతం= అసత్యం; మమత్వం= మమకారం; బ్రాతిపడి= ఆశపడి; బుధులు= (పండితులు) పెద్దలు;

**4. నానార్థాలు :**

| | | |
|---|---|---|
| చను | - | చనుట, స్తనం, వెళ్ళు, పోవు |
| అడుగు | - | పాదం, అడగడం. |

**ప్రకృతి - వికృతి :**

| | | |
|---|---|---|
| కీర్తి | - | కీరుతి. |
| కుమారుడు | - | కొమరుడు. |

**5. జతపరచండి :**

| | |
|---|---|
| చులకనమతి | గడగడవణకున్ |
| మూతినిడకు | నన్నుదలంపకు |
| పాషాణధేనువు | తల్లిలేని సుతుడు కుమారా |
| కన్నీరునించు | ఉగ్రసత్త్వములుగల నీటన్ |
| నీవెన్నడు | నిలిపినట్లు |

**6. సంధులు :**

| | | | |
|---|---|---|---|
| అమలానురక్తి | : అమల+అనురక్తి | = | సవర్ణ దీర్ఘసంధి |
| తోరంపుభీతి | : తోరము+ భీతి | = | పుంప్వాదేశసంధి |
| అవ్వత్స | : ఆ+ వత్స | = | త్రికసంధి |
| కదలకుండె | : కదలక+ఉండె | = | ఉకారసంధి |
| నీవెన్నడు | : నీవు+ఎన్నడు | = | ఉకారసంధి |

©KTBS Not to be republished

**7. సమాసాలు :**

| | | |
|---|---|---|
| తోరపుభీతి | - | ఎక్కువైన భీతి - విశేషణ పూర్వపద కర్మధారయం |
| గాదిలిపుత్రి | - | ప్రియమైనపుత్రి - విశేషణ పూర్వపద కర్మధారయం |
| పుణ్యకాలం | - | పుణ్యమైనకాలం - విశేషణ పూర్వపద కర్మధారయం. |
| పులివాత | - | పులియొక్కనోట- షష్ఠీ తత్పురుషం. |
| శోకదవాగ్ని | - | శోకమనెడి దావాగ్ని - రూపక సమాసం |
| వచనాంబువర్షం | - | మాటలనెడి బాణాలవర్షం - రూపక సమాసం |

**8. ఖాళీలను సరైన పదాలతో నింపండి :**

1. నెమ్మి_________ ధేనువు నిలిపినట్లు.
2. ఒంటి _________ పొలమున.
3. _________ బడకు సందడియగుచో.
4. మూతి నిడకు ముగ్ర _________ గలనీటన్
5. చులకన మఱి _________ లేని _________ కుమారా!

**9. సందర్భాలను వివరించండి :**

1. తెలిసిబిడ్డడంత దలగకున్న
2. మమత్వంబు విడువుమన్న మనమునన్
3. మాతృహీనత దెలిసి బిడ్డడంత దలగకున్నె
4. చులకన మఱి తల్లిలేని సుతుడు కుమారా!
5. మూతి నిడకు ముగ్ర సత్త్వములు గల నీటన్.
6. అంత సేయంగ నేల పనుపవయ్య నన్ను.
7. ఇంకేటి బ్రతుకుపోనాకు.
8. ఇట్టిలముగ గల్గు చావులింపులుగావే.

**10. కింది ప్రశ్నలకు ఒకటి, రెండు వాక్యాలలో జవాబులు రాయండి :**

1. దూడపాలు త్రాగే దాకా ఆవు ఎలా ఉంది?
2. ఆడుతున్న దూడను చూచి, ఆవు తనలో ఏమనుకున్నది?
3. తల్లిమాటలు విని దూడ ఎలా బాధ పడింది?
4. ఎలాంటి చావును పొందాలని ఆవు అన్నది?



©KTBS Not to be republished

5. ఎలాంటి ప్రాంతాల్లో మేయకూడదని ఆవు దూడకు చెప్పింది?

6. సత్యాన్ని తప్పితే ఏమవుతుంది?

7. చులకనైన వస్తువులు ఏవి?

**11. కింది ప్రశ్నలకు వివరంగా జవాబులు రాయండి.**

1. ఆవు తన దూడకు చెప్పిన హితవచనాలేమిటి?
2. పాఠంలోని సారాంశాన్ని రాయండి.

**12. కార్యాచరణం :**

విద్యార్థులు చిన్న చిన్న నీతికథలను చదవాలి.

**13. ఉపాధ్యాయులకు సూచన :**

కేయూర బాహుచరిత్రం, నీతిచంద్రిక- మొదలయిన పుస్తకాలనుండి నీతికథలను విద్యార్థులకు చదివి వినిపించాలి. విద్యార్థుల్ని చదివింపచేయాలి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 6. తామసి

- కళాప్రపూర్ణ డా. దాశరథి కృష్ణమాచార్యులు

[ఆధునిక పద్యంలో కవిత్వధార, వర్ణన ఎలా ఉంటాయో తెల్పి, ప్రకృతిలోని ప్రతీదీ అందమైనదనే భావనను పెంపొందించడం ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠ్యభాగ రచయిత దాశరథి కృష్ణమాచార్యులు (1927-87). వీరు ప్రఖ్యాత ఆధునిక కవి. వీరు దాశరథిగా సుప్రసిద్ధులు. నిజాముకు వ్యతిరేకంగా తెలంగాణాలో జరిగిన పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్ళి తమ కవిత్వం ద్వారా పోరాటానికి స్ఫూర్తినిచ్చిన అభ్యుదయ కవి దాశరథి. అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, పునర్నవం, అమృతాభిషేకం, కవితా పుష్పకం, నవమంజరి, దాశరథీ శతకం, తిమిరంతో సమరం, ఆలోచనాలోచనాలు, గాలిబ్ గీతాలు, వీరి రచనల్లో ముఖ్యమైనవి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డులు పొందారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదుతో గౌరవించింది. 1977 నుండి కొన్నేళ్లు ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా ఉన్నారు. ఈ కవిత వీరి 'అమృతాభిషేకము'లోనిది.]

1 చం. ఇరులు నిశాసతీ భుజము లెక్కి, శిరమ్మున నిక్కి తారకా
తరుణి కపోల పాళికలు తాకి, విహాయస వీధి ప్రాకి, చం
దురుపయిసోకి, భూమి ధర దుర్గమ వీధుల దూకి, మెల్లగా
ధరపయి కాలు మోపిన వుదారములై హరినీలకాంతులన్.

2 సీ. ఇటు ప్రాకి అటుప్రాకి ఇందు బింబాననా
ముఖముపై కస్తూరి బొట్టు పెట్టి
ఇటుదూకి అటుదూకి కుటిల నీలాలకా
భ్రుకుటికా ధనువు నంబకము గూర్చి
ఇటుసాగి అటుసాగి ఇందీవరేక్షణా
పక్ష్మభాగములపై వచ్చిప్రాలి.
ఇటువీగి అటువీగి మృగనేత్ర బంగారు
చెక్కిలిపై అగర్ చుక్కనునిచి.

తే.గీ. వెండికొండపయిన్ మబ్బు విధము దోచి
చంద్రకేదారమున లేడిచాయ తిరిగి
ఆదిశేషునిపై విష్ణువై శయించి
చీకటులు కూర్చె నందమ్ము లోకమునకు

3 సీ. ఇరులు కోకిలములై యెచ్చోట కూయునో
అచ్చోట మధుమాస మవతరించు
ఇరులె తుమ్మెదలుగా ఏవేళపాడునో
ఆవేళల వసంతమందగించు

©KTBS Not to be republished

ఇరులె మయూరమై ఎట నాట్యమాడునో
అటనే నవాషాఢ మావహించు
ఇరులె ఉత్పలములై ఏనాడు పూచునో
ఆ రోజు కార్తికమ్మాగమించు.

తే.గీ. ఇరులకన్న అందమెచటకానగరాదు
ఇరులె సౌఖ్యములకు దరులు సుమ్మ
ఇరులు లేనినాడు నరులు కానగరారు
నరులు లేనినాడు ధరణిలేదు.

4 సీ. కబరీభరమ్ములై కనుపించు చీకట్లు
కలకాలమందాలు చిలుకుగాత!
నల్ల కల్వల వోలె ఉల్లసిల్లెడునిరుల్
కాసారములలోన గ్రాలుగాత!
నీలమేఘమ్ములై నింగి బ్రాకెడి తమం
బాకాశమున నడయాడుగాత !
జవరాలి కనుపాప చాయ దోచెడునాంధ్య
మెడదలో వలపు వర్షించుగాత !

తే.గీ. ఇరులె కురులయి ఝరులయి పరుగులెత్తి
ఇరులె కరులయి హరులయి ఇంపునింపి
ఇరులె విరులయి సరులయి ధరణి నిండి
ఇరులె నరులకు మరులు కల్పించుగాత!

5 ఆ.వె. వెచ్చదనములేని వెర్రిదీపమ్ముల
పెట్టదలచెదేల ? పిచ్చిదాన!
వర్షధారవోలె వచ్చుచీకట్లలో
మట్టిదివ్వెనిలుచు మాటకల్ల.

6 ఆ.వె. గౌళి నాల్క మీద కంటకమ్ములలోన
చిక్కుకొన్నయట్టి చిన్న పురుగు
అంధకారమందు ఆటాడు దీపంబు
మరునిముసమునందు మడియగలదు.

7 శా. ఆకాశమ్మది చీకటిల్లు; శశి తారార్కావళుల్ మిణ్గురుల్
లోకంబియ్యది చీకటింటి పరదాలో డాగు మృత్పిండ; మిం
దా కల్పింపగ జూచెదేల? పరిహాసార్థమ్మె దీపావళీ
ప్రాకారమ్ములు ? తామసీ ధరణి కంపంబల్లదే వచ్చెడిన్.



©KTBS Not to be republished

8 ఉ. కానుగుచెట్ల నీడల నొకానొక స్వప్నపు సెజ్జ మీద ని
ద్రాణత హాయిగొల్పగ సదాశయనింపగ నీ మహాంధకా
రాన మనస్సు శాంతిగొనె, రాను భవత్ కమనీయకాంతి సౌ
ధానకు, నన్ను పిల్వకుము తన్వి ! విభావిభవాభిరామవై.

1. **సారాంశం :**

1. చీకట్లు నల్లని కాంతులతో భూమి మీద అడుగు పెట్టాయి. నిశ అనే స్త్రీ భుజాల మీద ఎక్కి శిరస్సు మీద నిలబడి, నక్షత్రాలనే స్త్రీల చెక్కిళ్లను స్పృశించి, ఆకాశంలోకి పాకి, చంద్రుని తాకి, కొండలలోకి దూకగా, మెల్లగా భూమి మీద చీకట్లు అడుగు పెట్టాయి.
2. చీకట్లు లోకానికి అందాన్ని చేకూర్చాయి, చంద్రముఖి ముఖం మీద కస్తూరి బొట్టు పెట్టాయి. నల్లని వంకరల ముంగురులు కలిగిన స్త్రీ కనుబొమ్మలనే విల్లుకు బాణాన్ని తొడిగాయి. కలువకంటి కనురెప్పల మీద వాలాయి. లేడి కన్నుల వంటి కన్నులు కలిగిన స్త్రీ బంగారు చెక్కిలి మీద అగరు చుక్కను పెట్టాయి, వెండి కొండ మీద మబ్బులాగా కనిపించాయి. చంద్రుడనే పొలంలో జింకలాగా తిరిగాయి. ఆదిశేషుని మీద విష్ణువులాగా పడుకున్నాయి. ఇన్ని విధాలుగా చీకట్లు లోకానికి అందాన్నిచ్చాయి [కస్తూరి బొట్టు, కనుబొమ్మలు, కనురెప్పలు, అగరుచుక్క, మబ్బు, చంద్రునిలోని మచ్చా, విష్ణువూ అన్నీ నలుపే. ఇవన్నీ సౌందర్యాపాదకాలే. చంద్రునిలోని మచ్చను జింకగా వర్ణిస్తారు.]
3. చీకట్లే కోకిలలు, తుమ్మెదలు, నెమళ్లు, నల్లకలువలు. కోకిలలు కూసినప్పుడే వసంత ఋతువు అవతరిస్తుంది, తుమ్మెదలు పాడినప్పుడే వసంతానికి అందం. నెమళ్లు నాట్యమాడినప్పుడే ఆషాఢమాసం ఆరంభమవుతుంది. చీకట్లకంటె అందం మరెక్కడాలేదు. చీకట్లే సుఖానికి హద్దులు. చీకట్లే లేకపోతే మనుషులే లేరు. మనుషులు లేకపోతే భూమే లేదు.
4. దట్టమైన వెంట్రుకల కొప్పుల వంటి చీకట్లు కలకాలం అందాలు చిందించాలి, నల్ల కలువల లాగా ప్రకాశించే చీకట్లు సరస్సులలో వ్యాపించాలి. నీలి మేఘాలలాగా ఆకాశంలో వ్యాపించే చీకటి ఆకాశంలో విహరించాలి. యువతి కనుపాపలాంటి చీకటి ఎదలో ప్రేమను కురిపించాలి, చీకట్లే కురులై, ప్రవాహాలై పరుగులెత్తాలి. ఏనుగులై, గుర్రాలై, మనస్సులకు హాయినివ్వాలి, పూవులై, దండలై, భూమి అంతటా నిండి మానవులకు మోహాన్ని కలిగించాలి.
5. ఓ వెర్రిదానా ! వెచ్చదనం లేని దీపాలను పెట్టాలనుకొంటావేం? వర్ష ధారల్లాగా వచ్చే చీకట్లలో మట్టి దీపం నిలవడం వట్టిది.
6. చీకటిలో అల్లాడే దీపం బల్లి నాలుక మీద ముళ్లలో చిక్కుకున్న పురుగులాంటిది, నిమిషంలో నశిస్తుంది.
7. ఆకాశం చీకటిల్లు; చంద్రుడు, నక్షత్రాలు, సూర్యుడు, మిణుగురు పురుగులు. లోకం చీకటింటి తెరలో దాక్కున్న మట్టిముద్ద. దీపాల వరుసల ప్రాకారాలు కల్పించాలని చూస్తావేం? పరిహాసం కోసమా ? భూమి వణికేట్లుగా అదిగో రాత్రి వస్తున్నది.
8. కానుగ చెట్ల నీడలో ఒక స్వప్నశయ్య మీద ఈ మహాంధకారంలో హాయిగా శాశ్వతంగా నిద్ర పోవడం వల్ల ఈ మనస్సు శాంతి పొందింది. కాంతి సంపద చేత మనోహరమైన ఓ తన్వీ ! నీ కమనీయ కాంతిసౌధానికి నన్ను పిలువ వద్దు. నేను రాను.

©KTBS Not to be republished

## 2. అర్థాలు

ఇరులు = చీకట్లు; నిశ = రాత్రి; కపోలపాళికలు = చెక్కిళ్లు; విహాయసం = ఆకాశం; భూమిధరం = పర్వతం; దుర్గమ = నడువరాని; హరినీలకాంతులు = నీలమణికాంతులు; ఇందుబింబానన = చంద్రబింబంవంటి ముఖం కలిగినది; అంబకము = బాణము; పక్ష్మ భాగములు = కనురెప్ప వెంట్రుకల ప్రదేశం; అగర్ చుక్క = గంధపుచుక్క (అగరు చెట్టునుంటి తీసిన పదార్థం) కేదారం = పొలం; మధుమాసం = వసంత ఋతువు; ఉత్పలములు = కలువలు; కబరీభరమ్ములు = కొప్పులు; ఉల్లసిల్లు = ఒప్పు; ప్రకాశించు; కాసారము = కొలను, సరస్సు; క్రాలు = వర్ధిల్లు; తమంబు = చీకటి; ఆంధ్యము = చీకటి; కురులు = వెంట్రుకలు; ఝరులు = సెలయేర్లు; కరులు = ఏనుగులు; హరులు = గుర్రాలు; మరులు = మోహం; గౌళి = బల్లి; శశితార+అర్య+ఆవళుల్ = చంద్ర, నక్షత్ర, సూర్యుల వరుసలు; మృత్పిండము = మట్టి ముద్ద; తామసి = రాత్రి; విభావిభవ + అభిరామ = కాంతి సంపద చేత మనోహరమైనది.

## 3. పర్యాయ పదాలు :

1. విహాయసం - ఆకాశం, గగనం, అంబరం, మిన్ను, అభ్రం.
2. భూమీధరం - పర్వతం, కుధరం, అచలం, నగం, శైలం.
3. ఇందీవరం - పద్మం, పుండరీకం, పంకజం, తామర.
4. ఇరులు - తమస్సు, చీకటి, అంధకారం, తమిస్రం.
5. శశి - చంద్రుడు, హిమకరుడు, శీతకరుడు, సుధాకరుడు.
6. కరి - హస్తి, ఇభము, దంతావళం, ఏనుగు.
7. హయం - తురగం, అశ్వం, గుర్రం.

## 4. నానార్థాలు :

1. సతి - స్త్రీ, పార్వతి.
2. హరి - విష్ణువు, పాము, కోతి.
3. అంబకం - కన్ను, బాణం.
4. మృగం - జంతువు, జింక, లేడి.
5. వెండి - రజతం, మరియు
6. కేదారం - వరిమడి, కొండ, కేదారఘట్టం, పాదు.
7. మబ్బు - చీకటి, మేఘం, అజ్ఞానం.
8. ఉత్పలం - నల్లకలువ, ఒక వృత్త పద్యం.

©KTBS Not to be republished

**5. వ్యుత్పత్త్యర్థాలు :**

1. విహాయసం : దీనిలో అన్నీ విశేషంగా సంచరిస్తాయి (ఆకాశం)
2. కేదారం : నీళ్లుకట్టి దున్నబడేది (పొలం)
3. ధరణి : విశ్వాన్ని ధరించేది (భూమి)
4. తామసి : అధికమైన తమస్సు (చీకటి) కలిగినది (రాత్రి)
5. సౌధం : సుధతో (సున్నంతో) కూడినది (మేడ; భవనం)

**6. ప్రకృతి - వికృతులు :**

| | ప్రకృతి | | వికృతి |
|---|---|---|---|
| 1. | శయ్య | - | సెజ్జ |
| 2. | దీపం | - | దివ్వె |
| 3. | ఆకాశం | - | ఆకసం. |
| 4. | భృంగారం | - | బంగారం |
| 5. | ముఖం | - | మొగం |
| 6. | చంద్రుడు | - | చందురుడు |

**7. సంధులు :**

1. నవ + ఆషాఢం = నవాషాఢం - సవర్ణదీర్ఘ సంధి
2. తార + అర్క + ఆవళుల్ = తారార్కావళుల్ - సవర్ణదీర్ఘ సంధి
3. ఆ + చోటు = అచ్చోటు - త్రికసంధి
4. ఆట + ఆడు = ఆటాడు - అకారసంధి
5. స్వప్నము + సెజ్జ = స్వప్నపుసెజ్జ - పుంప్వాదేశ సంధి
6. సౌధము + నకు = సౌధానకు - లులన సంధి

**8. సమాసాలు :**

1. హరినీల కాంతులు - హరినీలములయొక్క కాంతులు (షష్ఠీ తత్పురుషం)
2. వెండికొండ - వెండిమయమైన కొండ (విశేషణ పూర్వపద కర్మధారయం)
3. నల్లకలువలు - నల్లనివియైన కలువలు (విశేషణ పూర్వపద కర్మధారయం)
4. మృత్పిండం - మట్టితో కూడిన పిండం (విశేషణ పూర్వపద కర్మధారయం)



©KTBS Not to be republished

5. ఇందీవరేక్షణ - ఇందీవరములవంటి ఈక్షణములు కలది (బహువ్రీహి)

6. ఇందుబింబానన - ఇందుబింబంలాంటి ఆననంకలది (బహువ్రీహి)

7. భ్రుకుటికాధనువు - భ్రుకుటి యనెడి ధనువు (రూపక సమాసం)

8. నిశాసతి - నిశయనెడి సతి (రూపక సమాసం)

9. చంద్రకేదారం - చంద్రుడనెడి కేదారం (రూపక సమాసం)

**9. ఖాళీలు పూరించండి :**

1. ఇందీవరేక్షణా ______________పై వచ్చివ్రాలి.
2. కుటిల నీలాలకా ______________ నంబకము గూర్చి.
3. వెండి కొండ పయిన్ ______________ విధము దోచి.
4. ఆదిశేషునిపై ______________ వై శయించి.
5. నరులు లేనినాడు ______________ లేదు.

**10. కింది ప్రశ్నలకు ఒక మాటలో సమాధానాలీయండి :**

1. ఇందు బింబానన ముఖంపై చీకటి ఏమి చేసింది ?
2. మృగనేత్ర బంగారు చెక్కిలిపై చీకటి ఏమిచేసింది ?
3. చంద్రకేదారంలో చీకటి ఏమి చేసింది ?
4. మధుమాసం ఎక్కడ అవతరిస్తుంది ?
5. వసంతం ఎక్కడ అందగిస్తుంది ?
6. అంధకారంలో దీపం ఎలాంటిది ?

**11. కింది ప్రశ్నలకు రెండు మూడు వాక్యాల్లో సమాధానాలీయండి :**

1. ఇరులు ధరపై ఎలా కాలు మోపాయి ?
2. చీకట్లు లోకానికి ఏ విధంగా అందాన్ని గూర్చాయి ?
3. ఇరులకన్నా అందమెక్కడా కానరాదని కవి ఎందుకన్నాడు ?
4. ఇరులు నరులకు ఏ విధంగా మరులు కల్పిస్తాయి ?
5. మట్టి దివ్వె ఎందుకు నిలవదు ?
6. తామసి భూమికెలా వచ్చింది ?
7. కవికి హాయి గొల్పినదేది ?

©KTBS Not to be republished

**12. కింది ప్రశ్నలకు వివరంగా సమాధానాలీయండి :**

1. కవి చీకట్లను ఏయే వస్తువులతో పోల్చాడు?
2. చీకట్ల గొప్పతనాన్ని తెలిపి, అవి దీపాలను ఏ విధంగా ఆర్పుతాయో తెల్పండి .
3. తామసి పాఠ్యాభాగ సారాంశం రాయండి?

**13. కింది వాటికి సందర్భాలను తెల్పండి :**

1. నరులు లేనినాడు ధరణి లేదు.
2. ఇరులె, నరులకు మరులు కల్పించుగాత !
3. మట్టి దివ్వె నిలుచు మాటకల్ల.
4. మరునిముసమందు మడియగలదు.
5. నన్ను పిల్వకుము తన్వి విభావిభవాభిరామ వై.

**14. కింది వాటిని విడదీసి, సంధి పేర్లను తెల్పండి.**

మహాంధకారం, కవీశ్వరుడు, చీకటిల్లు, అత్యద్భుతం, మహేశ్వరుడు.

**15. కింది వాటికి విగ్రహ వాక్యాలు రాసి అవి ఏ సమాసాలో తెల్పండి.**

చీకటిల్లు, ధవళాశ్వం, మృదుతల్పం, రాజాజ్ఞ, వర్షధార, కాంతిసౌధం, ఆనందసాగరం.

**16. కింది వాక్యాలలోని అలంకారాన్ని గుర్తించండి.**

1. నల్ల కల్వలవోలె ఉల్ల సిల్లెడు నిరుల్
   కాసారములలోన గ్రాలుగాత
2. ఆకాశమ్మది చీకటిల్లు శశి తారార్కావళుల్ మిణ్గురుల్

**17. కింది పద్యపాదాలకు గణవిభజన చేసి, యతిప్రాసలు నిర్ణయించి, అవి ఏ పద్యపాదాలో తెల్పండి.**

1. లోకంబియ్యది చీకటింటి పరదాలోడాగు మృత్పిండమిం
2. ఇరులు కోకిలములై ఎచ్చోట కూయునో
   అచ్చోట మధుమాసమవతరించు.

**18. విద్యార్థులకు సూచనలు :**

1. కొంతమంది ఆధునిక కవుల రచనలను చదవండి.
2. ప్రసిద్ధమైన తెలుగు పద్యాలను కంఠస్థం చేయండి.

**19. ఉపాధ్యాయులకు సూచనలు :**

1. దాశరథిగారి సాహిత్యం గురించి వివరించండి.
2. తెలంగాణా పోరాటంలో ఆ రోజుల్లో దాశరథి తన సాహిత్యాన్ని ఎలా ప్రయోగించారో విద్యార్థులకు తెల్పండి.

©KTBS Not to be republished

# 7. అజ్ఞాత కౌంతేయము

- డా. నండూరి రామకృష్ణమాచార్యులు

[కుంతీదేవి పుత్ర వాత్సల్యం, హృదయ సంఘర్షణం, కర్ణునికి గల మాతృ భక్తి, హృదయ ఔదార్యం- వీనిని హృదయ స్పర్శిగా అనుభూతి ప్రదంగా ఈ పాఠ్య భాగంలో వర్ణించారు కవి డా. నండూరి రామకృష్ణమాచార్యులు గారు.

ఈ పాఠ్యభాగం, వీరు రచించిన 'తారాతోరణం' అనే ఖండకావ్యం నుండి గ్రహింపబడింది. నండూరి రామకృష్ణమాచార్యులుగారు సుప్రసిద్ధులైన ఆధునికాంధ్ర కవులలో ప్రముఖులు. వీరు పద్య కవితా ఉద్యమ సారథులుగా, యువకవులకు స్ఫూర్తి ప్రదాతగా, మార్గదర్శిగా వెలుగొందినారు. అధికార భాషాసంఘ అధ్యక్షులుగా కూడవీరు విశిష్టమైన సేవల నందించారు]

1. "సహజ కవచ కుండల దీప్త చారుమూర్తి
వౌచు, హస్తినాపురవీధి అరుగునపుడు
చూచు చుండియు, తన మోము చూపలేక,
నేటి కిచ్చట నీ మాత నిలిచియుండె !

2. కన్న మమత్వము నెంచక
నిన్నా గంగను గలిపిన నీచపు మోమున్,
ఎన్నటికి చూడ వలద" ని
కన్నీరొలుకంగ నామె కనలి వచించెన్.

3. "ఆగు మటంచు మేఘ నినదార్భటి విన్వడ హర్ష భావనా
సాగర మందు మున్గి వివశత్వము నొందితి" నంచు కర్ణుడు
ద్వేగము తోడ నీరములు వెల్వడి తల్లి పదాల వ్రాలినన్,
కౌగిట గ్రుచ్చి యెత్తినది కాలువలై స్రవియింప బాష్పముల్.

4. అపుడు జన్మైక లభ్యమైనట్టి మాతృ
హృదయ సంస్పర్శచే పుల్కరించు మేన,
రాజరాజు దక్కగ నితరంబు నెల్ల,
మరచి యుండెను కర్ణుండు కరగిపోయి.

5. తల్లి తనయుండు నారీతి తారసిలగ,
కాల పురుషుని నెమ్మేను గగురు పొడిచె,
కటిక చీకటులే పులకించి కంపమొంద
మిణుకు మిణుకుల తారకల్ మింట విరిసె.

©KTBS Not to be republished

6. డెందము కొండవాగయి వడిన్ ప్రవహింపగ పొంగి, కర్ణుడా
నంద సమాధి నిర్వృత మనస్సున ఆ మధుర క్షణంబులో
పొందె నమేయ శశ్వదనుభూతిని, వెల్లువలై శిరమ్ము పై
చిందిన బాష్ప బిందువులచే తెలివొంది ముఖమ్ము నెత్తగన్.

7. తన్ను పుత్రుని విశ్వమంతటిని మరచి
కంపమానా వశీకృత గాత్ర యగుచు,
ముసుగు జార్చిన ఆమె నెమ్మోము జూచి
కుంతి దేవిగ కర్ణుండు గుర్తు పట్టి.

8. "వీరుల, సర్వలోక పరివేష్టిత నిర్మల నిత్యకీర్తి దో
స్సారుల, పుత్రులన్, గనిన క్షత్రియ మాతవు! పాండురాజుదే
వేరివి! ఇంద్ర జాలమనిపించెడి! అర్జును కన్నతల్లివే!
యీారె మదీయ పూజ్య జనయిత్రుల? వందనముల్ పదాలకున్.

9. అర్జునుడు తమ్ముగుఱ్ఱి నాకనినయంత
ఎంత గర్వము వహియించె హృదయమిపుడు!
పదునెనిమిది అక్షౌహిణీ బలములందు
తల్లి! వీరులిద్దరును నీతనయు లైరి.

10. కమ్మని స్వప్నమందు వలె కాంచితి నిన్, మలిప్రొద్దు చీకటుల్
చిమ్మిన మేటి తెమ్మెరల చిత్తము పొందె నపూర్వశాంతి, ర
క్తమ్మును పంచియిచ్చి కనుతల్లి ఋణంబు నెవండు తీర్చు వా
డమ్మ! వచింపు నావలన నయ్యెడిదున్న తరింప నెంచెదన్."

11. అనిన మాట రాక అటమటించుచు పల్కె
కొంత సేపటి కెటొ గొంతు విప్పి,
"పుత్రు లొకరి నొకరు పొడుచు కొనుచు నుండ,
కన్నతల్లి యెటుల గాంచ గలదు!

12. ఆలము పేర, ఎన్నటికి ఆరక మండుచు నుండు కారు చి
చ్చేల రగుల్పగా వలయు నిందరి తల్లుల గుండెలన్ ? ధరా
పాలుడు నీకనుంగు చెలి, పాండవులున్ నిజసోదరుల్, దయా
శాలివి, సర్వలోక హిత సంధి యొనర్పుము సూర్యనందనా!

13. మాటలు తెల్పలేవికను, మౌనమె నా హృదయమ్ములోని ఆ
రాటము చెప్పజాలును, ధరాస్థలి పీనుగు పెంట తాను పో
రాటమునన్, శ్మశానమున రాజ్యమికేటికి? గుండెలేని క
ర్కోటక రాజు లేల ప్రజకున్ ? తిమిర ప్రళయాంధ భూమిలో"

©KTBS Not to be republished

14. లోని కళవళమ్ము పైన దోపగ నీక
శిరము నెత్తి అతడు చెప్ప దొడగె,
"కలసినాము తల్లి! తొలిసారి కడసారి
గూడ ఇచట ఒక్క నాడె మనము!

15. కచ్చకు కాలు దువ్వుదును కారులు ప్రేలెదనంచు ఎవ్వియో
యిచ్చకు వచ్చినట్లు వచియింతురు లోకులు, రాజరాజు నన్
మెచ్చగ గోరి, పాండవుల మీదను ద్వేషము లేక, యెప్పుడో
యిచ్చితి నా పరాక్రమము నెల్లను భావి రణాంకితమ్ముగన్.

16. అర్జునుని పైన నా కసూయ యని ప్రజలు
పలుకు చుందురు నిజము కావచ్చు కొంత
ప్రేమను కృతకముగ చంపివేయు నెడల
ఈర్ష్య యొాచు తిరిగి జన్మమెత్తుచుండు.

1. **సారాంశం ;**

1. సహజమైన కవచ కుండలాల చేత ప్రకాశిస్తున్న అందమైన శరీరంతో, హస్తినాపుర వీధులలో తిరిగేటప్పుడు నిన్ను చూస్తూ కూడ, తనముఖాన్ని చూపలేక, నీ తల్లి నేటి కిక్కడ నిల్చొని యున్నది.
2. కన్న మమకారాన్ని లెక్క చేయకుండా, నిన్ను ఆ గంగానదిలో కలిపిన ఈ నీచమైన ముఖాన్ని ఎప్పటికీ చూడవద్దని కన్నీటితో బాధపడుతూ చెప్పింది.
3. "ఆగుము' అని మేఘ గర్జనలాంటి స్వరం (అరుపు) వినబడగానే, సంతోష సాగరంలో మునిగి మైమరచి పోయానని'' ఎంతో ఉద్వేగం (ఆతురత)తో కర్ణుడు నీటిలో నుండి బయటికి వచ్చి తల్లి పాదాలకు ప్రణమిల్లాడు. ఆమె కన్నీటి ధారలు కాలువలై స్రవిస్తుండగా అతన్ని కౌగిలించుకొన్నది.
4. తన జన్మలో ఒకే ఒక్క సారి లభించిన ఆ తల్లి హృదయ స్పర్శతో ఒళ్ళంతా పులకరించి పోగా, ఒక రారాజును తప్ప అన్నింటినీ మరచిపోయాడు.
5. ఆ తల్లి, ఆ తనయుడు ఆ రీతిగా కలుసుకొన్న ఆ క్షణంలో కాలపురుషుని తనువంతా పులకించి పోయింది. ఇంతలో సాయంకాలమైంది. చీకట్లు వ్యాపించాయి. ఆకాశంలో నక్షత్రాలు వెలిశాయి.
6. తన హృదయం ఒక కొండవాగు వలె వేగంగా ప్రవహించగా, పొంగిపోయి కర్ణుడు ఆనందమనే సమాధిలో ప్రశాంతమైన మనస్సుతో ఆ మధురక్షణంలో శాశ్వతమైన, అపారమైన ఆనందాన్ని అనుభవించాడు. ఇంతలో తల్లి కన్నీటి ధారలు తన తలపై పడి, తేరుకొని ముఖాన్ని పై కెత్తగా

©KTBS Not to be republished

7. కంపిస్తున్న, పట్టు తప్పిన శరీరంతో తన పుత్రుని చూస్తున్న ఆమె ముసుగు జారిపోగా, చూచి కుంతీ దేవిగా గుర్తించి

8. ఓ తల్లీ! నీవు మహా పరాక్రమవంతులైన కుమారులను కన్న క్షత్రియ మాతవు. పాండురాజు గారి దేవేరివి. ఇదంతా చూస్తుంటే ఒక కనికట్టు (ఇంద్రజాలం) గా కనబడుతోంది. అర్జునుని కన్న తల్లివి. మీరే నా పూజనీయురాలైన నా తల్లిగారు. మీపాదాలకు నమస్కారాలు.

9. అర్జునుడు నా తమ్ముడని తెలిసినంతనే నా హృదయం గర్వంతో నిండిపోయింది. ఓ తల్లీ! ఇరు పక్షాలలో నున్న పద్దెనిమిది అక్షౌహిణులసైన్యంలో, ఇద్దరు మహావీరులు నీ కుమారులే.

10. ఒక కమ్మని కలలాగ నిన్ను చూశాను. సంజ చీకట్లు కమ్మిన సెలయేటి గాలిలో నా మనస్సు ఎంతో శాంతి పొందింది. రక్తాన్ని పంచియిచ్చిన కన్నతల్లి ఋణాన్ని ఎవరు తీర్చుకోగలరు? అయినా ఓ తల్లీ! నీకు నా వలన కావలసినది ఏదయినా వున్నచో తెల్పిన, దానిని నెరవేర్చి తరించెదను. (నా జన్మను ధన్యము చేసికొందును)

11. ఈ మాటలతో కుంతీ దేవి విలవిలలాడి పోతూ, మాటరాక, కాసేపటికి ఎలాగో గొంతు పెగల్చు కొని, 'నాయనా! కుమారు (లిద్దరు)లు ఒకరి నొకరు పొడుచు కొనుచుండగా, కన్న తల్లి ఎలా చూచి భరించ గలదు?

12. ఇంత మంది తల్లుల గుండెల్లో, యుద్ధం పేరుతో ఎన్నటికీ ఆరని మంటను ఎందుకు రగిలించుచున్నారు? రారాజు నీ ప్రియ స్నేహితుడు. పాండవులా సొంత తమ్ముళ్ళు. నీవా ఎంతో దయామయుడవు. ఓ సూర్య నందనా! అందరి క్షేమాన్ని కోరి సంధి చేసుకోండి.

13. ఇక నేనేమీ మాట్లాడలేను. నా మౌనమే నాహృదయంలోని ఆరాటాన్ని తెల్పగలదు. యుద్ధం చేస్తే భూమి నిండా పీనుగు పెంటలవుతాయి. అలాంటి శ్మశానంలో చీకటి నిండిన ప్రళయ కాలంలో ఇక ప్రజలకు రాజ్యమెందుకు? హృదయమే లేని రాజులెందుకు?

14. తన అంతరంగంలోని కలవరపాటును పైకి కనపడనీయకుండా, "ఓ తల్లీ! ఈనాడు మన మిరువురం ఇదే మొదటి సారిగా, ఇదే చివరి సారిగా కలిశాము.

15. లోకులంతా నన్ను కయ్యానికి కాలు దువ్వుతానని, కారుకూతలు కూస్తానని, తమకు యిష్ట మొచ్చినట్లు అనుకొంటారు. రాజరాజు మెప్పుకోసం, పాండవులపై ద్వేషం లేకున్నా, నా పరాక్రమాన్ని అంతా ఆయన కోసం, రాబోయే యుద్ధం కోసం ఎప్పుడో ఇచ్చేశాను.

16. నాకు అర్జునునిపై అసూయ అని ప్రజలనుకొంటారు. అందులో కొంత నిజం లేక పోలేదు. ప్రేమను బలవంతంగా చంపివేస్తే, అది ఈర్ష్యగా మారుతుందంటారు గదా!

©KTBS Not to be republished

**2. కొత్త పదాలు :**

కనలి  అమేయము  పరివేష్టితము  దేవేరి

**3. అర్థాలు :**

దీప్త = ప్రకాశిస్తున్న; మమత్వం = మమకారం; చారుమూర్తి = అందమైన ఆకారం కలవాడు; మేఘ నినద+ ఆర్భటి = మేఘ గర్జనలాంటి శబ్దం; హర్ష భావనా సాగరం = సంతోష భావమనెడి సముద్రం; వివశత్వం = వశం తప్పడం; ఉద్వేగం = ఆవేశం; బాష్పములు = కన్నీరు; మేన = శరీరంలో; సంస్పర్శ = బాగాతాకడం; నెమ్మేను = అందమైన శరీరం; తారకలు = నక్షత్రాలు; డెందము = హృదయం; వెల్లువ= ప్రవాహం; తెమ్మెరలు = గాలులు; ఇంద్రజాలము= కనికట్టు ; మాయ, మోసగించు; కనలి = బాధపడి; అమేయము = పరిమితిలేనిది; పరివేష్టితము = చుట్టబడినది; దేవేరి = పట్టపురాణి; చిచ్చు = అగ్ని, శిఖ; మింట = అకాశంలో; నిర్వృత = సుఖము, ఊరట, నాశము; శశ్వత్ = శాశ్వతమైనట్టి; కంపమాన = కంపించుచున్న; దోః సారులు = భుజ బలం కలవారు; ఈరే = మీరే; మలిప్రొద్దు = సాయం సంధ్య; ఆలము = యుద్ధము; కారులు = కారుకూతలు,చెడ్డమాటలు; కళవళము = కలత, వికారం; భావి = రాబోవు కాలం.

**4. వివరణ :**

[అక్షౌహిణి = 21,870 రథాలు, 21,870 గజాలు, 65610 గుఱ్ఱాలు,
1,09,350 కాల్బలం ఉన్నసేన.]

**5. నానార్థాలు :**

ప్రేలుట - ప్రేలిపోవుట, ఎక్కువగా మాట్లాడుట.

ఇంద్రజాలము - కనికట్టువిద్య, మాయ

చిచ్చు - శిఖ, అగ్ని.

కారు - అడవి, నలుపు, కాలము, వయసు.

గాత్రము - శరీరం, స్వరం

అరుగు - తిన్నె, వెళ్ళు.

©KTBS Not to be republished

**6. పర్యాయ పదాలు :**

రణము - యుద్ధము, ఆలము, అని, సమరం, పోరు

చెలిమి - స్నేహము, నెయ్యము

ధర - భూమి, అవని, ధరణి, పుడమి.

**7. వ్యతిరేక పదాలు :**

మలిప్రొద్దు x తొలిప్రొద్దు.

**8. వ్యుత్పత్త్యర్థాలు :**

క్షత్రియుడు - క్షతి నుండి కాపాడువాడు. (రాజు)

**9. ప్రకృతి- వికృతులు**

| **ప్రకృతి** | | **వికృతి** |
|---|---|---|
| ముఖము | - | మొగము, మోము |
| కీర్తి | - | కీరితి |
| వీధి | - | (ఈది) వీది |
| ఈర్ష్య | - | ఈసు |
| హృదయము | - | ఎద, డెందము |

**10. రూపాంతరాలు :**

మునిగి - మున్గి

నీరము - నీరు.

**11. సంధులు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| నీచము | + | మోము | = | నీచపుమోము | : | పుంప్వాదేశ సంధి |
| జన్మ | + | ఏకము | = | జన్మైకము | : | వృద్ధి సంధి |
| రణ | + | అంకితము | = | రణాంకితము | : | సవర్ణదీర్ఘ సంధి |
| కన్నీరు | + | ఒలుకంగ | = | కన్నీరొలుకంగ | : | ఉకార సంధి |
| రాజ్యము + ఇక + | | ఏటికి | = | రాజ్యమికేటికి | : | ఉకార సంధి, అకార సంధి |
| ప్రళయ | + | అంధ భూమి | = | ప్రళయాంధ భూమి | : | సవర్ణదీర్ఘ సంధి. |

©KTBS Not to be republished

**12. సమాసాలు :**

| | | | |
|---|---|---|---|
| అపూర్వ శాంతి | = | అపూర్వమైన శాంతి | విశేషణ పూర్వపద కర్మధారయం |
| మధురక్షణము | = | మధురమైన క్షణము | విశేషణ పూర్వపద కర్మధారయం |
| శశ్వదను భూతి | = | శాశ్వతమైన అనుభూతి | విశేషణ పూర్వపద కర్మధారయం |
| బాష్ప బిందువులు | = | బాష్పములయొక్క బిందువులు | షష్ఠీతత్పురుష సమాసం |
| తమ్ము గుజ్జు | = | కుజ్జుయైన తమ్ముడు | విశేషణోత్తర పదకర్మధారయం |
| కాలపురుషుడు | = | కాలమనెడు పురుషుడు | రూపక సమాసం |
| మాతృహృదయం | = | తల్లి యొక్క హృదయం | షష్ఠీతత్పురుష సమాసం |
| లోకహితం | = | లోకమునకు హితం | షష్ఠీ తత్పురుషం |
| సూర్య నందనుడు | = | సూర్యునియొక్క నందనుడు | షష్ఠీ తత్పురుషం |

**13. కింది పదాలను సొంత వాక్యాలలో రాయండి :**

| | | | |
|---|---|---|---|
| కాలుదువ్వు | కన్నీరొలుకు | కౌగిట గ్రుచ్చు | అలమటించు |
| గగురు పొడుచు | వెల్లువ | ఋణముతీర్చు | తరించు. |

**14. కింది ప్రశ్నలకు ఒకటి/ రెండు వాక్యాలలో జవాబులు రాయండి :**

1. 'కన్నీరొలుకంగ నామె కనలి వచించెన్.' ఆమె ఎవరు?
2. కుంతీ దేవి ఎలాంటి పుత్రులను కన్నది?
3. ఏమి విన్నందున కర్ణుడు వివశత్వము నొందాడు?
4. కుంతీ దేవిని కర్ణుడు ఎలా గుర్తుపట్టాడు?
5. కర్ణుడు ఎందుకు గర్వపడ్డాడు?
6. ఈర్ష్య ఎలా పుడుతుందని కర్ణుడు అన్నాడు?
7. హస్తినాపుర వీధుల్లో కర్ణుడు ఎలా వెళ్ళేవాడు?

**15. కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి :**

1. కర్ణుడు ఎలాంటి అనుభూతిని పొందాడు?
2. అనుభూతిలో మునిగి పోయిన కర్ణుడు, ఎలా మెలకువ చెందాడు?
3. కర్ణునికి ఏది ఇంద్రజాలమనిపించింది?
4. 'సంధి యొనర్పు'మని కుంతీ దేవి కర్ణున్ని ఎందుకు కోరింది?

©KTBS Not to be republished

5. కుంతీదేవిగా గుర్తించిన కర్ణుడు ఆమెతో ఏమన్నాడు?

6. కర్ణుని మాటలువిని కుంతీ దేవి ఏమని పలికింది?

7. తల్లి మాటలువిని కర్ణుడు ఏమని సమాధాన మిచ్చాడు?

**16. కింది ప్రశ్నలకు పది/ పన్నెండు వాక్యాలలో జవాబులు రాయండి :**

1. కుంతీ దేవి మాతృ హృదయాన్ని వర్ణించండి.

2. కర్ణుని మాతృభక్తిని వివరించండి.

**17. కింది వానికి సందర్భాలను వివరించండి:**

1. తనమోము చూపలేక నేటికిచ్చట నీమాత నిలిచియుండె.

2. నీచపుమోమున్ ఎన్నటికి చూడవలదు.

3. ఇంద్ర జాలమనిపించెడి, అర్జును కన్న తల్లివే!

4. తల్లి, వీరులిద్దరును నీతనయు లైరి!

5. తల్లి ఋణంబు నెవండు దీర్చు వాడమ్మ!

**18. కింది ఖాళీలను పూరించండి.**

1. __________ సాగర మందు మునిగి వివశత్వము నొందితి

2. కౌగిట గ్రుచ్చి యెత్తినది కాలువలై స్రవియింప __________

3. __________ నెమ్మేను గగుర పొడిచె.

4. శిరమ్ముపై చిందిన __________ చే తెలివొందె ముఖమ్ము నెత్తగన్.

5. పదునెనిమిది__________ బలములందు ఇద్దరును నీ తనయులైరి.

6. సర్వలోక హిత __________ యొనర్పుము సూర్యనందనా!

7. మౌనమె నా హృదయమ్ములోని __________ చెప్ప జాలును.

8. గుండె లేని __________ రాజు లేల ప్రజకున్.

9. ఎప్పుడోయిచ్చితి నా __________ నెల్లను భావి రణాంకితమ్ముగన్.

10. ప్రేమను కృతకముగ చంపివేయు నెడల __________ యౌచు తిరిగి జన్మ మెత్తు చుండు.

©KTBS Not to be republished

**19. విద్యార్థులకు సూచన :**

1. మాతృభక్తి తత్పరులైన శివాజీ, గాంధీజీ మొదలైన మహనీయుల జీవిత కథలను చదవండి.

**20. ఉపాధ్యాయులకు సూచనలు :**

1. భారతం కథలోని కర్ణుని జీవితానికి సంబంధించిన విశేషాలను, కర్ణుని స్వభావశీలాలను గురించి తరగతిలో వివరించండి.
2. మాతృత్వం మహనీయతను చాటి చెప్పే కథలను, సంఘటనలను విద్యార్థులకు వినిపించండి, చదివించండి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 8. విన్నపం

**- పింగళి సూరన**

[ వజ్రనాభుడు వరగర్వితుడై ఇంద్రుని పట్టణం పై దండెత్తి దేవతలను నానా హింసలు పెట్టాడు. వజ్రనాభుని బారి నుండి తనను కాపాడమని ఇంద్రుడు శ్రీ కృష్ణునితో మొరపెట్టుకోవడం ఈ పాఠంలోని వృత్తాంతం. ఇది పింగళి సూరన రచించిన ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యంలోని ప్రథమాశ్వాసం నుండి స్వీకరింపబడింది.

ప్రబంధకాలంలో కీర్తి గడించిన గొప్ప కవులలో పింగళిసూరన ప్రధానంగా పేర్కొన దగినవాడు. ఈయన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో ఒకడని అంటారు. అయితే కొంతమంది 16,17 శతాబ్దాల మధ్య కాలంవాడని నిర్ధారించారు. కళాపూర్ణోదయము, రాఘవ పాండవీయము, ప్రభావతీ ప్రద్యుమ్నము ఇతని ప్రసిద్ధమైన రచనలు. గరుడపురాణము, గిరిజా కళ్యాణము అనే గ్రంథాలను కూడా రచించాడని ప్రతీతి. అయితే అవి అలభ్యం. ఇతని శైలి భావ గాంభీర్యంతో రమణీయంగా ఉంటుంది.]

1 చం. తపమున వజ్రనాభుడను దైత్యుడు బ్రహ్మప్రసన్నుఁ జేసి వ
జ్రపురి యనంగ నొక్క నగరంబును; మేరువు పొంత మారు తా
తపములకున్ నిజానుమతిఁ దక్కఁ బ్రవేశ మొనర్పరాని య
ట్టి పసఁ దనర్చు దానిని ఘటించి యతండొసగన్ఁ బ్రదీప్తుడై.

2 వ. యథేష్ట వైభవోపభోగంబులం బ్రవర్తించుచు

3 ఉ. ఆతడు మొన్న నున్నత మదాంధత వాడిగ నేగుదెంచి, యా
పోతరమేమి చెప్ప, ననుఁ బూరికిఁగైకొనకప్సరో వధూ
వ్రాత నిశాత పాణీరుహ వారి సలాలస నవ్య పల్లవం
బై తనరారు నందన మహావనిలో విడియించె సేనలన్.

4 గీ. వాని కెదిరించి పోర దేవతల లోన
నెవ్వరును జాల; రిది బ్రహ్మ యిచ్చినట్టి
వరము లోపలి యదియ పంకరుహనాభ!
మదికలక జేసి మును చెప్ప మఱచినాడ

5 ఉ. వారిజనేత్ర యేనిపుడు వచ్చుచునుండి యలౌకికాద్భుత
శ్రీరుచిర త్వదీయ నగరీ గరిమాతిశయావలోక లీ
లారస దూర ధూత సకల వ్యథచిత్తుడనై యథాపురా
కారత నీకు దోచెదనొ కాని తనుద్యుతి బాసితిన్ జుమీ.

6 వ. అది యట్లుండె, నవ్విధంబున వివిధోపచారంబులు సంఘటిం
చుచుం బెంపునం బ్రవర్తిల్లుచుండ, యాచండ దానవుం డొకా
నొక నాడు సకల సైనిక సన్నాహ సంపదం బొదలు చుం
గదలి యేతెంచి మదీయ మందిర ద్వారంబున దన బలంబుల
నించి నిలిచి మాటలాడ బని గలిగి వచ్చితి నని లోనికిం జెప్పి
యనుపుటయు, నేనును తత్ ప్రవేశంబు నడుపం దగువారి
నియమించితి నప్పుడు.

©KTBS Not to be republished

7 చ. మెఱియల వంటి రక్కసుల మిక్కిలి లెక్కకు మీఱి, క్రొవ్వనే
డ్తె అయు దలిర్పగా వడివడిన్ దన వెంటనె ద్వారపాలురన్
నెఱ చెడ మట్టికొంచు జర, నిర్భర గర్వము నుబ్బు బింకమున్
మెఱయగ వచ్చి యా యసుర మించె, నుదగ్ర మహాసన స్థితిన్.

8 చ. బలిమి దదీయు లప్పుడు సభాముని ముఖ్యుల రెట్ట పట్టి మా
తలఁబడ వైచుచున్, దమకుఁదామె యవారణఁదత్త దాసనం
బులు గొని గూరుచుండిరి తపోధనులున్ సురలున్ వెడంగు పా
టొలయగ గ్రుక్కుమిక్కుమనకుండి రొదంగుచు నక్కడక్కడన్.

9 ఉ. యాదవ సింహ! నాతలపునప్పుడు వారల పాటొకింత యౌ
గా దనుదాక లేదు గలకంబడ జొచ్చె; 'ఖలుండు వీడు పెం
పేదగఁ జుట్టుముట్టి మము నిద్దఱఁ బట్టిన నేది దిక్కు, ప్రా
మాదికమైన మోసమిది మన్మతి' కంచు జనించు శంకతోన్.

10 వ. ఏనప్పుడుప్పతిల్లెడు మది కలంక యెఱుక పడకుండ గాంభీ
ర్యంబు దెచ్చుకొని, తనకు వస్త్రాభరణాది సంభావన లొనర్చుటకు
వారి వీరిం బిలిచి నియోగించుచు సంభ్రమించుటఁగనుంగొని
యన్నియు వచ్చెం జాలు నిలు'మని వారించుచు, నిలింప
విద్వేషియిట్లనియె.

11 ఆ.వె. "వలసినట్లు దివ్య వస్తువులెల్ల నా
యిచ్చ ననుభవించి వెచ్చవెట్టి
ప్రభుత నెఱప, కకట! పరుడిచ్చునందాక
నెదురు చూచు దైన్యమేల నాకు?

12 కం. నీమంచి తనపు నటనల
నేమొగ మోడుచు నెఱుంగ కిట్లుండితిఁ గా
కేమిటికి నాకు నీదు వృ
ధా మాధురి? యొండు వినుము తగవరి వైనన్

13 త. ఎంత కాలము నీవు నాకము నేలి తింతటినుండి నా
కంత కాలము నేల ఁ బాడి, బిడౌజ! కశ్యప మౌని రా
ట్సంతతిత్వము మీకు దానవ జాతికిన్ సరిగాదె! నీ
వింతయున్ కని రాజ్య హీనత నేగు మెచ్చుటి కేనియున్.

14 ఆ.వె. ఇట్లు సేయవేని, యింద్ర! మీరెల్ల నా
చేతిలోని వార చెప్పనేల?
యిపుడ పట్టి నిగ్రహించెద" నావుడు,
నేను నగుచు యాతు ధాను తోడ.

15 ఆ.వె. నిగ్రహముల కేమి నీవును మేము న
న్యోన్యమైత్రి ఁ బొదలునట్టి తెఱగు
నడుప వలయుఁ గాక యెడసి పోనాడుకోఁ
దడవె? వేగిరింప ఁ దగునె మనఘ!

©KTBS
Not to be republished

16 వ. దానవేంద్రా ! నీ పలికినట్ల మన మిరు దెగల వారముం
గశ్యపు సంతానం బగుటం జేసి మన మెల్ల వివాదంబులు
నతండు తీర్పనర్హుండు గావున నమ్మహా మునీంద్రు కడకు
నరిగి యతని యెఱుక మీద మీకు నాకాధిపత్యంబు నొసం
గవలసిన నొసంగెద ( దొలుత మదీయ వచనంబులు విని
యెట్టి సైరణ వహించి తది తుదముట్టనడవక విడిచి
వెట్టుట నీయట్టి గట్టి దొరకు నుచితంబే! తియ్యని నోరం
జేదు మేయుట నాయంబుగా''దని మరియు ననేక ప్రకారం
బుల నొడంబఱచి, యతని యతివ్యగ్రతకుం బ్రతి విధానంబు
గానక, యేనపుడ యప్పటికి దొరకిన బృహస్పతి ప్రము
ఖులు సహాయులుగా నమ్మహాదైత్యు వెంటం గశ్యపు పాలి
కేగితి; నప్పుడప్పరమ తపోధనుండు యజ్ఞ దీక్షితుండై
యున్నవాడు గావున మా వివాదంబులు నిజ యజనావ సానం
బు నందు విని తీర్చుటకు నియమంబు చేసి, యా సుర
విరోధిని యథార్థ సాంత్వ నాలాపంబుల శాంతుం జేసి,
''యిప్పుడు నీవు నీ వజ్ర పురంబునకు ( జను'' మని యాజ్ఞా
పించిన.

17 ఉ. ఇంబడరంగ నియ్యకొనియెన్ రజనీ చరు ( డేమి భాగ్యమో
యంబుజనాభ! యచ్చటికి నమ్ముని సత్కృపనేమ, నేమి చె
ప్పం బులినోటికండ విడివడ్డగతిం దలపట్టిచూచు కొం,
చుంబెను చేటు దప్పె ననుచుం దివికేగితి మెయ్యనొయ్యనన్

18 చ. అడరి మదోద్ధ తత్త్వమున నద్దనుజుం డెపుడేమరించి పై
బడునొ యెఱుంగరాదు, సురపట్టణ రాజ్య సుఖాశ యేర్పడ
న్విడిచితి, నింక నీవు తల నిండగ నర్థము వోసితేని నే
నడుగటు వెట్టగా వెఱతు, నచ్యుత నిన్ననె కొల్చి యుండెదన్.

**1. సారాంశం :**

1. వజ్రనాభుడనే రాక్షసుడు బ్రహ్మను గూర్చి తపస్సు చేశాడు. బ్రహ్మ అతని తపస్సుకు మెచ్చుకొన్నాడు. మేరు పర్వతానికి దగ్గరలో 'వజ్రపురి' అనే నగరాన్ని నిర్మించి, ఆ నగరంలోనికి అతని అనుమతి లేనిదే ఎండ, గాలి కూడా ప్రవేశించడానికి వీలు కాని విధంగా చేశాడు. అలాంటి గొప్ప నగరాన్ని బ్రహ్మ అతనికి సమర్పించగా వజ్రనాభుడు మిక్కిలి సంతోషించి
2. అక్కడ సమస్త భోగాలను అనుభవిస్తూ,
3. వాడు (ఆ వజ్రనాభుడు )మొన్న కండకావరంతో వచ్చాడు. వాని పొగరుబోతుతనాన్ని ఏమనాలి? నన్ను లెక్క చేయకుండా అప్సరస స్త్రీలచే వేళ్ళతో లాలించబడిన క్రొంజిగురులతో విరాజిల్లే నందనోద్యానవనంలో తన సైన్యాన్ని విడిది చేయించాడు.
4. దేవతలలో అతన్ని ఎదిరించే వారెవ్వరూ లేరు. ఓ కృష్ణా! మనస్సు అల్లకల్లోలమైనందున చెప్పడం మరిచిపోయాను. ఎదిరించలేక పోవడానికి కారణం కూడ బ్రహ్మ ఇచ్చిన ఆ వర ప్రభావమే!

©KTBS Not to be republished

5. నే నిక్కడికి వచ్చేముందు అసామాన్యమైన, అద్భుతమైన సిరిసంపదలతో అతిశయించిన మీ ద్వారకా నగరాన్ని సందర్శించినపుడు పొందిన ఆనందంతో నామనసులోని బాధలన్నిటినీ మరచిపోయాను. వారిజనేత్రా! అందుచేత మీకు నేను మునుపటిలాగే కనపడవచ్చునేమో! కాని, శరీర కాంతిని కోల్పోయాను సుమా!

6. అది అలా ఉండనీయండి. ఆ విధంగా అతడు (వజ్రనాభుడు) ఒకనాడు తన సైన్యంతో పాటు నా మందిర ద్వారం దగ్గరకు వచ్చాడు. నీతో పని ఉంది మాట్లాడాలి అని లోనికి చెప్పి పంపించాడు. నేను అందుకు తగిన వాళ్ళను నియమించాను.

7. అప్పుడు మెరికలలాంటి గట్టి రాక్షసులు ఎంతో మంది కండకావరంతో లోనికి గబగబా జొరబడ్డారు. ద్వార పాలురను ఎడాపెడా తన్నారు. అతడు వచ్చి గర్వంతో నా ఆసనంలో దర్జాగా కూర్చున్నాడు.

8. అతనితో పాటు బలవంతంగా అతని అనుచరులందరూ సభలోని మునులు మొదలైన వారిని రెట్ట బట్టుకొని అవతలకు ఈడ్చివేసి, తమకు తామే వాళ్ళకు కావలసిన ఆసనాలు ఆక్రమించుకొన్నారు. ఇదంతా చూస్తూ తాపసులు, దేవతలు ఆశ్చర్యంతో బిక్కుబిక్కుమంటూ అక్కడక్కడా ఒదిగిపొయ్యారు.

9. ఓ యాదవ సింహా! అప్పటి నాపరిస్థితి చెప్పనలవి కాదు. వాళ్ల దూకుడుతనం చేత ఏం చేస్తారో, ముందు ఏం జరుగుతుందో తెలియ రాలేదు. మనసంతా అల్లకల్లోలమైంది. ఈ దుర్మార్గుడు మమ్మలనిద్దరిని (శచీదేవిని, ఇంద్రున్ని) పట్టుకొని బంధిస్తే దిక్కెవరు? అలా జరిగితే చాలా ప్రమాదం అని సందేహిస్తూ.

10. అప్పటికి మాత్రం బయటికి నా కలవరపాటు తెలియకుండా తెచ్చిపెట్టుకొన్న గాంభీర్యంతో అతనికి వస్త్రాభరణాది మర్యాదలు చేయడానికి వాళ్ళను, వీళ్ళను నియోగించాను. అది చూచి ఆ రాక్షసుడు ఇలా అన్నాడు.

11. నా యిష్టానుసారం కావలసిన వస్తువులు నేనుగా అనుభవించక, ఎవడో ఇచ్చేదాకా ఎదురు చూడాల్సిన గతి నాకెందుకు? తెలివైన వాడివైతే నేను చెప్పేమాటలు విను.

12. మంచి వాడుగా నీవు నటిస్తున్నందున తెలుసుకోలేక మొగమాటంతో నేను ఇలా ఉండి పోయాను. నీ ఉత్తుత్తి మర్యాదలు నాకెందుకు?

13. నీవు ఎంత కాలం స్వర్గాన్ని పాలించావో, ఇప్పటినుండి నేను అంతేకాలం పాలించడం న్యాయం. ఓ ఇంద్రా! కశ్యపుని సంతానమైన మీకు, దానవులమైన మాకు రాజ్యాధికారం సమానమే కదా! ఇదంతా అర్థం చేసుకొని, రాజ్యాన్ని వదలి నీవెక్కడికైనా వెళ్ళిపో!

14. ఇలా చేయక పోతే, ఓ ఇంద్రా! ఇదిగో వీరంతా నాచేతిలోని మనుషులు. ఇప్పుడే నిన్ను చంపగలనని అతడనగా నేను నవ్వుతూ ఆ దానవునితో

15. చంపడాల దాకా ఎందుకు? నీవు మేము అన్యోన్యంగా బ్రతికే మార్గం ఆలోచించాలి కాని పోట్లాడుకోవడాలు మంచిదా? ఓ పుణ్యాత్ముడా, తొందర పాటెందుకు?

16. ఓ దానవేంద్రా! నీవన్నట్లు మన ఇరు తెగల వారము కశ్యపుని సంతానమైనందున మన వివాదం పరిష్కరించటానికి అతడే తగినవాడు. కాబట్టి మనం ఆ మహనీయుని దగ్గరకు వెళ్ళుదాము. ఆయన నీకు స్వర్గాధిపత్యాన్ని ఇవ్వమంటే తప్పకుండా ఇస్తాను. నా మాట



©KTBS Not to be republished

విని ఇంతవరకు నీవు ఎలా ఓర్పువహించావో, అలాగే చివరిదాకా నడచుకోక మధ్యలో మానుకోవడం నీలాంటి గొప్పవానికి తగునా? తియ్యని నోటితో చేదు తినడం న్యాయం కాదు. అని అనేక రకాలుగా నచ్చజెప్పి, అతని తొందరను ఆపడానికి గత్యంతరం లేక, అప్పటికి దొరికిన బృహస్పతి మొదలైనవారు సహాయులుగా ఆ మహాదైత్యుని వెంబడి కశ్యపుని దగ్గరకు వెళ్ళాను. అప్పుడు ఆ తపోధనుడు యజ్ఞం చేస్తున్నందున మా వివాదాన్ని ఆ యజ్ఞం పూర్తి అయ్యాక చూస్తానని, ఆ రాక్షసుని తగిన మాటలతో శాంతింప చేసి, అతన్ని వజ్రపురానికి వెళ్లమని ఆజ్ఞాపించగా

17. అదేమి అదృష్టమోగాని ఆ రాక్షసుడు సంతోషంతో సరే అన్నాడు. ఆ ముని పుణ్యమా అన్నట్లు పులినోటిలో పడిన కండను విడిపించుకొన్నట్లు, ఒక సారి తల పట్టుకొని చూచుకొని (ప్రాణంతో ఉన్నానా లేదా అన్నట్లు) పెద్ద ప్రమాదం తప్పిపోయిందని మెల్లగా స్వర్గానికి వెళ్ళిపోయాము.

18. కాని పొగరుబోతైన ఆ రాక్షసుడు ఎప్పుడు ఏమరుపాటుతో పైబడతాడో తెలియదు. ఇక ఈ పదవిపై ఆశ విడిచి పెట్టాను. తలయెత్తు బంగారం ఇచ్చినా ఆ వైపు అడుగు పెట్టటానికి కూడ భయపడుతున్నాను. ఓ కృష్ణా! కేవలం నిన్ను కొలుచుకొంటూ ఉంటాను.

**2. కొత్తపదాలు :**

కుశలము యథేష్ట పల్లవం అధమ విద్వేషి బిడౌజుడు వ్యగ్రత

**3. పదాలకు అర్థాలు :**

అభిమతం = కోరిక; వ్యథ= బాధ; పొంత= చెంత; దనుజుడు= రాక్షసుడు; అబ్జనాభుడు = శ్రీకృష్ణుడు; యథాపురాకారత = మునుపటి ఆకారము వలె; ఖలుడు = నీచుడు; నాకము = స్వర్గము; విరోధి= శత్రువు; రజనీ చరుడు = రాక్షసుడు; పల్లవము = చిగురు; వ్యగ్రత = కోపము; కుశలము = క్షేమము;

**4. పర్యాయ పదాలు :**

వారిజం : కమలం, పద్మం, తామర, అరవిందం, అంబుజం.

చేయి : పాణి, కరం, హస్తం.

రాక్షసులు : దైత్యులు, దనుజులు, నిశాచరులు, రజనీచరులు

**5. వ్యుత్పత్త్యర్థాలు :**

అంబుజము : అంబువు (నీటి) నుండి పుట్టినది (కమలం)

అబ్జనాభుడు : అబ్జమును నాభియందు కలిగినవాడు (విష్ణువు)

నిశాచరులు : నిశ (రాత్రి) యందు చరించువారు (రాక్షసులు)

దైత్యులు : దితికి పుట్టినవారు (రాక్షసులు)

పంకరుహనాభుడు : పద్మమును నాభియందు గలవాడు (విష్ణువు)

©KTBS Not to be republished

**6. ప్రకృతి - వికృతులు :**

| ప్రకృతి | - | వికృతి |
|---|---|---|
| మనుష్యుడు | - | మనిషి |
| దైవం | - | దయ్యం |
| రాక్షసి | - | రక్కసి |
| యజ్ఞం | - | జన్నం |
| పురము | - | ప్రోలు |

**7. సంధులు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఆ | + | దురాత్మ | = | అద్దురాత్మ | - | త్రికసంధి |
| మారుత | + | ఆతపము | = | మారుతాతపము | - | సవర్ణదీర్ఘ సంధి |
| వస్త్ర | + | ఆదులు | = | వస్త్రాదులు | - | సవర్ణదీర్ఘ సంధి |
| వివిధ | + | ఉపచారములు | = | వివిధోపచారములు | - | గుణసంధి |
| పాటు | + | ఒకింత | = | పాటొకింత | - | ఉకారసంధి |
| మొగము | + | ఓడుచు | = | మొగమోడుచు | - | ఉకారసంధి |

**8. సమాసాలు :**

వారిజనాభుడు : నాభియందు పద్మము కలవాడు - బహువ్రీహి సమాసం

దివ్య వస్తువు : దివ్యమైన వస్తువు - విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం

తపోధనుడు : తపస్సును ధనముగా కలవాడు - బహువ్రీహి సమాసం

**9. తప్పొప్పులను గుర్తించండి :**

| తప్పు | - | ఒప్పు |
|---|---|---|
| వైబవం | - | వైభవం |
| నాబుడు | - | నాభుడు |
| ఆబరణము | - | ఆభరణము |
| స్వాంతనము | - | సాంత్వనము |

©KTBS Not to be republished

**10. సొంత వాక్యాలలో ఉపయోగించండి :**

గ్రక్కుమిక్కు

అన్యోన్యం

చేతిలోనివారు

చపల చిత్తము

అక్కడక్కడ

**11. గుంపుకు చెందని పదాన్ని గుర్తించండి :**

ఋషి, ముని, తపస్వి, చిలుక

అన్న, తమ్ముడు, గురువు, చెల్లెలు

పురము, విమానము, పట్టణము, నగరము

**12. జతపరచండి :**

| | |
|---|---|
| వజ్రనాభుడు | స్వర్గము |
| ఇంద్రుడు | గుహ |
| శ్రీకృష్ణుడు | కశ్యపుడు |
| సింహము | ద్వారక |
| దితి | వజ్రపురి |

**13. కింది ప్రశ్నలకు ఒకటి, రెండు వాక్యాల్లో జవాబులు రాయండి :**

1. వజ్రనాభుడు ఎవరిపైన దండెత్తాడు ?
2. ఇంద్రుడు ఎవరితో మొరపెట్టుకొన్నాడు ?
3. వజ్రనాభుడు ఎవరి వల్ల వరాలు పొందాడు ?
4. వజ్రనాభుని సేనలు ఎక్కడ విడిది చేశాయి ?

**14. ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి :**

1. ఇంద్రుడు కృష్ణునితో వజ్రనాభుని గురించి ఏమని చెప్పాడు?
2. ఇంద్రసభలోనికి ప్రవేశించిన వజ్రనాభుని దౌష్ట్యాలను వివరించండి.
3. కశ్యపుడు ఇంద్రుని ఆపద నుంచి ఎలాగట్టెక్కించాడు?
4. ఆపద నుంచి గట్టెక్కిన ఇంద్రుడు మనశ్శాంతిని పొందిన విధమెలాంటిది?

©KTBS Not to be republished

**15. కింది సందర్భాలను వివరించండి :**

1. మాటలాడ పనికలిగి వచ్చితిని
2. ఏమిటికి నాకు నీదు వృథా మాధురి
3. అన్యోన్య మైత్రి బొదలునట్టి తెఱగు నడుప వలయు
4. మీరెల్ల నాచేతిలోని వార చెప్పనేల?

**16. విద్యార్థులకు సూచనలు :**

రాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులను, వారు రచించిన కావ్యాలను గురించి తెలుసుకొనండి.

**17. ఉపాధ్యాయులకు సూచనలు :**

ప్రభావతీ ప్రద్యుమ్నములోని కథాసారాంశాన్ని విద్యార్థులకు వివరించి, పింగళి సూరన ఇతర రచనలను గురించి తెలియజేయండి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 9. మమకారం

-పిల్లలమర్రిపినవీరభద్రుడు

[ఈ పాఠ్యాంశాన్ని రచించినకవి 'వాణీనారాణి' అని సగర్వంగా చెప్పుకొన్న కవి పిల్లలమర్రి పిన వీరభద్రుడు. భారతాన్ని ఆధారంగా చేసుకొని జైమినీ భారతాన్ని రచించాడు. ఒక్క రాత్రిలోనే మొత్తం కావ్యాన్ని రాసి ఇచ్చాడన్న ఐతిహ్యం ఉంది. ఈయన 15వ శతాబ్దానికి చెందినవాడు. ఇతని రచన సరళంగా, సుబోధకంగా, వర్ణణాత్మకంగా ఉంటుంది. ప్రస్తుత పాఠ్యభాగం 'శృంగార శాకుంతలం' అనే కావ్యంనుండి గ్రహింపబడింది.

పెళ్ళైన ఆడబిడ్డను అత్తవారింటికి పంపడం మన సంప్రదాయం. అత్తవారింటికి కూతురిని పంపే సందర్భంలో అమ్మానాన్నలతోపాటు పుట్టింటివారందరు బాధపడడం సహజం. ఈ పాఠ్యభాగంలో శకుంతలను అత్తవారింటికి (దుష్యంతుని దగ్గరకు) పంపే సమయంలో కణ్వుడు పొందిన బాధ, ఆవేదన వర్ణింపబడ్డాయి.]

1 వ. అని ప్రసంగవశంబున గొన్ని కులకన్యకాధర్మంబులెఱింగించి,
అనసూయ ప్రియంవదలు మున్నుగా కొందఱ వృద్ధ తపస్వినీ
జనంబులను, జతుర మతులగు నిద్దఱ శిష్యులందోడువెట్టి
శకుంతలన్ దుష్యంతు పాలికనుప సమకట్టి.

2 ఉ. పొమ్మన జూచు, జూచిమది పుట్టిన ప్రేమము పేర్మి బాష్పముల్
గ్రమ్మిన గ్రమ్మఱం బెడమొగంబయి కన్నుల నీరు మ్రింగుచున్
గ్రమ్మఱదా శకుంతల మొగంబగు, నశ్రులనించు గొంతసే
పమ్మని జాలిబొంది ధృతియంతము నిల్వక విచ్చిపాఱగన్.

3 ★ ఉ. ఎంచమునీంద్రులందు విజితేంద్రియుడైన తపస్వికూర్మిగా
పెంచి, శకుంతలం బెనిచి విస్మృతినొందిన మోహపాశముల్
త్రెంచుకొనంగలేక తియతీపుల చిత్తముగాసివెట్టె, శీ
లించిన ఎవ్వడింక వదలింపగనోపెడు మోహబంధముల్.

4 వ. ఇట్లు బంధురంబగు మోహలతా బంధంబున నమ్మునిసింధురంబు
కట్టువడి ప్రకృతిజనంబుకైవడి శకుంతలాభిముఖుండై

5 ★ ఉ. నాపయికూర్మి తద్గురు జనంబులపై నిడి, మౌని కన్యకా
స్థాపిత వృత్తి బంధువనితాతతియందు ఘటించియిష్టస
ల్లాపములందు నిచ్చటు తలంపక నిచ్చలు ప్రాణనాథ సే
వా పరతంత్రవై యెటుల వన్నెయ దెచ్చెదొ నాకు పుత్రికా!

6 ★ ఉ. ఎన్నడు నామదిన్మఱతు నేనిట పుత్రిక! పూటపూట యా
సన్న సరోవరంబునను సంస్మరణం బొనరింప సంతత
స్విన్నమరంద సిక్త సరసీజము జూచి మదంతికంబునన్
గన్నులు నీటితోడ కుళకంబగుచున్న భవన్ముఖాబ్జమున్.

©KTBS Not to be republished

7 ఉ. కొంత సుఖంబునుంగలదు కోమలి! నాకిట పర్ణశాలికా
ప్రాంతమునందు నీవు పెనుపంబరువొందిన మాలతీలతా
క్రాంత మనోజ్ఞమైన సహకారము కన్గొనునప్పుడెల్ల దు
ష్యంతుడు మా శకుంతలయు సంగడి నుండుటగాదలంపగన్.

8 వ. ఎట్టకేలకు ధైర్యంబు వట్టుకొని శకుంతలం దోడ్కొని యగ్ని హో
త్రంబునకు దండంబువెట్టించి, మునులకు నమస్కారంబు జేయిం
చి, పుణ్యతపస్వినీ జనంబులకు మ్రొక్కించి, తదీయాశీర్వా
దంబులతోడ దానును దీవించి యనుపుటయు దండ్రిపాదంబు
లకుబ్రణామంబాచరించి,

9 సీ. జనకుడుండెడు ననుష్ఠాన వేదిక జూచు
జూచిక్రమ్మఱబోయి, చూడవచ్చు
స్నానార్థ నియమిత జలజాకరము జూచు
జూచి, క్రమ్మఱబోయి, చూడవచ్చు
నిజహస్త పోషిత కుజవల్లికల చూచు
జూచి క్రమ్మఱబోయి, చూడవచ్చు
గుంజ కోటర కుటీక్రోడ వీథులు చూచు
జూచి క్రమ్మరబోయి చూడవచ్చు

తే.గీ. దండ్రిపాయంగలేని సంతాపజలము
నత్తవారింటికేగెడు హర్షజలము
గోరువెచ్చన పాలిండ్ల కొనలు దడుప
నెడపదడుపన బయ్యెద దుడిచికొనుచు.

10 సీ. కదలు నాలుగు మూడు బదములు క్రమ్మఱి
తండ్రిపాదంబులౌదల ఘటించు
గొంత దవ్వేగు, నేగుచువచ్చి కణ్వుని
కడుపులోదలమోపికౌగిలించు,
నరుగుకొండొక వేగదిరిది మౌనులకు'మా
యయ్యనుడీ'అని యప్పగించు
గమనించుపెడమర్లి కాశ్యపుదెస జూచి
'నేబోదు' నంచు గన్నీరునించు

జనకుడుపలాలనముసేయ, సంయమీంద్ర
భామలదలింపననసూయ పట్టి తిగువ
నిగిడి యడుగిడె నొకభంగి మగిడి మగిడి
చూచుకొంచు శకుంతలా సూనగంధి.

11 కం. మునిభామలు నలువంకల
జనుదేఱగ నిర్మలోర్మి సంగతయగున
య్యనిమిషనది రత్నాకర
మునకేగెడు భంగి కదలి పోయెను నెమ్మిన్

* కంఠస్థ పద్యాలు

© KTBS
Not to be republished

**1. సారాంశం :**

1. సందర్భోచితంగాకొన్ని కన్యకా ధర్మాలనుబోధించి, అనసూయ, ప్రియంవదలు మొదలైన కొందరు వృద్ధ తపస్వినులను, బుద్ధిమంతులైన ఇద్దరు శిష్యులను శకుంతలకు తోడుగా, చేసి ఆమెను దుష్యంతుని దగ్గరకు పంపటానికి పూనుకొని ఆ కణ్వుడు.

2. శకుంతలతో 'వెళ్ళిరావమ్మా!' అని చెప్పాలనుకుంటాడు కాని, అంతలోనె ఆమెపై కలిగిన వాత్సల్యంతో కన్నీరు రాగా, మొగం పక్కకు తిప్పుకొని, ఆ కన్నీటిని మింగుకుంటూ, మరల ఆమెవైపు చూస్తాడు. పట్టుదప్పిపోయి కారుతున్న కన్నీటితో జాలి పొంగిపోయింది.

3. మునిశ్రేష్ఠులలోనే, ఇంద్రియాలను జయించినవాడు ఆ తాపసి (కణ్వుడు). అంతటి గొప్పవాడే, ప్రేమతో పెంచిన శకుంతలపై, తనకున్న ప్రేమబంధాన్ని తెంచుకోలేక పోయాడు. మధురమైన పెంచిన ప్రేమ అతన్ని బాధించింది. ఆలోచించి చూడగా, ఇక సామాన్య మానవుడు మోహబంధాల్ని ఎలా వదలించుకోగలడు?

4. ఇలా తప్పించుకోలేని మోహమనెడితీగతో బంధించబడిన ఆమునిశ్రేష్ఠుడు సామాన్య మానవునిలా శకుంతల వైపు తిరిగి.

5. ఓకూతురా! ఇకనుంచి నామీద నీకున్న ప్రేమను (అత్తవారింటిలోని) పెద్దలవైపుచూపుము. ఇక్కడి ముని కన్యలపై నిలిపిన ప్రేమను, అక్కడి బంధువుల స్త్రీలపైనను చూపుము. ఇష్టాగోష్ఠి సందర్భాలలో, ఇక్కడి విషయాల ప్రస్తావన చేయక, నిత్యం నీ భర్తసేవలో మునిగి పోయి, నాకు ఎలా కీర్తిని తెస్తావో కదా!

6. ఓ అమ్మాయీ! చెంతనున్న సరోవరంలో వికసించి, మకరంద బిందువులతో నిండిన పద్మాలను ప్రతిదినమూ చూస్తుంటాను. వాటిని చూస్తూవుంటే నీవు పక్కన కూర్చొనివున్నట్లు, కన్నీటితో నిండిన పద్మములాంటి నీముఖము గుర్తుకు రావటం ఎప్పటి కైనా మరచిపోగలనా!

7. ఓ అమ్మాయీ! నాకిక్కడ కొంత సుఖంగా కూడా ఉంది. అదెలాగంటే నీవుపెంచిన, మాలతీలత తీయమామిడి చెట్టును పెనవేసుకొని వున్న అందమైన దృశ్యాన్ని చూచినపుడు, నీవు కూడ ఇలాగే దుష్యంతుని చేరువలో ఉన్నట్లు భావిస్తుంటాను కాబట్టి.

8. అని చివరికి ధైర్యం కూడగట్టుకొని, శకుంతలను పిలుచుకొని అగ్నిహోత్రానికిదండం చేయించి, మునులకు నమస్కారం చేయించి, పుణ్యతపస్వినీ స్త్రీలకు మ్రొక్కించి, వారి ఆశీర్వాదములతో పాటు, తానుకూడ ఆశీర్వదించి పంపే సమయంలో, ఆమె తన తండ్రి పాదాలకు ప్రణమిల్లి.

9. తనతండ్రి యజ్ఞం చేసే వేదికను చూస్తుంది. మళ్ళీవెళ్ళి దాన్నే చూస్తుంది. ప్రతిదినం స్నానంచేసే సరస్సువైపు చూస్తుంది. చూచి, పరిగెత్తుకొని వెళ్ళి మళ్ళీ దాన్నే చూస్తుంది, తాను పోషించి పెంచిన చెట్లను, తీగలను చూస్తుంది. చూచి మళ్ళీ వాటినే చూస్తుంది. చెట్లవరుసలను చూస్తుంది. ఆవరుసల్లో కొన్ని పొదరిండ్లున్నాయి. మరికొన్ని పెద్దచెట్టు తొర్రలున్నాయి. ఆ తొర్రలు గుడిసెల్లా ఉన్నాయి. వాటిని పదేపదే చూస్తుంది. ఒకవైపు తండ్రిని విడిచిపెట్టి వెళ్ళాల్సివచ్చినందుకు దుఃఖాశ్రువులు, మరోవైపు అత్తవారింటికి వెళ్ళాల్సివచ్చినందుకు ఆనందాశ్రువులు కలిసి వెచ్చటి ఎద భాగంపై పడుతుండగా పైట చెంగుతో తుడుచుకుంటూ.

Not to be republished ©KTBS

10. వెళ్ళడానికిగాను మూడు నాలుగు అడుగులు ముందుకు వేసి, వెంటనే వెనక్కి తిరిగివచ్చి తండ్రిపాదాలపై వాలిపోతుంది. కొంతదూరం వెళ్తుంది. మళ్ళీ ఆగి, వెనక్కిపరిగెత్తుకొని వెళ్ళి తండ్రికడుపులో తలపెట్టుకొని కౌగిలించుకుంటుంది. కొంచెం ముందుకెళ్తుంది. వెంటనే వేగంగా తిరిగివచ్చి, మునులవైపు చూచి, 'మా అయ్యను జాగ్రత్తగా చూసుకుంటూ ఉండండి.' అని అప్పగిస్తుంది. తదేకంగా తండ్రివైపుచూస్తూ నేను వెళ్ళివస్తాను అని కన్నీళ్ళు కారుస్తుంది. తండ్రి బుజ్జగిస్తుండగా, మునిస్త్రీలు 'ఏడవకమ్మా' అని మందలిస్తుండగా (తన స్నేహితురాలైన) అనసూయ పాదవిపట్టుకొనగా, అడుగు ముందుకు వేయలేక, వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ శకుంతల ముందుకు సాగింది.

11. నాలుగు వైపులనుండి తాపసి స్త్రీలు కలిసి వస్తుండగా, ఆమె ముందుకు సాగుతోంది. అది చూస్తుంటే నిర్మలమైన అలలతో కూడిన ఆ దేవనది, సముద్రన్ని కలిసేందుకు వెళ్ళుతున్నట్లుగా అనిపించింది.

**2. కొత్త పదాలు :**

ధృతి గాసివెట్టు సింధూరం నిచ్చలు సంస్మరణ సరసీజం పర్ణశాల సహకారం.

**3. అర్థాలు :**

క్రమ్మఱ = మరల; ధృతి = ధైర్యం; విజితేంద్రుడు; ఇంద్రియాలను జయించినవాడు; శీలించిన = పరిశీలించిన; చిత్తం = మనస్సు; కూర్మి = ప్రేమ; కాసివెట్టు = బాధించుట; సింధూరం= ఏనుగు; గురుజనం =పెద్దలు; నిచ్చలు = ప్రతిదినం; స్విన్న = మృదువైన; స్నిగ్ధ = తడిసిన; కైవడి = విధం; ఆసన్న = సమీపం; సహకారం = మామిడిచెట్టు; వితానం = సమూహం; తరువు = చెట్టు; ఆలవాలం = పాదు; కుంజకోటర కుటీ క్రోడ వీథులచూచు; కుంజ = పొదరిల్లు; కోటర = చెట్టుతొర్రలు; కుటీ = గుడిసె; క్రోడ = ఒడి; వీథులు = వరుసలు; అనిమిషనది = గంగానది; రత్నాకరం = సముద్రం.

**4. నానార్థాలు :**

గురువు : తండ్రి, పెద్దవాడు, విద్యనేర్పువాడు.

**5. వ్యుత్పత్త్యర్థాలు :**

రత్నాకరం : రత్నాలకు నిలయమైనది (సముద్రం)

సరసీజం : సరసునుండి పుట్టినది (పద్మము)

అబ్జం : నీటినుండి పుట్టినది (పద్మం)

గురువు : అజ్ఞానాంధకారాన్ని పోగొట్టేవాడు

జలజాకరం : కమలములకు నిలయం (సరస్సు)

©KTBS Not to be republished

**6. జతపరచండి :**

| | |
|---|---|
| జనకుడుండెడు | హర్షజలము |
| స్నానార్థ నియమిత | సంతాప జలము |
| నిజహస్త పోషిత | అనుష్ఠాన వేదిక |
| తండ్రిపాయంగలేని | జలజాకరము |
| అత్తవారింటికేగెడి | కుజవల్లికలు |

**7. రూపాంతరాలు :**

వన్నె - వన్నియ

మకరందం - మరందం

కన్య - కన్నె, కన్నియ

**8. సంధులు :**

| | | | | |
|---|---|---|---|---|
| విజితేంద్రియుడు | : విజిత | + | ఇంద్రియుడు | గుణసంధి |
| నిర్మలోర్మి | : నిర్మల | + | ఊర్మి | గుణసంధి |
| అమ్ముని | : ఆ | + | ముని | త్రికసంధి |
| రత్నాకరము | : రత్న | + | ఆకరము | సవర్ణదీర్ఘసంధి |
| శకుంతలాభిముఖుడు | : శకుంతల | + | అభిముఖుడు | సవర్ణదీర్ఘసంధి |
| ముఖాబ్జము | : ముఖ | + | అబ్జము | సవర్ణదీర్ఘసంధి |

**9. సమాసాలు :**

విజితేంద్రియుడు - జయించిన ఇంద్రియములు కలవాడు - బహువ్రీహి సమాసం

| | | |
|---|---|---|
| మోహపాశం | - మోహమనెడిపాశం | రూపక సమాసం |
| వృద్ధ తపస్వినులు | - వృద్ధులైన తపస్వినులు | విశేషణపూర్వ పదకర్మ ధారయ సమాసం. |
| చతుర మతులు | - చతురమైన మతులు కలవారు | బహువ్రీహి సమాసం. |

**10. అలంకారం :**

అయ్యనిమిష నది రత్నాకరమున కేగెడుభంగి
ఇందులో ఉపమాలంకారమున్నది.

ఉపమేయం - మునిభామలతో కూడిన శకుంతల

ఉపమానం - అలలతో కూడిన గంగ (ఆకాశ గంగ)

ఉపమావాచకం - భంగి

సామాన్యధర్మం - కదలి పోవడం.

©KTBS Not to be republished

**11. కింది సందర్భాలను వివరించండి :**

1. ఎవ్వడింక వదలింపగనో పెడు మోహబంధముల్
2. ఎటుల వన్నియదెచ్చెదొ నాకు పుత్రికా!
3. దుష్యంతుడు మా శకుంతలయు సంగడి నుండుటగా దలంపగన్
4. 'మాయయ్య సుడీ'యని యప్పగించు.
5. 'నేబోదు' నంచు గన్నీరు నించు.
6. కన్నులు నీటితోడ కుళకంబగుచున్న భవన్ముఖాబ్జమున్.

**12. కింది ప్రశ్నలకు ఒకటి రెండు వాక్యాలలో సమాధానాలు రాయండి :**

1. పిల్లలమర్రి పినవీరన ఎన్నో శతాబ్దం వాడు?
2. శకుంతల పెంపుడు తండ్రి ఎవరు?
3. శకుంతల భర్త ఎవరు?
4. కణ్వుడు ఎలాంటి తపస్వీ?
5. కణ్వుడు ఏ పాశాన్ని తెంచుకోలేక పోయాడు?
6. లతతో చుట్టబడిన మామిడి చెట్టును చూచినపుడు కణ్వునికి ఎవరు గుర్తుకు వస్తారు?
7. మమకారం పాఠాన్ని రాసిందెవరు?

**13. కింది ప్రశ్నలకు వివరంగా జవాబులు రాయండి :**

1. శకుంతలను అత్తవారింటికి పంపునపుడు కణ్వుడు ఎలా బాధ పడ్డాడు?
2. కణ్వుడు తనకు శకుంతల ముఖం ఎలా జ్ఞాపకం ఉంటుంది అన్నాడు?
3. ఆశ్రమాన్ని వదలి వెళ్ళేటప్పుడు శకుంతల ఎలా బాధ పడ్డది?
4. మమకారం పాఠంలోని సారాంశాన్ని రాయండి.

**14. కార్యాచరణం :**

శకుంతలా దుష్యంతుల నాటకాన్ని విద్యార్థులు చూడాలి.

**15. ఉపాధ్యాయులకు సూచనలు :**

1. విద్యార్థినీ విద్యార్థులతో దుష్యంత నాటకాన్ని వేయించండి.
2. 'అప్పగింతల' పాటలను సేకరించి పిల్లలకు వినిపించి, వివరించండి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 10. ఘోషయాత్ర

- ఎఱ్ఱాప్రెగ్గడ

[ద్యూత నియమం ప్రకారం పాండవులు వనవాసంలో కష్టాలు పడుతున్నారు. అలాంటి సమయంలో తమ వైభవాన్ని వారి ముందు ప్రదర్శించి, వారు మనస్తాపం పొందేలా చేసి, చూచి సంతోష పడాలని కర్ణుడు తన కూర్మి చెలికాడైన దుర్యోధనునికి సలహాయిస్తాడు.

ఈ పాఠ్యభాగం ఎఱ్ఱాప్రెగ్గడ రచించిన భారతారణ్య పర్వశేషం నుంచి గ్రహించబడింది. నన్నయ, తిక్కన, ఎఱ్ఱన- ఈ మువ్వురిని 'కవిత్రయం' అంటారు. ఎఱ్ఱన కవిత్రయంలో మూడోవాడు. 14వ శతాబ్దంలో అద్దంకి రాజధానిగా రెడ్డి రాజ్యాన్ని పరిపాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలోని వాడు. శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన బిరుదులు. రామాయణం, నృసింహపురాణం, హరి వంశం,- ఎఱ్ఱన ఇతర రచనలు. ఎఱ్ఱన రామాయణం అలభ్యం.]

1 వ. పాండవులిప్పుడు పరమ దుఃఖార్తులగుచు ద్వైతవన సరోవర సమీపంబున
నున్నవారని వింటిమి. నీవు సకల సామ్రాజ్యవిభవంబు మెరసి చని యందు నీతేజంబు
ఘర్మ సమయంబు నాటి తపను తేజంబై పగతుర కన్నులు గమర నతి దుస్సహంబగు
నట్లుగా జేయుచు.

2 కం. ధన ధాన్య పుత్ర బాంధవ
జన లాభంబులును దలప సరికావు సుఖం
బున దాను దనరి, శత్రులు
ఘనతర దుఃఖములనుండి గని యలరుటకున్

3 ఉ. నారలు గట్టి కూరలశనంబుగ నుగ్ర వనంబులో విప
ద్భారము నొంది యందురిన ఫల్గుణు నుజ్జ్వల రాజ్యవైభవో
దారులమై కనుంగొని ముదంబును బొందగ గాంచుకంటె, నిం
పారగ నొండు గల్గునె? కృతార్థత మెందును గౌరవేశ్వరా!

4 తే.గీ. అతుల సౌభాగ్య పుణ్య సమగ్ర గరిమ
నొప్పుచున్న నీదేవుల మెప్పు జూచి
ధృతి దరగి తన్ను తాన నిందించు కొనుచు
హృదయమున పాండవాంగన మెరియ వలదె?

5 వ. అనిన నిది వోలు నని నాగకేతనుండు సంప్రీతుండై కొండొక విచారించి,
రాధేయుం జూచి యిట్లనియె... విదురుండు పాండవ పక్ష పాతి యగుట
మనవిచారించిన యిక్కార్యంబు చిన్న సన్న యెరింగె నేనియు నాతండెల్ల భంగుల
విఘ్నంబు సేయుంగావున నిదియంతయు రహస్యంబుగా నొనరించుకొని
ధృతరాష్ట్రుండు దీని కనుమతించు తెరంగెయ్యది? యట్టియుపాయంబు
నీవును శకునియు నూహించునది. . . . . యన కర్ణుండు దుర్యోధనుని కిట్లనియె.

©KTBS Not to be republished

6 ఉ. భూతలనాథ! యేనొకట పోల నుపాయము గంటి, నిప్పుడా
ద్వైతవనంబునందు విదితంబుగ నున్నవి గోకదంబముల్
ప్రీతిగ తద్విలోకనము పేర జనందగు, ధారుణీశ్వరుం
డీ తెరగైన బొమ్మను నభీష్టము సేకురు నెల్ల భంగులన్.

7 కం. నావిని సుబల తనుజుడు
'దేవా! నీయాన యేను దెల్లంబుగ, రే
యీ వెరవె నెమ్మనమ్మున
భావించితి' ననియె నంత ప్రహసిత ముఖులై.

8 వ. ఒండొరుల చెయి సరచి నవ్వుచు నమ్ముర్వురుం దక్షణంబ సమంగ
నామధేయుండైన గోపాలకు నొక్కని గరపికొని ధృతరాష్ట్రు పాలికిం జని
సముచిత ప్రసంగ సేవా విశేషంబుల నమ్మహీవిభు సుముఖుం జేసి,
యనంతరంబ "దేవా! ద్వైతవనంబు నందుల కీలారంబున నుండి వీడె
యొక్క గోపకుండు వచ్చె" ననిన నతండును వాని కభిముఖుండై పసుల
సేమంబడుగుటయు. వాడిట్లనియె.

9 ఉ. ద్వైతవనంబు నట్టి సుఖవాసము గోవుల కెందు లేదు: ధా
త్రీతలనాథ! యిప్పుడు ప్రదీప్తములై సతతంబు చేర్చిగో
వ్రాత భయంకరంబులగు వాలు మృగంబులు సంచరించు. మీ
కాతెరగెల్ల జెప్పుటకు నైయిట వచ్చితి నేను జెచ్చెరన్.

10 వ. అనిన యనంతరంబ కర్ణ సౌబలులు ధృతరాష్ట్రు తోడ "దేవా!
యట్లయినం దడయక దుష్టమృగ నాశనంబును గోగణ సంరక్షణ
బును జేయుటకు భవత్సూను దుర్యోధను నియోగింపు" మనిన నతండు
గొండొక విచారించి యిట్లనియె.

11 మ. తగు గోరక్ష యొనర్ప, దుష్ట మృగ విధ్వంసంబు నూహింప, మే
లగు; నైనన్ వినుడవ్వనాంతరము నందాసక్తిమై నున్నవా
రు గరిష్ఠాత్ములు, పాండురాజ తనయుల్, రూఢ ప్రతాపాఢ్యు, ల
ట్లగుటన్ మీగమనంబు నామది బ్రియంబై తోపదెబ్బంగులన్.

12 చం. వనమున కేగి వందురిన వారని వారల మీరవశ్యముం
జెనకదలంతురప్పురుష సింహులు భూరి తపోనిధుల్ మనం
బున గలుషించిరేనియు, దపోమహిమన్ మిము నిగ్రహింతు, రొం
డె, నతులితాస్త్ర శక్తిని వడిం దునుమాడుదు రాజినందరన్.

©KTBS Not to be republished

13 తే.గీ. చెనకి మీరు వారికి గీడు సేయుటయును
వారు మీకెగ్గు సేతయు వగవ మేలు
గాదు; వలసిన ఘోష రక్షణ మొనర్ప
దగిన వారల బుత్తము దడయకందు.

14 వ. అని యొడంబడకున్న నయ్యాంబికేయునకు శకుని యిట్లనిమె

15 ఉ. పాలిత విక్రమోన్నతులు పాండు తనూజులు; వారికప్రియం
బేల యొనర్తు మే మధిప యేమటు సేసితి మేనియుం బ్రతి
జ్ఞాలపితుండు ధర్మజుడు సత్యము దప్పునె? తమ్ములేల త
చ్ఛీల మతి క్రమింతురిది సిద్ధము నమ్ముము నెమ్మనంబునన్.

16 కం. మాకును జిత్తంబుల మృగ
యాకౌతుక మతిశయిల్లినది. గోగణర
క్షాకరణము గార్యంబటె
యేకీడును నేల బొందు నిందు మహీశా!

17 కం. అనిన నతడు కొండొక వడి
మనమున నూహించి "బుద్ధి మంతులరై గో
ధనము నరసి తడయకరం
డ"ని వారికి నెట్టకేల కనుమతియిచ్చెన్.

18 ఆ.వె. ఆక్షణంబ కౌతుకాతిశయ వ్యగ్ర
హృదయుడైన ఫణిధరేంద్ర కేతు
నాజ్ఞ కరిపురంబు నందెల్ల ఘోషింప
బడియె, ఘోష యాత్ర ప్రకటలీల.

**1. సారాంశం**

1. ఇప్పుడు పాండవులుద్వైతవనంలో ఒక సరోవరం దగ్గర ఉన్నారని విన్నాము. మిట్ట మధ్యాహ్న సమయంలో సూర్యుని వలె నీవు నీ వైభవంతో వెళ్ళి, వాళ్ల కన్నులు కుట్టేలా భరించలేనట్లు చేయి.

2. తాను సుఖంగా ఉంటూ, తనశత్రువులు చాలా కష్టాలు పడుతుండటం చూచి సంతోషించడం కంటె ధన ధాన్యాదులు, పుత్రులు, బంధువులు ఎక్కువ కాదు.

3. నార చీరలు ధరించి, ఆకులు అలములు తింటూ, ఆ ఘోరారణ్యంలో ఆపదల మధ్యలో బాధపడుతున్న అర్జునుని, మనం ఎంతో గొప్ప రాజ్య భోగాలతో ఉంటూ, చూచి సంతోష పడటంకంటె ఓ దుర్యోధనా! మించిన కోరిక మరొక్కటి ఉంటుందా?

© KTBS Not to be republished

4. నీభార్యలు ఎంతో గొప్ప సంపదలతో తులతూగుతుండటం చూసిన ఆ ద్రౌపది పట్టుదప్పి, తనను తానే నిందించు కొంటూ మనసులో బాధ పడాలి.

5. అని కర్ణుడు చెప్పగావిని దుర్యోధనుడు సంతోషపడి, సరేనని, కాసేపు ఆలోచించి ఇలా అన్నాడు. 'విదురుడు పాండవ పక్షపాతి. మనం అనుకొన్న ఈ పనిని ఏమాత్రం పసికట్టినా, అన్నివిధాలా ఆటంకం కలుగ జేస్తాడు. కాబట్టి దీన్ని రహస్యంగా ఉంచాలి. ఏమి చేస్తే ఈ పనికి ధృతరాష్ట్రుడు అనుమతిస్తాడో, అలాంటి ఉపాయాన్ని నీవూ శకుని కలిసి ఆలోచించి చెప్పండి అనగా విని కర్ణుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు.

6. ఓ రాజా! నాకొక ఉపాయం తోస్తున్నది. ఇప్పుడు ఆ ద్వైతవనంలో మన ఆల మందలున్నవి కదా! వాటిని చూడాలనే నెపంతో వెళ్ళవచ్చును. మీ తండ్రి కూడ దీనికైతే వెళ్ళమంటాడు. ఇలా చేస్తే మన కోరిక తీరుతుంది.

7. అనగా విని శకుని 'దుర్యోధనా! నీవు చెప్పినట్లు నేను రాత్రి అంతా చక్కగా ఆలోచించాను. ఈ ఉపాయమే నేను కూడ అనుకొన్నాను'. అనగానే సంతోషంతో.

8. ఒకరికొకరు చేతులు చరచుకొని నవ్వుకొంటూ ఆముగ్గురు (దుర్యోధన, కర్ణ, శకుని) తక్షణమే 'సమంగ' అనే పేరున్న ఒక గోపాలుని (పసుల కాపరిని) పిలిపించి వానికి అన్నీ నేర్పించి ధృతరాష్ట్రుని దగ్గరకు పిలుచుకొని వెళ్ళారు. సందర్భోచితమైన మర్యాదలతో, మాటలతో అతన్ని సంతోష పరచి, ఆ తరువాత 'దేవా! ద్వైత వనంలోని మన పశువుల మంద నుంచి ఇదిగో! యీ గోపాలుడు వచ్చాడు. అనగా ఆ ధృతరాష్ట్రుడు వాని వైపు తిరిగి పశువుల క్షేమమడగ్గా వాడిలా అన్నాడు.

9. ఆవులకు ద్వైతవనంలాంటి సురక్షితమైన ప్రదేశం మరొకటిలేదు. కాని ఓ రాజా! అక్కడ ఇప్పుడు భయంకరమైన పెద్ద పులులు చాలా తిరుగుతున్నాయి. మీతో ఆవిషయం చెప్పటానికి నేను యిక్కడకు వచ్చాను.

10. అని వాడలా అన్నాక కర్ణుడు శకుని ధృతరాష్ట్రునితో "దేవా! ఇలా ఉన్నప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయక ఆదుష్ట మృగాల్ని చంపి ఆల మందల్ని సంరక్షించటానికి మీకుమారుడైన దుర్యోధనుని పంపించండి" అనగా అతడు కాసేపు ఆలోచించి యిలా అన్నాడు.

11. గోరక్షణ మంచిదే. ఆలోచించి చూస్తే దుష్టమృగ నాశనంకూడ ఇంకా మంచిదే. కాని ఆవనంలో ఎంతో ప్రశాంతంగా పాండవులుంటున్నారు. వారు విశాల హృదయులు. గొప్ప పరాక్రమవంతులు. అందువల్ల మీరక్కడికి వెళ్ళటం నా కిష్టంలేదు.

12. ఆ ద్వైత వనానికి వెళ్ళితే, బాధలలో నున్నవారిని మీరు తప్పకుండా ఎదుర్కొంటారు. వారా, పురుష సింహులు. గొప్ప తపస్సంపన్నులు. వారు కోపించినట్లయితే, తపోశక్తితో మిమ్మల్ని కట్టిపడ వేస్తారు.లేదా వారి గొప్ప ఆయుధాలతో మిమ్మల్ని అందరిని చంపివేయగలరు.

© KTBS Not to be republished

13. ఎదిరించి మీరు వారికి కీడు చేయటం, వారు మీకు అపకారం చేయటం- రెండూ మంచివి కావు. అవసరమైతే గోరక్షణకు తగినవాళ్ళను వెంటనే పంపిద్దాం.

14. అని వారి కోరికను అంగీకరించని ధృతరాష్ట్రునితో శకుని ఇలా అన్నాడు.

15. పాండవులు గొప్ప పరాక్రమవంతులు. మేము వారికెందుకు కీడు తలపెడతాము?

ఓరాజా! ఒకవేళ మేము అలా చేసినా, ప్రతిజ్ఞకు కట్టుబడిన ఆధర్మజుడు సత్యం తప్పునా? అతని మాటను ఆయన తమ్ములెందుకు అతిక్రమిస్తారు? ఇదినిజం. మామాట నమ్మి మన్నించండి.

16. మాకు కూడా మనసులో వేటాడాలని ఉంది. పైగా గోరక్షణం కూడ అవశ్యమే. ఓరాజా! ఇందులో కొంప మునిగే దేముంది?

17. అనగా అతడు కాసేపు ఆలోచించి 'గోరక్షణ చేసి, వెంటనే బుద్ధిగా తిరిగి రండి', అని చివరికి అనుమతించాడు.

18. దానితో దుర్యోధనుడు ఆనందంతో పొంగిపోయాడు. ఘోషయాత్ర గురించి అందరికీ తెలిసేలా హస్తినాపురమంతా చాటించండి అని ఆజ్ఞాపించాడు.

**2. కొత్తపదాలు :**

పక్షపాతి విఘ్నం అభీష్టం గోపాలకుడు సూనుడు గోరక్షణ

గరిష్ఠాత్ములు మృగయాకౌతుకం ఘర్మ సమయం పురుషసింహులు

**3. అర్థాలు :**

ఘర్మ సమయం = మధ్యాహ్న కాలం; తపనుడు = సూర్యుడు; దుస్సహం = భరింపరానిది; అలరుటకు = సంతోషించటానికి; అశనం = ఆహారం; వందురిన = బాధపడిన; ముదం = సంతోషం; కృతార్థత = సఫలత; దేవి+లు = భార్యలు; ధృతి = ధైర్యం; ఎరియవలదె = బాధపడవలదా; సన్న = శబ్దం; విదితంబుగ = తెలిసేలా; గోకదంబములు = ఆలమందలు; తెల్లంబుగ = స్పష్టంగా; వెరవు = ఉపాయం: ప్రహసిత ముఖులు = చక్కగా నవ్వినవారు; గరపు = నేర్పు; కీలారము = పసుల మంద; వాలు మృగములు = పెద్ద పులులు; భవత్ + సూనుడు = నీకొడుకు; ఆజి = యుద్ధం; నియోగింపుము = నియమింపుము; గరిష్ఠ+ ఆత్ములు = గొప్ప మనసున్నవారు; రూఢ ప్రతాప+ ఆఢ్యులు = గొప్ప పరాక్రమంతో ప్రసిద్ధులైనవారు; చెనకదలంతురు = ఎదుర్కొనాలని చూస్తారు: నిగ్రహింతురు = బంధిస్తారు; ఘోషరక్షణం = ఆవుల మందలను కాపాడటం; అస్త్రం = మంత్ర పూర్వకంగా ప్రయోగింపబడే ఆయుధం; ప్రతిజ్ఞాలపితుండు = ప్రతిజ్ఞ చేసిన నోరు కలవాడు; మృగయాకౌతుకం = వేటాడాలనే ఉత్సాహం; అతిశయిల్లినది = ఎక్కువైనది; వ్యగ్ర హృదయుడు = వేగిరపాటు హృదయం కలవాడు, ఫణిధరేంద్రకేతుడు = దుర్యోధనుడు; కరిపురం = హస్తినాపురం; ఘోషింపబడు = చాటింపు వేయబడు; ఘోషయాత్ర = గొల్లపల్లెకు బయలుదేరడం.



©KTBS Not to be republished

**4. వ్యతిరేక పదాలు :**

| | | |
|---|---|---|
| మేలు | × | కీడు. |
| ఎగ్గు | × | లగ్గు. |
| ప్రియం | × | అప్రియం. |
| సుముఖుడు | × | విముఖుడు. |
| దుష్టుడు | × | శిష్టుడు. |
| సహం | × | దుస్సహం. |

**5. ప్రకృతి – వికృతులు :**

| | | |
|---|---|---|
| ఆజ్ఞ | - | ఆన. |
| క్షేమం | - | సేమం. |
| శక్తి | - | సత్తి. |
| మృగం | - | మెకం. |
| యాత్ర | - | జాతర. |
| శబ్దం | - | సద్దు. |

**6. నానార్థాలు :**

| | | |
|---|---|---|
| ఘోషం | : | గొల్లపల్లె, ఆవులమంద. |
| వనం | : | అడవి, నీరు, వెదురు, |
| కదంబం | : | గుంపు, ఒక వృక్షం (కడిమి చెట్టు) |
| వెరవు | : | ఉపాయం, విధం, వశం |
| మృగం | : | జంతువు, జింక |
| నిగ్రహం | : | చెర, మేర, బెదరు మాట |

**7. వ్యుత్పత్త్యర్థాలు :**

| | | |
|---|---|---|
| తనూజులు | : | తనువు నుండి పుట్టినవారు (కుమారులు) |
| ఆంబికేయుడు | : | అంబ యొక్క కుమారుడు. (ధృతరాష్ట్రుడు) |
| రాధేయుడు | : | రాధచేత పెంచబడిన వాడు (కర్ణుడు) |
| సౌబలుడు | : | సుబలుని కుమారుడు (శకుని) |
| నాగకేతనుడు | : | తన జెండాపై పాము గుర్తు కలవాడు(దుర్యోధనుడు) |
| ఫణి ధరేంద్ర కేతుడు | : | తన జెండాపై పాము గుర్తు కలవాడు(దుర్యోధనుడు) |
| పాండవాంగన | : | పాండవుల యొక్క భార్య (ద్రౌపది) |

©KTBS Not to be republished

**8. సంధులు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| దుఃఖ | + | ఆర్తులు | = | దుఃఖార్తులు | - | (సవర్ణదీర్ఘ సంధి) |
| ఆ | + | ముచ్చురు | = | అమ్ముచ్చురు | - | (త్రిక సంధి) |
| విక్రమ | + | ఉన్నతులు | = | విక్రమోన్నతులు | - | (గుణ సంధి) |
| ఎగ్గు | + | చేత | = | ఎగ్గుసేత | - | (గ,స,డ,ద,వా దేశ సంధి) |
| మీకు | + | ఆతెరంగెల్ల | = | మీకాతెరంగెల్ల | - | (ఉకార సంధి) |

**9. సమాసాలు :**

| | | | |
|---|---|---|---|
| దుఃఖార్తులు | : | దుఃఖముచేత ఆర్తులు. | (తృతీయా తత్పురుష సమాసం.) |
| నాగకేతనుడు | : | నాగమును కేతన చిహ్నముగా గలవాడు దుర్యోధనుడు. | (బహుప్రీహి సమాసం) |
| గోరక్ష | : | గోవులకురక్ష | (షష్ఠీ తత్పురుష సమాసం.) |
| ప్రతాపాఢ్యులు | : | ప్రతాపం చేత ఆఢ్యులు | (తృతీయా తత్పురుష సమాసం) |
| మృగయాకౌతుకం | : | వేటయందలి కౌతుకం | (సప్తమీ తత్పురుష సమాసం) |
| సామ్రాజ్య వైభవం | : | సామ్రాజ్యం యొక్క వైభవం | (షష్ఠీతత్పురుష సమాసం) |

**10. కింది ఖాళీలను సరైన పదాలతో పూరించండి :**

1. ద్వైత వనంబు నందలి ______________నుండి యొక్క గోపకుండు వచ్చె.
2. ______________ నట్టి సుఖవాసము గోవుల కెందు లేదు.
3. గోగణ సంరక్షణంబు సేయుటకు భవత్సూను ______________ ను నియోగింపు.
4. వలసిన ______________ రక్షణ మొనర్ప తగిన వారల బుత్తము.
5. ప్రతిజ్ఞాలపితుండు ______________ సత్యము దప్పునె?
6. మాకును చిత్తంబుల ______________ కౌతుకమతిశయిల్లినది.

**11. జతపరచండి :**

| 'అ' పట్టిక | 'ఆ' పట్టిక | |
|---|---|---|
| 1. నాగకేతనుడు | అ) గోపాలుడు | ( ) |
| 2. రాధేయుడు | ఆ) శకుని | ( ) |
| 3. ఆంబికేయుడు | ఇ) దుర్యోధనుడు | ( ) |
| 4. సుబల తనయుడు | ఈ) కర్ణుడు | ( ) |
| 5. సమంగుడు | ఉ) ధృతరాష్ట్రుడు | ( ) |
| 6. కుంతీ తనూజుడు | | |
| 7. యుధిష్ఠిరుడు | | |

©KTBS Not to be republished

**12. కింది ప్రశ్నలకు ఒక మాటలో సమాధానాలీయండి :**

1. పాండవులున్న వనం పేరేమిటి?
2. ఘోష యాత్రకు వెళ్ళటానికి పురికొల్పిన దెవరు?
3. పాండవ పక్షపాతి ఎవరు?
4. గోవులకు సుఖవాసమైన ప్రాంతమేది?
5. పాండవాంగన ఎవరు?

**13. కింది ప్రశ్నలకు రెండు మూడు వాక్యాల్లో సమాధానాలీయండి :**

1. ధన ధాన్య పుత్ర బాంధవ జనలాభంబులు దేనితో సరికావు?
2. ఫల్గునుడు ఎలాంటి బాధలు పడుతున్నాడని కర్ణుడు దుర్యోధనునితో అంటాడు?
3. పాండవాంగన ఎలా బాధ పడాలని కర్ణుడు ఆశిస్తాడు?
4. తమపథకమంతా రహస్యంగా జరగాలని దుర్యోధనుడు ఎందుకు అంటారు?
5. ద్వైతవనంలోనికి వెళ్ళేందుకు అనుమతినెలా పొందాలని కర్ణుడు చెప్తాడు?
6. కర్ణ దుర్యోధనులు అనుమతికోసం పన్నిన పన్నాగ మేమి?

**14. కింది ప్రశ్నలకు వివరంగా సమాధానాలీయండి :**

1. గోపాలుని మాటలు విని ధృతరాష్ట్రుడు తన అభిప్రాయాన్ని ఎలా తెలిపాడు?
2. ద్వైత వనానికి వెళ్ళటానికి కర్ణుడు దుర్యోధనునెలా పురికొల్పాడు?
3. ద్వైత వనానికి వెళ్ళేందుకు కర్ణ సౌబలులు దుర్యోధనునికి ఎలా తోడ్పడ్డారు?

**15. కింది సందర్భాలను పేర్కొనండి :**

1. కల్గనె? కృతార్థత యెందును కౌరవేశ్వరా!
2. హృదయమున పాండవాంగన మెరియ వలదె?
3. ధారుణీశ్వరుండీ తెర్గగైన బొమ్మను
4. ఆతడెల్ల భంగుల విఘ్నంబు సేయును
5. మీగమనంబు నామది ప్రియంబై తోప దెబ్బంగులన్
6. వారి కప్రియం బేల యొనర్తుము?
7. తమ్ములేల తచ్ఛీల మతిక్రమింతురు?
8. మాకును చిత్తంబుల మృగయా కౌతుకమతిశయిల్లినది
9. బుద్ధిమంతులరై గోధనమునరసి తడయక రండు.

**16. కింద పేర్కొనిన సంఘటనలను చదివి. కథాక్రమాన్ని బట్టి వాటికి క్రమసంఖ్యలు వేయండి :**

అ. ద్వైత వనంలో కష్టాలు పడుతున్న పాండవులకు మన వైభవం చూపించి వాళ్ల బాధ పడేలా చేయాలి [ ]

©KTBS Not to be republished

ఆ. చాలా సంతోషం. కాని ఈ పథకం విదురునికి తెలియకుండా నడిపించాలి [ ]

ఇ. అలాగైతే పని చూసుకొని జాగ్రత్తగా వెంటనే తిరిగిరండి [ ]

ఈ. క్రూర మృగాలను వేటాడి గోవులను కాపాడేందుకు దుర్యోధనుని పంపండి [ ]

ఉ. ద్వైతవనంలో ఆలమందలున్నాయి. వాటిని చూడటానికి వెళ్ళాలంటే ధృతరాష్ట్రుడు అనుమతిస్తాడు [ ]

ఎ. ఘోష యాత్ర గురించి నగరంలో చాటించండి [ ]

ఏ. అరణ్యంలో ఆలమందలపై పెద్ద పులులు పడుతున్నాయి [ ]

ఐ. దుర్యోధనుని అక్కడకు పంపితే పాండవులతో గొడవ పడతాడు [ ]

ఒ. సమంగా! మేము చెప్పినట్లు ధృతరాష్ట్రునితో చెప్పాలి సుమా! [ ]

ఓ. ఏ గొడవలూ జరగవు. పైగా వేటాడాలని ఆశ. దయచేసి అనుమతించండి [ ]

**17. కింది అక్షర సముదాయాల్ని అర్థవంతమైన పదాలుగా పేర్చండి :**

1. యాగమ్ము కౌకతుము    2. నాగతకేనుడు    3. ణిధ పరేంకేద్రడుతను
4. రుపుషహసింలు    5. తద్వైమునవ    6. డవపాంక్షతిపపా

**18. కింది పదాలను విడదీసి సంధిపేర్లను తెలియ జేయండి :**

వైభవోదారులు; ధారుణీశ్వరుడు: పాండవాగ్రణి: అభీష్టము: అభీష్టము సేకురు: చెచ్చెర అయ్యాంబికేయుడు ప్రతాపాఢ్యులు; ఎబ్భంగులన్; అప్పురుషసింహులు; కౌతుకాతిశయం.

**19. కింది వాటికి విగ్రహ వాక్యాలు, సమాసాల పేర్లను తెల్పండి :**

ఘోషయాత్ర; పాండు తనూజులు; పురుషసింహులు; కర్ణసౌబలులు; విక్రమోన్నతులు; గరిష్ఠాత్ములు.

**20. కింది పద్యపాదానికి గణ విభజన చేసి, యతి ప్రాసలు నిర్ణయించి. అది ఏ పద్యపాదమో గుర్తించండి :**

''తగు గోరక్ష యొనర్ప దుష్టమృగ విధ్వంసంబు నూహింపమే''

**21. విద్యార్థులకు సూచనలు :**

i. ప్రాచీన తెలుగు సాహిత్యం గురించి తెలుసుకోండి.

ii. ప్రసిద్ధమైన కొన్ని తెలుగు పద్యాలకు అర్థం చెప్పించుకొని, వాటిని కంఠస్థం చేయండి.

**22. ఉపాధ్యాయులకు సూచనలు :**

i. విద్యార్థుల్లో సాహిత్యం పట్ల ఆసక్తిని రేకెత్తించండి.

ii. పద్యాల్ని శ్రావ్యంగా చదివి, విద్యార్థుల హృదయాలకు హత్తుకొనేలా వాటి అర్థవివరణ చేయండి.

♣ ♣ ♣

© KTBS Not to be republished

# 1. మిత వ్యయం

-శ్రీ పి. వి. చలపతి రావు

['ధన మూలం ఇదమ్ జగత్ ' అన్నది ఆర్యోక్తి.

ఆర్థిక స్థితిగతులే జీవితంలోని అన్ని విధాలైన సుఖ దు:ఖాలకు కారణం. ఆదాయాన్ని మించి వ్యయం చేయటం ఎన్నో అనర్థాలకు దారి తీస్తుంది. లేని పోని ఆడంబరాలకు పోవటం అంతమంచిది కాదు. నిత్యం సుఖ శాంతులతో జీవించాలంటే, మితవ్యయాన్ని అలవరచుకోవాలి.

మితవ్యయం శ్రేయమనే సందేశాన్ని రచయిత ఇందులో ప్రతిపాదించారు.

దీని రచయిత శ్రీ. పి. వి. చలపతిరావుగారు. హైదరాబాదులోని బద్రుకా వాణిజ్య సాయం కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేసి నివృత్తి చెందారు. నిశిత పరిశీలనం, సులభశైలి, జాతీయమైన పలుకుబడి వీరి రచనలలో గోచరించే ప్రధాన లక్షణాలు.]

మానవుని యానందమునకు, అభ్యుదయమునకు, ముఖ్య కారణము మితవ్యయము. మితవ్యయమనగా, అత్యవసరమైనంత మాత్రమే వ్యయము చేయుట. అల్పవ్యయముతోనధిక ప్రయోజనము సాధింపగలవాడే నేర్పరి. ఏదేశమున వ్యక్తులు మితవ్యయము పాటింతురో, ఆ దేశము సర్వ సౌభాగ్యములతో దులదూగు చుండును.

స్వార్థపరులు, హాస్యదృష్టి గలవారు. మితవ్యయమును పాటింప జాలరు. నియమబద్ధమైన జీవితమును గడుపువానికి, మితవ్యయము, అప్రయత్నముగా సిద్ధించును. ఇంద్రియ నిగ్రహము, సంతృప్తి , సక్రమజీవన విధానమును ఎవ్వడలవఱచుకొనునో వాడే మితవ్యయము పాటింపగలడు.

మానవుని మనస్సు కోరికల పుట్ట. పుట్టిన కోరికలన్నింటిని దీర్చుట యెట్టివానికిని సాధ్యముకాదు, ఎన్నింటిని దీర్చినను, నెప్పటికప్పుడు క్రొత్తవి పుట్టుచునేయుండును. శక్తికి మించిన కోరికలను దలయెత్తనీయక, శక్తికి దగిన కోరికలను దగువిధమున దీర్చుకొనుట మానవుని కర్తవ్యము. తృప్తియొక్కటియేదీనికి ముఖ్యసాధనము. తన అభ్యుదయమును, తనజాతియభ్యుదయమును గాంక్షించు వ్యక్తి ముఖ్యముగా నెనిమిది విషయము లందు మితవ్యయమును పాటింపవలసియున్నది.

ధనము మొదటిది. " ధనమూలమిదంజగత్ " అనుసూక్తి మీరు వినియేయుందురు. ఈ లోకమున సర్వ సుఖదు:ఖములకు ధనమే మూలకారణము. అవసరములను, సుఖములను, భోగములను, అనుభవించుటకు ధనమే ప్రధాన సాధనము. ఆదాయమున కనుగుణముగా వ్యయమును సరిదిద్దు కొనువాడు వివేకి. ఆదాయమును మించి వ్యయము చేయువాడు ఋణ గ్రస్తుడై దు:ఖభాజనుడగును. కోరికలనదుపులోబెట్టుకొని, ఆదాయమున కంటె దక్కువ వ్యయము చేయువాడు క్రమముగా నైశ్వర్యవంతుడగును. కలిగిననాళ్ళ నిలువచేసినది కష్టకాలమునం దక్కరకు వచ్చును. తాత్కాలిక దృష్టితోగాక భావికాల దృష్టితో ఆదాయ వ్యయములను క్రమబద్ధములు చేసికొనువాడు జీవితమును ధైర్యముతో, విశ్వాసముతో నడుపు కొనగలడు.

©KTBS Not to be republished

ఆహారము రెండవది. ''శరీర మాద్యంఖలు ధర్మసాధనం'' అను నార్యోక్తి యెంతయు సత్యము. కర్మమును, ధర్మమును ఆచరించుటకు శరీరమేకదా ముఖ్య సాధనము. శరీరమును పోషించునది యాహారము, శరీరము. శరీరము యొక్క సక్రమపోషణమునకు ఎట్టి యాహారము, ఎంత యవసరమో, యెఱింగి, యట్టి యాహారమును అంత మాత్రమే భుజించుట మానవుని కర్తవ్యము. అమితాహారము అనారోగ్య హేతువు. ఆరోగ్యమే మహాభాగ్యమని వినియేయుందువు. శరీరమారోగ్యవంతమైనచో మనస్సుగూడ ఆరోగ్యవంతముగాయుండును. శారీరక మానసికారోగ్యములుగలమానవుడు సాధింప జాలని దేముండును. మితాహారి మేధావంతుడగుటకు సందియములేదు.

వస్త్రము మూడవది. శరీరాచ్ఛాదనము వస్త్రముల ప్రధాన ప్రయోజనము. వెలగల వస్త్రములకై వెంపరలాడుట వెఱ్ఱి తప్ప వేరేమియుగాదు. శుభ్రవస్త్రములు ధరించుట యారోగ్యహేతువు. శుభ్రత శ్రద్ధవలన వచ్చునదిగాని, ధనమువలన వచ్చునదిగాదు. వినోదముకొఱకో, విలాసముకొఱకో వెలగల వస్త్రములను మితిమీరి కొనువాడు, వివేకియని చెప్పజాలము. ఆడంబరముగావస్త్రములనుగాని, యాభరణములనుగాని ధరించుటయధిక వ్యయమునకు గారణమే గాని నిజమైన నాగరికతే కాదు. పరిశుభ్రతయే నాగరికత.

విశ్రాంతి నాల్గవది. శరీరమునకు, మనస్సునకు విశ్రాంతి మిక్కిలి యవసరము, శ్రమకుదగిన విశ్రాంతి లేనిచో శరీరముగాని, మనస్సుగాని చిరకాలము చుఱుకుగా బని చేయజాలవు, నిద్ర, వినోదము, విశ్రాంతిలో చేరును. మితముగా నిద్రించువాడు గాఢముగా నిద్రించును. గాఢ నిద్రయే శ్రమను బోగొట్టి సుఖము గలిగించును. మితి మీరిన నిద్ర దరిద్ర లక్షణము. నిద్రాకాలము నెంత తగ్గించిన నిద్రయంత గాఢముగా బట్టును. ఇందువల్ల దీర్ఘముగా చుఱుకుగా బని చేయుటకు వీలుగలుగును.

సమయమైదవది. అందఱకు సమానముగానున్నది. సమయము ఒకరికెక్కువ ఒకరికి తక్కువయనుమాట దీనిలోలేదు. భోగవిలాసములలో గొట్టుకొని పోవువాని కెంతసమయము నిచ్చినను జాలదు. సత్కార్యము లాచరింపదలచిన వానికిని సమయము చాలదు. ఉన్న సమయమును క్రమబద్ధముగా సద్వినియోగము చేయగలవాడే వివేకి. క్షణము వ్యర్థమైనచో మరల సంపాదింప జాలము. ధనములలో నెల్ల ఉత్తమధనము సమయము. ప్రతినిమిషమును సక్రమముగాసద్వినియోగము చేయువాడు సాధింపజాలనిది లేదు. ఆరోగ్యము, ఐశ్వర్యము, జ్ఞానము, ఆనందము-అన్నియు సమయము నుపయోగించుకొను నేర్పుపైనాధారపడి యున్నవి. విశ్రాంతికి, వినోదమునకు, విజ్ఞాన మునకు, ఆలోచనమునకు, గార్యాచరణమునకు సమయమును దగు విధమున మితముగావ్యయము చేయనేర్చినవాడు సర్వకార్యములను సాధింపగలడు. దినచర్యను, జీవిత చర్యను దూరదృష్టితో దిద్దుకొనుట మిక్కిలియవసరము.

శక్తియారవది. శక్తియనగ ఇది సోమరితనమునకు వ్యతిరేకమైనది. ఉత్సాహముగలవాడే శక్తిగలవాడు. అతడెట్టి కార్యమైనను సాధింపగలడు. సోమరియేదియు జేయజాలడు. ప్రతి మానవుండును శక్తిని సక్రమముగానుపయోగింప వలయును, సర్వాభ్యుదయములకును శక్తియే మూలము. సోమరియైనవాడు కాలముకంటే వెనుకబడియుండును. శక్తిమంతుడు కాలముతోపాటు నడచును. ఒక్కొక్కప్పుడు కాలముకంటే ముందుకూడనడచును, సోమరి యనుకూలసమయము కొఱకు వేచియుండును, శక్తిమంతుడు యనుకూల సమయమునుదనకనుకూలము గావించుకొనును.

©KTBS Not to be republished

శక్తిమంతుడు స్వతంత్రుడు. అతడు కాలమునకు, బరిస్థితులకు లోబడడు. తానేవానిని లోబఱచుకొని సర్వ కార్యాలను సాధించును.

భాషణమేడవది. వాక్కుమానవునకు భగవంతుడు ప్రసాదించిన వరములలో నత్యుత్తమ మైనది, మానవుని జంతువులనుండి వేఱుపఱచు లక్షణములలో భాష ముఖ్యమైనది. ఆలోచించుటకు, ఆలోచనలనితరులకు దెలియజేయుటకు పరమసాధనము. మనుష్యుని ప్రాణశక్తియే భాషగా మారుచున్నది. కనుక అతిభాషణముప్రాణ వ్యయ హేతువు. మితభాషి సర్వవిధముల మేలుగాంచును. మితము, హితము, సత్యము, ప్రియమునైన భాషణము మానవునకు సర్వ భూషణములకంటె, విలువగల భూషణము. మితభాషికి లభించు గౌరవము అతిభాషికి లభించదు, "కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా?'' యను వేమనసూక్తి మీరు వినియే యుందురు. మితభాషణము సజ్జన లక్షణము. వదరుబోతు నెవ్వరు లక్ష్యపెట్టరు. తులువను, పలువనునెవ్వరు మన్నింపరు. కనుక మితభాషణము సర్వదాశ్రేయోదాయకము.

భూషణ మెనిమిదవది. అలంకార ప్రీతి స్త్రీ, పురుషులకు సహజము. అయినను మితిమీరిన యలంకారములను ధరించినచో నొకప్పుడు ఉన్న అందము కూడ చెడిపోవును. జీవితమునకు భూషణము లనివార్యములైన యవసరములుకావు. అది కేవలము విలాస వస్తువులు. అట్టివానిని ఎంత మితముగా ధరించిన నంతమేలు. శీలమే నిజమైన భూషణము. అది కలవానికి అన్యభూషణముల గత్యములుకావు. అమితవ్యయమూలకములు, కృత్రిమములు నగు సువర్ణమణి భూషణముల యందలి యాసక్తిని తగ్గించుకొని సహజములైన సత్యదయా త్యాగాదులైన యాత్మభూషణములనభివృద్ధి చేసికొనుటయుచితము. చిత్తము వికృతమైయుండగా శరీరమునకెన్ని యలంకారములుతొడిగి యేమి ప్రయోజనము? కావున మానవులు కృత్రిమ సౌందర్య వ్యామోహము దగ్గించుకొని శీలసౌందర్యము నందాసక్తి పెంపొందించుకొనవలయును.

మితవ్యయము సర్వసద్గుణములలో శ్రేష్ఠమైనది. బాల్యమునుండియు నభ్యసింపదగినది. ముఖ్యముగా విద్యార్థులు పైన వివరించిన యంశములందు మితవ్యయము పాటింపవలెను. అట్లు పాటించిన నాడు వారు సర్వ సుఖములను, అభ్యుదయములను నిస్సందేహముగా పొందగలరు.

**1. అర్థాలు :**

అభ్యుదయము = అభివృద్ధి; ఇంద్రియనిగ్రహము = ఇంద్రియాలను స్వాధీన పరచుకోవడం; దు:ఖ భాజనుడు = దు:ఖాన్ని అనుభవించేవాడు (ద్వితీయా తత్పురుష సమాసం); ఆర్య + ఉక్తి = పెద్దలమాట; శరీర + ఆచ్ఛాదనము = దేహన్ని కప్పుకోవడం; పరమ సాధనము = మంచి సాధనము; కృత్రిమములు = కల్పితాలు.



©KTBS Not to be republished

**2. పర్యాయ పదాలు :**

ధనం : సొమ్ము, సంపద, లక్ష్మి, సిరి, ఐశ్వర్యం

కొరత : లోటు, లేమి, లోపం, తక్కువ, శేషం

భూషణం : అలంకారం, నగ, సొమ్ము, ఆభరణం

**3. ప్రకృతి - వికృతులు :**

ఆహారం - ఓగిరం

వ్యయం - వమ్ము

విజ్ఞానం - విన్నాణం

వస్త్రం - వసనం

**4. సందర్భాలు :**

'కంచు మ్రోగు నట్లు కనకంబు మ్రోగునా'?

" ధన మూల మిదం జగత్"

'శరీరమాద్యంఖలుధర్మసాధనమ్'.

**5. ప్రశ్నలు :**

1. పొదుపు అవసరమెలాంటిది ?
2. మితవ్యయాన్ని ఎలాంటి వ్యక్తి సాధింపగలడు ?
3. ఏ యే విషయాలలో మితవ్యయాన్ని పాటించాలి ?
4. మితాహారం వలన కలిగే లాభాలేమిటి ?
5. సమయాన్ని మితంగా ఎలావాడాలి ?
6. విశ్రాంతి ప్రయోజనాలను వివరించండి.
7. శక్తిని ఎలా పొదుపు చేయాలి ?
8. ఎలాంటి భూషణం నిజమైన భూషణం ?

©KTBS Not to be republished

**6. సంధులు :**

1. శ్రేయః + దాయకము - శ్రేయోదాయకము (విసర్గసంధి)
2. ఆహార + ఉత్పత్తి - ఆహారోత్పత్తి (గుణసంధి)
3. అతి + అవసరము - అత్యవసరము (యణాదేశసంధి)

**7. సమాసాలు :**

1. ఋణగ్రస్తుడు : ఋణంచేతపీడితుడు - తృతీయా తత్పురుష సమాసం
2. ఆదాయవ్యయములు : ఆదాయం, వ్యయం - ద్వంద్వసమాసం
3. జీవితచర్య : జీవితంలోనిచర్య - షష్ఠీ తత్పురుష సమాసం

**8. సొంతవాక్యాలలో ఉపయోగించండి :**

1. తులతూగు 2. తలయెత్తు 3. సరిదిద్దుకొను 4. కన్నెఱ్ఱయగు

**9. జతపరచండి :**

| | | |
|---|---|---|
| అ. అమితాహారం | ( ) | 1. దరిద్రలక్షణం |
| ఆ. మితిమీరిన నిద్ర | ( ) | 2. అనారోగ్యహేతువు |
| ఇ. పరిశుభ్రత | ( ) | 3. భూషణం |
| ఈ. శీలమేనిజమైన | ( ) | 4. నాగరికత |

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 2. కల్పనా చావ్లా

(జ్ఞానం అనేది అందరికీ అవసరం. జ్ఞానసముపార్జనకు లింగభేదం లేదని, కావలసిందల్లా ఆసక్తి, పట్టుదల, కృషి, అనేవి ఉంటే ఎంతటి అడ్డంకులనైనా అధిగమించవచ్చునని ఈ పాఠ్యాంశం తెలియజేస్తుంది. వార్తాపత్రికలు, అంతర్జాలం ఆధారంగా ఈ పాఠం రచింపబడినది.

ఆశలు, ఆశయాలు అందరికీ ఉంటాయి. ఆశలను గురించి ఎన్నో కలలు కంటూ, ఆశయసాధనకై అహర్నిశలూ శ్రమిస్తూ, అడ్డంకులను అధిగమిస్తూ కలలను సాకారం చేసుకోవడం మాత్రం కొందరికే సాధ్యం. కార్యసాధకులు నిపుణమతులై, ప్రజ్ఞానిధులై, ధైర్యోత్సాహాలతో తమ ఆశయసాధనకై కడదాక, తమ ప్రయత్నాలను వదలరు. ఆ కోవకు చెందిన మహిళామణియే కల్పనాచావ్లా. ఈ పాఠ్యాంశంలో ఆమె జీవిత విశేషాలు వివరించబడ్డాయి. ఇవి విద్యార్థులకు స్ఫూర్తిదాయకం.)

కల్పనా చావ్లా ఆకాశపు రహస్యాలను అవగతం చేసుకోవాలని గగనగామియై గ్రహాంతరయానం చేసి గ్రహాల గుట్టుమట్లు రట్టు చేయాలని, ఆకాశపుటంచులు తాకాలని పుట్టి బుద్ధెరిగిననాటినుండి కలలు కనింది. కాలంతోపాటు ఆమెలో కోరిక కూడా పెరిగి, పెద్దదై దృఢత్వాన్ని సంతరించుకొంది. చిన్ననాటి కల జీవిత లక్ష్యంగా మారింది. లక్ష్య సాధనయే జీవిత ధ్యేయమైంది. తారలను తాకాలని ఆమె తహ తహ.గ్రహాంతర యానం ఆమె తపన. తన ఆశయ సాధనకై జీవితకాలమంతా తపస్సు చేసిన తపస్విని కల్పనా చావ్లా.

కల్పనా చావ్లా 1961 జులై 1వ తేదీన హర్యానాలోని ముల్టాన్ జిల్లా కర్నాల్‌లో జన్మించింది. సంయోగిత, బనారసీలాల్ చావ్లాలు ఆమె తల్లి దండ్రులు. వీరింట జన్మించిన కడగొట్టు గారాలపట్టి కల్పన. ఆయింట ఆమె ముద్దు పేరు 'మోంటు'. పట్టుదల, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, కావలసినదాన్ని అది ఎంత కష్టసాధ్యమైనా సాధించడం ఆమెకు పుట్టుకతో వచ్చిన గుణాలు. అనుకున్నదాన్ని చేజిక్కించుకోవడంలో ఏ అడ్డంకినైనా, ఎవరి అభ్యంతరాలనైనా లెక్కించని దృఢచిత్త కల్పన. ఈ గుణాలే భవిష్యత్తులో ఆమె వ్యక్తిత్వాన్ని రూపుదిద్దాయి.

కుశాగ్రబుద్ధి కల కల్పన చిన్నప్పటినుండి కూడా స్వయం నిర్ణయాలకే ప్రాధాన్యం ఇచ్చేది. చిన్నతనంలో అల్లరిలోగాని, ఆటపాటలలోగాని మగపిల్లలకు ఏమాత్రం తీసిపోయేదికాదు. జుట్టు కత్తరించికోవడం, మగపిల్లలతో కలిసి క్రికెట్ ఆడటం వంటిది చేసి 'మగరాయుడు' అనిపించుకొంది. కల్పన యొక్క ఈ చేష్టలని కొట్టి వేయలేం. ఆమెలోని తార్కికశక్తి, ఆత్మవిశ్వాసం, విచక్షణాజ్ఞానం పట్టుదలలే భవిష్యత్తులో తన లక్ష్యం వైపు దూసుకుపోవడానికి తోడ్పడ్డాయి.

బనారసీలాల్‌ది సాధారణ మధ్యతరగతి కుటుంబం. బనారసీలాల్ కర్నాల్‌లోని టైర్ల ఫ్యాక్టరీలో సాధారణ ఉద్యోగి. అతని భార్య సామాన్య గృహిణి. వీరు పూర్వాచార పరాయణులే అయినా అర్థవిహీనమైన సంప్రదాయాల పేరిట కల్పన అభ్యున్నతికీ ఎన్నడూ అడ్డుపడలేదు.

బాల్యమాదిగా వినువీధి వీక్షణం పట్ల కల్పనకు కుతూహలం అధికం. ఆకాశం అన్నా నక్షత్రాలన్నా, వినువీధిలో విహరించే విమానాలన్నా మక్కువ ఎక్కువ. చిన్నతనంలో ఇంటి ముంగిట ఆకాశంలోని నక్షత్రాలను వీక్షించేది. వాటిని చేరుకోవాలని ఆశపడేది. ఏవియేషన్ ఫ్లయింగ్ క్లబ్‌కు సమీపాన్నే చావ్లా



©KTBS Not to be republished

కుటుంబం నివసించడంవల్ల విమానాలరాకపోకలను సునిశితంగా పరిశీలించేది. తన సోదరునితో కలిసి వెళ్ళి విమానకేంద్రాన్ని సందర్శించేది. ఎనిమిదవ తరగతిలోనే గ్లైడర్ ప్రయాణం చేసింది. 11వ తరగతిలో ప్రాజెక్ట్‌కు గాను కుజగ్రహాన్ని గురించి వ్యాసం రాసింది. పాఠశాలలో సందర్భం వచ్చినప్పుడెల్ల ఆకాశం, నక్షత్రాలు, విమానం, కొండలు, పర్వతాలు వాటికి సంబంధించిన చిత్రపటాలను, వివిధ ఆకృతులను తయారు చేసేది. ప్రప్రథమ భారతీయ విమానచోదకుడయిన జె. ఆర్. డి. టాటా కల్పనకు స్ఫూర్తిదాయకం. ఆయన పయనించిన విమానాన్ని తొలిసారిగా చూచినపుడు ఆమె భావోద్వేగం వర్ణనాతీతం.

కల్పన పాఠశాలావిద్యాభ్యాసం కర్నాల్‌లోని ఠాగూర్ విద్యానికేతన్ పబ్లిక్ స్కూల్లో జరిగింది. పిమ్మట, పి. యు. సి. విద్యాభ్యాసం కూడా కర్నాల్‌లోనే 'దయాసింగ్' కాలేజీలో కొనసాగింది. తదనంతరం పై చదువులకై చండీఘడ్‌కు వెళ్ళాలని నిర్ణయించుకొన్నది. ఆడపిల్ల చదువు కోసం ఉన్న ఊరిని వదిలి ఒంటరిగా 80 కి. మీ. దూరంలో ఉన్న ఊరికి వెళ్తాననడం ఆమె బంధువర్గానికి విడ్డూరం అనిపించింది. వారు ఎన్నో విధాల అభ్యంతరాల్ని లేవనేత్తారు. కాని వారికి కల్పన కొరకరాని కొయ్య అయ్యింది. కల్పన చండీఘడ్‌లోని పంజాబ్ ఇంజనీరింగ్ కాలేజీలో తనకు అభిమాన పాత్రమైన ఏరోనాటికల్ ఇంజనీరింగ్ విభాగంలో చేరింది. కల్పన సంకల్ప బలానికి కఠినమైన పరీక్ష ఇక్కడ ఎదురైంది. ఆ పరీక్ష మరి ఎవరినుండో కాదు సాక్షాత్తు ఆమె కాలేజీలో ఎంచుకున్న విషయ విభాగపు అధ్యాపక వర్గంనుండియే.

చండీఘడ్‌లోని పంజాబ్ ఇంజనీరింగ్ కాలేజీలో ఆనాడు మొత్తం విద్యార్థినులు కల్పనతో చేరి ఏడుగురు మాత్రమే. అందులో ఈమె ఏరోనాటికల్ విభాగంలో ఒకే ఒక్క విద్యార్థిని. ఈ కారణంగా ఆ విషయపు విభాగాధిపతి ఆమెను ఎలెక్ట్రికల్ లేదా మెకానికల్ విభాగాలకు మార్చాలని ప్రయత్నించాడు. కేవలం ఈ కారణంగా తన జీవితలక్ష్యానికి నీళ్ళొదులుకోవడానికి కల్పన ఒప్పుకోగలదా? ఆమె తార్కిక జ్ఞానం అందుకు అంగీకరిస్తుందా? అధ్యాపకుని సూచనకు కల్పన ససేమిరా అంగీకరించలేదు. చివరకు అధ్యాపకుడే తన ప్రయత్నాన్ని మానుకోవల్సివచ్చింది. తరగతిలో ఉన్నది ఒక్క ఆడపిల్లే అయినా చదువులో విద్యా విషయక సంబంధ సదస్సులు, గోష్ఠులు, చర్చాసభల నిర్వహణ అదీ, ఇదీ, అననేల అన్నింటా తనదే ముందంజ. విద్యాభ్యాస విషయంలో కల్పన జిజ్ఞాస, ఉత్సాహం, పట్టుదల చురుకుదనం, సాటి విద్యార్థులనే కాక అధ్యాపకులను సైతం అబ్బురపరిచేది.

1982 లో ఇంజనీరింగ్ విద్యాభ్యాసం పూర్తయిన పిమ్మట ఉన్నత విద్యార్జనకై అమెరికా వెళ్ళారు. 1984లో అర్లింగ్‌టన్‌లోని టెక్సాస్ విశ్వవిద్యాలయంనుండి ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో ఎం. ఎస్ డిగ్రీని, 1986లో రెండవ ఎం. ఎస్. డిగ్రీని, 1988లో బౌల్డర్‌లోని కొలొరాడో విశ్వవిద్యాలయంనుండి పి. హెచ్. డి. డిగ్రీని పొందారు.

అమెరికాలో స్థానిక ఫ్లయింగ్ క్లబ్‌లో ఉపాధ్యాయుడైన జీన్ పెర్రీ హ్యారిసన్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం క్రమేణా 1984లో పరిణయానికి దారి తీసింది. వివాహంతోపాటు అమెరికా పౌరసత్వాన్ని పొందారు కల్పన. భర్తప్రోత్సాహం ఆమెకు మరింత ఉత్సాహకారకమైంది. అనేక రకాల విమానాలపై కంప్యూటర్ మోడలింగ్ చేశారు. విమాన యానానికి, గ్లైడర్ల ప్రయాణానికి, ఏక, అనేక, ఇంజన్లతో కూడిన వాణిజ్య విమాన ప్రయాణాలకై అవసరమైన అనేక లైసెన్స్‌లను పొందారు. ఏరోబేటిక్స్ నేర్చుకొని గ్లైడర్ల మీద, విమానాలలోను తిరిగారు. కల్పనా దంపతులు పాతకారుకు ఏరోటర్బన్

©KTBS Not to be republished

ఇంజన్‌ను బిగించి కొలెరాడొ ప్రాంత పరిసరాల్లోని కొండలపై విహరించేవారు. 1988లో పిహెచ్. డి పట్టాన్ని పొందిన 5 సంవత్సరాల తర్వాత ఎమ్‌కాన్‌టి ఇన్‌స్టిట్యూట్‌లోని నేషనల్ ఎయిరోస్పేస్ అండ్ రీసర్చ్ సెంటర్లో రీసర్చ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. అందులో విమానాల డిజైన్లను తయారు చేసి స్థిరమైన ద్రవపద్ధారాలతో అతి తక్కువ స్థితిలో ఏవిధంగా ఉంటాయో చూపించే బృందానికి నాయకురాలిగా ఉండేవారు.

1995లో కల్పనా చావ్లా 'నాసా' (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్)లో ఆస్ట్రోనాట్ కోర్‌గా చేరింది. అంతరిక్షయాత్రికులకై 'నాసా' ఇచ్చే శిక్షణకోసం 2,962 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 23మంది మాత్రమే ఎన్నికయ్యారు. వారిలో కల్పన ఒకరు. నాసావారు అంతరిక్ష యాత్రికులకు ఇచ్చే అన్ని శిక్షణలలో కల్పన పాల్గొన్నారు. వారు నిర్వహించిన అన్ని పరీక్షలలో ఉత్తీర్ణురాలయ్యారు. 1995 మార్చి నుండి 14నెలల పాటు అవసరమయిన శిక్షణ పొందారు. వీటిలో రోదసికి ఎగరడం స్పేస్‌షటిల్ నిర్వహణలో మరమ్మత్తులు చేయడం, శూన్య ప్రదేశంలో, కృత్రిమ పద్ధతుల్లో, క్లిష్టసమయాలలో ఉండేవిధానం, అత్యవసర సమయాల్లో చేసే వ్యాయామం, సముద్రాలు, పర్వతాలు, అరణ్యాలలో అన్నపానీయాలు లేక తట్టుకోగలిగే వ్యాయామాలు ఎంతో ముఖ్యమైనవి. స్పేస్‌మిషన్ని బట్టి రోదసిలోకి వెళ్ళేందుకు కొంతమందికే అవకాశం ఉంటుంది. నాసాలో శిక్షకులు నిరంతర శాస్త్రపరిశోధనలలో మునిగి తేలుతుంటారు. అంతరిక్షంలోనే కాక పరిశ్రమల్లో, పరిశోధనాలయాల్లో పాఠశాల, కళాశాలల్లో కూడా ఈ పరిశోధనలు ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో తప్ప అంతరిక్షయాత్రికునికి స్వయంనిర్ణయాలు తీసుకునే అధికారం లేదు.

రోదసీయాత్ర చేసిన మొట్టమొదటి భారతీయుడు రాకేష్‌శర్మ. ఇతడు 1984లో మొదటి సారిగా సోవియట్ రష్యాదేశం తరపున రోదసీ యాత్ర గావించారు. భారతదేశంలో జన్మించిన కల్పనా చావ్లా రోదసీయాత్ర చేసిన ఆసియా మహిళగా పేరుగాంచారు.

1996 డిశంబర్ 7న కల్పన షటిల్ మిషన్‌కు ఎంపిక అయ్యారు. దానిని STS- 87 అని, కొలంబియా అని కూడా పిలుస్తారు. ఇది 1997 నవంబర్‌లో ప్రయాణానికి సిద్ధమైంది. కల్పన మిషన్ స్పెషలిస్ట్‌గా, ప్రైమ్ రొబోటిక్ ఆరమ్ ఆపరేటర్‌గా అందులో పని చేసేవారు. కల్పన మొదటి ఇండో అమెరికా అంతరిక్ష యాత్రికురాలిగా స్థానం పొందారు. 1997 నవంబర్ 19న 7గంటలకు కొలంబియా, ఇండియా ఉపఖండాన్నిదాటింది. ఈ ప్రయాణంలో ఆమె 252 భూకక్ష్యలలో 6. 5 మిలియన్ మైళ్ళు పయనించారు. ఈ పయనంలో మొత్తం 376 గం 34ని ల సమయం రోదసిలో గడిపారు.

ఈ తొలి అంతరిక్షయానంలో ఆమె భూమిని వివిధ కోణాల్లో ఫోటోలు తీసారు. అందులోని సూక్ష్మాతి సూక్ష్మాంశాలను కూడా సుస్పష్టంగా వివరించారు. 1997 డిశంబర్ 3న అప్పటి భారత ప్రధాని ఐ. కె. గుజ్రాల్‌తో మాట్లాడారు. తన సహచరులతో కలిసి ఆనాటి అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్‌తో వీడియోకాన్ఫరెన్స్ జరిపారు. బ్లూ బాక్స్‌లతో జీరోగ్రావిటీ మీద శూన్యప్రదేశంలోను, వివిధ అంశాలపై ప్రయోగాలు చేశారు. బలమైన రెండు లోహాలను కలిపితే ఎలా ఉంటుందనే విషయం పై కూడా ప్రయోగాలు చేశారు. స్పేస్‌షటిల్‌తో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ను నియంత్రించి, షటిల్ మార్గాన్ని నిర్దేశించారు. శాటిలైట్ నుండి మరమనిషి చేతిలో సూర్యుని పరిశోధించేవారు. అద్భుతమైన ఈ యాత్రాఫలితాలే ఆమె రెండవ స్పేస్‌మిషన్‌కు ఎంపిక కావడానికి తోడ్పడ్డాయి. 1997 డిశంబర్ 5వ

©KTBS Not to be republished

తేదీన ఈ షటిల్ తిరిగి భూమి పైకి వచ్చేందుకు సిద్ధమైంది. కల్పన తొలి ప్రయత్నం విజయవంతం కావడంతో ఆమె పుట్టిన, మెట్టిన భారత, అమెరికా దేశాలలో సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ విజయం కల్పనకు ఆనందంతోపాటు బాధ్యతల్ని పెంచింది. భూమి ఎంతో విలువైన ఉపగ్రహం అని దానిని రక్షించుకోవల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని ఆమె విద్యార్థులకు తెలిపేవారు.

రెండవ రోదసీ యాత్రకు సంసిద్ధతలు జరుగుతున్నాయి. సాధారణంగా నాసా శాస్త్రవేత్తలు రోదసీ యాత్ర తర్వాత భూమిపైకి వచ్చిన పిమ్మట వివిధ సంస్థలలో పని చేస్తారు. కొందరు ఆ రంగం నుండి నిష్క్రమిస్తారు. అతికొద్దిమంది మాత్రమే మళ్ళీ రోదసిలోకి వెళ్ళాలనుకొంటారు. కల్పన ఈ కోవకు చెందినది. చిన్నప్పట్నుండి గగనానికి ఎగరాలని, గ్రహాంతర పరిశోధనలు గావించాలని కలలుగన్న కల్పన, అందుకై అహర్నిశలు శ్రమించిన కల్పన, అందునా మొదటి రోదసీయాత్రలో సాధించిన విజయోత్సాహాలతో రెండవ యాత్రకు సిద్ధమయ్యారు. స్పేస్‌షటిల్ ఎస్. టి. ఎస్- 107 మిషన్‌కు ఎంపిక అయ్యారు. 2002 జనవరి 16వ ప్రారంభమైన రెండవ ప్రయాణం 15రోజులు సాగింది. ఇందులో సాగిన 80 ప్రయోగాలలో కల్పన 12 ప్రయోగాలు నిర్వహించారు. ఈ యాత్రలో కల్పనతో కలిపి ఏడు మంది ప్రయాణికులు ఉన్నారు.

ప్రాణులు ఆకాశంలో ప్రవర్తించే తీరు, కొవ్వొత్తి పై రసాయనిక ప్రతి చర్యలు మొదలయిన పరిశోధనలు కల్పన అంతరిక్షంలో చేసినవాటిలో పేర్కొనదగినవి. ఆమె చేసిన పరిశోధనలు విమానాలు, పరిశ్రమలు ఇంజన్‌లకు ఎంతో శక్తిని ఇచ్చింది. స్పేస్‌లో నిప్పును ఏ విధంగా నియంత్రించవచ్చోచూపారు. ఈ పునాదులవల్ల భవనాలు వరదలకు, తుఫానులకు తట్టుకుంటాయి. కల్పన తను చేపట్టిన అన్ని ప్రయోగాలను విజయవంతంగా పూర్తిగావించారు. ఆ ప్రయోగాల పట్టిక ఎంతో సురక్షితంగా, మిషన్ కంట్రోల్‌కు చేర్చబడి విశ్లేషించబడింది.

అది 2003 ఫిబ్రవరి 1వ తేదీ కొలంబియా (ఎస్. టి. ఎస్-107) భూమిపై దిగేందుకు కేవలం 16 నిమిషాలు మాత్రమే ఉంది. కాస్సేపట్లో టెక్సాస్ మీదుగా ఫ్లోరిడాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం చేరుకోవాల్సిన కొలంబియా ఆకాశంలోనే ముక్కలు ముక్కలైంది. ఇంకాస్సేపటిలో భూతలంపై అడుగు పెట్టే ఆ అంతరిక్షయాత్రికుల కోసం ఏర్పాటు చేయబడిన సన్మాన వేదిక సంతాప వేదికగా మారింది.

వృత్తిరీత్యా కల్పన యంత్రాలతో, మరమనుషులతో వ్యవహరించినప్పటికీ స్వభావరీత్యా గొప్ప భావుకురాలు. సంగీత, సాహిత్యాభిమాని. పద్యరచన ఆమె ప్రవృత్తి. రోదసీయాత్రలో కూడా నిత్యం తనవెంట నజరత్ ఆలీఖాన్, హరిప్రసాద్ చౌరసియా, రవిశంకర్ మొదలైన సంగీత విద్వాంసుల ధ్వని ముద్రికలను (సీ.డీ.లను) తీసుకువెళ్ళేవారు. చిన్నతనంలోనే, మార్షల్ ఆర్ట్స్‌లో కూడా శిక్షణ పొందారు. కరాటేలో బ్లాక్‌బెల్ట్ పొందారు. ఆమె ఆధ్యాత్మిక చింతన కలవారు కూడా. హోస్టన్‌లోని హిందూ దేవాలయ పాలనా బాధ్యతలను నిర్వర్తించారు.

ఆమె దృక్పథం వినీలాకాశమంత విశాలమైంది. కర్నాల్‌లో పుట్టి ఖండాంతరాలు దాటి ఆకాశపుటంచులు తాకినా పుట్టిన ఊరిని, ఓ, న, మా, లు దిద్దిన బడిని, దిద్దించిన ఉపాధ్యాయులను, కల్పన విస్మరించ లేదు. తన సాధనను భావితరాలవారు, మరింత ముందుకు తీసుకెళ్ళాలని,

©KTBS Not to be republished

కొంగ్రొత్త విషయాలు కనిపెట్టాలని, నూతనరీతులు, మార్గాలు ఆవిష్కరించాలని, ఆమె కోరిక. అంతరిక్ష పరిశోధనలో మహిళలు కూడా భాగస్వామినులు కావాలనేది ఆమె ఆకాంక్ష. అందుకై ఆమె ఎన్నో మార్గాలలో ప్రయత్నించారు తను చదివిన పాఠశాల నుండి ప్రతియేటా ఇద్దరు విద్యార్థులకు 'నాసా'ను సందర్శించే అవకాశం కల్పించారు. అమెరికాలో వారికి అవసరమైన సదుపాయాలను సమకూర్చేవారు. భావిభారత పౌరులయిన విద్యార్థులను ముఖ్యంగా విద్యార్థినులను, ప్రయోగాత్మక విద్యార్జనకు, ఎస్. ఎం. ఎస్‌ల (షార్ట్ మెసేజ్ సర్వీసస్) ద్వారా ప్రోత్సహించేవారు.

కర్తవ్య నిర్వహణలో అసువులు బాసిన ఆమె స్మృత్యర్థం ఇంటర్నేషనల్ స్పేస్ యూనివర్సిటీ (ఐ. ఎస్. యు) ఆమె పేరిట ఉపకారవేతనాన్ని ఏర్పాటు చేశారు. హర్యానా ప్రభుత్వంవారు ఆమె పేరుతో వైద్యకళాశాలను స్థాపించారు. మన దేశంలో స్థాపింపబడిన 'మెటియరోలాజికల్ సిరీస్'కు ఆమె పేరు పెట్టారు. కర్ణాటక ప్రభుత్వం యువ మహిళా శాస్త్రవేత్తలకు ఆమె పేరుతో బహుమతిని ఏర్పాటు చేసింది. చండీఘర్‌లో ఆమె చదివిన పంజాబ్ ఇంజినీరింగ్ కాలేజీ ఏరోనాటికల్ విభాగంలోని ఉత్తమ విద్యార్థికి కల్పన పేరిట ప్రతియేటా బహుమతి ప్రదానం చేస్తోంది. టెక్సాస్, ఫ్లొరిడా, మొదలయిన దేశాలలో ఆమె జ్ఞాపకార్థం ఎన్నో కట్టడాలు వెలిశాయి.

జ్ఞానార్జన ప్రతి ఒక్కరి హక్కని, ఏదీ దానికి అడ్డు కాదని, కాకూడదని, దానికి కావల్సిందల్లా పట్టుదల, సంకల్పం, కృషి అని తన జీవితంద్వారా నిరూపించిన కల్పనా చావ్లా అందరికి, అందులోను ఆడపిల్లలకు వినువీధిలో వేగుచుక్కై వెలుగుతున్నారు.

**1. కఠిన పదాలు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆశయం | ధ్యేయం | ఆత్మబలం | మనోస్థైర్యం | మక్కువ | స్ఫూర్తి |
| గ్లైడర్లు | నిక్షిప్తం | రోదసీ | అంతరిక్షం | బృహత్‌ప్రయత్నం | దిగంతాలు |
| విస్మరించు | గగనవీధి | వేగుచుక్క | పూర్వాచార పరాయణులు | | |
| గ్రహాంతరయానం | | | | | |

**2. అర్థాలు :**

మక్కువ=ఇష్టం ; ఆవరణ= ఇంటి బయట; వైమానికచోదకుడు=విమానాన్ని నడిపేవాడు; అధిగమించు= దాటు; వెనుకంజ=వెనుక అడుగు; అభిరుచి=ఇష్టం; పరిసరాలు=చుట్టుపక్కలు; బృందం= ఇష్టం; నిక్షిప్తం= దాచి పెట్టబడిన / ఉంచబడిన; దిగంతాలు=దిక్కులకొనలు; పురోగతి=అభివృద్ధి; స్మృత్యర్థం=జ్ఞాపకంకోసం; అశేష=అంతంలేని/ మిక్కిలి.

©KTBS Not to be republished

**3. వ్యతిరేక పదాలు :**

| | | |
|---|---|---|
| ఆశ | × | నిరాశ |
| అంతం | × | ఆది |
| ధైర్యం | × | అధైర్యం |
| ఉత్సాహం | × | నిరుత్సాహం |
| వెనుకంజ | × | ముందంజ |
| ఆటంకం | × | నిరాటంకం |
| ఆకారం | × | నిరాకారం |
| ఆచారం | × | అనాచారం |
| విఫలం | × | సఫలం |
| ఏకం | × | అనేకం |
| స్థిరం | × | అస్థిరం |
| తక్కువ | × | ఎక్కువ |
| ఉపయోగం | × | నిరుపయోగం |
| అవసరం | × | అనవసరం |
| అధికారం | × | అనధికారం |
| ఆనందం | × | విషాదం |
| విజయం | × | అపజయం |
| స్మృతి | × | విస్మృతి |
| సాధారణం | × | అసాధారణం |

**4. ప్రకృతి - వికృతులు :**

| | | |
|---|---|---|
| ఆశ్చర్యం | - | అచ్చెరువు |
| ప్రజ్ఞ | - | పెగ్గె |
| సంతోషం | - | సంతసం |
| శక్తి | - | సత్తి |
| సముద్రం | - | సంద్రం. |

©KTBS Not to be republished

**5. పర్యాయపదాలు :**

పర్వతం : అద్రి; మహీధరం; గోత్రం; గిరి;

పరిణయం : పెండ్లి; వివాహం; ఉద్వాహం;

సముద్రం : అబ్ధి; పారావారం; ఉదధి; కడలి;

**6. ఈ కింది పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించండి :**

తహతహలాడు కలకలం రేపు దిగంతాలు అభిరుచి
గ్రహాంతరయానం గుట్టుమట్లు గారాలపట్టి

**7. సందర్భ సహిత వ్యాఖ్యలు రాయండి :**

1. పుట్టి బుద్దెరిగిన నాటినుండి కలలు కనింది.
2. జీవిత కాలమంతా తపస్సు చేసిన తపస్విని.
3. ఈ గుణాలే భవిష్యత్తులో ఆమె వ్యక్తిత్వాన్ని రూపుదిద్దాయి.
4. ఆమె భావోద్వేగం వర్ణనాతీతం.
5. సన్మాన వేదిక సంతాప వేదికగా మారింది.

**8. ఖాళీలను పూరించండి :**

1. కల్పనా చావ్లా ముద్దు పేరు ______________
2. కల్పన తల్లిదండ్రులు ఆమె అభ్యున్నతికి ______________
3. ఆకాశం అన్నా, విమానాలన్నా కల్పనకు మక్కువ______________
4. జె. ఆర్. డి. టాటా కల్పనకు______________
5. కల్పన చదివింది ______________పబ్లిక్ స్కూల్.
6. విమాన ప్రయాణాలకై అనేక లైసెన్స్‌లను ______________
7. కల్పన మొదటి రోదసీయాత్రలో రోదసి గడిపిన సమయం ______________
8. కల్పన శాటిలైట్ నుండి మరమనిషి చేతితో సూర్యుని ______________
9. భూమి ఎంతో విలువైన ______________
10. సన్మాన వేదిక సంతాప వేదికగా ______________

©KTBS Not to be republished

**9. క్రింది విషయాల తప్పు/ఒప్పులను గుర్తించండి :**

1. కల్పనా చావ్లా ఆడపిల్ల అన్న కారణంగా ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కోర్స్ చదవలేకపోయింది.
2. కల్పన అమెరికా పౌరసత్వాన్ని స్వీకరించింది.
3. కల్పన మెకానికల్ ఇంజనీరింగ్ పట్ట భద్రురాలు.
4. కల్పన కరాటే విద్యను అభ్యసించింది.
5. కల్పనకు సంగీత సాహిత్యాలపట్ల అభిరుచి లేదు.

**10. కింది సంఘటనలను క్రమ పద్ధతిలో అమర్చండి :**

1. కల్పనా చావ్లా వివాహం 1984లో జరిగింది.
2. కొలొరాడొ యూనివర్సిటీ నుండి పిహెచ్. డి. డిగ్రీ పొందారు.
3. కల్పన అమెరికాలో రెండు ఎం. ఎస్ డిగ్రీలను పొందారు.
4. తాగూర్, విద్యాని కేతన్ పబ్లిక్ స్కూల్లో ప్రాథమిక విద్యాభ్యాసం జరిగింది.
5. చండీఘడ్‌లోని పంజాబ్ ఇంజనీరింగ్ కాలేజీలో చదివింది.
6. కల్పన హర్యానా జిల్లాలోని కర్నాల్‌లో జన్మించింది.

**11. జత పర్చండి :**

| | |
|---|---|
| 1961 | అస్ట్రొనాట్ కోర్‌గా ఎంపిక |
| 1988 | రెండవ రోదసీయాత్ర |
| 1984 | పిహెచ్. డి పట్టం |
| 1995 | మరణం |
| 1997 | పుట్టుక |
| 2003 | మొదటి రోదసీ యాత్ర. |

**12. ఈ కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి ఏ సమాసాలో తెలపండి :**

తక్కువ స్థితి
అన్నపానీయాలు
రెండు రోదసీ నౌకలు
ద్రవ పదార్థాలు
తల్లిదండ్రులు
క్లిష్ట సమయం
పన్నెండు ప్రయోగాలు.
భూమ్యాకాశాలు.

©KTBS Not to be republished

**13.** క్రింది వాక్యాలను గమనించండి :

a. కల్పనా చావ్లా బుద్ధిమంతురాలు

b. కల్పన వెళ్లింది.

c. అటు చూడు.

వీటిలో మొదటి వాక్యం క్రియాపదం లోపించింది. రెండో వాక్యంలో కర్మపదం లోపించింది. మూడోవాక్యంలో కర్తను సూచించే పదం లోపించింది. ఇలాంటి వాక్యాలను మరి కొన్నిటిని మీరు సొంతంగా రాయడానికి ప్రయత్నించండి.

**14.** వివరణలు :

1. ఏర్ క్రాఫ్ట్ :- గాలి (ఆకాశం)లో ఎగరడానికి అనువైనయంత్రం.
2. ఏరోనాటిక్స్ :- గాలి (ఆకాశం)లో పయనించడానికి సంబంధించిన చదువు.
3. ఏరోబెటిక్స్ :- ఆకాశంలో ప్రయాణించే యంత్రాలలో చేసే నైపుణ్యకరమైన, ఉద్రేక పూరితమైన వినోదాలు.
4. శాటిలైట్ :- సమాచార సేకరణకై, భూకక్ష్యలలోను, ఇతర గ్రహకక్ష్యలలోను ఉంచే కృత్రిమ సాధనం.
5. నాసా :- నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్.
6. ఎస్. ఎం. ఎస్:- సంక్షిప్త సందేశ సేవలు. (షార్ట్ మెసేజ్ సర్వీసెస్)

**15.** ఈ కింది ప్రశ్నలకు ఒకటి/రెండు వాక్యాలలో జవాబులు రాయండి :

1. కల్పన జన్మస్థలం ఏది?
2. కల్పన తల్లి తండ్రులెవరు?
3. మొట్ట మొదటి భారతీయ విమాన చోదకుడెవరు?
4. మొదటి భారతీయ రోదసీ యాత్రికుడెవరు? అతడు ఏ దేశం తరపున రోదసీయాత్ర చేశాడు?
5. కల్పన అమెరికాలో ఏయే విశ్వవిద్యాలయాలలో చదివింది?
6. కల్పన చావ్లా ఎక్కడ, ఏ సంస్థలో అంతరిక్షయాత్రకు శిక్షణ పొందింది?

©KTBS Not to be republished

**16. ఈ కింది ప్రశ్నలకు వివరంగా జవాబులు రాయండి :**

1. కల్పనా చావ్లా బాల్యాన్ని గురించి రాయండి.
2. చండీఘడ్‌లో కల్పన విద్యాభ్యాసాన్ని వివరించండి.
3. అమెరికాలో కల్పన విద్యాభ్యాసాన్ని గురించి రాయండి.
4. కల్పన వివాహ జీవితాన్ని గురించి తెలపండి.
5. 'నాసా'లో కల్పన శిక్షణను గురించిరాయండి.
6. కల్పన మొదటిరోదసీ యాత్రను వివరించండి.
7. కల్పన రెండవ రోదసీ యాత్రను గురించి వివరించండి.
8. కల్పన తరువాతి (భావి) తరాలను ఎలా ప్రోత్సహించింది?
9. కర్తవ్యనిర్వహణలో ప్రాణత్యాగం చేసిన కల్పనను దేశవిదేశాలు ఏవిధంగా గౌరవించాయి?

**17. విద్యార్థులకు సూచనలు :**

1. ఉపాధ్యాయులను, పెద్దలను అడిగి అంతరిక్షయాత్రికులను గురించి తెలుసుకోండి.
2. అంతరిక్ష కేంద్రాలను దర్శించండి.

**18. ఉపాధ్యాయులకు సూచనలు :**

1. విజ్ఞానయాత్రలోభాగంగా విద్యార్థులను అంతరిక్షకేంద్రాలకు తీసుకువెళ్ళండి.
2. నక్షత్రశాల(ప్లానెటోరియం) లకు తీసుకువెళ్ళి గ్రహాల తారలను, గ్రహాలను గురించి వివరించండి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 3. స్వయం ఉపాధి

[ దేశ జనాభా పెరిగి పోతుండటం, రోజు రోజుకు నిరుద్యోగ సమస్య జటిలమై, సంఘ విద్రోహ చర్యలకు దారి తీస్తున్న ఈ తరుణంలో యువతకు కర్తవ్యోపదేశంగా ఈ వ్యాసం రూపుదిద్దుకొంది. నేటి విద్యార్థులు ఈదిశగా ఆలోచించి తమ భావి జీవిత గమనాన్ని సుగమం చేసుకోవటానికి ఈ పాఠం కొంతైనా దోహద పడుతుంది. ]

ఈ నాడు మనదేశంలో ఎంతో మంది నిరుద్యోగ యువతీ యువకులున్నారు. వీళ్ళంతా ప్రతినిత్యం కార్యాలయాలచుట్టూ, ఉద్యోగ వినిమయ కేంద్రాల చుట్టూ, లేదా స్నేహితులు, బంధువుల గడపలెక్కి, కాళ్లరిగేలా ఉద్యోగాన్వేషణ చేస్తున్నారు. చివరకు తమ అర్హతకు తగ్గట్టుగాకున్నా, ఎలాంటిదో ఒకపాటి చిన్న ఉద్యోగమైనాసరే, లభిస్తే అదే పదివేలనుకొని సర్దుకుపోతున్నారు.

ఈ నాడు 2500 కోట్ల విలువైన కంపెనీకి యజమాని అయిన నిర్మాపటేల్, ఒకప్పుడు ఒక రసాయనిక శాస్త్ర వేత్త దగ్గర పనిచేసేవాడు.

అలాగే ధీరూ బాయి అంబానీ, ఎడెన్ నగరంలోని ఒక ఫ్రెంచ్ కంపెనీలో చిన్న గుమాస్తాగా జీవితం ప్రారంభించాడు. అతడు వ్యాపారస్థుల ఇంట్లోపుట్టలేదు. ఎమ్. బి. ఎ. లాంటి చదువు కూడ లేదు. అయితేనేమి? నేడు ఆయన పేరు ప్రతియింట్లోవాళ్లకు తెలుసు, అతను ఆసియాలోనే అతిగొప్ప ధనవంతులలో ఒకడని. ఇట్లే చెప్పుకుంటూ పోతే, ఇనుప కర్మాగారాధినేత అయిన లక్ష్మీ మిత్తల్, హాట్‌మేల్ (E Mail) అధినేత సత్ బీర్ భాటియా, ఇన్‌ఫోసిస్ అధినేత నారాయణ మూర్తి- ఇలా ఎందరో ఉన్నత శిఖరాల నధిరోహించినవారు మనకళ్ళ ముందు కనబడతారు. వీళ్లంతా స్వయం కృషితో స్వయం ఉపాధి కల్పనతో అంచెలంచెలుగా ఎదిగిన వారే!

చాలామంది చాలావరకు ఏదైనా ఉద్యోగాన్నే చూసుకోవాలనుకొంటారు. అలాంటివారు ఇతరులకోసం పని చేయాల్సివుంటుంది. ఒకే విధమైన పని గానుగ ఎద్దులాగా, గతిఉన్నా ప్రగతిలేనట్లు సాగిపోతూ ఉండాలి. అందుకు నెలనెలా కచ్చితమైన జీతం అందుతుంటుంది. పైవాళ్ల సూచనల మేరకు, తన ఆలోచనలతో పనిలేకుండా, ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా. ఉద్యోగ జీవితం గడచి పోతుంటుంది. ఈ ఉద్యోగాలు ప్రైవేట్ రంగంలోనివి కాని, పబ్లిక్ రంగంలోనివి కాని, లేదా ప్రభుత్వరంగం లోనివి కాని కావచ్చు. వాటిల్లో పనిచేసే ఉద్యోగులందరికీ 'సంఘాలు' (యూనియన్స్) ఉంటాయి. ఉద్యోగ భద్రత, ఫించనులు వగైరా సౌకర్యాలుంటాయి.

కాని స్వయంఉపాధి వాటికంటె భిన్నమైనది. ఎంతో కష్టనష్టాలతో కూడుకొని ఉంటుంది. ఉద్యోగానికి స్వయం ఉపాధికి మధ్యగల తేడాలు ఈ విధంగా ఉంటాయి.

©KTBS Not to be republished

| ఉద్యోగం | స్వయం ఉపాధి |
|---|---|
| 1. ఇతరుల కోసం పని చేయాలి | 1. తనకోసమే. తానే యజమాని. |
| 2. పైవారి సూచనలు పాటించాలి | 2. తానే ప్రణాళికను తయారు చేసుకోవాలి. |
| 3. ఒకే విధమైన పని | 3. కొత్త కొత్త రీతుల్లో మార్పు చేసుకోవచ్చు. |
| 4. జీతం యింతే వస్తుందని తెలుస్తుంది. ఎక్కువ తక్కువలుండవు. | 4. ఒక్కోసారి ఎక్కువ కావచ్చు, తక్కువా కావచ్చు, సాధారణంగా మిగులుబాటుగానే ఉంటుంది. |
| 5. కొత్తగా సంపాదించేదేమి ఉండదు. | 5. ఉత్పత్తి ఎక్కువ చేసి సంపాదన ఎక్కువ పొందవచ్చు. ప్రభుత్వానికి ఆదాయపు పన్ను రూపంలో కూడ చెల్లింపవచ్చు. |
| 6. ఉద్యోగాలను ప్రైవేట్, ప్రభుత్వ ప్రైవేట్ లిమిటెడ్, పబ్లిక్ సెక్టార్లలో పొందవచ్చు. | 6. పారిశ్రామిక, వాణిజ్య సేవారంగాల్లో ఉపాధిని చేపట్టవచ్చు. |

**స్వయం ఉపాధి కల్పనలో మూడు దశలుంటాయి :**

1. ఆదాయ ఉత్పత్తి(Income Generation)
2. సొంత ఉద్యోగం (Self Employment)
3. వాణిజ్యవిధానం. (Enter Preneurship)

**1. ఆదాయ ఉత్పత్తి** : స్వయం ఉపాధి విధానంలో ఇది మొదటిదశ. ఈదశలో వ్యక్తులు తమ పరిధిలో ఆదాయాన్ని ఉత్పత్తి చేసుకొంటారు. ఇందుకోసం కొంత సమయాన్ని వెచ్చించడమో, లేదా తాత్కాలిక ప్రాతిపదికపై పని చేయడమో జరుగుతుంది. ఉదా: ఒక వ్యక్తి తన మిగులు బాటు సొమ్మును బ్యాంక్‌లో ఫిక్స్డ్ డిపాజిట్ చేసి అయినా లేదా చిట్ ఫండ్‌లో వేసి అయినా కొంత వడ్డీని పొందగలుగుతాడు. ఇలా తన సొమ్మును వృద్ధి చేసుకొంటాడు.

**2. సొంత ఉద్యోగం** : ఇది రెండోదశ. ఈ దశలో అనగా సొంత ఉద్యోగంలో ఒక వ్యక్తి తన పూర్తీ సమయాన్ని కేటాయించవలసి ఉంటుంది. ఉదా:- ఒక వ్యక్తి టీదుకాణం పెట్టుకొంటాడు. వేరే ఆలోచన లేకుండా పగలంతా టీ అందిస్తూ, వచ్చిన అదాయంతో హాయిగా గడుపుతాడు. అంతేగాని టీతోపాటు కాఫీ, సమోసాలు, బన్నులు, శీతల పానీయాల్లాంటి ఇతరాలైన వాటిని అదనంగా చేర్చి, చుట్టు పక్కలవాళ్లకు అందించాలనుకోడు. లేదా ఇంకా మరేదైనా పద్ధతిలో తన దుకాణాన్ని అభివృద్ధి పరచాలనుకోకుండా సంతృప్తిగా గడుపుతాడు.

**3. వాణిజ్యవిధానం** : ఈ విధానంలో ఇది మూడవది, చివరిది. ఈ దశలో స్థిర పడిన వ్యక్తి వివిధ మార్గాలను అన్వేషిస్తూ తన వృత్తిని అభివృద్ధి పరచుకొంటాడు. ఒకే విధమైన వ్యాపారం

©KTBS Not to be republished

ఇతనికినచ్చుదు. ప్రతినిత్యం కొత్త కొత్త సవాళ్లను ఎదుర్కొంటాడు. ఇతని దగ్గర వనరులు (Resources) లేక పోవచ్చు. కాని కావలసినన్ని ఆలోచనలు (Ideas) ఉంటాయి. ఇతడు నిరంతరాన్వేషి. (Creator) తనకు కలిగిన ఒక ఆపదను కూడ మంచి అవకాశంగా మలచుకోగలడు.

ఒక చిన్న వ్యాపారి అయితే తనకు జరగబోయేనష్టాన్ని అంచనా వేసుకొని, అంతటితో ఆ దుకాణాన్ని మూసివేస్తాడు. కాని వాణిజ్యవేత్త అయిన వ్యక్తి, ఆనష్టం ఎందుకు జరిగిందో, విశ్లేషించుకొని, కారణాలను తెలుసుకొని, అవి పునరావృతం కాకుండా, మళ్ళీ వ్యాపారాన్ని కొనసాగిస్తాడు. అంతేగాకుండా ఒక్కోసారి ఇంకో కొత్త వ్యాపారాన్ని ప్రారంభించాలనుకొంటే, బాగా కొనసాగుతున్న ప్రస్తుత వ్యాపారాన్ని ఆపివేయడానికి కూడ వెనుదీయడు.

ఇలా వాణిజ్యవేత్తలు ఆదాయాన్ని పెంచేవారుగాను, సొంత ఉద్యోగం చేసుకొనేవారుగాను ఉంటారు. అలాగని ఆదాయాన్ని పెంచుకొనేవారు, సొంత ఉద్యోగం చేసుకొనేవారంతా వాణిజ్యవేత్తలు కాలేరు సుమా! అయితే స్వయం ఉపాధి కల్పనలో ఎవ్వరైనా విజయం సాధించవచ్చు అనడానికి ఒక చిన్న ఉదాహరణ తీసుకొందాం.

రాము ఒక పేద పిల్లవాడు. తల్లినీ తండ్రినీ కోల్పోయాడు. తనతోపాటు ఒక చెల్లెలు ఉంది. బ్రతుకు తెరువు కోసం ఒక ఫ్యాక్టరీలో చేరాడు. ఉదయం నుంచి సాయంకాలం దాకా తెరిపిలేని పని చేసేవాడు. సంపాదన ఏమీ చాలలేదు. పైగా తన చెల్లెలిని కూడ చూసుకోవాలి. ఆ అమ్మాయి చిన్నపిల్ల. ఆమెను చూసుకొంటూ పని చేసుకోవడం ఒక సమస్య. ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో రాము బుర్రలో ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది. అతడు తన తండ్రి వద్ద గ్రహించిన విద్య గుర్తుకువచ్చింది. అది సైకిల్ ట్యూబులకు పంచర్లు వేయడం. ఇకనేం? తనకు తెలిసినవారి సహాయంతో ఆ పని ప్రారంభించాడు. అతని నిర్ణయాన్ని అందరూ అభినందించారు. తన చెల్లెలు చిన్న చిన్న సహాయాలు చేసేది. ఇంటి పట్టునసే కాబట్టి, ఆమెతో మాటాడుకుంటూ హాయిగా పని చేసుకొనేవాడు. రోజుకు అంతోయింతో సొమ్ము మిగిలేది. అలా మిగిలిన సొమ్మును కూడ బెట్టి సమీపంలోని బ్యాంకు అధికారులను కలిశాడు. వారి ద్వారా స్వయం ఉపాధి పథకం గురించి తెలుసుకొన్నాడు. కొంత సొమ్ము అప్పుగా తీసుకొని సైకిళ్లను కొన్నాడు. వాటిని బాడుగకు యిచ్చే పని మొదలు పెట్టాడు. వచ్చిన సొమ్ము జాగ్రత్త చేసుకొని అప్పును తీర్చాడు. ఇప్పుడు రాము ఐదు సైకిళ్లకు యజమాని. వాటితోపాటు ఒక చిన్న బడ్డీ కొట్టు తెరిచాడు. తన చెల్లెలిని బడికి పంపుతున్నాడు. ఒకరి మీద ఆధారపడకుండా తన ఉపాధిని తానే సాధించాడు. అందరి ప్రశంసల్ని అందుకొన్నాడు చూశారా! రాము తన సొంత ఆలోచనతో స్వయం ఉపాధితో ఎలా అంచెలంచెలుగా పైకి ఎదిగాడో!

కాబట్టి స్వయం కృషి లేనిదే ఎవ్వరైనా పైకిరాలేరు. ఎంత గొప్ప సింహం అయినా వేటాడితేనే తప్ప, తమకు తామే దాని ఆహార జంతువులు వచ్చి నోట్లో వాలిపోవు. 'కృషితో నాస్తి దుర్భిక్షం'.

**ఆధారం : అంతర్జాలం :**



©KTBS Not to be republished

## అభ్యాసాలు

**1. కొత్తపదాలు :**

వాణిజ్యవేత్త. అజమాయిషీ అన్వేషణ విశ్లేషించు అనుసంధానం జాగృతం
ఆవశ్యకత స్రష్ట దుర్భిక్షం ఉపాధి క్లిష్ట పరిస్థితి వనరులు

**2. అర్థాలు :**

స్రష్ట = సృష్టించేవాడు బ్రహ్మ; విశ్లేషించి = విడమరచి; నిరంతరాన్వేషి = ఎల్లప్పుడు వెదికేవాడు; వాణిజ్యవేత్త = వ్యాపారంలోని మెలకువలు తెలిసినవాడు; అజమాయిషీ = అధికారం (పెత్తనం) క్లిష్ట పరిస్థితి = కష్టకాలం, కృషితో నాస్తి దుర్భిక్షం = కష్టపడితే కరువు అనేది ఉండదు.

**3. వ్యతిరేక పదాలు :**

అర్హత × అనర్హత

సహజం × అసహజం

ఆవశ్యకత × అనావశ్యకత

**4. సంధులు :**

ఉద్యోగ + అన్వేషణ = ఉద్యోగాన్వేషణ : (సవర్ణ దీర్ఘ సంధి)

ఇచ్ఛ + అనుసారం = ఇచ్ఛానుసారం : (సవర్ణ దీర్ఘ సంధి)

నిరంతర + అన్వేషణ = నిరంతరాన్వేషణ : (సవర్ణ దీర్ఘ సంధి)

ఆదాయము + పన్ను = ఆదాయపుపన్ను : (పుంప్వాదేశ సంధి)

అతి + అధిక = అత్యధిక : (యణాదేశ సంధి)

పునః + ఆవృతం = పునరావృతం : (విసర్గ సంధి)

**5. సమాసాలు :**

స్వయం కృషి : స్వయంగా చేసే కృషి (విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం)

కష్టనష్టాలు : కష్టం మరియు నష్టం (ద్వంద్వ సమాసం)

©KTBS Not to be republished

**6 వివరణలు :**

ఎమ్. బి. ఎ (M. B. A) : Master of Business Administration

పించను (Pension) : ఉద్యోగ విరమణ అయ్యాక ప్రభుత్వోద్యోగులు వారి వారి స్థాయిని బట్టి ప్రతినెలా వేతనంగా పొందే సొమ్ము.

ప్రైవేట్ సంస్థలు : కేవలం వ్యక్తిగతమైన ఏదైనా సంస్థ.

**ఉదా :** రైస్ మిల్లులు, ప్రత్తిమిల్లులు, చిన్న చిన్న పరిశ్రమలు

ప్రభుత్వరంగ సంస్థలు : పూర్తిగా ప్రభుత్వానికి సంబంధించిన సంస్థలు.

: ఉదా:ఇస్రో (ISRO) (Indian Space Research organisation)

డి. ఆర్. డి. పి. (D. R. D. P) : Defence Research Development Organisation

పబ్లిక్ సెక్టార్ సంస్థలు : ఈ సంస్థలను ప్రభుత్వమే స్థాపించి, వాటికి కావలసిన ఆదాయవనరులను చూపించి, వాటికి స్వాయత్తత కల్పిస్తుంది. ఈ సంస్థలే వీటిని నడుపు కోవాలి. వీటిపై ప్రభుత్వ అజమాయిషీ మాత్రం ఉంటుంది. **ఉదా :** భారతీయ భీమా సంస్థ. (L. I. C), భారత సంచార నిగమ సంస్థ (B. S. N. L), అన్ని జాతీయ బ్యాంకులు:

ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు : ఈ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులు స్థాపిస్తారు. అందులో తమతోపాటు వివిధ రంగాలు మరియు వ్యక్తుల ద్వారా షేర్ల రూపంలో పెట్టు బడులు సేకరిస్తారు. ప్రభుత్వానికి వీటితో జోక్యం ఉండదు.

ఉదా : ఇన్ఫోసిస్

: టి. సి. యస్ Tata Consultancy Services (T. C. S)

**7. ఖాళీలు నింపండి :**

1. చాలామంది చాల ఏదైనా ______________ నే చూసుకోవాలనుకొంటారు.
2. ఉద్యోగులు గతి ఉన్నా ______________ లేనట్లు సాగిపోతుంటారు.
3. ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ______________ జీవితం గడిచిపోతుంటుంది.
4. ఆదాయాన్ని పెంచుకొనేవారు. సొంత ఉద్యోగం చేసుకొనే వారంతా, ______________ కాలేరు సుమా !

©KTBS Not to be republished

5. కృషితో నాస్తి ______________

6. ఎంత గొప్ప సింహమైనా ______________ తప్ప తమకు తామే దాని ఆహార జంతువులు వచ్చి నోట్లో వాలిపోవు.

**8. జతపరచండి :**

| A. పట్టిక | B. పట్టిక | |
|---|---|---|
| 1. ఇన్ఫోసిస్ | a) నిర్మాపటేల్ | ( ) |
| 2. ఇనుప కర్మాగారాధినేత | b) ధీరూబాయి అంబానీ | ( ) |
| 3. రసాయన శాస్త్రవేత్త సహాయకుడు | c) లక్ష్మీ మిత్తల్ | ( ) |
| 4. చిన్న గుమస్తా | d) నారాయణమూర్తి | ( ) |
| 5. ఓడ వ్యాపారి. | | |

**9. కింది ప్రశ్నలకు ఒకమాటలో సమాధానాలీయండి :**

1. స్వయం ఉపాధిలోని మూడుదశలేవి?
2. వాణిజ్యవేత్త ఎలాంటి వాడు?

**10. కింది ప్రశ్నలకు రెండు, మూడు వాక్యాల్లో సమాధానాలీయండి :**

1. ఉద్యోగి జీవితం ఎలా సాగిపోతుంది?
2. చిన్న వ్యాపారికి, వాణిజ్యవేత్తకు మధ్య తేడా ఎలాంటిది?
3. 'ఆదాయ సేకరణ' అనగా ఏమిటి?

**11. కింది వాటికి వివరంగా సమాధానాలు రాయండి.**

1. ఉద్యోగానికి, స్వయం ఉపాధికి మధ్య తేడాలేవి?
2. స్వయం ఉపాధి కల్పనలోని దశలేవి? వాటిని వివరించండి.
3. వాణిజ్యవేత్త ప్రత్యేకత ఏమిటి?

©KTBS Not to be republished

**12. విద్యార్థులకు సూచనలు :**

1. మీ పెద్దల ఆధ్వర్యంలో ఏదైనా బ్యాంకును సందర్శించి, అక్కడ జరిగే ఆర్థిక లావాదేవీల విధానాన్ని తెలుసుకోండి.
2. మీ చుట్టుప్రక్కల నిర్వహింపబడుతున్న కుటీరపరిశ్రమల్ని, లఘుపరిశ్రమల్ని సందర్శించండి.

**13. ఉపాధ్యాయులకు సూచనలు :**

1. విద్యార్థుల్లో స్వయం ఉపాధి పట్ల అవగాహన కల్పించండి.
2. విద్యార్థుల్లో దాగివున్న ప్రజ్ఞావిశేషాల్ని గమనించి, అందుకు తగినట్లుగా వారిని ప్రోత్సహించండి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 4. మన తెలుగురైతు

**- శ్రీ దేవులపల్లి రామానుజరావు**

[తెలుగు భాషాభివృద్ధికి, తెలుగువారి సంస్కృతి పరిరక్షణకు కంకణధారులై, తమజీవిత కాలాన్ని ధారపోసి, ధన్యులైన వారిలో శ్రీ దేవులపల్లి రామానుజారావుగారొకరు. హైదరాబాదులోని 'ఆంధ్రసారస్వతపరిషత్తు' శ్రీరామానుజరావుగారి నిస్వార్థమైన భాషాసేవకు, సాహిత్యాభిమానానికి ఒక నిదర్శనం. బహుకాలం ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీకి కార్యదర్శిగా ఉన్నారు.

శ్రీ రామానుజరావుగారు 26.8.1917న వరంగల్లులో జన్మించారు. బి.ఎ. పట్టభద్రులైన పిమ్మట, యల్.యల్.బి. పట్టాన్ని పొంది, శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారిని ఆదర్శంగా చేసుకొని, కొంతకాలం గోలుకొండ పత్రికా సంపాద కత్వాన్ని చేపట్టారు. పచ్చతోరణం, నవ్యకవితా నీరాజనం, వ్యాసమంజూష- మొదలయినవి వీరి రచనలు.

వీరు గొప్ప వ్యక్తులు. వీరు ఆకాశవాణిలో చేసిన ప్రసంగాలలో కొన్ని 'సారస్వతనవనీతం' అనే పేరుతో ఒక చక్కటి వ్యాస సంపుటిగా వెలువడింది. ఆంధ్ర దేశంలోని రైతు సాంస్కృతిక జీవితాన్ని వర్ణించే ఈ పాఠ్యభాగం ఆ గ్రంథం నుంచి గ్రహించబడింది.

మనదేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. కనుకనే రైతు దేశానికి వెన్నెముకలాంటివాడు అని కొనియాడబడ్డాడు. గ్రామసీమలలో తుష్టి, పుష్టిగల రైతన్నల సమగ్ర సుందర జీవితం, దైనందిన కార్యక్రమాలు ఈ పాఠంలో చెప్పబడ్డాయి. ]

ఆంధ్ర ప్రదేశమునందలి పల్లెపట్టులు అందాల దీవులు. భారతావనిలోని అన్ని ప్రాంతముల వలెనే, తెలుగు సీమ జనాభాలోని మిక్కిలి ఎక్కువ భాగం గ్రామ ప్రాంతాలలో నివసించుచున్నది. ఈ పల్లెటూరి ప్రజలలో నూటికి తొంబది వంతులకు పైగా ప్రత్యక్షముగనో, పరోక్షముగనో వ్యవసాయము మీద ఆధారపడి యున్నారు. అందుచేత తెలుగు సీమకు రైతు ఆయువు పట్టని నిస్సందేహముగా చెప్పవచ్చు.

తెలుగు సీమలోని రైతు జీవితము విశిష్టమైనది. సంవత్సరము పొడవునను, పన్నెండు నెలలు, మూడు నూర్ల అరువది దినములును రైతు గడియారమువలె పని చేయుచునేయుండును. ప్రొద్దుట మేల్కొన్నప్పటి నుండి రాత్రి నిద్రించువరకు రైతునకుగల కార్యక్రమము నిర్ణీతమైయుండును. ఈ విధముగ క్రమశిక్షణతో కష్టపడి పని చేయురైతు జీవితములోనికి కొంచెము తొంగి చూచినచో, అందులో కళా సౌందర్యమునకు ఆటపట్టయిన ఘట్టములు గోచరించును. ఈ ఘట్టములు రైతు సాంస్కృతిక జీవితమునకు ప్రతిబింబములు. మతము , కళ ఈ రెండును రైతు సాంస్కృతిక జీవితమునకు ప్రధాన ప్రాతిపదికలు.

రైతు జీవితము శుష్కమైనది కాదు. అది రసహీనముకాదు. హృదయమును కదలింపగల సంఘటనలు, మనస్సును ఆకర్షింపగల దృశ్యములు, ఆధునిక నాగరికత చేత కలుషితముగాని ఉదాత్త భారతీయ సంస్కృతి రైతుజీవితమందు అడుగడుగున చూడవచ్చును. మన దేశములో వ్రాయను, చదువను నేర్చిన రైతులు తక్కువేనని ప్రత్యేకముగా చెప్పవలసిన పనిలేదు.

©KTBS Not to be republished

కాని ఒక సారి యే పల్లెటూరికైనను వెళ్ళి మనము కొందరు రైతులతో సంభాషించిన యెడల, మన భారతీయ పురాణములను గూర్చి రైతులకు తగినంత విజ్ఞానమున్నట్లు స్పష్టముగా గ్రహింపవచ్చును. రామాయణ, భారతములు రైతుకు బాగుగా పరిచితములై యుండును. శ్రుత పాండిత్య ఫలితమైన విజ్ఞానము రైతుకు తగినంతయున్నది. పశువుల వ్యాధులకు చికిత్స, రైతు విజ్ఞానములో ఒక ముఖ్యభాగము. పాము కాటుకు, తేలు కుట్టుకు చేయవలసిన చికిత్సలో రైతు మంచి నేర్పరి.

మనరైతు విజ్ఞానములో, సంస్కృతి ఒక ముఖ్య భాగము. పరంపరాగతముగా అతనికి సంక్రమించినట్టిది. తరతరాలనుండి వచ్చిన సంప్రదాయములు, ఆచారముల ప్రభావము తాత ముత్తాతల నుండి, అమ్మమ్మ, నాయనమ్మల నుండి నేర్చుకొనిన విషయములు తెలుగు సీమలోని రైతు సాంస్కృతిక జీవితమునందలి ప్రత్యేకతలు. మనదేశములో మొట్టమొదటిసారి 1952 సంవత్సర మున వయోజన వోటింగ్ పద్ధతిపైన జరిగిన సాధారణ ఎన్నికలను గూర్చి తెలుసుకొని, పాశ్చాత్య దేశములలో కొందరు ''ఇంత పెద్ద దేశములో, ఇన్ని కోట్ల జన సంఖ్యలో మొట్ట మొదటిసారి ప్రజలు ఓటు చేసినప్పటికిని, ఏ విధమైన రక్తపాతము జరగలేదే''! అని ఆశ్చర్యపడినవారికి సమాధానముగా శ్రీ సి. పి రామస్వామి అయ్యరుగారు ''ఇది మాదేశములోని పల్లె పట్టులందు నివసించుచున్న రైతుల జీవితపు ఉదాత్త సంస్కృతికి నిదర్శన''మని చెప్పియుండిరి. మంచి, చెడుల విచక్షణలో నేర్పు, ఓర్పు, పరమత సహనము, రైతుకు ఉగ్గుపాలతో అలవడిన మంచి గుణములు. ఈ సద్గుణములే రైతు సాంస్కృతిక జీవితమునకు శోభను చేకూర్చుచున్నవి.

రైతు సాంస్కృతిక జీవితమున మతమునకు ప్రత్యేక ప్రాధాన్యమున్నది. మన రైతులలో మత విశ్వాసము ప్రగాఢమై కనిపించును. దైవభక్తి, పాపభీతి రైతులలో మిక్కుటము. రైతు గృహమున ఏ శుభ కార్యము జరిగినను, ఇలవేలుపు పూజతో అది ప్రారంభము కావలసియుండును. మత విశ్వాసము రైతుల దైనందిన జీవితములో అడుగడుగున గోచరించుచుండును. బొట్టు, జుట్టు ఈ రెండును రైతుకు అనివార్యమైన బాహ్యలక్షణములు. పంచాంగములో రైతుకు పరిపూర్ణమైన నమ్మకమున్నది. కొత్త బట్టలు కట్టుకొనుటకు మంచిదినము కావలె, ప్రయాణమునకు మంచి రోజు కావలె, క్షౌరమునకు మంచిదినము కావలె, దుర్ముహూర్తమును, వర్జ్యమును రైతు బాగుగా పాటించునట్టి సంప్రదాయములు. ఈ సందర్భాలలో రైతు మంచి పనిని దేనినీ చేయుటకు ఇష్టపడడు. పున్నమి, అమావాస్యలు, గ్రహణములు రైతుకు సుపరిచితములైన సందర్భములు.

సాంస్కృతిక జీవితములో గమనింపదగిన విషయములలో వేషభాషలు ప్రధానములైనవి. మన పల్లెటూరి రైతు వేషభాషలలో ప్రత్యేకత కలదు. పల్లెటూరి సామెతలు, లోకోక్తులు, మనకు తెలియని చక్కని తెలుగు పలుకుబడులు ఎన్నిటినో రైతు సంభాషణలో మనము గమనింపవచ్చును. తెలుగు దేశములోని రైతును తలచుకోగానే, అతని కోరమీసములు మన ఎదుట ప్రత్యక్షమగును. అతని దండ కడియములు మనకు కనిపించును. అతని చెవుల పోగులు, వ్రేలి ఉంగరములు మన కన్నులకు కట్టును. అతని తలపాగా మనకు గుర్తుకు వచ్చును. ఆ తలపాగాను చుట్టెడి పద్ధతిలో రైతు చూపించు నేర్పును మనము చక్కగా పరిశీలించవచ్చును. రైతు ధరించు ధోవతులు, వాని అంచులు, రంగులు రైతుల అభిరుచికి మంచి నిదర్శనములు.

© KTBS Not to be republished

కోడి కూత రైతును పొద్దుట మేలుకొలుపు అలారము గడియారము. కోడి, కుంపటి ఈ రెండును రైతుల యిండ్లలో మనకు ప్రత్యేకముగా కనబడుచుండును. కోడి కూతతో లేచిన రైతు ప్రతిదినము తన దైనందిన కార్యక్రమమును సక్రమముగా నిర్వహించుకొనగలడు. సోమరితనమను మాట రైతు నిఘంటువులో లేదు. వాతావరణమును గమనించి, సమయ సందర్భములను నిర్ణయించుకొని, తన పనులు నెరవేర్చుకొనుట రైతుకు అలవాటు. ఇందుకు కార్తెలు రైతుకు మార్గదర్శకములగు చుండును. రోహిణి కార్తెలో వర్షాలుపడి, చెరువులు నిండినచో అది ఆ సంవత్సరము రైతు అదృష్టమునకు మంచి సూచన. తరువాత ప్రతి కార్తెను గమనించుచున్న రైతు ఏ కార్తెలో దుక్కిదున్నవలెను, ఏ కార్తెలో విత్తనములు వేయవలెను, ఏ కార్తెలో నారు పోయవలెను, వరికి ఏ కార్తె అనుకూలమో, మొక్కజొన్నకు ఏ కార్తె మంచిదో తెలుసుకొని వ్యవసాయ కార్యకలాపములను దిద్దుకొనుటలో మంచి ప్రవీణుడు. ఈ ప్రావీణ్యమే రైతు వ్యవసాయంలో సాధింపగల విజయమునకు ముఖ్య కారణము. వ్యవసాయమును కళగా, శాస్త్రముగా ఆరాధించే రైతు దేశ శ్రేయస్సునకు వెన్నెముక.

తెలుగుసీమలో దేవాలయము లేని ఊరులేదు. రామాలయము, శివాలయము, హనుమదాలయము మొదలయిన దేవాలయములు రైతుల సాంస్కృతిక జీవితమునకు మార్గదర్శకములు. ఈ దేవాలయముల నిర్వహణకు రైతు ముఖ్యపోషకుడు. పంటలు పండిన తరువాత కళ్ళము మీదనే తనవంతు భాగమును అతడు దేవాలయమునకు సమకూర్చును. ప్రతి రైతు కుటుంబమునకు ఒక ఇలవేలుపు తప్పకయుండును. ఈ ఇలవేలుపులకు ముడుపులు, మొక్కుబడులు చెల్లించుట తరచుగా జరుగుచుండును. పౌరాణిక దేవతలతోపాటు, శాక్తేయమైన దేవతలనుగూడ ఆరాధించుట రైతు జీవితమందు మనకు కానవగును. కనకదుర్గ, కాళీ, ఎల్లమ్మ, మరిడమ్మ మొదలయిన పేర్లతో శక్తి పూజ సేయుట రైతులకు పరిపాటి. ప్రతి సంవత్సరము ఈ దేవాలయములలో ఉత్సవములు, జాతరలు జరుగుచుండును. ఈ అన్నిటికిని రైతు సహాయము, ప్రోత్సాహము పూర్తిగా లభించును. తెలుగు సీమలో కొన్ని జాతరలు చాలా ప్రసిద్ధమైనవి. కొత్తకొండ, కొరివి, అయ్యనవోలు, గోవాడ, కోటప్పకొండ మొదలైన చోట్లలో ప్రతి సంవత్సరము జరుపు జాతరలకు అలంకరించుకొన్న బండిని కట్టుకొని, కుటుంబముతో పాటు తీర్థము పోవుట జరుగుచుండును.

రైతుకు పండుగలు చేసుకొనుటలో చాలా ప్రీతి. కొన్ని పండుగలు ప్రత్యేకముగా రైతుకు సంబంధించినవే. ఏరువాక పున్నమి ఇందులో మొట్టమొదట చెప్పదగినది. ఈ పండుగనాడు రైతులు ఎడ్లను పూజింతురు. ఆనాడు ఎద్దులను కడిగి, కొమ్ములకు రంగులు వేసి, గజ్జెలు గంటలు కట్టి కనులపండువుగా అలంకరించి ఊరేగుట ముఖ్య కార్యక్రమము. ఉగాదినాడు రైతులు సాయంకాలమున దేవాలయములో సమావేశమై, నూతన సంవత్సర కాలమాన పరిస్థితులను, తమ అదృష్టములను తెలుసుకొందురు.

దసరానాడు జమ్మిని తీసికొనుటకు వెడలు రైతుల సమూహము మన కన్నులకుగట్టు మరొక అద్భుతమైన దృశ్యము. శ్రీరామ నవమినాడు బండ్లు కట్టుకొని ఊరేగుట కూడ ఇట్టి దృశ్యమే. దీపావళి మొదలైన పండుగలను రైతులు అత్యంతోత్సాహముతో జరుపుకొందురు. సంక్రాంతి అచ్చముగా రైతుల పండుగే. సంక్రాంతి పండుగ సమయాన పల్లెటూర్ల సౌందర్యము ప్రత్యేకముగా చూడదగినది. కంది చేలతో, బంతిపూలతో, దోసపండ్లతో శోభిల్లెడి ప్రకృతి మధ్య, అప్పటికే పంట చాలావరకు చేతికందిన రైతు ఇంటిల్లిపాదియు సుఖ సంతోషములతో, సంతృప్తితో, సిరి సంపదలతో తులతూగుచుండును .



©KTBS Not to be republished

రైతులకు ప్రత్యేకమైన వినోద విలాసములతో పాటు ఆటలుకూడ నెన్నియో కలవు. పులి జూదము పల్లెటూరిరైతు కుటుంబమువారు మక్కువతో ఆదరించెడి ఆట. పాచికలాట, చదరంగము, పచ్చీసు మొదలయినవి కూడ రైతుకు ప్రియమైనవి. గోధూళి వేళ పశువులను తోలుకొని యింటికి వెళ్ళునపుడు పాటలు పాడుకొను రైతులు మనకు పల్లె పట్టులలో కనిపింతురు. వడిగల ఎద్దులను కట్టుకొని, బండిని శరవేగమున తోలుకొని పోవునప్పుడు ఆనందముతో పాడుకొనెడి రైతులు మనకు గ్రామ సీమలలో అగుపింతురు. మంచెమీద కూర్చుండి, వడిసెలను రువ్వుచు పాటపాడెడి ఆర్ద్రహృదయులను మనము రైతులలో చూడవచ్చును. కోతలప్పుడు, కలుపుతీయునప్పడు పొలాలలో వినిపించు రాగాలు రైతుల గానాభిమానమునకు తార్కాణములు.

రైతులకు ప్రత్యేకములైన కొన్ని వినోదములున్నవి. తోలు బొమ్మలాటలు, వీధినాటకములు, ఈ వినోదములలో ముఖ్యమైనవి. తీరిక దినాలలో రాత్రి యంతయు తోలుబొమ్మలాటలను చూచుచు ఆనందించు రైతులే ఆ యాటకాండ్రకు రాజ పోషకులు. అట్లే పగటి పూట కథలు చెప్పించుకొని, విని ఆనందింతురు. పురాణ కాల క్షేపములకు వెళ్ళుట రైతుల సరదాలలో ఒకటి. వర్షాలు సకాలమున పడక పోయినచో విరాట పర్వము పురాణము చెప్పించిన వానలు కురియగలవని రైతుల విశ్వాసము.

ఈ విధముగా తెలుగు సీమలోని రైతు జీవితము పరిశీలించినపుడు ఒక ప్రత్యేకమైన సంస్కృతీ వైభవం మనకు గోచరించును. ఈ సంస్కృతి బహుముఖ్యమైనది. దీనిలో విజ్ఞానము వినోదతీ సమ్మిళితమైయున్నవి. కష్టపడి, చెమటోడ్చి పనిచేసి దేశసంపదను అభివృద్ధి చేయుటకు కృషి సల్పు రైతు కుటుంబముల కష్ట సుఖములు, ఒడిదుడుకులు, ఆర్థిక, సామాజిక జీవనము ఈ సంస్కృతిలో మనకు కనిపించును.

**1. కొత్తపదాలు :**

ప్రత్యక్షము; ఆయువుపట్టు; శుష్కము; పురాణములు; పాశ్చాత్య దేశములు; దుర్ముహూర్తము. దృశ్యము; పులిజూదము; ఆర్ద్రహృదయులు; ఒడిదుడుకులు.

**2. అర్థాలు :**

శుష్కము = నిస్సారం; ప్రాతిపదిక = ఆధారం; రసహీనము = రసములేనిది; మిక్కుటము = ఎక్కువ; గోచరించు = కనిపించు; వర్జ్యము = విడువదగిన సమయం; శ్రుతపాండిత్యము = వినుటవల్ల వచ్చిన పాండిత్యం; పరంపరాగతం = కాలక్రమమున వచ్చినది; ఇలవేలుపు = ఇంటి దేవుడు; ఇంటిల్లిపాది = ఇంటిలో ఉన్నవాళ్ళందరు.

**3. వ్యతిరేక పదాలు :**

సందేహం × నిస్సందేహం

ప్రత్యక్షం × పరోక్షం.

విశ్వాసం × అవిశ్వాసం

ముహూర్తం × దుర్ముహూర్తం.



©KTBS Not to be republished

**4. ప్రకృతి - వికృతి :**

| | | |
|---|---|---|
| ద్వీపం | - | దీవి |
| హృదయం | - | ఎద, ఎడద. |
| విజ్ఞానం | - | విన్నాణం |
| ఆశ్చర్యం | - | అచ్చెరువు |
| భక్తి | - | బత్తి |
| గృహం | - | గీము |
| కార్యం | - | కర్జం |
| వేషం | - | వేసం |
| భాష | - | బాస |
| దేవాలయం | - | దేవళం. |

**5. కింది పదాలను మీ సొంత వాక్యాలలో ప్రయోగించండి :**

ఆటపట్టు; ఇంటిల్లి పాది; ఉగ్గుపాలు; క్రమశిక్షణ; ప్రతిబింబం;
అభివృద్ధి; ఇలవేలుపు వెన్నెముక; సిరిసంపదలు; మొక్కుబడి;
అడుగడుగున; కన్నులకు కట్టు; ముడుపు; మార్గదర్శకం;

**6. సంధులు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| భారత | + | అవని | = | భారతావని | : | సవర్ణదీర్ఘ సంధి. |
| పంచ | + | అంగం | = | పంచాంగం | : | సవర్ణదీర్ఘ సంధి. |
| దేవ | + | ఆలయం | = | దేవాలయం | : | సవర్ణదీర్ఘ సంధి. |
| రామ | + | ఆలయం | = | రామాలయం | : | సవర్ణదీర్ఘ సంధి. |
| శివ | + | ఆలయం | = | శివాలయం | : | సవర్ణదీర్ఘ సంధి. |
| లోక | + | ఉక్తులు | = | లోకోక్తులు | : | గుణసంధి. |
| చెమట | + | ఓడ్చి | = | చెమటోడ్చి | : | అకార సంది |

©KTBS Not to be republished

**7. సమాసాలు :**

సుఖసంతోషాలు : సుఖం మరియు సంతోషం - ద్వంద్వ సమాసం.

వినోద విలాసములు : వినోదం మరియు విలాసం - ద్వంద్వ సమాసం.

రామాయణ భారతములు : రామాయణం మరియు భారతం - ద్వంద్వ సమాసం.

కోరమీసం : కోరగా ఉండే మీసం - విశేషణ పూర్వ పద కర్మధారయం.

పంచాంగం : ఐదు అంగములు కలది - బహువ్రీహి సమాసం.

**8. వివరణ :**

పంచాంగం: తిథి, వార, నక్షత్ర, యోగ, కరణములు అనే ఐదు అంశాలతో కూడిఉన్న దాన్ని పంచాంగం అని అంటారు.

**9. ఖాళీలను సరైన పదాలతో పూరించండి :**

1. తెలుగు సీమకు రైతు _______________ నిస్సందేహము.
2. ఈ సద్గుణములే రైతు ____________ జీవితమునకు ____________ చేకూర్చుచున్నవి.
3. రైతు ____________ జీవితమున ____________ కు ప్రత్యేక ప్రాధాన్యమున్నది.
4. రైతు గృహమున ఏ శుభకార్యము జరిగినను _________ పూజతో అది ________ కావలసి యుండును.
5. ____________ అనుమాట రైతు ____________ లో లేదు.
6. వర్షాలు సకాలమున పడకపోయినచో ___________ పురాణము చెప్పించిన ____________ కురియ గలవని ____________ ల విశ్వాసము.

**10. కింది ప్రశ్నలకు ఒకటి, రెండు వాక్యాలలో జవాబులు రాయండి :**

1. పల్లెటూరి ప్రజలు దేనిమీద ఆధారపడియున్నారు?
2. తెలుగు సీమలోని రైతు జీవితం ఎలాంటిది?
3. రైతు జీవితంలో అడుగడుగున చూడవలసినవి ఏవి?
4. రైతుకు బాగా పరిచయమైన గ్రంథాలు ఏవి?
5. ఏయే చికిత్సలో రైతు నేర్పరి?
6. తెలుగు రైతును తలచుకోగానే, కనిపించే ఆతని ఆకారం ఏమిటి?
7. రైతును మేలుకొలిపే అలారం గడియారం ఏమిటి?

©KTBS Not to be republished

**11.** **కింది ప్రశ్నలకు వివరంగా సమాధానాలురాయండి.**

1. తెలుగుసీమలోని రైతు సాంస్కృతిక జీవితంలోని ప్రత్యేకతలేమిటి?
2. రైతులలో మిక్కుటమైనవి ఏవి?
3. రైతు పాటించే సంప్రదాయాలేమిటి?
4. రైతు ఏరువాక పున్నమిని ఎలా ఆచరిస్తాడు?
5. రైతులకు ఇష్టమైన ఆటలు ఏమిటి?
6. రైతుల గానాభిమానానికి తార్కాణాలు ఏమిటి?
7. రైతుకున్న వినోదాలను తెల్పండి?

**12.** **కార్యకలాపాలు :**

**క్రింది విషయాల గురించి వివరాలు సేకరించండి :**

a. ఏరువాక పున్నమి b. తోలుబొమ్మలాట c. ఉగాది.

**13.** **ఉపాధ్యాయులకు సూచన :**

a. విద్యార్థులకు జాతర గురించి పరిచయం చేయండి.

b. రైతు జీవితాన్ని గురించి విద్యార్థినీ విద్యార్థులతో ఒక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించండి.

c. గ్రామ జీవితం గురించిన చిత్రాలను విద్యార్థులకు ప్రదర్శింప చేయండి.

d. వ్యవసాయ పనిముట్ల పేర్లను, వాటి ఉపయోగాలను విద్యార్థులకు తెలపండి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 5. యువకులు- సాహిత్యాభిరుచి

- డా. ఆశావాది ప్రకాశరావు

[ దేశ భవితవ్యం యువతపై ఆధారపడి ఉంది. యువత మీదనే సమాజం ఆశలు నిలుపు కొన్నది. యువతకు దిశానిర్దేశం చేసే మహత్తరమైన సాధనం సాహిత్యం. మంచి పునాదుల మీద సాహిత్యాభిరుచి పెరగాలి. సాహిత్య శక్తి శ్రమించి కూర్చుకోదగినది. యువతరం సామాజిక ప్రగతిని సాధించేందుకు సాహిత్యాభిరుచి ఉపయుక్తం కావాలని, ఈ వ్యాసంద్వారా రచయిత డా. ఆశావాది ప్రకాశరావుగారు తమ సందేశాన్ని అందిస్తున్నారు.

మధుర కవి డా. ఆశావాది ప్రకాశరావుగారు 'అవధాని'గా చాలా ప్రసిద్ధులు. ప్రస్తుతం 'ఆంధ్ర పద్యసదస్సు' రాష్ట్ర అధ్యక్షులుగా పద్యకవితా వ్యాప్తికి ఎంతో కృషి చేస్తున్నారు.

©KTBS Not to be republished

యువకులు తీరని దాహానికి, నిరంతర చైతన్యానికి, అభ్యుదయానికి ప్రతీకలు. రేపు మీద చూపున్నది ఒక్క యువతకు మాత్రమే. యువత మీదనే సమాజము తన ఆశలు నిలుపు కొన్నదన్నా అతిశయోక్తి కాదు. అర్థవంతమైన మార్పును ఎప్పుడూ సహృదయతతో స్వీకరించడానికి సిద్ధంగా ఉంటుంది యువత.

ఇంత పటిష్టమైన యువతలో కూడ స్థూల దృష్టికి రెండు వర్గాలు గోచరిస్తాయి. ఒక వర్గం నిర్మాణాత్మకమైన, ప్రయోజనాత్మక మైన కృషిలో భాగస్వామియై, సదవగాహనతో ముందడుగు వేస్తూ, ఉత్తమ ఫలితాలను సాధిస్తూ, సామాజిక సాంస్కృతిక వికాసానికి, అచంచల దీక్షతో ముందడుగు వేస్తోంది. మరొక వర్గమేమో తాత్కాలిక కీర్తి కండూతికి, స్వప్రయోజనాలకు లోనై, స్వార్థపరుల క్రీనీడల్లో బలిపశువుల్లా తారాడుతూ వ్యక్తిత్వం చంపుకొని, విధ్వంసక చర్యల్లో పాల్గొంటూ నైతిక విలువలు లేనిదై జడత్వంతో జీవిస్తోంది.

ఒక ఉదాత్తకళపై అభిరుచి కలగడమనేది జన్మ సహజాతము. అది పూర్వజన్మ సంస్కారం వల్ల వస్తుందని సనాతనులు విశ్వసిస్తే, తల్లి తండ్రుల్లో రక్తనిష్ఠమైన గుణాల కారణంగా సాధ్యమవుతుందని ఆధునికులంటారు. పరిసర ప్రభావాలవల్ల అభిరుచి కలగడం, ఆ అభిరుచి అభివృద్ధి చెందడం సాధ్యమవుతుందనడం సత్యదూరం కాదు.

పెక్కు మంది రాజకీయ వేత్తలు సాధించలేని కార్యాన్ని ఒక్క సాహితీవేత్త మాత్రమే పరిష్కరించ గలడని నేటి యువతరం ప్రగాఢంగా విశ్వసిస్తోంది. రచనల్లో శ్లాఘనీయమైన సృజనాత్మక శక్తి ప్రదర్శిస్తూ సాహిత్యాన్ని కళాదృష్టితో కాక సామాజిక చైతన్యానికి ఉపయోగపడేలా మరమ్మత్తు చేస్తోంది. సాంప్రదాయబద్ధమైన నియమాలను ఛేదిస్తూ కొంగ్రొత్త సాహితీ ప్రక్రియలను ఆవిష్కరిస్తోంది. చదవాలనే అభిలాషతోపాటు చెప్పాలనే ఆసక్తి కూడాపెంచుకొంటోంది. అతిసామాన్యునిలో కూడ మూఢ దృక్పథాలు పెల్లగిస్తూ హేతువాదాన్ని ప్రచారం చేస్తోంది. భౌతిక వికాస విజృంభణలో గణనీయమైన స్థానాన్ని అందుకొంటోంది. యువతరంలోని ఈ సాహితీ పిపాసను ఎవరూ కాదనలేరు. అయితే ఇంతగా అభివృద్ధి చెందుతున్న వీరి అభిరుచి పరిమిత వలయంలోనే పరిభ్రమిస్తూ వలసినంత ప్రగతి సాధించ లేక పోతోంది.

హేతువాదానికి ఆలంబనగా సాహిత్యం నడవాలంటారు యువకులు. హేతువాదం పేరిట భౌతిక సత్యాన్ని మాత్రమే ఆవిష్కరించటంతో, కళాధర్మం నశిస్తోంది. తదతీత సత్యాల్ని కనుగొని చెప్పజాలక పోతున్నారు. బాహ్యశరీరం, అంతఃశరీరం, బుద్ధి, మనస్సు, ఆత్మ అనేవి ఉత్తరోత్తర బలీయాలు. సంకుచితత్వం నుండి విశాల పరిధిలోనికి తీసికొనిపోగల మెట్లు. ఈ క్రమవికాసం సాహిత్య సృజనలో యువకులు విధిగా గుర్తించాలి.

సాహిత్యంలో తప్పనిసరిగా సమాజం చిత్రింపబడాలన్నది వీరి మతం. సాహిత్య స్రష్ట భౌతికంగా సమాజంలోనివాడే. కాబట్టి విధిగా సామాజిక స్పృహ రచనలో ఉంటుంది. అయితే అంతకంటే మానసిక జగత్తులో కూడ జీవిస్తుంటాడు. కాబట్టి కల్పన అవసరం. కల్పన కళామయ చిత్రణకు కారణ మవుతుంది. సంఘ సంస్కర్తల మీద రసవంతమైన సాహిత్యాన్ని సృష్టించవలసిన అవసరము లేనట్లే, రచయితల మీద సంఘాన్ని సంస్కరించ వలసిన బాధ్యత లేదు. హృదయాన్ని రసోన్ముఖంగా నడపడం ద్వారా హృదయం మంచికి అంకితమయ్యేలా మానవుణ్ణి మలచుతుంది సాహిత్యం. ఉపదేశమే ప్రధానంగా నడిస్తే అక్కడ రసపుష్టి నశిస్తుంది. అదొక ప్రచార నినాదంగా తయారవుతుంది.

ప్రాచీన సాహిత్యంలో సామాజిక స్పృహ లేదని, దాన్ని పూర్తిగా తుద ముట్టించాలంటోంది యువత. నేటి సత్ఫలితాలన్నీ అలనాటి విలువల్ని మథించగా వచ్చినవే అనే సత్యాన్ని విస్మరించరాదు. అయితే అప్పటి సాహిత్యాన్ని అట్లే వాడుకోవాలనడంలో అర్థంలేదు. సాహిత్య సమ్రాట్టులనదగినవారు వాటిని ప్రయోగ దృష్టితో రూపాంతర మొనర్చినట్లయితే, యువకులు ఆకర్షితులై అభిరుచి పెంచుకొంటారు.

రచన అందరికి అర్థమయ్యేలా ఉండాలన్నది వీరి అభిలాష. అసలు ప్రజాకవులనబడేవారి రచనలు ఎంతమందికి అర్థమవుతున్నాయి! అర్థం కావాలంటూ సహజోక్తిలో చెప్పితే అది సాహిత్య స్థాయి నందుకుంటుందా? ఎదుట వ్యక్తిని కొంచెం సేపైనా ఆలోచింప చేయవలసిన అవసరం సాహిత్యానికి లేదా! ఇలా అందరికీ అందుబాటులో ఉండే భాషతో, భావాలతో రచన సాగాలి అని అనడంతో చాలా మంది యువకుల దృష్టిలో సాహిత్య శక్తి శ్రమించి కూర్చుకోదగినదిగా కనబడడం లేదు. సాహిత్య తత్త్వం ఎక్కువగా భావనా బలం మీద ఆధారపడి ఉంటుంది. ఆలోచనా బలాన్ని పుంజుకోవాలంటే, నిదానమైనా మంచి పునాదుల మీద సాహిత్యాభిరుచి పెరగాలి. ప్రాచీన ఆధునిక భావనలకు వడపోతగా తయారైన పద్య గద్య సంకలన గ్రంథాలను తరచు చూస్తూ, వీలయితే కొన్నింటిని కంఠస్థం చేయాలి. ఈ కృషి వల్ల ఎవరికి వారు సాహిత్యశిల్ప కళాభిజ్ఞతను తమకు తెలియకుండానే పొందగలరు.

''ఈ పుస్తకం సాహిత్య విలువలతో నిండింది. దీన్ని చదవండి'' అని ఎవరైనా అంటే ఆ పుస్తకము సంపాదించుకోవడానికి తెలుగు పాఠకుడు చాలా ఇబ్బంది పడవలసి వస్తోంది. మార్కెట్‌లో దొరకదు. వ్యాపారదృష్టిమాని సంస్కృతి పెంచే యోచనతో పుస్తక ప్రచురణ జరగాలి. ఈనాడు తెలుగు నాట ఎన్ని పత్రికలు వెలువడుతున్నా, అవన్నీ ఒకదాని కొకటి నీడగా వస్తున్నాయే తప్ప వివిధాభిరుచులతో భిన్న దృక్పథాలు గలవారికి ఉపయోగపడేలా ఉండడము లేదు. ఈ విషయాలలో మార్పువస్తే అభిరుచులు పెరిగే అవకాశం ఎంతయినావుంటుంది.

'కమిట్ మెంట్' యువకుల చైతన్యానికి పెద్ద ప్రతిబంధకంగా ఉంటూ సాహిత్యాన్ని ఉజ్జీవింప చేయడం లేదు. మేలుకోరి విలువల్ని పెంచే సద్విమర్శనల్ని కూడా సహృదయతతో స్వీకరింపదు. వీరికి నాయకత్వం వహించేవారు తమ ''ఇమేజ్'' పెంచుకోవడం కోసం తమనుండి వారు విడిపోకుండా

©KTBS Not to be republished

ఉండాలని, వీరి ఆలోచనలోని లోపాలను కచ్చితంగా నిర్దేశించి చెప్పలేక పోవడంతో, యువకులు ఆత్మ విమర్శకు దూరమైన ఆదర్శాలను యాంత్రికంగా వల్లె వేస్తుంటారు.

ఏది నిత్యం చూస్తూ, వింటూ ఉంటామో దాని ప్రభావం కూడ అభిరుచుల్లో మార్పు తెస్తుంది. ఈ నాడు యువకులు వేగి లేచిందే వింటున్నవి చాలా వరకు బూతుపాటలు. బస్టాండులో చూస్తున్నవి అసభ్యకరమైన రచనలు. యువకుల బలహీనతల్ని, చాపల్యాన్ని రెచ్చగొడుతున్నాయి. సాహిత్య ప్రక్రియలో అగ్రస్థానమందుకొన్న నాటకం ఈనాడు చలనచిత్రమై, పేలవమైన అభిరుచులే కలిగిస్తోంది తప్ప ఉన్నత ప్రమాణాలను అందించడం లేదు. యువకుల మనసత్వాన్ని తీర్చిదిద్దడంలో, ఎంతో బాధ్యత వహించవలసిన కవులు, కళాకారులు అశ్లీల సాహిత్యాన్ని ప్రతిఘటించకపోతే యెలా?

ఒకనాడు విలువైన జానపదగేయాల నాలాపించే భిక్షకులు ఈనాడు సినిమా పాటలు పాడుతున్నారు. జీవిత సత్యాన్ని విశ్లేషిస్తూ, ఆలోచనామృతాన్ని పంచే అధ్యాపకులు తరగతి గదిలో ఊకదంపుడు పాఠాలు చెపుతున్నారు. ఊరి వెలుపల ప్రశాంత వాతావరణములో ఆటపాటల మధ్య పిల్లల్ని ఆనందింప జేయవలసినపెద్దలు కృతక వినోదాల మధ్య ప్రొద్దు గడుపుతున్నారు. ఆయా పండుగలలో ఋతువులలో కానవచ్చే గీతి సంరంభం పల్లెలలో కనబడడం లేదు. ఈ విధంగా ప్రకృతి సహజమైన చేతన నశిస్తోంది. ప్రకృతి నేర్పే పాఠాలు యువత నేర్చుకోలేక పోతోంది. ఈ చైతన్యం పునరుజ్జీవించినప్పుడే యువకుల అభిరుచులలో స్పష్టమైన మార్పు వస్తుంది.

**1. కొత్త పదాలు :**

సమ్రాట్టు సనాతనులు అతిశయోక్తి రక్త నిష్ఠము.

**2. అర్థాలు :**

అచంచల దీక్ష= స్థిరమైన పట్టుదల; సనాతనులు= పూర్వకాలపు సంప్రదాయాలలో విశ్వాసం ఉన్నవారు; ఆధునికులు= ఈ కాలపు కొత్త భావాలు ఉన్నవారు; సమ్రాట్టు= చక్రవర్తి; సహజోక్తి= సహజమైన మాట; అతిశయోక్తి= అతిశయమైన మాట

**3. వ్యతిరేక పదాలు :**

అమృతం × విషం

సభ్యత × అసభ్యత

సత్యం × అసత్యం

**4. పర్యాయపదాలు :**

హృదయము : ఎద, డెందము.

**5. ప్రకృతి - వికృతులు :**

భిక్షము - బిచ్చము

©KTBS Not to be republished

**6. సంధులు :**

1. క్రొంగొత్త = క్రొత్త+క్రొత్త = ఆమ్రేడిత సంధి.
2. రసోన్ముఖం = రస+ఉన్ముఖం = గుణసంధి.
3. సహజోక్తి = సహజ+ ఉక్తి = గుణసంధి.
4. వివిధాభిరుచులు = వివిధ+ అభిరుచులు = సవర్ణ దీర్ఘ సంధి.
5. పునరుజ్జీవం = పునః + ఉజ్జీవం = విసర్గ సంధి.

**7. తప్పు, ఒప్పులను గుర్తించండి :**

1. సాహిత్య ప్రక్రియలో అగ్రస్థానం అందుకోనిది నాటకం (   )
2. ఈనాడు చలన చిత్రం పేలవమైన అభిరుచుల్నే కల్గిస్తోంది తప్ప ఉన్నత ప్రమాణాలను అందించడం లేదు (   )
3. హేతువాదానికి ఆలబంనగా సాహిత్యం నడవాలంటారు (   )
4. బాహ్యశరీరం, అంతఃశరీరం, బుద్ధి, మనస్సు, ఆత్మ అనేవి ఉత్తరోత్తరం బలీయాలు ( )
5. సంఘ సంస్కర్తల మీద రసవంతమైన సాహిత్యాన్ని సృష్టించవలసిన అవసరం ఉంది (   )

**8. కింది పదాలను సొంత వాక్యాల్లో రాయండి :**

1. ముందడుగు
2. మేలుకోరు.
3. ఆత్మవిమర్శ.
4. ఉత్తరోత్తరం బలీయాలు
5. ప్రచార నినాదం.
6. పిపాస
7. వడబోత
8. పునరుజ్జీవం.
9. ఊకదంపుడు.

**9. కింది ప్రశ్నలకు ఒకటిరెండు, వాక్యాలలో జవాబులు రాయండి :**

1. యువకులు ఏ లక్షణాలకు ప్రతీకలు?
2. రేపుమీద చూపున్నది ఎవరికి?
3. ఎవరి మీద సమాజం ఆశలు  నిలుపుకొన్నది?

©KTBS Not to be republished

4. రాజకీయవేత్తలు సాధించలేని కార్యాన్ని ఎవరు పరిష్కరించగలరని యువతరం విశ్వసిస్తోంది?
5. దేని వలన కళాధర్మం నశిస్తుంది?
6. సాహిత్య తత్త్వం దేనిమీద ఆధారపడి ఉంటుంది?
7. ఏది సత్యదూరం కాదు?
8. కవులు, కళాకారుల బాధ్యత ఎలాంటిది?
9. కవులు, కళాకారులు దేనిని ప్రతిఘటించాలి?
10. యువకుల అభిరుచుల్లో స్పష్టమైన మార్పు ఎప్పుడు వస్తుంది?
11. ఏవి ఉత్తరోత్తరం బలీయాలు?
12. ఆలోచనా బలాన్ని పుంజుకోవాలంటే ఏం జరగాలి?
13. రసపుష్టి ఎందువల్ల నశిస్తుంది?

**10. కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి :**

1. యువత స్థూల దృష్టికి గోచరించే వర్గాలను వివరించండి.
2. యువతరం సాహిత్య పిపాస ఎలాంటిదో వివరించండి.
3. సాహిత్య సృజనలో యువకులు విధిగా గుర్తించాల్సిన క్రమవికాసం ఎటువంటిదో తెల్పండి?
4. సాహిత్యాన్ని గురించి యువత అభిమతం ఎలాంటిది?
5. సాహిత్య శక్తిని గురించి యువత అభిప్రాయం ఎలాంటిది?
6. సాహిత్య కళాభిజ్ఞతను ఎలా పొందవచ్చు?
7. ఏ విషయాల్లో మార్పువస్తే అభిరుచులు పెరిగే అవకాశం ఉంటుంది?
8. 'కమిట్‌మెంట్' గురించి రచయిత అభిప్రాయాన్ని తెల్పండి?
9. అశ్లీల సాహిత్య ప్రభావాన్ని వివరించండి.

**11. కింది ప్రశ్నలకు పది, పన్నెండు వాక్యాలలో జవాబులు రాయండి :**

1. సాహిత్యంపై యువకుల అభిప్రాయాలను తెల్పండి.
2. 'యువకులు - సాహిత్యాభిరుచి' ఆధారంగా రచయిత అభిప్రాయాలను వివరించండి.

©KTBS Not to be republished

**12. కింది ఖాళీలను పూరించండి :**

1. యువకులు తీరని దాహానికి, నిరంతర చైతన్యానికి, అభ్యుదయానికి ____________
2. రేపు మీద చూపున్నది ఒక్క ____________ కు మాత్రమే.
3. పెక్కుమంది రాజకీయవేత్తలు సాధింపలేని కార్యాన్ని ఒక్క ____________ మాత్రమే పరిష్కరించగలడు.
4. అర్థం కావాలంటూ ____________లో చెప్పితే అది సాహిత్య స్థాయినందు కొంటుందా?
5. సాహిత్యతత్త్వం ఎక్కువగా ____________ మీద ఆధారపడి ఉంటుంది.

**13. విద్యార్థులకు సూచనలు :**

1. ప్రాచీన కావ్యాలలోని కొన్ని ప్రసిద్ధమైన పద్యాలను, శతక పద్యాలను, జానపద గేయాలను, వచనకవితలను కంఠస్థం చేయండి.
2. లోకోక్తులను, సామెతలను సేకరించండి.
3. స్నేహితులతో కలసి కవులు, రచయితలు వారి రచనల్ని గురించి చర్చించండి.

**14. అధ్యాపకులకు సూచనలు :**

1. ప్రాచీన కావ్యాలలోని పద్యాలను, ఆధునిక కావ్యాలలోని పద్యాలను, పాటలను, జానపదగేయాలను పాడి వినిపించండి. విద్యార్థులచే పాడించండి.
2. నన్నయ, తిక్కన, శ్రీనాథ, పోతన, వేమన, గురజాడ, వీరేశలింగంపంతులు, జాషువా, శ్రీ శ్రీ తిలక్, శేషేంద్ర శర్మ, బోయి భీమన్న, సినారె మొదలైన కవులను, రచయితలను గురించి వివరించండి.
3. తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధ కథకులు, నవలా రచయిత్రుల రచనల్ని గురించిన విశేషాలను బోధించి, విద్యార్థుల్లో మంచి అభిరుచిని, సృజనాత్మక ప్రతిభను, సామాజిక చింతనను వెలుగులోకి తీసికొని రావటానికి ప్రయత్నించండి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 6. జానపదవిజ్ఞానం- సామెతలు

- డా. ఆర్వీయస్ సుందరం

[ప్రస్తుత పాఠ్యభాగం 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' అనే గ్రంథంలోనిది. సామెత నిర్వచనం, లక్షణం, జన జీవితంలో సామెతకున్న ప్రాధాన్యం, ప్రాచుర్యం, ఉదాహరణలతో ఈ పాఠం చక్కగా వివరింపబడింది.

ఈ పాఠ్యభాగ రచయిత డా. ఆర్వీయస్ సుందరంగారు. వీరు మైసూరు విశ్వవిద్యాలయంలో కన్నడ అధ్యయన శాఖలో తెలుగు ఆచార్యులుగా పనిచేసి, నివృత్తి చెందారు.

వీరు తెలుగు, కన్నడ భాషలలో నిష్ణాతులు. ఈ రెండు భాషలలోను కవితలు, గద్యరచనలు, అనువాదాలు చేశారు.

'తెలుగు- కన్నడ జానపదగేయాలు; అన్నది వీరి పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథం. వీరు కన్నడంలోని ''సంస్కార'' నవలను తెనుగులోనికి, తెనుగులోని 'ఫిడేల్ రాగాల డజన్' కవితను కన్నడంలోనికి అనువదించారు. జానపద విజ్ఞానం పై అనేక రచనలు చేశారు. ]

'ఏదో సామెత చెప్పినట్లు'' సామెతను గురించి మనం తెలుసు కోవలసింది ఏముంది, అని ఎవ్వరైనా అనుకోవచ్చు. కాని ఒక్కొక్క సామెతలో అనుభవం వెనుక ఒక పరిపూర్ణ జీవిత సత్యమేదాగి వుండవచ్చు. ఒక సంపూర్ణ జీవిత సారమంతా ఒకే వాక్యంలో అడగి ఉండవచ్చు. తెలుగువారి సామెతల్లో , తెలుగు వారి జీవితంలోని అనేక ముఖాలు తొంగిచూస్తుంటాయి. అట్లే కన్నడిగుల సామెతలు, తమిళులవి, వంగభాష వారివి, చైనావారివి, జపాన్ వారివి, అమెరికావారివీ.

సామెత అనే మాట ''సామ్యత'' నుంచి వచ్చింది. వీటి ముఖ్య గుణాలలో సామ్యతను చెప్పడం కూడా ఒక్కటి. ఆంగ్లంలో సామెతను ''ప్రావెర్బ్'' (Proverb) అంటారు.

సంస్కృతంలో సూక్తి అని, సుభాషితమని, తమిళంలో పళమొళీ (పాత మాట) అని, కన్నడంలో గాదె (గాథా శబ్దభవం) లేక నాణ్ణుడి అని అంటారు. జన జీవితానికున్నంత వైవిధ్యం సామెతలకుంది.

'అల్పాక్షరాలలో అనల్పార్థరచన' అన్నవాక్యానికి సామెతలే ఉదాహరణలు. సామాన్యంగా సామెతలలో ఒక వాక్యం మాత్రం వుంటుంది. ప్రాచీన కళాత్మక అభివ్యక్తులలో సామెతలు ముఖ్యమైనవి. అయితే సామెతలు ఎప్పుడూ సంక్షిప్తంగానే ఉంటాయని అనుకోవడానికి వీలులేదు. నాతి దీర్ఘమై, గంభీరంగా సూచ్యంగా అనుభవాన్ని, అభివ్యక్తీకరించేట్లయితే అలాంటి వాక్యాలను సామెతలని పిలవడంలో తప్పులేదు.

సామెతలలో ఒక వాక్యంగాని, ఒకే పరిమాణంగల రెండు వాక్యాలుగాని ఉండవచ్చు. చివరికి అక్షరాల సంఖ్యలో గూడ పోలిక కన్పిస్తుంది. అంటే సామెతలోని రెండుభాగాల అక్షరాల సంఖ్య సమానంగా ఉంటుందన్నమాట. 'చేసింది పోదు, చేయంది రాదు'. 'చేసేవి లోపాలు, చెప్పితే కోపాలు' 'నలుగురు నడిచిందే బాట, పలువురు పలికిందే మాట'.

సామెతల లక్షణాలలో మానవుని వివేకాన్ని ప్రతిబింబించేది ఉండడం ఒకటిగా చెప్పుకోవచ్చు

©KTBS Not to be republished

కాని, ఈ వివేకం ఏదైనా వాక్యం రూపొందగానే అది సామెతగా చెప్పడానికి వీలులేదు. అది ఆక్షణంలో ఒక ఉక్తి (Saying) మాత్రమే. ఆ ఉక్తి ప్రజల్లో బాగా ప్రచారమై తనదైన ఒక సంప్రదాయాన్ని ఏర్పరచుకొని ఆ తర్వాతనే సామెత అవుతుంది.

సామెత నాణెంవంటిదే. ఎవరైనా నాణాన్ని ముద్రించినా ప్రజల్లో చలామణి అయిన తర్వాతనే నాణానికి విలువ వస్తుంది. అట్లే సంప్రదాయం, జనప్రియత్వం లేని ఉక్తులు, ఉక్తులుగానే వుండి పోతాయి. సూక్తులు కాలేవు.

కొన్ని సామెతలు పురాణాలు, ఇతిహాసాలు, కథలు మొదలైన వాటిని ఆధారంగా చేసికొని ఉద్భవిస్తాయి. పురాణేతిహాసాలు చాలా సామెతలకు ప్రేరణనిచ్చాయి. రామాయణ, మహాభారతాలు, బైబిలు, పంచతంత్రం మొదలైనవి ఇలాంటి గ్రంథాలు.

ఉదా:- ''రామాయణంలో పిడకలవేట'', ''వింటే భారతం వినాలి, తింటే గారెలే తినాలి'' ''రామాయణమంతావిని, రాముడికి సీతేంకావాలి అని అడిగినట్లు''.

సామెతలలో కొన్ని ఏదో సత్యాన్నిగాని, నీతినిగాని చెప్పేవిగా ఉండవచ్చు.

ఉదా:- పరుల సొమ్ము పాపిష్ఠి సొమ్ము (Honesty is the best policy)

ఒక సూత్రాన్నిగాని, అనుభవాన్నిగాని చెప్పేవి కొన్ని.

ఉదా:- మౌనం అంగీకార సూచకం (Silence gives Consent)

కొన్ని సామెతలు కథలను సూచించేవిగా, పాతకాలపు సంప్రదాయాలను, సూచించేవిగా ఉంటాయి. ఈసపు కథకు సంబంధించినవి, పంచతంత్రం కథలకు సంబంధించినవి అనేకం ఉన్నాయి.

''అందని ద్రాక్షపళ్ళు పుల్లన'' (Sour Grapes)

కొన్ని సంప్రదాయాలను, ఆచారాలను తెలిపే సామెతలున్నాయి. Good wine needs no bush అనే సామెత మద్యం అంగడి ముందు తీగను వ్రేలాడదీసే సంప్రదాయాన్ని గురించి తెలుపుతుంది. కొన్ని సామెతలకు అనుకరణలుగా మరికొన్ని సామెతలు పుట్టుకొస్తాయి. వీటిని అనుకరణ సామెతలుగా పేర్కొనవచ్చు.

వైద్యానికి సంబంధించిన సామెతలను ఒక వర్గంగా విభజించవచ్చు. గృహవైద్యానికి అనుభవమే జీవగఱ్ఱ. శాస్త్రీయాధారము లేకున్నా గృహ వైద్యం ఒక్కొక్క సారి చక్కగా పని చేస్తుంది. లాటిన్ సామెత అయిన 'Like Cures Like' అన్నదే హోమియోపతి వైద్యానికి ప్రేరణనిచ్చింది. 'ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదు' అని అనుభవజ్ఞుల మాట. 'An apple a day keeps the doctor away' అన్నది వైద్య సంబంధమైన సామెతల్లో ఒకటి.

వాతావరణానికి సంబంధించిన సామెతలు కూడా అనుభవమూలకమైనవే. 'కృత్తికలో విత్తితే కుత్తుకలు నిండవు' అని వ్యవసాయదారుడు అనుభవంతో తెలుసుకొన్నాడు. ఆరుద్రవానను గురించి బోలెడన్ని సామెతలున్నాయి. సామెతలలో ముఖ్యంగా రెండు రకాలున్నాయి. జనప్రియ సామెతలు, గ్రంథస్థసామెతలు

కొందరు నాగరికుల సామెతలనే మూడో విభాగాన్ని కూడా చేరుస్తారు. జనప్రియ సామెతలు ప్రజల్లో

©KTBS Not to be republished

సహజంగాపుట్టినవి. మిగిలినవి చాలావరకు కల్పితమైనవి. ప్రాస, లయ, ఛందస్సు వగైరాలను ప్రయత్న పూర్వకంగాచేర్చి కవులు, విద్యావంతులు అటువంటి సామెతల్ని రూపొందిస్తారు. జానపద సామెతలది గ్రామ్యభాష. నాగరికుల సామెతలది గ్రంథస్థ భాష. సామెతలు కూడా జనబాహుళ్యంలో ప్రాచుర్యాన్ని సంపాదించి జానపద సామెతలుగా పరిణమించవచ్చు. వేమన పద్యాలలో మూడవ పాదం సామెతగా చలామణి అవుతుండం దీనికి ప్రత్యక్ష నిదర్శనం. అయితే సామెతల్ని పనిగట్టుకొని సృష్టింప బూనడం, గ్రంథాల్లోనుంచి సుభాషితాల్ని ప్రచారం ఉన్నా, లేకున్నా వెలికిలాగి సామెతలుగా నిరూపింప బూనడం జానపద విజ్ఞానానికి చేసే అపచారం.

గేయాలు మొదలైన సాహిత్య రూపాలలాగే సామెతల్ని కూడా వస్తువుని బట్టి, రచనను బట్టి, ప్రాసాదులను బట్టి వర్గీకరింపవచ్చు. వస్తువును బట్టి సామెతల్ని విభజించేటట్లయితే పౌరాణికాలనీ, చారిత్రకాలనీ రూపాలేర్పడతాయి. కొన్ని సామెతలు స్థలపురాణాలు, అంటే అవి ఆయా స్థలాల వైశిష్ట్యాన్ని తెలుపుతాయి. వస్తువుని బట్టి చేసే వర్గీకరణలో ప్రకృతి వస్తువులను గురించిన సామెతలను కూడా చేర్చవచ్చు.

సామెతలలో ఎంత వైవిధ్యముందంటే నిజానికి ఒక్కొక్క సామెతా ఒక్కొక్క ప్రత్యేక విభాగమని చెప్పదగి ఉంది. మానవుని అనుభవానికి, స్వభావానికి, సంబంధించిన సామెతల్ని పెద్ద విభాగంగా పేర్కొనవచ్చు. వేదాంత పరమైన సామెతల్ని కూడా ప్రత్యేక విభాగంగా చెప్పవలసియుంది. సలహాలు, చమత్కారాలు, విజ్ఞానానికి సంబంధించిన సామెతల్ని మరో విభాగంగాపేర్కొనవచ్చు. కథలకు తోకలుగా పుట్టుకొచ్చే సామెతలొక విభాగం. శృంగారం, హాస్యం, మొదలైన వాటికి సంబంధించిన సామెతలను ప్రత్యేకంగా పేర్కోవాలి. ఇవి కాక అలంకారకమైన సామెతలన్నింటిని కలిపి ఉపమలు, రూపకాలు, శబ్దాలంకారాలు కలవి. ఈ విధంగా కొన్ని విభాగాలను ఏర్పరచవచ్చు. ఇవిగాక ఆయా ప్రదేశాలలో వుండే విశేషాలను గుర్తించి, వర్గీకరణ చేయవలసి ఉంది.

ప్రపంచంలో ఎంతోమంది సామెతల్ని సేకరించి, సంకలనాలను ప్రచురించారు, గ్రీకు సామెతల్ని సేకరించిన అరిస్టాటిల్ ప్రపంచంలోనే మొట్టమొదట శాస్త్రీయ సంకలనకారుడని ప్రఖ్యాతి చెందాడు. కర్నల్ బ్యాక్ స్ట్రోమ్ 20,000 స్వీడిష్ సామెతల్ని సేకరించాడు. ఎ స్టోరియన్ జానపద భాండారంలో లక్షకుపైగా ఎ స్టోరీయన్ సామెతలున్నాయని తెలుస్తున్నది. మన చిలుకూరి నారాయణరావుగారు కూడా లక్షసామెతల్ని సేకరించారట.

యువ భారతివారు ఒక చిన్న సంకలనాన్ని వేశారు. డా. జి. యస్. మోహన్‌గారు కన్నడ, తెలుగు సామెతలను ప్రచురించారు. దక్షిణ భారతీయ పుస్తక సంస్థవారు దక్షిణ భారతీయ భాషల్లోని సమానార్థ కాలైన సామెతల్ని చిన్న పుస్తకంగా ప్రచురించారు.

నన్నయనాటి నుంచి కావ్యాలలో ఎన్నో సామెతలు, పలుకుబళ్ళు, నుడికారాలు, లోకోక్తులు కన్పిస్తాయి. కానీ వాటితో వచ్చిన చిక్కల్లా కవి కల్పితాలా, లేక జన వ్యవహారంలో వుండిన సామెతలా అన్నది తెలియక పోవడమే. ఏది ఏమైనా గ్రంథస్థ సామెతలు శిష్ట సాహిత్యం మీద జానపద సాహిత్యం ప్రభావాన్ని సూచిస్తాయి.

ఈ క్రింది కొన్ని వాక్యాలు సామెతలుగా చలామణి అవుతుండినవి. సామెతల్ని పోలినవి. సామెతల్ని చూచి కవులు కల్పించినవి, అని ఏ విధంగానైనా చెప్పుకోవచ్చు. అయితే మొత్తం మీద ప్రాచీన కాలం



©KTBS Not to be republished

నుంచి తెనుగు నాట సామెతలు జనజీవితంలో భాగంగా ఉండేవనడానికి ఇవి నిదర్శనాలు.

‘ గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్ ’
‘ వృద్ధుల బుద్ధులు సంచలింపవే ’
‘ యజమాన భక్ష్యమగు పురోడాశమది గుక్క కర్భమగునే ’
‘ లేడి కడుపున పులి పుట్టునే? ’
‘ కయ్యమున కొండొకరుండిటు లొంటి వచ్చునే ’
‘ పాలలో బడిన బల్లి విధంబున నుండకుండునె ’
‘ కలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబులన్ ’
‘ పట్టిన పదడైన పసిడియై వెలింగె ’ (పాల్కురికి సోమన)

పైవన్నీ ఒక ఎత్తు. వేమన పద్యాలే ఒక ఎత్తు. వేమన పద్యాల మూడవ పాదం చాలావరకు సామెత వంటిదే. వేమన జీవితానుభవంతో కవిత చెప్పినవాడు కావడంచేత అనుభవమే మూలద్రవ్యమైన సామెతలు వేమన సూక్తులలో కోకొల్లలుగా కన్పిస్తాయి. ఈ వాక్యాలు వేమనను అచ్చమైన ప్రజాకవిగా చేశాయి.

‘భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు’.
‘అనువుగాని చోట అధికుల మనరాదు’.
‘పదుగురాడు మాట పాటియై ధర జెల్లు’.
‘తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు’.
‘కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?’
‘సాధనమున పనులు సమకూరుధరలోన’
‘పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా’
‘చిత్త శుద్ధిలేని శివపూజ లేలరా’

కవుల కావ్యాలలో పైవిధంగా సామెతలు, పలుకుబళ్ళు అధిక సంఖ్యలలో దొరకడం వాటి ప్రాచుర్యాన్ని తెలుపుతుంది. శిష్టకవుల కావ్యాలలోనే తొంగిచూచే సామెతలు జానపద సాహిత్యంలో అసంఖ్యాకంగా కనిపిస్తాయనడంలో సందేహం లేదు. గేయాలలో, కథా గేయాలలో, గద్య కథలలో సామెతలు బోలెడన్ని కన్పిస్తాయి.

ఉదాహరణకు కొన్ని

‘పేదవాని కోపము పెదవికి చేటు’
‘చల్ల కోసము వచ్చి ముంత దాచగనేల’
‘కడవంత గుమ్మడికాయ కత్తిపీటకు లోకువ’
‘దాసుని తప్పు దండముతో సరి’

ఇలా సామెతల విలువను సమాజంలో వాటి పాత్రను లోతుగా పరిశీలించవలసిన అవసరం ఎంతయినా వుంది. సాహిత్యపరంగా, సామాజికంగా, సాంస్కృతికంగా సామెతలను విశ్లేషించవలసి ఉంది.

© KTBS Not to be republished

©KTBS Not to be republished

## అభ్యాసాలు

**1. కొత్త పదాలు :**

1. సుభాషితం 2. సంప్రదాయం 3. అనల్పార్థం 4. ప్రేరణ 5. జీవగఱ్ఱ.

**2. అర్థాలు :**

గతకాలం = గడిచిపోయిన కాలం; వృద్ధులు = ముసలివాళ్ళు; యజమానుడు = యజ్ఞం చేసేవాడు; పురోడ + ఆశము = యజ్ఞ సంబంధమైన ప్రసాదం (పవిత్ర పదార్థం); కయ్యం = యుద్ధం; కలంచు = కలతబెట్టు; పదడు = మన్ను; పసిడి = బంగారు; చల్ల = మజ్జిగ.

**3. వివరణలు :**

1. పురాణం : ప్రాచీనమైనా కొత్తగా ఉండేది. నీతి ధర్మాలను ప్రబోధించేది. ఉదా: అష్టాదశ పురాణాలు.
2. ఇతిహాసం : 'ఇలా జరిగింది' అని తెలియజెప్పే గొప్ప వ్యక్తులను గూర్చిన చరిత్ర. ఉదా: భారతం, రామాయణం.

**4. సంధులు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1. | పురాణ | + | ఇతిహాసాలు | = | పురాణేతిహాసాలు | గుణసంధి |
| 2. | సు | + | ఉక్తి | = | సూక్తి | సవర్ణదీర్ఘసంధి |
| 3. | కావ్యము | + | లు | = | కావ్యాలు | లు. ల. నలసంధి |

**5. వ్యతిరేక పదాలు :**

1. అల్పం × అనల్పం
2. సమానం × అసమానం
3. వివేకం × అవివేకం
4. ఆధారం × నిరాధారం
5. సత్యం × అసత్యం
6. నీతి × అవినీతి
7. సహజం × అసహజం.

**6. ఈ క్రింది పదాలను సొంత వాక్యాలలో రాయండి.**

1. జీవ గఱ్ఱ 2. పనిగట్టుకొని 3. లోకువ 4. చేటు.

**7. ఈ క్రింది ప్రశ్నలకు ఒకటి-రెండు వాక్యాలలో జవాబులు రాయండి :**

1. సామెతలలో ఎన్ని వాక్యాలుంటాయి?
2. సామెత ఎలా ఏర్పడుతుంది?
3. వాతావరణానికి సంబంధించిన సామెతలేవి?
4. సామెతలను ఎన్ని విధాలుగా వర్గీకరింపవచ్చును?

**b. క్రింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో జవాబులు రాయండి :**

1. తెలుగువారి జీవితంలో ఏవి తొంగి చూస్తూ ఉంటాయి?
2. ఆంగ్లంలో సామెతను ఏమంటారు?
3. 'సామెత' అనే మాట ఇతర భాషల్లో ఏయే పేర్లతో పిలువ బడుతున్నది?
4. ఎలాంటి అంశాలున్న వాక్యాలను సామెతలని పిలవడంలో తప్పులేదు?
5. సామెతలలో రకాలను, వాటికి ఉదాహరణాలను ఇవ్వండి.
6. వైద్యానికి సంబంధించిన సామెతలను తెలపండి.
7. అరిస్టాటిల్ దేనికి ప్రఖ్యాతి చెందాడు?
8. సామెతలను ప్రచురించిన వారిని పేర్కొనండి.

**8. క్రింది ఖాళీలను పూర్తించండి :**

1. సామెత అనేమాట ______________ నుంచి వచ్చింది.
2. సామాన్యంగా సామెతలలో ______________ మాత్రం ఉంటుంది.
3. సామెత ______________ వంటిదే.
4. మౌనం ______________ సూచకం.
5. అందని __________ పళ్ళు __________
6. చిలుకూరి నారాయణరావుగారు కూడా ______________ సేకరించారట.

**9. కార్యాచరణం**

పెద్దల సంభాషణలోని సామెతలను గుర్తించి రాయండి.

♣ ♣ ♣

©KTBS
Not to be republished

# 7. డా. చంద్రశేఖర కంబార

['సహితస్య భావమే సాహిత్యము' అన్నది ఆర్యోక్తి. సమాజహితంతో కూడుకొన్న సాహిత్యం సర్వదా గౌరవార్హమే. నాడు సాహిత్యసత్కారాలకు రాజాస్థానాలు ఆటపట్టులయితే నేడు ప్రభుత్వ సంస్థలు, స్వకీయ(ప్రైవేట్) సంస్థలు ఆ బాధ్యతను నిర్వహిస్తున్నాయి. అలాంటి సాహిత్య సత్కారాలలో అత్యున్నత మైనది 'జ్ఞాన పీఠ ప్రశస్తి'

భారత దేశం అనేక భాషలకు నిలయం కావున జ్ఞానపీఠ బహుమతిని పొందడానికి ప్రధాన భారతీయ భాషాసాహిత్యాలను మాత్రమే అర్హంగా పరిగణిస్తారు. ప్రధాన ద్రావిడ భాషలలో ఇప్పటికి ఎనిమిది మార్లు ఈ బహుమతిని పొందిన ఘనత కన్నడ భాషా సాహిత్యానిదే. కన్నడ సాహితీ మకుటంలోని ఎనిమిదవ భూషణమే డా. చంద్రశేఖర కంబారగారు. అననుకూల పరిస్థితులను సైతం పట్టుదలతో, సంకల్పబలంతో అనుకూలంగా మార్చుకోవచ్చునని, కృషి ఉంటే మానవులు మహనీయులవుతారని తెలిపే ఈ పాఠ్యాంశం విద్యార్థులకు ప్రేరణ కారకం [ఈ పాఠ్యాంశం పత్రికలు, అంతర్జాలం, తక్కిన గ్రంథాల ఆధారంగా రచించ బడింది. ]

©KTBS Not to be republished

చంద్రశేఖర కంబారగారు 1937వ సంవత్సరం జనవరి 2న జన్మించారు. వీరి జన్మస్థలం బెళగావి జిల్లాలోని హుక్కేరి తాలుకాలోని ఘోడగేరి అనే కుగ్రామం. ఆ గ్రామంలోని ఒకనిరుపేద కుటుంబంలో కంబార మూడవసంతానంగా జన్మించారు. చిన్నతనంలో తల్లి నోట విన్న జానపద గీతాలు, ఊళ్ళో ప్రదర్శించే బయలాటలు, సంగ్యాబాళ్యడప్పులాట, లావణిగీతాల ఆలాపన కంబార మనస్సులో చెరగనిముద్ర వేశాయి. ఇలాంటి స్వచ్ఛమైన, సమృద్ధమైన గ్రామీణ వాతావరణం కంబారగారి విశిష్ట సాహితీ ప్రతిభను రూపొందించింది.

చదువుకోవాలని కంబార తహ తహ. అతని ఈ ఆకాంక్షకు నిరుపేదరికం ఆటంకమైంది. ఆ సమయంలో ఆదుకున్నవాడు దానప్ప అనే ఆప్తమిత్రుడు. కాని అతని అకాల మరణంతో కంబార పరిస్థితి అయోమయమయింది. ఆ సమయంలో బాలప్ప మాస్టారు కంబారగారికి దారి దీపమయ్యాడు. బెళగావిలోని నాగనూరు మఠంలో చేర్చి మహోపకారం చేశాడు. అక్కడ కంబార కృష్ణమూర్తి మాస్టారి అభిమానాన్ని చూరగొన్నాడు. అప్పటినుండి కంబారగారి జీవితంలో పురోగమనమేగాని తిరోగమనం అన్న మాటకు చోటే లేదు.

కర్ణాటక విశ్వ విద్యాలయంలో ఎం. ఎ చదివే రోజుల్లో ఆయనలో నిక్షిప్తమై ఉన్న సాహిత్యబీజం అంకురించింది. డా. ఎం. ఎం. కల్బుర్గి; గిరడ్డి గోవిందరాజు; డా. సిద్ధలింగ పట్టణ శెట్టి; ప్రొ. చంద్రశేఖర పాటిల వంటి హేమా హేమీల స్నేహంలభించింది. ఈ మిత్రత్వమే వారు ఒక్కొక్కరు ఒక్కొక్కరంగంలో ప్రత్యేకత సాధించడానికి పునాది రాళ్ళయ్యాయి.

ఎం. ఎ విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత కంబార బెళగావిలోని లింగరాజు కళాశాలలో ఉపన్యాసక వృత్తిని చేపట్టారు. తరువాత ఉడుపి, సాగరలలో వృత్తిని కొనసాగించారు. అనంతరం కొద్దికాలం చికాగో విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేశారు. పిమ్మట స్వదేశం వచ్చి బెంగుళూరు విశ్వవిద్యాలయంలో దాదాపు రెండున్నరదశాబ్దాల పాటు ఆచార్య పదవిని నిర్వహించారు. ఈ సందర్భంలోనే వారి సాహితీ

జీవన ప్రవంతి విస్తృతమైంది. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సొసైటికి నాలుగు సంవత్సరాలు (1996-2000) అధ్యక్షులుగా ఉన్నారు. కర్ణాటక నాటక అకాడెమి అధ్యక్షులుగా మూడు సంవత్సరాలు (1980-83) సేవ చేశారు.

కంబార సాహితీ క్షేత్రంలో చేసిన కృషి ఎనలేనిది. ఆయన రచనలకు లభించిన అవార్డులు అనేకం. కంబార ఆరాధించింది కావ్యాన్ని, ఆనందించింది నాటకాన్ని. 1958 నాటికి 'ముగుళు' మొదటి కవితా సంకలనాన్ని ప్రకటించిన కంబార 'హేళతీన కేళ' అనే రెండవ కవితా సంపుటిని కూడా ప్రకటించారు. ఈ రెండు సంకలనాలు ఆయనలోని దేశీయతకు ఉత్కృష్ట ఉదాహరణలు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన కంబార లేఖినినుండి వెలువడిన సాహిత్య ప్రక్రియలు అనేకానేకాలు. వీరి రచనలు ఎన్నో బహుమతులు సాధించాయి. 'తకరారినవరు'; 'సావిరద నెరళు'; 'అయ్యకవనగళు'; 'బెళ్ళిమీను'; 'అక్కక్కు-హాడుగళు'; 'ఈ వరెగిన హేళతీనకేళ'; 'చకోరి'; మొదలైన కవితా సంకలనాలు వారికలంనుండి వెలువడిన వాటిలోకొన్ని. తకరారినవరు సంకలనానికి కేరళ రాష్ట్రపు ఆశాన్ బహుమతి లభించింది. 'రాక్స్ ఆఫ్ హంపి' అనేది వీరి ఆంగ్ల కవన సంకలనం.

కంబార రంగస్థలం లోతుపాతులు సుస్పష్టంగా తెల్సినవారు. ప్రాచ్య, పాశ్చాత్య నాటకాల పరిజ్ఞానంతో జానపదుల నమ్మకాలు, పురాణప్రతీకలు, బ్రతుకులోని వైవిధ్యంతో కూడిన ఇతివృత్తాలతో నాటక రచనగావించారు. మొత్తం ఇరవైమూడు నాటకాల్ని రచించి కన్నడ నాటకరంగాన్ని సుసంపన్నం గావించారు. 'నార్సిసస్'; 'ఋష్యశృంగ'; 'నెలసంపిగె'; 'జోకుమారస్వామి'; 'కాడుకుదురె'; 'హరికెయకురి'; అనేనాటకాలు కన్నడ సాహిత్య క్షేత్రానికి వీరు అర్పించిన కానుకలు. 'ఋష్యశృంగ'; 'కాడుకుదురె; 'నాయికథె'; హులియ నెరళు నాటకాలు చలనచిత్రాలుగా రూపొందాయి. 'నాయికథె' చలనచిత్రం ఐదు రాష్ట్రాల బహుమతులు గెల్చుకొన్నాయి 'జోకుమారస్వామి' నాటకానికి రాజ్యసాహిత్య అకాడెమీ అవార్డు, కమలాదేవి చటోపాధ్యాయ బహుమతీ లభించాయి. ఈ నాటకం భారతీయ భాషలలోనికే కాక ఆంగ్లభాషలోనికి కూడా అనువదింపబడింది.

కావ్యనాటకరంగాల్లోనే కాక నవలా రచనలో కూడా కంబారగారిది అందె వేసిన చేయి. 'అణ్ణతంగి'; 'కరిమాయి'; 'జి. కె. మాస్తరిన ప్రణయ ప్రసంగ'; 'సింగారవ్వ మత్తు అరమనె'; 'శిఖరసూర్య'; అనే నవలలు రచించారు. వీటిలో జి. కె. మాస్తరిన ప్రణయ ప్రసంగ హిందీ భాషలోనికి అనువదింపబడింది. 'సింగారవ్వ మత్తు అరమనె' నవల కన్నడ సాహిత్య అకాడెమీ బహుమతులను గెల్చుకోవడమేకాక హిందీ, మలయాళం, ఆంగ్ల భాషలలోనికి కూడా అనువదింప బడింది. 'శిఖర సూర్య' బృహత్ నవల టాగూర్ సాహిత్య ప్రశస్తిని పొందడం కంబారగారి నవలా రచనా శ్రేష్ఠతకు పరాకాష్ఠ.

నిరంతర సాహిత్య కృషి, పరిశోధనలలో నిమగ్నమైన కంబార వాటికి సంబంధించి అనేక రచనలు చేశారు. వాటిలో వారి పరిశోధనా గ్రంథం (సిద్ధాంతవ్యాసం) 'ఉత్తర కర్ణాటకద జనపదరంగభూమి' ప్రముఖమైంది. అలాగే బణ్ణిసి హాడవ్వ; ననబళగ; బయలాటగళు; మాతాడులింగవె; నమ్మ జానపదకోశ; బేడరహుడుగ మత్తు గిళి; కాసిగొందుసేరు; నెలద మరెయ నిధాన; దేశీయ చింతన మొదలైనవి కూడా ప్రధానమైనవి. బేడరహుడుగ మత్తు గిళి రచన కర్నాటక రాష్ట్ర సాహిత్య అకాడెమీ బహుమతిని పొందింది.

©KTBS Not to be republished

ఆధునిక భారతీయ నాటకాలను గురించి జాతీయనాటకశాలకు రెండు సంపుటాల బృహత్ కృతిని రచించారు. వీరి అనేక కృతులు ఆంగ్ల, హిందీ, మరాఠీ, తెలుగు, తమిళం, కొంకిణి, పంజాబీ, మలయాళం మొదలైన అనేక భారతీయ భాషలలోనికి అనువదింపబడటం గర్వకారణం. కంబార సాహిత్యాన్ని గురించి అనేక సిద్ధాంత వ్యాసాలు వెలువడ్డాయి.

చంద్రశేఖర కంబార సాహితీరంగంలోనే కాక చలన చిత్ర పరిశ్రమలో కూడా విశేష కృషి సలిపారు. ఆయన నాటకాల ఆధారంగా తీసిన చలన చిత్రాలకు తామే స్వయంగా దర్శకత్వం వహించారు. కరి మాయి; సంగీత; కాడుకుదురె; మొదలయినవి ఆయన దర్శకత్వం వహించిన ప్రధానమైన చిత్రాలు తమ చిత్రాలన్నింటికి తామే స్వయంగా సంగీతాన్ని సమకూర్చారు. కాడుకుదురె చిత్రానికి కంబార రచించిన శీర్షికగీతం (టైటిల్ సాంగ్) నేషనల్ ఫిల్మ్ అవార్డు పొందింది. వెండి తెరకేకాక బుల్లితెరకు చిత్రంగా సమకూర్చారు. అంతేకాక రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు అనేక రూపకాల (డాక్యుమెంటరీల)ను రూపొందించారు.

కంబారగారు హంపీలోని కన్నడ విశ్వవిద్యాలయం ప్రప్రథమ ఉపాధ్యక్షులు. కన్నడ విశ్వవిద్యాలయం స్థాపనలో, పాలనలో, ఆయన కృషి అనన్య సామాన్యం. రెండు కాలావధులను విజయవంతంగా పూర్తి చేసి పదవీ విరమణ పొందారు. పిమ్మట శాసనమండలి సభ్యునిగా నియమితులయ్యారు.

డా. కంబార సాహితీ సంబంధ, విద్యావిషయక రచనలు అనేకం చేశారు. ఎనిమిది కావ్య సంకలనాలు, మూడు నవలలు, ఇరవైరెండు నాటకాలు, పన్నెండు పరిశోధనా విషయ సంబంధితాలు ఇంకా అనేకం వీరి కలంనుండి వెలువడ్డాయి. ఈ సాహితీ వేత్త నిరంతర సాహితీ సేవకు లభించిన అవార్డులు అనేకం. సాహిత్య అకాడెమి, (1991) సంగీత అకాడెమీ (1993) పద్మశ్రీ (2001) టాగూర్ లిటరరీ అవార్డు; నేషనల్ ఫిల్మ్ అవార్డు; కాళిదాస సమ్మాన్; కబీర్ సమ్మాన్; పంప; నాడోజ, మొదలైన అవార్డులు లభించాయి. వీటన్నిటికి శిఖర ప్రాయమైంది వీరికి లభించిన జ్ఞానపీఠ బహుమతి. ఈ అత్యుత్తమ బహుమతి వీరి సమగ్ర రచనలకు ఇవ్వబడింది. 2009 సంవత్సరానికి ఈ బహుమతికి ఎన్నికయ్యారు. వీరికి ఈ ప్రశస్తిని 2011, సెప్టెంబర్‌లో ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా కర్ణాటక ప్రభుత్వం వారిని ఘనంగా సన్మానించింది. ఆ సన్మాన సభలో ప్రభుత్వం కంబారగారి రచనలన్నింటిని పునర్ముద్రించి పాఠశాల గ్రంథాలయాలలో ఉంచడమే కాక, ఇతర భాషలలోనికి అనువదింప చేస్తామని, ఆయన రచించిన నాటకాలను ప్రదర్శనార్థమై, నాటకోత్సవాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది.

భారతదేశంలో ఒక మారుమూలగ్రామంలో, సాంఘికంగా వెనుకబడ్డ ఒక నిరుపేద, నిరక్షరాస్య కుటుంబంలో పుట్టి, పట్టుదల, దీక్ష, స్వయంకృషితో ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చునని నిరూపించిన మహామనీషి కంబార. ఎంత ఎత్తుకు ఎదిగినా వృక్షం తన వేళ్ళద్వారా భూమినుండే జీవనాధారమైన ఆహారాన్ని గ్రహించినట్లు కంబారగారు కూడా తాము పుట్టి పెరిగినప్రాంత పరిసరాలనుండియే తమ సాహిత్య ఇతివృత్తాన్ని, భాషను, భావాన్ని, అది, ఇది, అననేల తమ సాహిత్య రచనకు అవసరమైన సమస్త సామాగ్రిని గ్రహించి దేశీయతను రూపించుకొన్నారు, నిరూపించుకొన్నారు. దైహికంగా వారు తమ ఊరికి దూరంగా ఉన్నా మానసికంగా వారి విహారం వారు పుట్టిపెరిగిన ఊరే అనడం అతిశయోక్తి కాదు.

©KTBS Not to be republished

కవి, నాటకకారుడు, నవలాకారుడు, కళాకారుడు, పరిశోధకుడు, పాలనాదక్షుడు అయిన డా. చంద్రశేఖర కంబారగారు సమాజశ్రేయస్సుకు సర్వదా శ్రమిస్తున్న సాహితీ కృషీవలుడు.

**1. కొత్త పదాలు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆర్యోక్తి | సహితస్య | ఆటపట్టులు | కృతికర్తలు | కలికితురాయి | |
| సుసంస్కృత | సమృద్ధ | ప్రతిభ | హేమాహేమీలు | పురోగమనం | ప్రాచ్య |
| ఇతి వృత్తాలు | పరంపర | నిమగ్నం | పరిశోధన | పునర్ముద్రించు | భావనాత్మకం |

**2. అర్థాలు :**

సహితస్య = హితంతో కూడుకొన్నది; ఆర్యోక్తి = పెద్దలమాట; అభిషిక్తార్హం = అభిషేకానికి తగినది; ఆటపట్టులు = ఆటలకు నెలవైన చోట్లు;(నెలవైనవి అని అర్థం). భూషణం = నగ; అలంకారం; సుసంస్కృత = బాగుగా సంస్కరింపబడిన; సమృద్ధి = ఎక్కువ / అధికం; పురోగమనం = అభివృద్ధి / ముందుకు పోవు; హేమాహేమీలు = అధికులు; మొనగాళ్ళు, ప్రతిమ = బొమ్మ; తురాయి = తలపై ధరించెడినగ; కలికి = అందమైన స్త్రీ; ఆకాంక్ష = కోరిక; నిక్షిప్తం = ఉంచబడిన; స్రవంతి = ప్రవాహం; రంగస్థలం = నాటకరంగం; ప్రతీకలు = గుర్తులు; అవధి = పరిమితి; కృషీవలుడు = రైతు; బృహత్ = గొప్ప; మగ్నం = లీనం /మునిగి ఉండడం; రొఖ్ఖం = నగదు; డబ్బు; ధనం.

**3. పర్యాయ పదాలు :**

కలికి : స్త్రీ; నారి, అబల; అంగన; పొలతి.

వాగ్దేవి : సరస్వతి; వాణి; భారతి; గీర్వాణి.

బహుమతి : ప్రశస్తి; కానుక; పురస్కారం

సంవత్సరం : వర్షం, ఏడు; అబ్ది; వత్సరం

విశ్వం : ప్రపంచం; జగతి; జగం

రొఖ్ఖం : నగదు; డబ్బు; ధనం; రూపాయలు

బలం : శక్తి; సామర్థ్యం; దృఢం; గట్టిదనం

ప్రతీక : గుర్తు; చిహ్నం; సంజ్ఞ

©KTBS Not to be republished

**4. ప్రకృతి - వికృతులు :**

భాష - బాస

వృద్ధి - వడ్డి

ప్రయాణం - పయనం

దీపం - దివ్వె

విద్య - విద్దె

**5. జంటపదాలు :**

తహతహ, హేమాహేమీలు

**6. వ్యతిరేక పదాలు :**

ఉత్తమం × అధమం

పురస్కారం × తిరస్కారం

గౌరవం × అగౌరవం

సందర్భం × అసందర్భం

సులభం × కష్టం

జ్ఞానం × అజ్ఞానం

ఉపకారం × అపకారం

అభిమానం × దురభిమానం

ముందు × వెనుక

మిత్రత్వం × శత్రుత్వం

అక్షరాస్యత × నిరక్షరాస్యత

అర్థం × అనర్థం

ప్రాచ్య × పాశ్చాత్య

**7. వ్యుత్పత్తి అర్థాలు :**

1. సౌధం - సుధతో కట్టబడినది - మేడ
2. లేఖిని - లిఖించునది - కలం

©KTBS Not to be republished

3. సాహిత్యం - హితంతో కూడుకొన్నది -
4. చలనచిత్రాలు - చలించేచిత్రాలు -
5. వాగ్దేవి - వాక్కుకుదేవి - సరస్వతి
6. సంస్కృతం - సంస్కరింప (పరిష్కరింప) బడినది - దేవభాష

## అభ్యాసాలు

**8. కింది పదాలకు వ్యతిరేక పదాలను రాయండి :**

1. విజయం × ____________
2. ప్రధానం × ____________
3. సామాన్యం × ____________
4. అన్యం × ____________
5. ఏకం × ____________
6. సమగ్రం × ____________
7. ఆదరం × ____________
8. అవసరం × ____________

**9. కర్తృ వాక్యాలు, కర్మణి వాక్యాలు :**

1. కర్తృ వాక్యాలు :- కర్త ప్రధానంగా కల వాక్యాలు
   **ఉదా :** కల్పనను బంధువులు అడ్డుపెట్టారు
2. కర్మణి వాక్యాలు :- కర్మ ప్రధానంగా కల వాక్యాలు
   **ఉదా :** బంధువులచే కల్పన అడ్డుపెట్ట బడింది

**10. కింది కర్తృ వాక్యాలను కర్మణి వాక్యాలుగా మార్చండి :**

1. జైన్ దంపతులు జ్ఞానపీఠం స్థాపించారు.
2. సాహిత్యవేత్త తన క్షేత్రంలో గొప్ప కృషి చేయాలి.
3. ప్రధాన భారతీయ భాషా సాహిత్యాలను మాత్రమే పరిగణిస్తారు.
4. కంబార కవితా సంకలనాన్ని ప్రకటించారు.
5. కంబార కావ్యాన్ని ఆరాధించారు.

**11. కింది కర్మణి వాక్యాలను కర్తృ వాక్యాలుగా మార్చండి:**

1. కంబార నాటకాలు చలనచిత్రాలుగా రూపొందింపబడ్డాయి.
2. ప్రభుత్వంచే కంబార సాహిత్యం పునర్ముద్రింపబడింది.

©KTBS Not to be republished

3. చలన చిత్రాలకు కంబారచే సంగీతం సమకూర్చ బడింది.
4. కంబారచే బృహత్ కృతి రచింపబడింది.

**12. ఖాళీలను సరి అయిన పదాలతో పూరించండి :**

1. 1965 నుండి బహుమతి ప్రదానం ____________
2. ప్రధాన భాషా సాహిత్యాలను ____________ అర్థంగా పరిగణిస్తారు.
3. కంబార మనస్సులో చెరగని ముద్ర ____________
4. తిరోగమనం అన్న మాటకు చోటు ____________
5. కంబార సాహిత్యం ఇతర భాషలలోనికి ____________
6. అకాడెమి అధ్యక్షులుగా సేవ ____________
7. అనేక సిద్ధాంత వ్యాసాలు ____________
8. కంబార ఆంగ్ల కావ్య సంకలనం ____________

**13. సందర్భ సహిత వ్యాఖ్యలు రాయండి :**

1. కంబారగారి విశిష్ట సాహితీ ప్రతిభను రూపొందించింది.
2. అతని అకాల మరణంతో కంబార పరిస్థితి అయోమయమైంది.
3. అప్పటినుండి తిరోగమనం అన్న మాటకు చోటేలేదు.
4. ఈ సందర్భంలోనే వారి సాహితీ జీవన స్రవంతి విస్తృతమైంది.
5. ఈ రెండు సంకలనాలు ఆయనలోని దేశీయతకు ఉత్కృష్ట ఉదాహరణలు.

**14. కింది పదాలను సొంతవాక్యాలలో ప్రయోగించండి :**

1. ఆటపట్టులు
2. చెరగని ముద్రవేయు
3. తహతహలాడు
4. దారి దీపం
5. హేమా హేమీలు
6. లోతుపాతులు
7. పరాకాష్ఠ
8. గౌరవార్థం
9. నిక్షిప్తం
10. రూపొందించు

© KTBS Not to be republished

11. అంకురించు

**15. జతపర్చండి :**

| | |
|---|---|
| శిఖర సూర్య | కవితా సంకలనం |
| జోకుమార స్వామి | నవల |
| ముగుళు | నాటకం |
| ఆశాన్ | కన్నడ విశ్వవిద్యాలయం |
| హంపి | గౌరవ డాక్టరేట్ పట్టా |
| నాడోజ | ఆప్తమిత్రుడు |
| దానప్ప | బహుమతి. |

**16. ఈ కింది పదాల్ని విడదీసి సంధి పేర్లను రాయండి :**

గౌరవార్హత

జాతీయోత్సవం

వాతావరణం

పురస్కారాలు

కూడియున్నది

దశాబ్దాలు

విద్యాలయం

అత్యుత్తమం

బయలాట

మహత్వాకాంక్ష

మహోపకారం

**17. ఈ కింది పదాలకు విగ్రహ వాక్యాలు రాసి, సమాసాలను తెలపండి :**

1. రాజాస్థానం
2. ఉత్తమకృతి
3. నాటక పరంపర
4. జీవనాధారం
5. ప్రభుత్వ సంస్థలు

©KTBS Not to be republished

**18**. **కింది పదాల కింద గీతగీసినవి ఏ విభక్తి ప్రత్యయాలో తెలపండి :**

1. బెళగావి జిల్లాలోని
2. ప్రతిభను
3. సాధించడానికి
4. వారి యొక్క కృతులు
5. తనవలన
6. వారి తోడ
7. అతని కొరకు
8. విద్యాలయంలో
9. వారికృతులందు
10. అన్నింటి కంటె

**19**. **కింది వాక్యాలలోని తప్పొప్పులను గుర్తించండి :**

1. కంబార చలనచిత్ర దర్శకత్వం వహించారు.
2. పేదరికంవలన కంబార విద్యాభ్యాసం ఆగిపోయింది.
3. కంబారగారు నోబెల్ బహుమతిని పొందారు.
4. కంబారగారు గొప్ప విజ్ఞాన శాస్త్రవేత్త.
5. కంబారగారు మైసూరు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా పని చేశారు.

**20**. **కంబారగారి జీవితంలోని కింది సంఘటనలను క్రమపద్ధతిలో అమర్చండి :**

1. కంబారగారు శాసన మండలి సభ్యులు.
2. కంబారగారు నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సొసైటీ అధ్యక్షులుగా ఉన్నారు.
3. చికాగో విశ్వవిద్యాలయంలో ఉద్యోగంచేశారు.
4. కర్ణాటక విశ్వవిద్యాలయంలో చదివారు.
5. నాగనూరు మఠంలో విద్యాభ్యాసంగావించారు.
6. సంగీత అకాడెమి అవార్డు పొందారు.
7. పద్మశ్రీ అవార్డు లభించింది.
8. సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది.

©KTBS Not to be republished

**21. ఈ కింది ప్రశ్నలకు ఒకటి, రెండు వాక్యాలలో జవాబులు రాయండి :**

1. భారతీయ జ్ఞానపీఠ సంస్థను ఎవరు, ఎప్పుడు స్థాపించారు?
2. జ్ఞానపీఠ బహుమతిని అనేకమార్లు పొందిన ప్రధాన ద్రావిడ భాషా సాహిత్యం ఏది?
3. కంబార ఎప్పుడు, ఎక్కడ జన్మించారు?
4. కంబార రచనలు ఏయే భాషలలోనికి అనువదింపబడ్డాయి?
5. కంబార ఏయే ఊళ్ళలో ఉపన్యాసక వృత్తిని చేశారు?
6. కంబారగారికి జ్ఞాన పీఠ దేనికి ప్రశస్తిలభించినది?

**22. కింది ప్రశ్నలకు వివరంగా జవాబులు రాయండి :**

1. కంబార బాల్యం గురించి రాయండి.
2. కంబారగారి వృత్తి జీవితాన్ని గురించి రాయండి.
3. కంబారగారు నిర్వహించిన పదవులను తెలపండి.
4. కంబారగారి నవలా రచనను గురించి వివరించండి.
5. కంబారగారి కావ్య రచనను గురించి రాయండి.
6. కంబారగారి నాటక రచనను గురించి రాయండి.
7. కంబార పొందిన బహుమతులను గురించి రాయండి.
8. కంబారగారి బిరుదులను గురించి తెలపండి.
9. కంబారగారు చిత్రపరిశ్రమలో చేసిన కృషిని గురించి రాయండి.

**23. వివరణ :**

**జ్ఞానపీఠ ప్రశస్తి:-** ఇది ప్రధాన భారతీయ భాషలలోని అత్యుత్తమ సాహిత్యానికి ఇచ్చే బహుమతి. ఈ బహుమతిని ప్రధానం చేసే సంస్థ 'భారతీయ జ్ఞానపీఠం'. ఈ సాహిత్యపీఠాన్ని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికా యాజమాన్యానికి చెందిన శ్రీమతి రమాజైన్, శ్రీసాహుశాంతి ప్రసాద్ జైన్ దంపతులు 1944వ సంవత్సరం కలకత్తాలో స్థాపించారు.

జ్ఞాన పీఠ బహుమతి రూ 7,00,000లు నగదును, వాగ్దేవి కంచుప్రతిమ ఫలకాన్ని కూడి ఉంటుంది. ఈ సంస్థ 1965వ సంవత్సరంనుండి బహుమతి ప్రదానం ప్రారంభించింది. తొలిసారిగా ఈ బహుమతి 1965లో మలయాళరచయిత అయిన శ్రీ శంకర కురుప్‌గారికి లభించింది.

©KTBS Not to be republished

తెలుగు భాషా సాహిత్యాలకూ 'జ్ఞానపీఠ' ప్రశస్తి 1970లో కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి శ్రీమద్రామాయణ కల్పవృక్ష కావ్యానికి, 1988 లో డా. సి. నారాయణరెడ్డి (సి నా రె)గారి 'విశ్వంభర' కృతికి, 2012 కు గాను డా. రావూరి భరద్వాజగారి 'పాకుడు రాళ్ళు' నవలకు లభించింది.

**24. కన్నడ భాషాసాహిత్యంలో జ్ఞానపీఠ ప్రశస్తిని పొందిన కవులు :**

1. కుప్పళ్ళి వెంకటప్పపుట్టప్ప (కు.వెం.పు) - 1967
2. దత్తాత్రేయ రామచంద్ర బేంద్రె (ద.రా.బేంద్రె) - 1973
3. శివరామకారంత - 1977
4. మాస్తి వెంకటేశ అయ్యంగార్ - 1983
5. వినాయక కృష్ణ గోకాక్ (వి.కె.గోకాక్) - 1990
6. యు. ఆర్. అనంతమూర్తి - (1994)
7. డా. గిరీశ్ కార్నాడ్ - (1998)
8. డా. చంద్ర శేఖర కంబార - (2011)

**25. ప్రణాళికా కార్యాచరణం :**

కన్నడేతర సాహిత్యాలలో 'జ్ఞానపీఠ' బహుమతి గ్రహీతలను, బహుమతి పొందిన వారి గ్రంథాల్ని తెల్పండి. జ్ఞానపీఠ బహుమతి పొందిన కన్నడ కృతులను తెల్పండి.

**26. విద్యార్థులకు సూచనలు :**

జ్ఞానపీఠ బహుమతి లభించిన తెలుగు గ్రంథాలను గురించి వివరంగా తెలుసుకోండి.

**27. ఉపాధ్యాయులకు సూచనలు :**

సాహిత్యపు విలువలను, పఠనావశ్యకతను విద్యార్థులకు తెలియ జేయండి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 8. లేఖ

[సాహిత్యంలో ఎన్నోప్రక్రియలున్నాయి. అందులో లేఖా సాహిత్యం ఒకటి. వేరు వేరు ప్రాంతాల్లో ఉంటున్న రెండు హృదయాలను కలిపేవే లేఖలు. లేఖారచనా విధానంలోని మెలకువలను కింది తరగతిలో చదువుకొన్నారు. ఈ లేఖలో రచనా విధానం పాటించి, వృద్ధులైన తల్లిదండ్రుల పట్ల మన బాధ్యతను ఇతి వృత్తంగా చేసుకొని మాదిరి లేఖను పొందుపరచడమైంది.]

గంగావతి,
6-01-2012;

ప్రియమైన విజయ్‌కి,

నీ మిత్రుడు వంశీరాయునది. నేను క్షేమం. నీవూ, మీ స్నేహితులూ క్షేమమని భావిస్తున్నాను. నా ఉత్తరం చూడగానే నీకు ఆశ్చర్యం వేసి ఉంటుంది కదూ! ఫోన్‌తో సరిపెట్టుకోకుండా ఉత్తర మెందుకు రాయాల్సి వచ్చిందని అనుకొని ఉంటావు. అందుకుకారణం లేక పోలేదు. నేనీమధ్య ఒక వార్తా పత్రిక ప్రత్యేక సంచికలో ఒక చక్కని శీర్షికను చదివాను. అది నన్నెంతో కలచివేసింది. నన్నే కాదు, చదివిన ప్రతి ఒక్కరికీ కన్నీటిని తెప్పించి ఉంటుంది. అందుకనే చదివిన ఆ నాలుగు ముక్కల్ని నీకు తెల్పాలను కొన్నాను. ఫోన్‌లో కంటే ఉత్తరంలో మరింత చక్కగా భావావిష్కరణ చేయవచ్చుగదా! పత్రికలోని శీర్షిక "అయ్యో! పాపం! ముసలోళ్లు"- విషయం యిలా ముందుకు సాగుతుంది. ఈ ప్రపంచంలో నిస్వార్థ జీవులెవరైనా ఉన్నారా? అంటే, ఉన్నారు. వారే తల్లిదండ్రులు. వారి జీవిత లక్ష్యమే, తమ సంతానాన్ని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం. ఆ దిశగా నడుంబిగించి వెనుకా ముందూ చూడకుండా, కష్టసుఖాల్ని, మానావమానాల్ని, ప్రశంసాభిశంసల్ని లెక్క చేయకుండా, జీవన సమరంలో రెక్కలు ముక్కలు చేసుకొనిపోరాడుతారు. తమ సంతానానికొక దారి యేర్పరచి, తమకు మాత్రం ఏదారీలేక జీవన సంధ్యలో బిక్కు బిక్కుమంటూ, 'కాటికే మా బ్రదుకు కాబట్ట లేదు' అన్నట్లు విలపించే అభాగ్యులు వీరు. వికటించిన మానవ నాగరికతా సభ్యతా సంస్కారాలకు నిలువెత్తు సాక్ష్యాలు వీరు. కొడుకుల అమానుష నిర్లక్ష్యానికి నిదర్శనాలు వీరు.

కొందరు పెద్ద మనుషులు తమ వృద్ధ మాతాపితలను ఆధునిక వసతి సౌకర్యాలున్న వృద్ధాశ్రమాల్లో అధిక మౌల్యాన్ని చెల్లించి దిగబెట్టివస్తున్నారు. అంతటితో తమ బాధ్యత తీరిపోయినట్లు ఊపిరి పీల్చుకొంటున్నారు. నిజానికి ఆ వయసులో వారికి కావలసినవి, ఆధునిక సౌకర్యాలు కావు. తాము వేలు పెట్టుకొని నడిపించిన తమసంతానం మరియు వారి పిల్లలు. వేలు పోసినా దొరకని వారి ముద్దు మురిపాలు. వారి ప్రతి రూపాలైన మనుమళ్లు, మనవరాండ్రు వారి బుల్లి బుల్లి మాటలు, వెక్కిరింతలు.

ఇటీవల బెంగళూరులోని ఒక వృద్ధాశ్రమంలో ఒక ముసలి తల్లి నేనిక్కడ ఉండలేను బాబూ, నా కొడుకు ఇంట్లోనన్ను వదలి పెట్టండి. మీకు పుణ్యముంటుంది. వాళ్లు చెప్పులు వదలే చోటయినా సరే, పడుంటాను అని బోరున విలపించడం చూచి అక్కడి సిబ్బంది వారే, కంట తడి పెట్టారట! ఆ విషయం ఆమె కుమారునికి ఫోన్ చేస్తే, తనకు సమయంలేదని, అదనంగా మరికొంత డబ్బు చెల్లించగలనని, ఎలాగో నచ్చ చెప్పండి అని ఫోన్ పెట్టేశాడట!

©KTBS Not to be republished

మిత్రమా! చదువుతున్నావా? అతని స్థానంలో నువ్వుంటే ఏమి చేసేవాడివి? ఛీ! ఛీ! ఇలాంటి పాడు ఆలోచన నాకెందుకు వచ్చింది?

ఆ శీర్షిక ఇంకా ఇలా ముందుకు సాగుతోంది....

"ఎంతోగొప్ప సంస్కృతీ సంప్రద్రాయాలున్న దేశంమనది. ఈ దేశం వేదాలకు, పురాణేతి హాసాలకు పుట్టినిల్లు. వీటిల్లో చెప్పినట్లుగానే, మన కుటుంబ వ్యవస్థ తరతరాలుగా సంక్రమిస్తోంది. తండ్రి మాటకోసం అడవులకు వెళ్ళినరాముడు, తండ్రికోసం తన యౌవనాన్నేధారపోసిన పూరుడు, తల్లిదండ్రుల సేవకై తన జీవితాన్నే అంకితం చేసిన శ్రవణకుమారుడు, తండ్రి సుఖంకోసం జీవితాంతం బ్రహ్మచారిగా గడిపిన భీష్ముడు, తల్లి దాస్యవిముక్తికై తెగించి పోరాడి అమృతం తెచ్చియిచ్చిన గరుత్మంతుడు - ఇలా ఎందరో ఆదర్శ మూర్తుల పవిత్ర చరిత్రలు రక్తగతమై పోయిన సంస్కృతి మనది. అందుకే మన కుటుంబ వ్యవస్థను యీ మధ్య విదేశీయులు వేనోళ్లకొనియాడుతున్నారు. అనుసరిస్తున్నారు".

మన చరిత్రలో ఎక్కడా వృద్ధాశ్రమాల ప్రసక్తి కనబడదు. మనకు వాటి అవసరమే లేదు. వృద్ధులైన తల్లి దండ్రులకు ఎంతో జీవితానుభవం ఉంటుంది. ఏ కష్టానికి ఎలా స్పందించాలి? ఏ సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలి? ఏ పాటకు ఏ తాళం వేయాలి? అనే సమస్త విషయాలు వారికి అనుభవైక వేద్యాలు. వారి సలహాలు, ఆదేశాలు ఎంతో విలువైనవి. అందుకే 'పెద్దలమాట చద్దిమూట' అనే సామెత ప్రచురమైంది.

వృద్ధులైన తల్లిదండ్రులు ఇంట్లో ఉంటే తమ కొడుకులకు, కోడండ్రకు చేదోడు వాదోడుగా ఉండగలరు. వారి పిల్లల ఆలనాపాలనా చూడగలరు. ఎవరు ఎలాంటివారో తమ ఇంటికి వచ్చిన వారి యోగ్యతానుసారం ఎంతవరకు గౌరవించాలో సూచించగలరు. భార్యా భర్తల మధ్య ఏవైనా కుటుంబ కలహాలు ఏర్పడినపుడు విజ్ఞతతో నిష్పక్షపాతంగా పరిష్కరించగలరు. పెళ్లిళ్లు, పండుగలు, పూజలు మొదలయిన సందర్భాల్లో, ఆచార సంప్రదాయాల పాటింపుల్లో అడుగడుగునా దారి చూపగలరు. తమ మనుమళ్లు, మనవరాండ్రకు అనూచానంగా వస్తున్న ఆటలు, పాటలు, పొడుపు కథలు మొదలైన వాటిని చెప్పగలరు. పేదరాశి పెద్దమ్మ కథలు, జోలపాటలతో నిద్రబుచ్చగలరు. మేల్కొల్పు పాటలతో నిద్రలేపగలరు. దురదృష్టవశాత్తు ఏవైనా ఇబ్బందులు సంభవిస్తే కింకర్తవ్యతా మూఢులైనవారికి మనోధైర్యం కలిగించి పరిస్థితులను చక్కబెట్టగలరు. ఇంట్లో కొడుక్కిఅన్యాయం జరిగితే కోడలిని మందలించగలరు. కోడలిని బాధపెడితే కొడుకును దండించగలరు. వారు సుఖంగా ఉంటే సంతోషిస్తారు. కష్టాల్లో ఉంటే బాధను పంచుకోగలరు. ఆశీర్వదించగలరు.

ఇక ఏ యింట్లో వృద్ధులైన తల్లిందండ్రులు లేరో, ఆయిల్లు కంచెలేని చేనులాంటిది. కొన్ని చోట్ల భర్తవైపువారి ఆధిపత్యం (Domination) తోను, మరికొన్ని చోట్ల భార్యవైపు వారి ఆధిపత్యంతోను, నిరంతరం బంధువులరాకతో ఇళ్లు గుల్లవుతుంటాయి. హద్దూ పద్దూ లేకుండా సాగిపోతుంటాయి. సూక్ష్మాతి సూక్ష్మాలైన ఇలాంటి ఆంతరంగిక విషయాలను చొరవతో నిష్పాక్షికంగా అజమాయిషీ చేసే దిక్కులేక ఆ తర్వాత ఇబ్బందుల్లో పడి భార్యాభర్తలు పరస్పరం దూషించుకోవడాలతో, మనస్పర్ధలతో అనేక ఇబ్బందులకు గురి అవుతారు.

ఓ కొడుకుల్లారా! కోడళ్లారా!  ఒక రోజున మీరు ఈ స్థాయికి రాక తప్పదు సుమా! ముసలి వాళ్లన్నాక కొంతయిబ్బంది తప్పదు. మతిమరపు, చెవుడు, దృష్టిలోపం, అనారోగ్యంలాంటి ఇబ్బందులతో

©KTBS Not to be republished

శరీరంలో పటుత్వం తగ్గి, వారికి చాదస్తం కలగడం సహజం. అంతేగాక, ఒక తరానికి, మరోతరానికి ఆలోచనా ధోరణిలో కొంత తేడా ఉండనే ఉంటుంది. వాళ్లు దగ్గుతున్నారని, తుమ్ముతున్నారని, మీ బిడ్డల్ని తాకితే ఏమైనా అవుతుందని అభాండాలు వేయకండి. ఒక సారి వెనక్కి తిరిగి చూసుకోండి, చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు మీరెంతగా వారిని ఏడిపించారో! నడిపించుకొని వెళ్ళేటపుడు కిందపడిపోతే ఎత్తుకొని హృదయానికి హత్తుకొనివాళ్ళు ఎలా ఓదార్చారో! చిన్నపిల్లలు దేవునితో సమానమని ఏమాత్రం ఏహ్యభావంలేకుండా మీ మలమూత్రాదులను కడిగి ఎలా పెంచిపెద్దచేశారో!

ఈ వయసులో వారేదైనా మీకు కోపం కలిగించేలా చేస్తే, ఆరోజుల్లో మీరెంతగా వారికి కోపం కలిగించారో గుర్తుకు తెచ్చుకోండి. మీరు వారి ప్రతిరూపాలేనని, పైనుండి ఒక్కసారిగా కిందికి ఊడిపడలేదని, ఎంతోకష్టపడి పెంచితేనే యింత వారమయ్యామనేయింగితాన్ని పొందండి. కాకపోతే నాటి పిల్లలైన మీరు నేడుపెద్ద వారయ్యారు. ఆ పెద్దలు ఈనాడు పిల్లలై పోయారు. పిల్లలు దేవునితో సమానమని; కాదు, కాదు సాక్షాత్తూ దేవుళ్ళే! అని అర్థం చేసుకోండి.

కాబట్టి ఎంతోకొంత యిబ్బందిని ఎదుర్కోవాల్సి వచ్చినా, వృద్ధమాతాపితలున్న యిల్లు, నిండుకుండలా, పాలవెల్లిలా వారి బోసినవ్వుల ఆశీస్సులతో మూడుపూవులు ఆరుకాయలుగా వర్ధిల్లు తుందనడంలో సందేహంలేదు''. ఇలా ఆ శీర్షిక ముగుస్తుంది.

హమ్మయ్యా! మిత్రమా! విజయ్ ఈ విషయాలన్నీ నీకు తెలియజేయాలనే  నా తాపత్రయం ఇలా నెరవేరినందుకు సంతోషంగా ఉంది. ఈ శీర్షికను ప్రచురించిన పత్రిక వారికి ధన్యవాదాలు. ఈ ఉత్తరంపై నీ స్పందనను తెలియ జేస్తావని ఆశిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

ఇట్లు
నీ ప్రియమిత్రుడు,

వంశీ మోహన్

**చిరునామా**
విజయ్. యస్.
బి. టెక్ ఫైనల్
వ్యవసాయ విశ్వవిద్యాలయం
నాలుగో బ్లాక్, రాయచూర్.

♣ ♣ ♣

©KTPS Not to be republished

# అభ్యాసాలు

**1. కొత్తపదాలు :**

నిస్స్వార్థ జీవులు; నిర్లక్ష్యం; విజ్ఞత; జీవన సమరం; వృద్ధాశ్రమాలు; నిష్పాక్షికం జీవన సంధ్య; అనర్థాలు; సంస్కృతీ సంప్రదాయాలు;

**2. అర్థాలు :**

లక్ష్యం = ఉద్దేశ్యం; వికటించిన = తారుమారైన; ప్రతీకలు = గుర్తులు; ప్రచురం = ఎక్కువగా వాడుకలోనికి రావడం; ఇంగితం = కనీస జ్ఞానం; కింకర్తవ్యతా మూఢులు = ఏమిచేయాలో దిక్కుతోచనివారు; చొరవ = కలుగజేసుకోవడం; అజమాయిషీ = పెత్తనం, అధీనంలో ఉంచుకోవడం; చాదస్తం = లోకజ్ఞానం లేకపోవడం; వింతప్రవర్తన; అభాండం = నింద; అనుభవైకవేద్యాలు = అనుభవించి తెలుసుకొన్నవి.

**3. వ్యతిరేక పదాలు :**

| | | |
|---|---|---|
| స్వార్థం | × | నిస్స్వార్థం |
| ప్రశంస | × | అభిశంస |
| మానుషం | × | అమానుషం |
| పక్షపాతం | × | నిష్పక్షపాతం |
| అంతరంగం | × | బహిరంగం |

**4. నానార్థాలు :**

1. లక్ష్యం : గురి, లెక్క.
2. తాళం : తాడిచెట్టు; సంగీతంలో తాళం; బీగం; కంచువాద్యం.
3. సంతానం : సంతతి; సమూహం; ఒక కల్పవృక్షం.
4. ఉత్తరం : ఒకదిక్కు; సమాధానం.

**5. పర్యాయ పదాలు :**

1. పుత్రుడు : కొడుకు; కుమారుడు; సూనుడు; సుతుడు; తనూజుడు.
2. పుత్రిక : కూతురు; కుమార్తె; సుత; తనూజ; తనయ.
3. భార్య : ఇల్లాలు, గృహిణి; కుటుంబిని; అర్థాంగి; పెళ్ళాం; పత్ని.
4. భర్త : మగడు; పతి; అధిపుడు; కాంతుడు.
5. లేఖ : ఉత్తరం; జాబు; కమ్మ.

©KTBS Not to be republished

**6. వ్యుత్పత్త్యర్థాలు :**

| | |
|---|---|
| భీష్ముడు | : భయంకరమైన శపథం చేసినవాడు (శాంతనవుడు) |
| గరుత్మంతుడు | : సారవంతమైన రెక్కలు కలవాడు (గరుడుడు) |

**7. సంధులు :**

| | | | |
|---|---|---|---|
| భావ | + ఆవిష్కరణ | = భావావిష్కరణ | - సవర్ణదీర్ఘ సంధి |
| వృద్ధ | + ఆశ్రమాలు | = వృద్ధాశ్రమాలు | - సవర్ణదీర్ఘ సంధి |
| పురాణ | + ఇతిహాసాలు | = పురాణేతి హాసాలు | - గుణ సంధి |
| వేయి | + నోళ్ళు | = వేనోళ్ళు | - ప్రాతాది సంధి |

**8. సమాసాలు :**

| | | |
|---|---|---|
| జీవన సంధ్య | - జీవనమనెడి సంధ్య | - రూపక సమాసం |
| వృద్ధాశ్రమాలు | - వృద్ధులకొరకు ఆశ్రమాలు | - చతుర్థీ తత్పురుష సమాసం |
| నిండుకుండ | - నిండుగాఉన్న కుండ | - విశేషణ పూర్వపద కర్మధారయం |

**9. వివరణలు :**

**వేదములు** : అతి ప్రాచీన కాలంలో రాయబడ్డ తొలిచదువులు. ధర్మాధర్మములు వీటివల్ల తెలుసుకోవచ్చు. ఇవి నాలుగు. ఋగ్వేదం. యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం.

**పురాణాలు** : సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం, వంశాను చరిత్రం - అనే ఐదు లక్షణాలు కలిగిన గొప్పగ్రంథాలు. ఇవి పదునెనిమిది. బ్రహ్మ, వాయు, వామన, స్కాందం ఇత్యాది

**ఇతిహాసాలు** : పూర్వచరిత్రలు ఇతివృత్తంగా గల కావ్యాలు (Epics)

**పూరుడు** : యయాతి, శర్మిష్ఠల పుత్రుడు. శుక్రుని శాపంవల్ల అతని తండ్రికి ముసలితనం కలిగింది. అది పోవడానికి తన యౌవనాన్ని ధారవోస్తాడు.

**గరుత్మంతుడు** : ఒక పక్షి. ఇతని తల్లి వినత. తండ్రి కశ్యపుడు. గొప్ప బలము కలిగినవాడై, అమృతము తెచ్చియిచ్చి, తల్లి దాస్యం తొలగించాడు. విష్ణుమూర్తికి వాహనంగా ఇతడు ప్రసిద్ధుడు.

**10. కింది ప్రశ్నలకు ఒక మాటలో సమాధానాలీయండి :**

1. ఈ ప్రపంచంలోనిస్వార్థ జీవులెవరు?
2. 'ఆ వయస్సులో వారికి కావలసినవి ఆధునిక సౌకర్యాలు కాదు'-మరేవి?
3. వికటించిన మానవ నాగరికతకు నిలువెత్తు సాక్ష్యాలు ఎవరు?

©KTBS Not to be republished

4. తండ్రిమాటకోసం అడవికి వెళ్ళింది ఎవరు?

5. తండ్రికోసం తన ఆయువును ధారవోసినదెవరు?

6. తల్లి దండ్రుల సేవకొరకు తన జీవితాన్నే అంకితం చేసిన వ్యక్తి ఎవరు?

**11. కింది ప్రశ్నలకు రెండు మూడు వాక్యాల్లో సమాధానాలియండి :**

1. వృద్ధ మాతాపితల పరిస్థితి ఎలాంటిది?
2. 'అక్కడి నిర్వాహకులే కంట తడి పెట్టారట'. ఎందుకు?
3. ఎంతో గొప్ప సంస్కృతీ సంప్రదాయమున్నదేశం మనదని ఎలా చెప్ప గలవు?
4. 'పెద్దలమాట చద్దిమూట' - అని ఎందుకంటారు?

**12. కింది ప్రశ్నలకు వివరంగా సమాధానాలీయండి :**

1. వృద్ధ మాతాపితలు, వృద్ధాశ్రమాల గురించి రాయండి.
2. వృద్ధ మాతాపితల వల్ల కలిగే ప్రయోజనమేమిటి?
3. వృద్ధులైన తల్లి దండ్రులు లేని ఇంటి పరిస్థితి ఎలాంటిది?
4. తల్లిదండ్రుల విషయంలో కొడుకుల, కోడండ్ర ప్రవర్తన ఎలా ఉండాలి?

**13. కింది ఖాళీలను పూరించండి :**

1. మన ప్రాచీన చరిత్రలో ఎక్కడా ____________ ప్రసక్తి కనబడదు.
2. పెద్దల మాట ____________ అనే సామెత ప్రచురమైంది.
3. ఒకతరానికి మరొక తరానికి ____________ లో కొంత తేడా ఉండనే ఉంటుంది.
4. చిన్నపిల్లలు ____________ తో సమానం.
5. ఈ దేశం ____________ , ____________ పుట్టినిల్లు.
6. కొడుక్కి అన్యాయం జరిగితే ____________ మందలించగలరు.
7. కోడలికి అన్యాయం జరిగితే ____________ ను దండించగలరు.
8. వృద్ధులైన తల్లిదండ్రులులేని ఇల్లు ____________ లేని చేనులాంటది.
9. నిరంతరం ____________ రాకతో ఇళ్లు గుల్లవుతుంటాయి.

Not to be republished ©KTBS

**14.** **కింది వాటిల్లో సరైన సమాధానాన్ని ఎన్నుకొని దాని చిహ్నాన్ని బ్రాకెట్లలో గుర్తించండి :**

1. తండ్రి సుఖంకోసం జీవితాంతం బ్రహ్మచారిగా గడిపిన వ్యక్తి.
   a) రాముడు b) కృష్ణుడు c) భీష్ముడు d) భీముడు [ ]
2. తల్లి దాస్య విముక్తికై అమృతం తెచ్చియిచ్చినవాడు
   a) హనుమంతుడు b) గరుత్మంతుడు c) భీష్ముడు d) ధర్మరాజు [ ]
3. విదేశీయులు మన కుటుంబవ్యవస్థను చూచి
   a) నవ్వుకొంటున్నారు b) వేనోళ్లకొనియాడుతున్నారు
   c) తిట్టుతున్నారు d) మంచిది కాదంటున్నారు [ ]
4. ముసలి వాళ్లకు చాదస్తం కలగడం
   a) సహజం b) అసహజం c) విచిత్రం d) జరుగదు [ ]
5. కొందరు తమ వృద్ధ మాతాపితరులను ఇక్కడ దిగ బెట్టి వస్తున్నారు.
   a) ఆస్పత్రుల్లో b) అనాథ శరణాలయాల్లో
   c) దేవాలయాల్లో d) వృద్ధాశ్రమాల్లో [ ]

**15.** **కింది జాతీయాలను మీ సొంత వాక్యాల్లో ప్రయోగించండి :**

1. మూడు పూవులు ఆరు కాయలు
2. రెక్కలు ముక్కలు చేసుకొని
3. ఊపిరి పీల్చుకొను
4. ధారవోయు
5. వేనోళ్ల కొనియాడు
6. చేదోడు వాదోడు
7. బిక్కు బిక్కుమను
8. నడుం బిగించు

**16.** **ఉపాధ్యాయులకు సూచనలు :**

1. ఉత్తరాలకు ఒకప్పుడు ఎంత ప్రాధాన్యం ఉండేదో విద్యార్థులకు సోదాహరణంగా వివరించండి.
2. లేఖారచనకు, వ్యాసరచనకు పాటించాల్సిన తేడాను తెల్పండి.

**17.** **విద్యార్థులకు సూచనలు :**

1. మహాత్మాగాంధీ, నెహ్రూలాంటి మేధావుల లేఖలను పరిశీలించండి.
2. ఈ పాఠంలో తెల్పిన మాదిరి ఆధారంగా మీ మిత్రులకు లేఖలు రాయండి.

©KTBS Not to be republished

# 9. కలహ కారణం

- శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రి

[కౌరవ పాండవుల మధ్య బాల్యంలోనే అంకురించిన అసూయా ద్వేషాలు కాలక్రమంలో పెరిగి పెద్దవయ్యాయి. అవి యుద్ధానికి దారి తీసి చివరకు వంశ నాశనానికి కారణమయ్యాయన్న విషయాన్ని సరళ సుందరమైన శైలిలో ఈ పాఠ్యభాగంలో వివరింపబడింది.

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు సంస్కృతాంధ్రాలలో గొప్పపండితులు. కవిగా, విమర్శకులుగా చాల ప్రసిద్ధులు. భాసమహాకవి సంస్కృతంలో రచించిన నాటకాల్లో కొన్నింటిని ఆయన రసవంతంగా ఆంధ్రీకరించారు. అనేక విమర్శలు వెలయించారు. 'ద్రోణప్రశస్తి' ఆయన రచనల్లో ప్రముఖమైనది. ఈ గ్రంథంనుండే ప్రస్తుత పాఠ్యభాగం స్వీకరింపబడింది. ]

రాజ్యము ధృతరాష్ట్రునిది. ఆతడు పుట్టంధుడగుట వలన నతని మాఱుగా, తమ్ముడు పాండుడు రాజైనాడు. అతడన్నగారి యెడ భయభక్తులు గలిగి, అన్ని వ్యవహారములను అన్నగారి పేరనే నడపుచు, అతనియభిమానమును, ప్రజలలో మంచి పేరును సంపాదించుకొన్నాడు. రాజ్యమభివృద్ధికి దెచ్చినాడు. ధర్మజాదులు చిన్నవారుగానున్నప్పుడే పాండుడు పరలోక గతుడైనాడు.

ధృతరాష్ట్రుడు సోదరునియందలి ఆదరాభిమానముల చేత పాండవులను తనయింటనే యుంచుకొని, తన బిడ్డలతో సమానముగా ప్రేమించి, పోషించుచు విద్యాబుద్ధులు నేర్పించుచున్నాడు.

పాండుకుమారులు మంచి తెలివితేటలు గలవారు. సహజముగనే వినీతులు. పైగా తండ్రి యండ తప్పిన వారగుట చేతను, ఉన్నది పరగృహము గావునను అణగి మణగి మెలగుచు, తాతగారికిని, పెద తండ్రి గారికిని, దక్కిన పెద్దలకును విధేయులై, చుట్టాలకు తలలోని నాల్కలై అందఱి మన్ననలకును భాజనములైనారు.

దుర్యోధనాదుల కది యొప్పలేదు. వారు 'మహారాజు బిడ్డల' మన్న దిమాకుగలవారు.

అందువలన పెద్ద - పిన్న యంతరువులను అంతగా పాటించు వారు గారు. వారికి పాండవులు జ్ఞాతులు గదా! జ్ఞాతిత్వమే విరోధ హేతువై యుండగా పైపెచ్చువారు తమ యింట, తమ కంటెను మిన్నగా మన్ననలందుచున్నారు. అది యెట్లు సహ్యమగును? గతిమాలి మా పంచను బడియున్న యీ నిర్భాగ్యులకింత మన్ననయా? అన్న భావము కౌరవులకేర్పడినది. దానికి తోడు చదువు సంధ్యలయందును, సాము గరిడీల యందును తమ కంటె వారు మేలుచేయిగా, మెట్టుకు మెట్టెక్కి పోవు చుండుట మఱింత ఈర్ష్యకు హేతువైనది.

అది యట్లుండంగా - పాండుకుమారులలో భీముడు కొంటె పిల్లవాడు, బలిష్ఠుడు, మోటుగాడు. వాడు కురుకుమారులను బాల క్రీడలలో పలుమాఱు పరిభవించి పరిహసించుచుండెడివాడు.

జలకేళి వేళలలో భీముడు రెండు చంకల క్రిందను పదేసి మంది నిరక బట్టుకొని, నీటముంచి-అదిమిపట్టి, వారూపిరాడక ఉక్కిరి బిక్కిరి యగుచుండుట చూచి, వదలి, నవ్వెడివాడు. నియుద్ధ క్రీడలలో దుర్యోధన దుశ్శాసనులను పిడుగుల వంటి తన పిడిగ్రుద్దులతో మిక్కిలిగా నొప్పించెడివాడు.

©KTBS Not to be republished

కసి పూని కౌరవులందఱు నొక్క మొత్తముగా కలిసినను, పట్టుపడక గున్న యేనుగు వలె వారి నందఱిని కూలద్రోసి, కుమ్మి కుమ్మి ఘోష పెట్టెడివాడు.

ఒక మాటు, కౌరవులు కొందఱు పండ్లకొఱకొక చెట్టెక్కి యుండగా జూచి, భీముడా చెట్టును బిట్టుగా తన్నినాడు. ఆ తన్నుతో కాయలతోపాటు కౌరవులును జలజల రాలి పడినారు.

ఇవి యన్నియు పిల్ల చేష్టలుగాని భీముడు ద్రోహ బుద్ధితో చేసిన పనులు కావు. కాకపోయినను బాధాకరములే కదా! అతని బల సాహసములను, దుడుకుతనమును దుర్యోధనునకు దుస్సహము లైనవి. ఇట్టివానితో గూడిన ధర్మజాదులు భావికాలమున తమ రాచరికమున కడ్డు తగులక పోరన్న భావమును గలిగినది. కర్ణశకుని దుశ్శాసనులతో నాలోచించినాడు. వారందఱును కలియ బలుకు కొని, భీష్మ విదురుల కెఱుక పడకుండ భీమునంతమొందింపవలె ననుకొన్నారు.

అనుకొని, ఒక నాడు, వనభోజనోత్సవ మొకటి కల్పించి, అందు దుర్యోధనుడే స్వయముగా నందఱికి వడ్డించు వినోద ప్రసంగములతో నెల్లవా రి యుల్లముల కుల్లాసము గల్పించుచు, భీముని మంచి మాటలతో నుబ్బించుచు, నూరించుచు, కాలకూటము కలిపిన యన్న మతనికి వడ్డించినాడు. అతడా కంఠముగా భుజించినాడు. అది రాత్రివేళ భోజనానంతరము భీము డొక మూలం బరుండి, విషప్రభావము వలన మృతప్రాయు డైనాడు. అది కనిపెట్టి దుర్యోధనుడతని కాళ్ళుచేతులు కట్టించి, గంగలో విసరి వేయించినాడు. అంతటితో భీముని వలన పీడ విఱుగడమైనదని సంతోషించినాడు. కాని ఆ సంతోష ముళక్కియేయైనది.

గంగలో బడిన భీముడు నాగలోకము చేరినాడు. అక్కడ కొన్ని విషనాగములు భీముని కాటువేసినవి. ఆ కాటు వలన నతని యుదరములోని విషము విఱిగి పోయినది. భీముడు బంధములు ద్రెంపుకొన్నాడు. ఇంతలో ఆర్యకుడను నాగముఖ్యుడచటికి వచ్చినాడు. అతడు కుంతి తండ్రియైన శూరసేనుని తాత. అతడు భీము నెక్కువగా నాదరించి, సర్వ విషహరమును, బలకరమును నైన రస మొకటి యిచ్చి, త్రావించినాడు. నాగరాజయిన వాసుకి భీమునకు రత్నరాసులు బహుమతిగా నొసగి పంపించినాడు.

భీముడు సుఖముగా నిల్లు చేరుకొని జరిగిన కథయంతయు నన్నకు చెప్పినాడు. యుధిష్ఠిరుడీ సంగతి యెవరికిని తెలుపవలదన్నాడు. భీముడార్యకదత్త రస మహిమ చేత నాగాయుత బలుడైనాడు.

దుర్యోధనుడు చేసిన మహాపకారము మరుత్సుతునకీ విధముగా మహోపకారమైనది. అదృష్టవంతుల కాపదలును సంపదలుగానే పరిణమించును గదా!

విషాన్నముపెట్టి గంగలో త్రోసినను చావక, భీముడు బ్రతికి వచ్చుట కురుపతి యీర్ష్యాగ్ని కాజ్యము పోసినట్లయినది. అయినను, ఆతడా లక్షణమును వెలిదోపనీక పాండవులతో యథాపూర్వము కలసి మెలసి వర్తించుచు, వారిని హతమార్ప నాలోచనలు చేయుచునేయున్నాడు. భీముడు పోయిననే కాని తక్కిన నలువురు తనకు సాధ్యులు కారని యాతని తలంపు. అతని మీదనే యీతని కెక్కువ యీసు. అది కారణముగా దుర్యోధనుడొక నాడు- అత్తమీదికోపము దుత్తమీద జూపిన దన్న సామెతగా భీముని సారథిని గొంతు పిసికి చంపి వేసినాడు.

భీముడాతని క్రూర కృత్యమును అన్నకు తెలిపి, ఆగ్రహోదగ్రుడై, "అనుమతియిత్తువేని దుర్యోధనుని తుదముట్టింతు" నన్నాడు. ధర్మజుడు తమ్ముని కోపముడిపి, "తొందర పడవల" దన్నాడు. అన్న యాజ్ఞకు బద్ధుడై, ఆతడు కోపమును దిగమ్రింగి మిన్నకున్నాడు.

©KTBS Not to be republished

అంతటితో దుర్యోధనుడూర కొన్నాడా? మఱి కొన్నాళ్ళకు రహస్యముగా, మరల నొక మాటు భీమునకు విషాన్నము పెట్టించినాడు. అది యెఱిగియున్న యుత్సుడు చెప్పినను, వడముడి లెక్క సేయక చంకల బంటిగా మెక్కి, చెక్కైనను చెమర్చక గఱ్ఱున త్రేచి, నిమ్మకు నీరెక్కినట్లు నిమ్మళముగ నున్నాడు. ఆర్యకదత్త రసమహిమ వలన ఆ విష మతని గర్భ గోళమున హరించిపోయినది.

దుర్యోధనుని దుశ్చేష్టలను ధర్మజుడు విదురునికి విన్నవించినాడు. అతడు "వాని యవివేక కృత్యములకు ప్రతీకారము తల పెట్టక మీరు జాగరూకులైయుండు" డని యుపదేశించినాడు. విదురుని యుపదేశమును బట్టి ధర్మజుడును; ధర్మజుని యాజ్ఞ ననుసరించి యతని తమ్ములును ప్రతీకార ప్రయత్నములకు దిగక, కౌరవులతో మామూలుగనే మసలు కొనుచున్నారు.

పాండవులను చంపుటకు దుర్యోధనుడును, కర్ణ శకునులును చేసిన శ్రమ యంతము 'ఏటిలో పిసికిన చింతపం'డై పోయినది. వారి క్రౌర్యము మాత్రము బయట పడినది.

**మనలో మాట :**

భీమునివి పిల్ల చేష్టలుగాని విరోధ కృత్యములు కావు గదా! వాడు దుష్టుడే యగుగాక, వాని దౌష్ట్యమును పెద్దలకు జెప్పి, బుద్ధి చెప్పింప వలెనా? దుర్యోధనుడు వానిని చంపుటకు యత్నింప వలెనా?

భీముని జంపి, ధర్మజ ధనంజయులను కారాగార బద్ధులను గావించి సర్వం సహా మండలమును తానే పాలింపవలెనని యతని సంకల్పము. న్యాయమేనా?

కౌరవ పాండవ కలహమున కిదియే యంకురార్పణము.

**1. కొత్తపదాలు :**

పుట్టంధుడు, తలలోని నాల్కలు, జ్ఞాతులు, కాల కూటము,
మృతప్రాయుడు, అంతరువు, పరగృహము

**2. అర్థాలు :**

వినీతులు = వినయం కలవారు; దిమాకు = గర్వము, అహంకారము; పుట్టంధుడు = పుట్టుకతో గ్రుడ్డివాడు; జ్ఞాతులు = దాయాదులు, అన్నదమ్ముల బిడ్డలు; కాలకూటము = విషము; నియుద్ధము = మల్లయుద్ధము; అయుతము = పదివేలు, పెక్కు; వడముడి = భీముడు; ఆకంఠము = కుత్తుకదాక; భాజనములు = పాత్రములు, అర్హములు; హుళక్కి = శూన్యము, లేనిది; దుత్త = చిన్న కడవ; సర్వంసహ = భూమి; అంకురార్పణము = మొలకెత్తుట, ప్రారంభమగుట.

**3. వ్యుత్పత్త్యర్థాలు :**

సోదరుడు : ఒకే గర్భమున జనించినవాడు, తోడ బుట్టిన వాడు (అన్న, తమ్ముడు)

ధనుంజయుడు : రాజసూయమున రాజులను జయించి ధనము నార్జించినవాడు (అర్జునుడు)

యుధిష్ఠిరుడు : యుద్ధమునందు స్థిరముగా నిలుచువాడు (ధర్మరాజు)

©KTBS Not to be republished

వడముడి : పగతురకు సంతాపము కల్గించు గ్రంధి వంటివాడు, ఉత్తరపు వైపునకు (ఎడమవైపునకు) జడముడి వేయువాడు (భీముడు)

యుయుత్సుడు : వైశ్యయందు ధృతరాష్ట్రునకు పుట్టినవాడు.

**4. వివరణలు :**

యుద్ధం ప్రారంభింపక పూర్వం ధర్మరాజు భీష్మాదులకు నమస్కరించి మా పక్షంలో చేరగోరే రాజులు ఇపుడే వచ్చి చేరండని పిలిచాడు. యుయుత్సుడు పాండవుల పక్షం చేరాడు. ధృతరాష్ట్రుని పుత్రులలో యుద్ధంలో మరణించక మిగిలిన వాడితడే.

**5. జాతీయాలు :**

1. అత్తమీది కోపం దుత్తమీద జూపినది.
2. నిమ్మకు నీ రెత్తినట్లు నిమ్మళముగ నున్నాడు.
3. అదృష్టవంతుల కాపదలును సంపదలుగానే పరిణమించును.
4. ఏటిలో పిసికిన చింత పండైపోయినది.

**6. నానార్థాలు :**

1. నాగము : తగరం, పాము, మేఘం, ఏనుగు
2. గుల్మం : ఉపవాయువు, ముస్తె, పొన్న చెట్టు

**7. పర్యాయపదాలు :**

1. యుద్ధం : సమరం, సంగ్రామం
2. ఇల్లు : గృహము, ఆవాసము, నివాసం
3. కుమారుడు : పుత్రుడు

**8. వ్యతిరేకపదాలు :**

1. ఉపకారం × అపకారం
2. వివేకం × అవివేకం
3. అభిమానం × దురభిమానం
4. జ్యేష్ఠుడు × కనిష్ఠుడు
5. అదృష్టం × దురదృష్టం
6. ధర్మం × అధర్మం

©KTBS Not to be republished

**9**. **ప్రకృతి - వికృతులు :**

1. ఆజ్ఞ - ఆన
2. విషము - విసము
3. భోజనము - బోనము
4. ఈర్ష్య - ఈసు,
5. సంధ్య - సందె
6. సంతోషం - సంతసం

**10**. **సంధులు :**

1. ఇవన్నియు = ఇవి + అన్నియు - ఇకారసంధి
2. ఆదరాభిమానములు = ఆదర + అభిమానములు - సవర్ణదీర్ఘసంధి
3. ఆగ్రహోదగ్రుడు = ఆగ్రహ + ఉదగ్రుడు - గుణసంధి
4. మహోపకారం = మహా + ఉపకారం - గుణసంధి
5. ఈర్ష్యాగ్ని = ఈర్ష్య + అగ్ని - సవర్ణదీర్ఘసంధి
6. కూలన్ దోసి = కూలన్ + తోసి - ద్రుతప్రకృతికసంధి
7. లెక్క సేయక = లెక్క + చేయక - గ. స. డ. ద. వాదేశ సంధి
8. భీముడొక = భీముడు + ఒక - ఉకారసంధి
9. విషాన్నము = విష + అన్నము - సవర్ణదీర్ఘసంధి
10. అన్నయాజ్ఞ = అన్న + ఆజ్ఞ - యడాగమసంధి

**11**. **సమాసాలు :**

1. విషప్రభావము - విషముయొక్క ప్రభావము - షష్ఠీ తత్పురుష సమాసం
2. ఈర్ష్యాగ్ని - ఈర్ష్య అనెడి అగ్ని - రూపక సమాసం
3. చదువు సంధ్యలు -చదువు మరియు సంధ్య - ద్వంద్వ సమాసం
4. గున్నఏనుగు - గున్నదైన ఏనుగు - విశేషణ పూర్వ పదకర్మధారయ సమాసం
5. భీష్మ విదురులు - భీష్ముడు మరియు విదురుడు - ద్వంద్వ సమాసం

©KTBS Not to be republished

**12. సొంత వాక్యాలలో రాయండి :**

దిగమ్రింగు, హతమార్చు, నిమ్మకు నీరెత్తినట్లు, తలలోని నాల్క, తుద ముట్టించు.

**13. జతపరచండి :**

| | |
|---|---|
| ధృతరాష్ట్రుడు | నాగలోకము |
| భీముడు | శాంత స్వభావుడు |
| సర్పములు | దురాలోచనాపరుడు |
| దుర్యోధనుడు | మహా బలిష్ఠుడు |
| ధర్మరాజు | పుట్టంధుడు (గ్రుడ్డివాడు) |

**14. ఒకటి రెండు వాక్యాలలో జవాబులు రాయండి :**

1. ధృత రాష్ట్రుని తమ్ముడెవరు?
2. పాండురాజు ఎలా రాజైనాడు?
3. పాండు కుమారులు ఎవరింట పెరిగారు?
4. పాండవులలో భీముడు ఎలాంటి వాడు?
5. భీముని గర్భగోళం విషాన్ని ఎలా హరించింది?
6. ధర్మరాజు దుర్యోధనుని దుశ్చేష్టలను ఎవరికి విన్నవించాడు?
7. గంగలో పడిన భీముడు ఎక్కడికి చేరాడు?
8. దుర్యోధనునకు ఎవరిపై ఈర్ష్య ఉండేది?

**15. కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి :**

1. పాండవులు ధృతరాష్ట్రుని ఇంటిలో పెరగటానికి కారణం ఏమిటి?
2. పెదతండ్రి ఇంటిలో పాండవులు ఎలా మెలిగారు?
3. కౌరవ పాండవుల మధ్య కలహం ఎలా ఆరంభమైంది?
4. భీమున్ని చంపటానికి దుర్యోధనుడు చేసిన ప్రయత్నాలను, వాటి ఫలితాలను వివరించండి?
5. నాగలోకంలో భీమునికి కల్గిన సత్కారాన్ని వివరించండి.
6. 'అదృష్టవంతుల కాపదలు సంపదలుగనే పరిణమించును గదా'- దీనిని వివరించండి.

© KTBS Not to be republished

**16**. **కింది ప్రశ్నలకు పదిపన్నెండు వాక్యాలలో జవాబులు రాయండి :**

1. కలహ కారణం పాఠ్యభాగ మాధారంగా భీముని వృత్తాంతాన్ని వివరించండి?
2. దుర్యోధనుని దుష్ట స్వభావాన్ని గురించి తెల్పండి.
3. కౌరవపాండవుల నడుమ కలహానికి దారితీసిన పరిస్థితుల్ని వివరించండి?

**17**. **కింది వాక్యాలకు సందర్భాలను వివరించండి :**

1. తలలోని నాల్కలై అందరి మన్ననలకు భాజనము లైనారు.
2. గతిమాలి మా పంచను బడియున్న ఈ నిర్భాగ్యులకింత మన్ననయా?
3. కాయలతో పాటు కౌరవులును జలజల రాలి పడినారు
4. అతడా కంఠముగ భుజించినాడు
5. అదృష్టవంతుల కాపదలును సంపదలు గానే పరిణమించును కదా!
6. అతని మీదనే ఈతని కెక్కువ ఈసు
7. అత్తమీది కోపం దుత్తమీద జూపినది.
8. ఏటిలో పిసికిన చింత పండై పోయినది.

**18**. **కింది ఖాళీలను పూరించండి :**

1. అతడు పుట్టంధుడగుట వలన అతనికి మారుగా తమ్ముడు ______________ రాజైనాడు.
2. ______________ చిన్నవారుగా నున్నప్పుడే పాండురాజు పరలోక గతుడైనాడు.
3. దుర్యోధనుడు భీమునకు ______________ కలిపిన విషము వడ్డించినాడు.
4. ______________ పోయిననేకాని తక్కిన నలువురు తనకు సాధ్యులు కారని ఆతని తలంపు
5. ______________ తమ్ముని కోపముడిపి తొందర పడవలదన్నాడు.
6. ______________ నాగ ముఖ్యుడచటికి వచ్చినాడు.
7. ఆతడు కుంతి తండ్రియైన ______________ తాత.
8. దుర్యోధనుని దుశ్చేష్టలను ధర్మజుడు ______________ కి విన్నవించినాడు.

**19**. **గుంపుకు చెందని పదాలను గుర్తించండి :**

1. ధర్మరాజు, భీముడు, ధనంజయుడు, శకుని.

©KTBS Not to be republished

2. దుర్యోధనుడు, కర్ణుడు, భీముడు, దుశ్శాసనుడు.

3. కుమారుడు, తమ్ముడు, శత్రువు, తండ్రి.

4. నాగలోకము, ఆకాశము, భూలోకము, స్వర్గలోకము.

5. ఈర్ష్య, పగ, కాలకూటము, ద్వేషము.

**20. విద్యార్థులకు సూచన :**

1. భారత, భాగవత, రామాయణ కథలను తెలుసుకోండి.

**21. ఉపాధ్యాయులకు సూచన :**

పురాణ కథలలోని పాత్రల స్వభావ వ్యక్తిత్వాలను గురించి విద్యార్థులకు వివరించండి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# 10. భువన విజయము

- డా. అంతటి నరసింహం

[ఈ పాఠ్యభాగ రచయిత డా. అంతటి నరసింహంగారు. రతనాల సీమ అని పేరుపొందిన రాయల సీమలోని, కడపమండలంలో వెంకటరాజుపల్లి అనే గ్రామంలో జన్మించారు. తెలుగు భాషలో ఎం. ఎ. పరీక్షలో ఉత్తీర్ణులై కొన్ని సంవత్సరాల పాటు కడపప్రభుత్వకళాశాలలో ప్రధానాంధ్రోపన్యాసకులుగా పనిచేశారు.

శ్రీ నరసింహంగారు నవలలను, నాటకాలను, గేయకావ్యాలను ఎన్నింటినో రచించి వాసి కెక్కారు. ఆదర్శభావం, స్వగతం, రామరాయలు, పరిష్కారం మొదలయినవి వీరి ప్రముఖరచనలు. బాలల సాహిత్య విషయంలో కూడ వీరు చెప్పుకోదగ్గ పరిశ్రమచేసి కొన్ని పుస్తకాలను రచించారు. సహజీవనం, మానవత్వం మున్నగు వీరినాటకాలు అస్పృశ్యతా నివారణను లక్ష్యంగా ఉంచుకొని రచింపబడ్డాయి.

సాహితీ సమరాంగణ సార్వభౌముడగు కృష్ణదేవరాయల ఆస్థానం సహజంగానే విద్వత్కవులకు నిలయం. ఆ ఆస్థానంలోనే ప్రతినిత్యం సాహిత్య చర్చలు, విద్వద్గోష్ఠులు జరపడానికి ఏర్పాటు చేయబడ్డ మందిరాన్నే 'భువన విజయం' అని పిలిచేవారు.

ప్రస్తుత పాఠ్యభాగంలో రాయలు ఒక్కొక్క పండితుని పిలిపించి, అతని పాండిత్య ప్రకర్షను తెలుసుకొని, తన ఆస్థాన కవిగా నియమించుకోవడం చక్కగా వర్ణింపబడింది.]

(తెర ఎత్తగనే సింహాసనము పై శ్రీకృష్ణదేవరాయలు ఆశీనుడైయుండును. అప్పాజీ, వీరమ నాయుడు మున్నగువారు ఉచితాసనములపై ఆసీనులైయుందురు. పెద్దన, చినతిమ్మన మున్నగు కవులు సైతమాసీనులైయుందురు)

రాయలు :- అప్పాజీ! మన యుద్యోగము లెంతవరకు పరిణమించినవి?

అప్పాజీ :- సమర్థులగు ప్రధానులు, సమరాంగణ లయకార మూర్తులగు సేనాపతులునుండ సత్ఫలితముల కేమి కొదవ ప్రభూ!

రాయలు :- నిన్ననే గదా మనము గజపతుల నోడించివచ్చితిమి! ఆ గజపతుల కుతంత్రములనుండి తప్పించుకొనుట మీ ప్రతిభా విశేషమే గదా అప్పాజీ!

అప్పాజీ :- ప్రభువులు గోరంతలు కొండంతలు చేయుచున్నారు.

రాయలు :- ఇతర ప్రదేశముల కంపిన మన సైనికుల ఉదంతము!

అప్పాజీ :- అంతయును శుభమే. నావాడ శకంధర సింధుపతులును తదితరులును ప్రభువులకు దాసోహమనిరి. కాని. . . . . .

రాయలు :- ఏమది అప్పాజీ!

అప్పాజీ :- పాండ్యునకు సాయముగానంపిన నాగమనాయుని ఉదంతమే ఇంతకును తెలియలేదు.

©KTBS Not to be republished

రాయలు :- పంపిన వార్తాహరులు!

అప్పాజీ :- మఱలి రాకుండుటచే మరియొక్కని నపుడే పంపితిని.

రాయలు :- అతని ప్రవర్తనమనుమానాస్పదమగునా?

అప్పాజీ :- పరికింతము ప్రభూ, ఏపుట్టలో ఏపామున్నదో యెరుగుట దుర్లభము కదా!

రాయలు :- (ఆలోచనా నిమగ్నుడైయుండును)

అప్పాజీ :- దండయాత్ర నాల్గు మాసములు విరామ రహితముగ సాగియుండుటచే కాబోలు ప్రభువులించుక అలసినట్లు కాన్పించుచున్నారు. ఇప్పటికిక రాజకీయముల నిలిపివేయుదము.

(తెరలో వందిమాగధులు)

ప్రబల రాజాధిరాజ వీరప్రతాపరాజ పరమేశ్వరార్థ దుర్గానటేశ, సాహితీ సమరాంగణ సార్వభౌమ, కృష్ణరాజేంద్ర నవ్యకృష్ణా జయము జయము.

రాయలు :- (చిరునగవుతో) చదరంగమున నిపుణుడు చిన తిమ్మన. (చినతిమ్మన వైపుచూచి) ఒక యెత్తు వేయుదమా!

చినతిమ్మన:- ప్రభువుల చిత్తము (ఆడుచుందురు)

రాయలు :- (ఆడుచు పెద్దనవైపు చూచి) పెద్దనామాత్యా! ఆశువుగా ఒక గ్రంథము చెప్పుదురా?

పెద్దన :- (మందస్మితముతో) గ్రంథరచనయా ప్రభూ! నిరుపహతి స్థలము, ఆత్మకింపగు భోజనము, ఊయలమంచము, ఊహ తెలియంగల లేఖక పాఠకోత్తములు ఉండినగదా కృతి రచన!

రాయలు :- (తల యూపుచు) ఎంత సరసపు సమాధానము! (ఆటవైపుచూచి) అహో రాజునకు గండము (రాజును తప్పింప యెత్తువేయ నాలోచించుండును)

(ప్రతీహారిప్రవేశము)

ప్రతీహారి :- విజయము ప్రభువులకు. నాగమనాయుని కడకంపిన వార్తాహరుడు ద్వారముకడ వేచియున్నాడు.

అప్పాజీ :- శీఘ్రముగా ప్రవేశపెట్టుము.

ప్రతీహారి :- చిత్తము (నిష్క్రమించును)

(వార్తాహరుడు ప్రవేశము)

వా. హ :- విజయము ప్రభువులకు. ఇదే నాగమ నాయండంపిన లేఖ (అందిచ్చును).

©KTBS Not to be republished

అప్పాజీ :- (లేఖ నందుకొని చదువును)

"విజయనగరాధీశులు శ్రీకృష్ణదేవరాయలకు విజయలక్ష్మీ సమేతుడు నాగమ నాయుడు తెల్పునది. దక్షిణ దేశమునందు మాకఖండ విజయము కల్గినదని తెల్పుటకు గర్వించుచున్నాము. తద్విజయ చిహ్నముగ ఈ రాజ్యమునంతయును స్వయముగ మేమే పాలింపదలచితిమి. మీ వార్తాహరుని ద్వారా మీ అభిప్రాయమెరింగితిమి. కాని మీయానతి నౌదలదాల్చుటకు మేము మునుపటివలె మీ దండనాథులముగాము. స్వభుజ పరాక్రమముచే పాండ్య, చేర, చోళ రాజ్యముల జయించి తద్దేశములకధిపతులమైన నాగమనాయ ప్రభువులమిపుడు మీ పై దండెత్తి వచ్చుటకెంతకాలము పట్టదని హెచ్చరించుచున్నాము''.

రాయలు :- (అప్రయత్నముగ కరవాలముపై చేయివైచి హుంకరించి) తిన్నయింటికే వాసములు లెక్కించు ఈ రాజద్రోహి నాగమ నాయుని బంధించు వీరుడొక్కడు ఈ యోధులలోలేరా? (యోధుల వైపు చూచును)

(వీరమనాయడులేచి)

వీరమనాయడు :- విజయము ప్రభువులకు. మీయానతిని శిరసా వహించు సేవకుడిదే సిద్ధముగానున్నాడు.

రాయలు :- ఆ నాగమ నాయుడు నీకు తండ్రి!

వీరమనాయడు :- ఈ శరీరము మాత్రమే ఆ తండ్రినుండి వచ్చినది.

అప్పాజీ :- గుణములే పూజాస్థానములు ప్రభూ!

రాయలు :- నాగమ నాయుని బలపరాక్రమములు!

వీరమనాయడు :- అంతయు ఎరింగియే మనవి జేయుచున్నాను.

రాయలు :- అటకేగి నీవును తండ్రి పక్షమే వహించిన!

వీరమనాయడు :- కృతఘ్నతా భావమునకు ఒడిగట్టు దేశద్రోహిని కాను ప్రభూ!

అప్పాజీ :- ప్రభువులు సంశయింపవలదు. అనుమతించి, ఆశీర్వదించి అంపుడు.

రాయలు :- ఇదే కరవాలము. మదాంధుడగు ఆరాజద్రోహిని సజీవముగా బంధించిగాని, ఆతని శిరమునుగాని తెమ్ము. ఇవే మా ఆశీస్సులు. విజయము కల్గుగాక.

(వీరమనాయుడు నమ్రుడై కరవాలమునందుకొనును. తెరలో వందిమాగధులు)

వీరాధివీర వీరమనాయుడా విజయీభవ. చండ ప్రచండరణరంగ మార్తాండా విజయీభవ. శౌర్యధైర్య సాహసధుర్యా విజయీభవ !

(వీరమనాయుడు నిష్క్రమించును)

అప్పాజీ :- విశ్వాస ఘాతకులగు రాజద్రోహుల అవినీతి ప్రవర్తనము కారణముగ ప్రభువులుద్విగ్న మనస్కులగుచున్నారు. అవి కేవలము తాత్కాలికములు. ఈ యుద్విగ్నత, కార్యవ్యతిక్ర మముగానీయకుండుగాక.

రాయలు :- సత్యము వచించితిరి అప్పాజీ! తరువాతి కార్యక్రమము!

అప్పాజీ :- మహాకవికొక్కనికి గండపెండేర బహూకరణము. (గండపెండేరము, గంధాక్షతలు పళ్ళెరము నందుంచుకొని వేత్రవతి ప్రవేశించును)

రాయలు :- అయిన. . . రావలసిన మహాకవులందరును విచ్చేసిరో?

అప్పాజీ :- సర్వమును సన్నద్ధము.

రాయలు :- (సభ్యులతో) ప్రబంధకవిత ప్రజాశ్రేయస్సునకే అనునదెంతవరకు సత్యమో మహాకవులు స్పష్టపరతురుగాక.

తిమ్మన :- అర్థమైనగదా శ్రేయస్సు!

పెద్దన :- అర్థము చేసికొనుట పాఠకుని అధికారమునకు సంబంధించినది.

తిమ్మన :- అధికారమునకవధిలేదు. సామాన్యపాఠకునికి గూడ అర్థమగు కవితయే చక్కని కవిత.

పెద్దన :- మీరనునది ద్రాక్షాపాకము. మరి నారికేళపాకమున రచింపబడిన ఆముక్త మాల్యదవంటి గ్రంథములలో ప్రజాశ్రేయస్సునకుప యుక్తమగు వర్ణ నలెన్నియోయున్నవి గదా!

అయ్యలరాజు
రామభద్రుడు :- రాయలవారి కవిత సంస్కృత పద భూయిష్టము. వారు సంస్కృత కవులు. కావుననే వారు గీర్వాణ భాషను ఎక్కుడుగ అభిమానింతురు.

రాయలు :- అదేమి రామభద్ర కవీ! నాది తెలుగుదేశము. నేను తెలుగు వల్లభుడను. దేశభాషలందు తెలుగే లెస్సయను నానుడి ఎరుగరా?

ధూర్జటి :- కావుననే ''తెలుగు తేట, కన్నడ కస్తూరి'' అనునొక సామెతయువిందుము.

రాయలు :- లెస్స బలికితివి ధూర్జటి కవీ! నేటి ఈ సభాలక్ష్యము గండపెండేర బహూకరణము. సమర్థుడగు కవి ఈ బహూకరణము నందుకొన గోరుదును.

పెద్దన :- (లేచి) పెద్దన బోలు సత్కవులు పృథ్విని లేరని మీరెరుంగరా ప్రభూ! పెద్దన కీదలంచిన నాకు బహూకరింప ప్రార్థన. (రాయలుత్సాహపూరితుడై లేచి, స్వయముగా గండపెండేరమును స్వహస్తములతో పెద్దన కాలికి తొడుగును)

రాయలు :- పెద్దన కవీ! నీవు చతురవచో నిధివి. ఆంధ్రకవితాపితామహుడవు. నీకు సాటి ఏరును లేరు.



©KTBS
Not to be republished

అప్పాజీ :- ఇంక భువన విజయ పూరణకై అష్టదిగ్గజములను ఏరి కోవలయును పెద్దనామాత్యా!

(పెద్దనవైపు సూరన చూచును)

సూరన :- (లేచి) కావ్యకళారసానుభవ బుధ ప్రజపాలన శ్రీకృష్ణదేవరాయా విజయీ భవ

పెద్దన :- ఈ మహాకవి పింగళి సూర్యనార్యుడు. నూత్నాతినూత్న భావనా సంపన్నుడు. చిత్రకథా కథన పటుత్వముగల ప్రతిభాశాలి.

రాయలు :- సూరనకవీ! నీ కవితలోగల విశేష గుణములు!

సూరన :- ప్రభూ! చలువగల వెన్నెలలకు సౌరభమును, కప్పురపు పలుకులకు కోమలతయు, మందానిలమునకు మధురతయు కలిగిన నెంత ఆనందదాయకములో అట్లే నాపలుకులు నంత ముదావహములు.

రాయలు :- (సంతుష్టుడై) సూరనకవీ! నీవు మా ఆస్థాన కవులలో ఒక్కడవుగానుండి మమ్ము సంతృప్తులు జేయుము.

సూరన :- ధన్యోస్మి! (కూరుచుండును)

(పెద్దన భట్టు మూర్తి వైపుచూచును)

భట్టుమూర్తి :- మహారాజులకు విజయము.

రాయలు :- పెద్దన వైపు చూచును.

పెద్దన :- ఈ భావుక కవి భట్టుమూర్తి. సంగీత సాహిత్య కళానిపుణుడు

రాయలు :- మూర్తికవీ! నీ కవితా విశిష్టత!

భట్టుమూర్తి :- మహారాజా! శతలేఖినీ పద్మ సంధాన ధౌరేయుడను. ఘంటికాశతగ్రంథకరణ ధుర్యుడను. వేయేల ప్రభూ! మీ ఆస్థాన కవిగ మిమ్మానందపరుపగోరెదను.

రాయలు :- మంచిది.

భట్టుమూర్తో :- ధన్యోస్మి (కూరుచుండును)

(పెద్దన రామలింగని వైపు చూచును)

తెనాలి
రామలింగడు :- (లేచి) విజయోస్తు ప్రభూ!

(రాయలు పెద్దన వైపు చూచును)

పెద్దన :- ఈ విజ్ఞాన తేజుడు తెనాలిరామలింగ కవి.

రాయలు :- రామలింగ కవీ! ఆస్థాన కవీశ్వర పదవికిగల నీ అర్హతలు!

తె. రా :- రాజకవీ! సంస్కృతము తెలుంగుగను, తెలుగును సంస్కృతముగను చేయగల సమర్థతగల చతురమతిని. ఆశువునందును కరము మేటిని.శైవ, వైష్ణవ పురాణావళి, నానార్థములన్న నాకు కరతలామలకములు.

©KTBS Not to be republished

రాయలు :- సంతుష్టుడను, నీవును మా ఆస్థాన కవితా పీఠమునలంకరించి మమ్ము సంతృప్తుల జేయుము.

తె. రా. :- కృతజ్ఞుడను ప్రభూ! (కూరుచుండును)

రాయలు :- నేటికిగదా మన ఆస్థానమష్టదిగ్గజములతో పరిపూర్ణముగ అలంకృతమైనది! ఆంధ్రకవితాపితామహా! పెద్దన కవీంద్రా! ఈ యానంద సమయమున మిమ్మొకటి అడుగదలతును. నారచితమగు ఆముక్తమాల్యదలో మద్విషయమును నేనే స్వయముగా వ్రాసికొనుట ఇంచుక యాత్మస్తుతిగ పరిణమించునేమో!

పెద్దన :- అదెట్లు ప్రభూ! ఉన్న విషయమును చెప్పుట ఆత్మస్తుతిగాదు. అంతగ మీకు సంశయమేయుండిన నా మను చరిత్రయందలి పీఠికనట్లే పొందుపరుపనగును.

భట్టుమూర్తి :- అటులేయగుచో కాలక్రమమున కొందరు అసూయాపరులు గ్రంథము గ్రంథమే పెద్దన కృతమన గలరు.

పెద్దన :- కవిత్వశైలి నెరింగిన మతిమంతుడు మనుచరిత్ర, ఆముక్తమాల్యదలకుగల విభేదమెరుంగక పోడు.

తిమ్మకవి :- లోకములోని కాకులతో నేమి ప్రభూ! ఆంధ్ర కవితా పితామహుని అభిప్రాయమే యుక్తి యుక్తముగనేయున్నది.

(నేపథ్యమున)

వీరాధి వీరమనాయకా విజయీభవ
సత్యవాక్యపరిపాలనా విజయీభవ
రాజభక్తిదురంధరా విజయీభవ

అప్పాజీ :- వీరమనాయుని విజయోత్సాహమును తెల్పుచున్నదీ కలకలము (భటుడు ప్రవేశము)

భటుడు :- విజయము ప్రభువులకు; నాగమనాయుని బంధించి తెచ్చిన వీరమనాయుడు ప్రభువుల ఆనతికై వేచియున్నాడు.

రాయలు :- (సహర్షముగ) అప్పాజీ! మనము స్వయముగ ఎదురేగి ఆ వీరయువకుని సముచిత సత్కృతులతో బహూకరింతము.

అప్పాజి :- (లేచి) ప్రభువుల చిత్తము. ఉత్సాహపూరితులగు యువకులిటులే స్వార్థపరతలేక, రాజభక్తి పరాయణులై వీరశౌర్యముల జూపిన దేశము నిష్కంటకమై సుభిక్షమై విరాజిల్లగలదు.

(తెరపడును)

©KTBS Not to be republished

**1. కొత్తపదాలు :**

అస్పృశ్యత; సార్వభౌముడు; సమర్థులు; కుతంత్రం; దాసోహం; ఉదంతం; ఆశువు; మందస్మితం; వార్తాహరుడు; కరవాలం; ముదావహం; చతురమతి; సుభిక్ష.

**2. అర్థాలు :**

ఉద్యోగం = పని; ఉదంతం = విషయం; వార్తాహరులు = వార్తలు తెచ్చేవారు (గూఢచారులు); నిరుపహతి స్థలం = విఘ్నాలు లేని చోటు; ఔదల = తల; దండనాథులు = సేనాపతులు బుధప్రజలు = పండితులు; ధౌరేయుడు = ప్రజ్ఞావంతుడు ; ధుర్యుడు = సమర్థుడు; కరతలామలకం = స్పష్టంగా తెలిసినది.

**3. వ్యతిరేకపదాలు :**

శుభం × అశుభం

కృతజ్ఞత × కృతఘ్నత

జీవి × నిర్జీవి

నీతి × అవినీతి

స్వార్థం × నిస్వార్థం

**4. నానార్థాలు :**

కవి : కాకి; పండితుడు

గండం : చెక్కిలి; ఆపద

పక్షం : వైపు; 15 రోజులు; రెక్క

కరం : మిక్కిలి, చేయి, తొండం

**5. ప్రకృతి - వికృతి :**

ఆజ్ఞ - ఆన

కవిత - కైత

గౌరవం - గారవం

భాష - బాస

సహాయం - సాయం

©KTBS Not to be republished

**6. జతపరచండి :**

| | | |
|---|---|---|
| సూరన | - | శ్రీ కృష్ణదేవరాయల మంత్రి |
| శ్రీకృష్ణదేవరాయలు | - | మనుచరిత్ర |
| పెద్దన | - | చదరంగంలో చతురుడు |
| భట్టు మూర్తి | - | ఆముక్తమాల్యద |
| తెనాలిరామలింగడు | - | నూత్న వినూత్న భావనా సంపన్నుడు |
| అప్పాజి | - | సంగీత సాహిత్య కళానిపుణుడు |
| చినతిమ్మన | - | విజ్ఞానతేజుడు |

**7. సంధులు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| సమర | + | అంగణ | = | సమరాంగణ | - | సవర్ణదీర్ఘసంధి |
| అనుమాన | + | ఆస్పదం | = | అనుమానాస్పదం | - | సవర్ణదీర్ఘసంధి |
| రాజ | + | అధిరాజు | = | రాజాధిరాజు | - | సవర్ణదీర్ఘసంధి |
| కవి | + | ఇంద్ర | = | కవీంద్ర | - | సవర్ణదీర్ఘసంధి |
| పరమ | + | ఈశ్వర | = | పరమేశ్వర | - | గుణసంధి |
| నట | + | ఈశ | = | నటేశ | - | గుణసంధి |
| విజయ | + | ఉత్సాహం | = | విజయోత్సాహం | - | గుణసంధి |
| సరసము | + | సమాధానం | = | సరసంపు సమాధానం | - | పుంప్వాదేశసంధి |
| పాఠక | + | ఉత్తములు | = | పాఠకోత్తములు | - | గుణసంధి |

**8. సమాసాలు :**

మదాంధుడు : మదముచేత గ్రుడ్డివాడు - తృతీయాతత్పురుష సమాసం

అష్టదిగ్గజాలు : ఎనిమిది ఏనుగులు - ద్విగుసమాసం

నాల్గుమాసాలు : నాలుగు నెలలు - ద్విగుసమాసం

సంగీత సాహిత్య కళానిపుణుడు : సంగీత సాహిత్య కళలయందు నిపుణుడు - సప్తమీ తత్పురుష సమాసం

రాజాధిరాజు : రాజులకు రాజు - షష్ఠీతత్పురుష సమాసం

సరసంపు సమాధానం : సరసమైన సమాధానం - విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం

©KTBS Not to be republished

మహాకవి : గొప్పకవి - విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
వీరయువకుడు : వీరుడైన యువకుడు - విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
వీరశౌర్యములు : వీరం మరియు శౌర్యం - ద్వంద్వ సమాసం

**9. ఖాళీలను పూరించండి :**

1. ఏ ____________ ఏ పాముున్నదో ఎరుగుట దుర్లభం కదా!
2. పెద్దనామాత్యా! ఆశువుగానొక ____________ చెప్పుదురా!
3. మీా పై ____________ వచ్చుటకు ఎంతోకాలము ____________ హెచ్చరించు చున్నాము
4. తిన్న ____________ వాసములే లెక్కించు ____________ ఈ నాగమనాయని ____________ వీరుడొక్కడునీ ____________లలో లేరా!
5. గుణములే ____________ స్థానములు ప్రభూ!
6. అటకేగి నీవును తండ్రి ____________ వహించిన!
7. ____________ పాపమున కొడిగట్టు ____________ గాను ప్రభూ!
8. కావుననే ____________ తేట, కన్నడ ____________ అనునొక కన్నడ సామెతను విందుము.

**10. సందర్భాలను వివరించండి :**

1. ప్రభువులు గోరంతలు కొండంతలు చేయుచున్నారు.
2. ఏపుట్టలో ఏ పామున్నదో ఎరుగుట దుర్లభం కదా!
3. గుణములే పూజాస్థానములు ప్రభూ!
4. దేశభాషలందు తెలుగులెస్స అను నానుడి ఎరుగరా!

**11. కింది వాటికి విగ్రహ వాక్యాలు రాసి, అవి ఏ సమాసాలో గుర్తించండి.**

1. పాఠకోత్తములు
2. గ్రంథరచన
3. వార్తాహరుడు
4. బలపరాక్రమములు
5. గంధాక్షతలు
6. ప్రజాశ్రేయస్సు
7. సభాలక్ష్యం

©KTBS Not to be republished

**12. కింది ప్రశ్నలకు సంక్షిప్తంగా జవాబులు రాయండి :**

1. పాండ్యునికి సాయంగా వెళ్ళిందెవరు?
2. రాయలు ఎందుకు అలసినట్లు కనిపించారు?
3. తిమ్మన ఏరంగంలో నిపుణుడు?
4. రాయలు యోధులను చూచి ఏమన్నాడు?
5. తనను అనుమానించిన రాయలతో వీరమనాయుడు ఏమన్నాడు?
6. కత్తిని వీరమనాయునికి ఇస్తూ రాయలు ఏమన్నాడు?
7. రాయలు 'సంస్కృత కవి' అని అన్న అయ్యలరాజు రామభద్రునితో రాయలు ఏమన్నాడు?
8. పెద్దన బిరుదము ఏమిటి?
9. రాయల ఆస్థానం పేరేమిటి?

**13. కింది ప్రశ్నలకు వివరంగా సమాధానాలు రాయండి :**

1. ఆశువుగా పద్యాన్ని చెప్పడానికి ఏమేమి ఉండాలని పెద్దన చెప్పాడు?
2. నాగమ నాయుని ఉత్తరంలోని సారాంశం ఏమిటి?
3. సూరన కవితా లక్షణాలేమిటి?
4. భట్టు మూర్తి ఎలాంటివాడు? అతనికి గల కవితాలక్షణాలేమిటి?
5. తెనాలి రామలింగనికి గల కవితా లక్షణాలేమిటి?

**14. కార్యకలాపాలు :**

1. చారిత్రక పురుషుల భావచిత్రాలను సేకరించండి.
2. చారిత్రక స్థలాలకు విహారయాత్రలు చేసి అక్కడి విశేషాలను తెలుసుకోండి.

**15. ఉపాధ్యాయులకు సూచనలు :**

1. పిల్లలతో భువన విజయ నాటకాన్ని వేయించండి.
2. పిల్లలకు పురాణ నాటకాలను పరిచయం చేయండి.

♣ ♣ ♣

©KTBS Not to be republished

# వ్యాకరణం

**కృదంతాలు :**

క్రియాధాతువులపై కొన్ని ప్రత్యయాలు చేరి ఏర్పడే పదాలను కృదంతాలంటారు.

**ఉదా :** అలుగు - అలక

నడుచు - నడక

గీయు - గీత

మేయు - మేత.

**తద్ధితాంతాలు :**

నామవాచక శబ్దాలపై ప్రత్యయాలు చేరి ఏర్పడే పదాలను 'తద్ధితాంతా'లంటారు.

**ఉదా :** చిన్న - చిన్నరికం

చుట్టం - చుట్టరికం

ఆట - ఆటకాడు

నేస్తం - నేస్తగాడు.

**విరామచిహ్నాలు :**

రచనలో సందర్భానుసారంగా ఉపయోగించే చిహ్నాలను విరామచిహ్నాలంటారు.

1. **బిందువు** (Full Stop) : దీన్ని ఒక చుక్కతో గుర్తిస్తారు. ప్రతి వాక్యాంతంలోను ఈగుర్తు ఉంటుంది.

   **ఉదా :** రాముడు దశరథుని కుమారుడు. అతడు ధర్మప్రభువు.

2. **కామా** (Comma) : వాక్యభాగంలో తాత్కాలిక విరామాన్ని సూచించడానికి కామా (,) గుర్తును వాడుతారు. భిన్నవిషయాలను వేరుగా సూచించడానికి కూడ ఈగుర్తును ఉపయోగిస్తారు. ఉదా: (a) ఆయనవచ్చాడు కాని, ఆమెరాలేదు

   (b) గంగ, యమున, గోదావరి మొదలయినవి మన నదులు.

3. **కొటేషన్ :** ఒకరు చెప్పిన మాటను యథాతథంగా చెప్పేటప్పుడుగాని, ఒక ప్రసిద్ధ వ్యాక్యాన్ని పేర్కొనేటప్పుడు గాని, ఈ కొటేషన్‌ను వాడుతారు. అలాంటి వాక్యాల ప్రారంభంలో కొంచెం పైభాగంలో " గుర్తుతోను, చివర " గుర్తుతోను సూచిస్తారు. ఉదాహరణకు, "సత్యమేవ జయతే" అని పెద్దలన్నారు.

4. **ప్రశ్నార్థకం :** ఎవరు? ఏమిటి? ఎందుకు? మొదలైన ప్రశ్నల చివర '?' గుర్తును ఉంచుతారు.

   **ఉదా :** అక్కడ ఉన్నదెవరు? వారంటున్న దేమిటి? ఈ సభ ఎందుకు?

5. **ఆశ్చర్యార్థకం :** ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని, దుఃఖాన్ని, వ్యక్తపరిచేటపుడు '!' గుర్తును వాడుతారు. సంబోధనలో కూడ వాడుతారు.

©KTBS Not to be republished

**ఉదా :** ఆహా! ఈ వెన్నెల ఎంత హాయిగా ఉన్నది. అయ్యో! దైవమా! నాపై ఇంత కోపమా? సీతా! ఎక్కడున్నావు?

**ఛందస్సు :**

**కందపద్యం :**

కందపద్యంలో 1, 3, పాదాల్లో మూడుగణాలు 2, 4 పాదాల్లో 5 గణాలు ఉంటాయి. గగ, భ, జ, స, న, ల - గణాలు మాత్రమే ఉండాలి. 2, 4, పాదాలలో మాత్రమే యతి ఉంటుంది. నాల్గవ గణం మొదటి అక్షరంలో పాదంలోని మొదటి అక్షరానికి 'యతి' చెల్లుతుంది. ప్రాసనియమం ఉంటుంది. 1, 2 పాదాలు కలిపి ఆరవగణం తప్పని సరిగా 'నలం' కాని 'జగణం' కాని అయ్యుండాలి. ఇలాగే 2, 4 పాదాల్లోనూ ఉండాలి. బేసిగణాల్లో అంటే 1, 3, 5, 7 గణాల్లో 'జగణం' ఉండరాదు. ప్రతి గణంలోను నాలుగు మాత్రలుంటాయి. మాత్ర అంటే లఘువు.

**ఉదా :** కందము | త్రిశరగ | ణంబుల |

నందము | గా భ జ | సనలము | లటు వడి | మూటన్

(న్ + అ) (లు + అ)

ప్రాస బిందుపూర్వక దకారం (ంద). రెండవపాదంలో అ- అ- లకు యతి చెల్లింది.

**అలంకారాలు :**

శబ్ద ప్రధానమైనవి శబ్దాలంకారాలు. అర్థ ప్రధానమైనవి అర్థాలంకారాలు.

**శబ్దాలంకారాలు :-** వృత్త్యను ప్రాసం, ఛేకాను ప్రాసం, లాటానుప్రాసం, యమకం, ముక్తపదగ్రస్తం - మొదలైనవి.

**అర్థాలంకారాలు :-** ఉపమ, రూపక, ఉత్ప్రేక్ష, దృష్టాంతం మొదలైనవి.

**దృష్టాంతాలంకారం :-** ఉపమాన, ఉపమేయాలకు బింబ - ప్రతిబింబ భావంతో వర్ణన జరిగితే దానిని దృష్టాంతాలంకార మంటారు.

**ఉదా :** ఓరాజా! నీవే కీర్తి మంతుడవు. చంద్రుడే కాంతి మంతుడు

**శ్లేషాలంకారం :-** అనేకార్థాలుండే చమత్కార వాక్యం

**ఉదా :** 'రాజు కువలయానందకరుడు' - ఇక్కడ రాజు అనే పదానికి ప్రభువు, చంద్రుడు, అనే అర్థాలున్నాయి. అలాగే కువలయం అనే పదానికి భూమండలం, కలువ అనే అర్థాలున్నాయి. దీన్ని బట్టి ప్రభువు, భూమండలానికి ఆనందం కలిగించేవాడనీ, చంద్రుడు, కలువలకు ఆనందం కలిగించేవాడనీ, రెండు అర్థాలు వస్తాయి.

**అర్థాంతరన్యాసాలంకారం :** విశేషాన్ని సామాన్య అర్థంతోను, సామాన్య అర్థాన్ని విశేషార్థంతోను సమర్థించి చెప్పితే, అది అర్థాంతరన్యాసాలంకార మవుతుంది.

**ఉదా:-** హనుమంతుడు సముద్రాన్ని దాటాడు - మహాత్ములకు అసాధ్యం లేదుకదా!

సముద్రాన్ని దాటడం అనేది నమ్మశక్యం కాని విషయం. దీన్ని మహాత్ములకు అసాధ్యం లేదు అనే సామాన్య వాక్యంతో సమర్థించి చెప్పడమైంది.

©KTBS Not to be republished

**సమాసాలు :**

**విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం :** విశేషణం (గుణవాచకం) పూర్వ (మొదటి) పదంగా, విశేష్యం (నామవాచకం) ఉత్తరపదం (రెండవపదం)గా ఉన్న సమాసం.

**ఉదా:** మృదు పుష్పములు

పై ఉదాహరణంలో 'మృదువు' అనే పదం విశేషణం. పుష్పములు అనే పదం నామవాచకం. పుష్పములకు, మృదువు అనేది విశేషణం. ఇది మొదటిపదం (పూర్వపదం) కాబట్టి ఇది విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం.

**రూపక సమాసం :** ఉపమేయ (పోల్చబడు వస్తువు) ఉపమానా (పోలిక) లకు భేదం లేదని చెప్పడం.

**ఉదా :** వాగ్భూషణం - వాక్కు అనెడి భూషణం. పై ఉదాహరణంలో వాక్కుకు, భూషణానికి భేదంలేదని చెప్పడంవల్ల ఇది రూపక సమాసం.

**ద్వంద్వ సమాసం :-** ఇక్కడ సమాసంలోని రెండు పదాలకూ ప్రాధాన్యం ఉంటుంది.

**ఉదా :** అహర్నిశలు - అహస్సు మరియు నిశ.

రెండు పదాల కన్నా ఎక్కువ పదాలతో కూడిన సమాసం బహుపద ద్వంద్వ సమాసం.

**ఉదా :** భక్తి శక్తి యుక్తులు

భక్తి, శక్తి మరియు యుక్తి

**ద్విగు సమాసం :-** సంఖ్యా పూర్వకమైనది ద్విగువు. ఇందులో సంఖ్యను సూచించే పదం పూర్వపదంగా వుంటుంది. ఉదా నలుదిశలు; నాలుగు దిక్కులు.

**బహువ్రీహి సమాసం :-** సమాసంలోని పదాల అర్థాలు కాక అవి సూచించే వేరొక పదం యొక్క అర్థానికి ప్రాధాన్యం కలది.

**ఉదా : చక్రధారి :-** చక్రమును ధరించినవాడు - విష్ణువు.

**తత్పురుష సమాసాలు :** రెండవ (ఉత్తర) పదం యొక్క అర్థానికి ప్రాధాన్యం కలిగి ఏడు విభక్తుల భేదాలు, మరియు నఞ్ తత్పురుష సమాసంతో కలిసి ఇవి మొత్తం ఎనిమిది.

**ప్రథమాతత్పురుషం :** సమాసం యొక్క మొదటి, రెండవ పదాల చివర్లలో ప్రథమా విభక్తి ప్రత్యయాలు ఉన్న సమాసం.

**ఉదా : పూర్వకాలం :-** కాలము యొక్క పూర్వము.

**ద్వితీయాతత్పురుషం :** విగ్రహవాక్యంలోని పూర్వపదంలో ద్వితీయా విభక్తి ప్రత్యయాలయిన నిన్, నున్, లన్, కూర్చి, గురించి అనేవి ఉన్న సమాసాలు.

**ఉదా :** విద్యార్థి - విద్యను అర్థించువాడు.

**తృతీయాతత్పురుషం :** తృతీయా విభక్తి ప్రత్యయాలు ఉన్నవి.

**ఉదా :** గుణయుతుడు - గుణములతో కూడినవాడు.

**చతుర్థీ తత్పురుషం :** చతుర్థీ విభక్తి ప్రత్యయాలు చేరినవి.

©KTBS Not to be republished

**ఉదా** : విద్యార్థి వేతనం - విద్యార్థి కొరకు వేతనం.

**పంచమీ తత్పురుషం** : పంచమీ విభక్తి ప్రత్యయాలు చేరినవి.

**ఉదా** : దొంగభయం - దొంగవలన భయం

**షష్ఠీతత్పురుషం** : షష్ఠీవిభక్తి ప్రత్యయాలు చేరిన సమాసాలు. ఉదా :- భూపతి - భూమికి పతి.

**సప్తమీతత్పురుషం** : సప్తమీవిభక్తి ప్రత్యయాలు కలవి. ఉదా :- శరీరాంగాలు - శరీరమందలి భాగాలు

**నఞ్ తత్పురుషం** : విగ్రహవాక్యంలో లేదు, కాదు, కానిది మొదలైన వ్యతిరేకార్థక పదాలు వస్తాయి

**ఉదా** : అసత్యం - సత్యంకానిది. నిర్భీతి - భీతి లేక పోవడం

**ఔపవిభక్తికాలు** : ఇ, టి, తి వర్ణాలకు ఔపవిభక్తికాలు లేక ఉపవిభక్తులు అని పేరు. ఇవి విభక్తులను ఆధారంగా చేసుకొని, ద్వితీయాది ఏక వచన విభక్తి ప్రత్యయాల మీద ఆదేశ, ఆగమాలుగా వస్తాయి.

ఎక్కడ + మంత్రములు = ఎక్కడి మంత్రములు

నీరు + లో = నీటిలో

నేయి + గిన్నె = నేతిగిన్నె

**వాక్యం**

ఒక అభిప్రాయాన్ని లేదా ఆలోచనను ప్రకటించే అర్థవంతమైన పదాల సమూహం వాక్యం.

వాక్యంలో కర్త, కర్మ, క్రియ అనేవి ఉంటాయి. కర్త అంటే పనిచేసే వారు. కర్మ అంటే ఆ చేసిన పనికి ఆధారమైనవారు. క్రియ అంటే పని.

**ఉదా** : శ్రీరాముడు రావణుని చంపాడు.

చంపడం అనేది పని, అంటే క్రియ. దానిని చేసిన వాడు శ్రీరాముడు. కాబట్టి ఆయన కర్త. ఆ పనికి ఆధారం ఎవరు? రావణుడు. అందుకని, అతడు కర్మ. అయితే అన్ని వాక్యాల్లోనూ ఈ కర్త కర్మ క్రియలు ఉండాలన్న తప్పనిసరి నియమం ఏమీ లేదు.

నిర్మాణాన్ని బట్టి వాక్యాలు మూడురకాలు. అవి సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలు.

a. ఒక సమాపక క్రియతో ఉండేవాక్యం సామాన్య వాక్యం. ఉదా : ఆమె ఊటీకి వెళ్లింది.

b. అనేక అసమాపక క్రియలుండి, ఒకే సమాపక క్రియను కలిగిన వాక్యం సంశ్లిష్ట వాక్యం.

**ఉదా** : ఆమె ఆంధ్రాలో చదివి, కర్ణాటకకు వెళ్లి డిగ్రీపూర్తి చేసి, ఢిల్లీకి వెళ్లింది.

c. రెండుగానీ అంతకంటె ఎక్కువగానీ సమాపక క్రియలను కలిగిన వాక్యాన్ని సంయుక్త వాక్యమంటారు.

**ఉదా** : ఆమె చదివింది, పరీక్షలు రాసిందికూడా.

♣ ♣ ♣

©KTBS Not to be republished